وَاعْتَصِمُوْا بِحَبْلِ اللّٰهِ جَمِيْعًا وَّلَا تَفَرَّقُوْا



# భైఅత్ నిబంధనలు మరియు అహ్మదీయుని బాధ్యతలు

(పవిత్ర ఖుర్ఆన్, హదీసులు, హజ్రత్ అక్దస్ మసీహా మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశముల ఆధారముగా)

ప్రవచనములు
హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్
అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్

## ABOUT THE BOOK:

The Holy Prophet of Islam, Muhammad (may peace and blessings of Allah be upon him), had prophesied about the coming of the Promised Messiah and a Reformer who would revive and rejuvenate Islam. Haḍrat Mirza Ghulam Ahmad of Qadian, India claimed to be that Promised Messiah and Reformer. In December of 1888, he announced that God had ordained him to create a new community of righteous Muslims and to take a pledge of allegiance.

Prior to founding this new jama'at (Community) on March 23, 1889, Haḍrat Mirza Ghulam Ahmad announced and published ten conditions of Bai'at (initiation) for all those who wished to join his fold. These conditions beautifully capture the essence of Islam and set forth a sublime code of conduct for millions of Ahmadi Muslims today.

In the course of his sermons and speeches Haḍrat Mirza Masroor Ahmad, the present head of the Worldwide Ahmadiyya Muslim Community, has explained these ten conditions in light of the Holy Qur'an, the sayings of the Holy Prophet Muhammad (may peace and blessings of Allah be upon him) and the writings of Haḍrat Mirza Ghulam Ahmad, the Promised Messiah (may peace be upon him). A Tamil rendering of his thoughtful commentaries are presented in this book for the benefit of All Ahmadi Muslims and for all those who wish to learn more about Ahmadiyyat, the true Islam.

9 789383 882434

# బైఅత్ నిబంధనలు

# మరియు

# అహ్మదీయుని బాధ్యతలు

(పవిత్ర ఖుర్ఆన్, హదీసులు,
హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం
ఉపదేశముల ఆధారముగా)

**ప్రవచనములు**

హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్
అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్

**అనువాదము**

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్

Bai’at Nibandhanalu mariyu Ahmadeeyuni Badhyatalu

(Pavitra Qur’an, Hadeesulu, Hazrat Maseeh Moud Alihissalam Upadeshamula Adharamuga)

**Conditions of Bai’at & Responsibilities of an Ahmadi -**

according to the Holy Qur‘an, Ahadith and
the Promised Messiah, peace be upon him

(Ten conditions of Bai’at - explained in detail by
Hadhrat Khalifatul Masih V)
Urdu


Telugu Translation
Hafiz Syed Rasool Niyaz

First Edition : 2015
Copies : 1000
Printed at : Fazl-e-Umar Printing Press Qadian
Published by : Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India,143516


ISBN : 978-93-83882-43-4

ఇతర వివరాలకు సంప్రదించగలరు

www.alislam.org
www.ahmadiyyamuslimjamaat.in
Toll Free No: 1800-3010-2131



హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం




హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్
అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్

# విషయ సూచిక


| విషయము | పుట |
|---|---|
| సంక్షిప్తములు | IX |
| పదకోశం | XI |
| ముందుమాట | XIX |
| విజ్ఞప్తి | XXI |
| ప్రకాశకుల విజ్ఞప్తి | XXIII |
| హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం | XXV |
| రచయిత పరిచయం | XXVII |
| బైఅత్ నిబంధనలు | XXIX |
| బైఅత్ ప్రతిజ్ఞ అనగా నేమి ? | 1 |
| బైఅత్ అనగా అల్లాహ్‌కు ప్రాణమర్పించుట | 2 |
| అల్లాహ్ తరపున బైఅత్ తీసుకొను ఆదేశము | 6 |
| బైఅత్ ప్రయోజనములు, ఉద్దేశములు | 7 |
| బైఅత్ పరంపర ఆరంభము | 9 |
| **మొదటి బైఅత్ నిబంధన** | **13** |
| అల్లాహ్ అన్యారాధనను క్షమించడు | 13 |
| అన్యారాధన వివిధ రకాలు | 15 |
| **రెండవ బైఅత్ నిబంధన** | **19** |
| అబద్ధము అతి పెద్ద దుష్టత్వము | 19 |
| వ్యభిచారము నుండి దూరముండుము | 26 |

| విషయము | పుట |
|---|---|
| చెడు చూపు నుండి దూరముండుము | 27 |
| దుష్కార్యముల నుండి దూరముండుము | 31 |
| దౌర్జన్యము చేయకుము | 34 |
| ద్రోహమునకు పాల్పడకుము | 39 |
| పీడనము నుండి దూరముండుము | 40 |
| తిరుగుబాటు పద్ధతుల నుండి దూరముండుము | 42 |
| మానసిక ఉద్రేకములకు లొంగకూడదు | 45 |
| **మూడవ బైఅత్ నిబంధన** | **49** |
| ఐదు పూటల నమాజ్ సలుపుము | 49 |
| ప్రాతఃకాల (తహజ్జుద్) నమాజ్‌కు ప్రయత్నించుము | 56 |
| ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దురూద్ క్రమం తప్పకుండా పంపుము | 59 |
| క్రమం తప్పకుండా ఇస్తిఘ్ఫార్ చదువుము | 63 |
| క్షమాపణ (ఇస్తిఘ్ఫార్), పశ్చత్తాపము (తౌబహ్) | 68 |
| అల్లాహ్‌ను ప్రశంసించుచుండుము. | 69 |
| **నాలుగవ బైఅత్ నిబంధన** | **77** |
| క్షమాగుణమును అవలంభించుము | 79 |
| ఎవరికి బాధ కలిగించకుము | 81 |
| వినయ, విధేయతను అలవర్చుకొనుము | 89 |
| **ఐదవ బైఅత్ నిబంధన** | **91** |
| బాధలు పాపములకు పరిహారమగును | 93 |

| విషయము | పుట |
|---|---|
| బాధ కలుగగానే వహించునది నిజమైన సహనము | 95 |
| అల్లాహ్ అంతిమ జమాఅత్ మీరే | 98 |
| నావారు నా నుండి విడిపోలేరు | 101 |
| సంపూర్ణ విశ్వసనీయత, స్థిరత్వ ఆదర్శమును చూపుము | 102 |
| **ఆరవ బైఅత్ నిబంధన** | **105** |
| క్రొత్త క్రొత్త ఆచారాలు, సంప్రదాయాలు రద్దు చేయదగినవి | 109 |
| ఇస్లామ్ బోధనకు పవిత్ర ఖుర్ఆన్ మన మార్గదర్శి | 113 |
| మీ జీవితము పవిత్ర ఖుర్ఆన్‌లోనే గలదు | 115 |
| **ఏడవ బైఅత్ నిబంధన** | **125** |
| అన్యారాధన తర్వాత గర్వము లాంటి మరో ఆపద లేదు | 125 |
| గర్వితుడు స్వర్గములో ఎన్నటికి ప్రవేశించడు | 132 |
| గర్వము, షైతాన్‌కు మధ్య గట్టి సంబంధము గలదు | 134 |
| గర్వము దైవ దృష్టిలో అతి హేయమైనది | 137 |
| ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దృష్టిలో నిరుపేదల స్థాయి | 142 |
| **ఎనిమిదవ బైఅత్ నిబంధన** | **145** |
| ఇస్లాం బోధనల సారాంశము | 147 |
| ఇస్లాం పునరుద్ధరణ మనతో ఒక పరిహారమడుగును | 150 |
| నమ్మకమే పాపము నుండి విముక్తికి కారణము | 152 |
| **తొమ్మిదవ బైఅత్ నిబంధన** | **155** |
| అందరితో మంచిగా వ్యవహరించు బోధన | 156 |
| హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం – మానవ సేవ | 172 |

| విషయము | పుట |
|---|---|
| **పదవ బైఅత్ నిబంధన** | **177** |


హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ), వర్తమాన ఖలీఫాతో సోదరభావ
బంధమును ఏర్పరచుకొనుట అనివార్యము 177
సముచితము, అనుచితము అనగా నేమి ! 181
విధేయత గొప్ప ఉదాహరణ 188
హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పొందినదంతయు
ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయత వల్లనే పొందిరి 190
ప్రతి స్థితిలో విధేయత అనివార్యము 196
సంస్థలో ఎవరు చేరుదురు 198
పరస్పరము సోదరభావము, ప్రేమ కలిగి యుండుము
అల్లాహ్‌తో నిజమైన బంధమును సృష్టించుకొనుము 201
హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హస్తముపై చేయు
బైఅత్ ప్రతిజ్ఞతో రెండు ప్రయోజనములు గలవు 204
ఈ కాలపు దృఢమైన కోట హజ్రత్ మసీహ్ మౌవూద్
అలైహిస్సలాం 204

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన తర్వాత కలిగిన ఆధ్యాత్మిక మార్పుల పలు విశ్వాసపూరిత సంఘటనల ప్రస్తావన**

పదవ నిబంధన “సముచితము పట్ల విధేయత” విషయపు
వివేకాత్మక విశ్లేషణ, వివరణ 209

| విషయము | పుట |
| --- | --- |
| హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా ఏర్పడిన | |
| ఆధ్యాత్మిక విప్లవము | 217 |
| అన్యారాధన నుండి దూరముండుము | 218 |
| మానసిక ఉద్రేకములకు లొంగకపోవుట | 220 |
| నమాజుల ఏర్పాట్లు | 222 |
| మానసిక ఉద్రేకములను అణచివేయుట | 230 |

**అహ్మదియ్య సంస్థను స్వీకరించిన తర్వాత**
**పుణ్య విప్లవ మార్పుల**
**విశ్వాసపూరిత ప్రస్తావన**

| | |
| --- | --- |
| సుఃఖ దుఃఖములో అల్లాహ్‌తో  విశ్వాసముగా నుండుట | 235 |
| సహనము, స్థిరత్వము | 240 |
| సహనపు సాటిలేని ఉదాహరణ | 241 |
| ఆచారాల నుండి దూరముండుట | 243 |
| విధేయత అరుదైన ఉదాహరణములు | 245 |
| మద్యపాన నిషేధము | 247 |
| పవిత్ర ఖుర్‌ఆన్‌ను తమ కార్యాచరణగా  చేసుకొనుము | 248 |
| వినయ, విధేయత | 253 |
| గర్వము నుండి దూరముండుము | 257 |
| ప్రపంచముపై ధర్మమునకే ప్రాధాన్యత నిచ్చుట | 259 |

**విషయము** **పుట**


**మానవ సేవ, స్వచ్ఛత, విశ్వసనీయతలో జమాఅత్ సభ్యులు నిరుపమాణ ఆదర్శములను నెలకొల్పిరి** 271

అహ్మదీ వైద్యులు తమ జీవితములను సమర్పించవలెను 273

మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో నిరుపమాణ అనుబంధము 288

సత్పురుషుల సంతానపు బాధ్యతలు 295

ఇతరుల అంగీకారము 296


❖❖❖

# సంక్షిప్తములు

ఈ పుస్తకములో క్రింద తెలుపబడిన అరబ్బి పదాలను పూర్తిగా లేదా సంక్షిప్తముగా ఉపయోగించినాము. వాటి పూర్తి పదములు, అర్థములను క్రింద చూడగలరు.

**1. స.అ.స** : సల్లల్లాహు అలైహి వసల్లం– (అర్థము) అల్లాహ్ వారికి శాంతి, దీవెనలు ప్రసాదించుగాక!

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభ నామము తర్వాత ఇది వ్రాయబడును.

**2. అ** : అలైహిస్సలాం– (అర్థము) వారికి శాంతి కలుగుగాక! హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తప్ప ఇతర ప్రవక్తల నామముల తర్వాత దీనిని వ్రాయుదురు.

**3. రజి** : రజియల్లాహు ***అన్హు/అన్హా/అన్హుమ్*** – (అర్థము) అల్లాహ్ వారితో రాజీ పడుగాక! ***అన్హు***: ఏకవచనము, ***అన్హా***: స్త్రీ కొరకు, ***అన్హుమ్***: బహువచనము. ***అన్హుమా***: ఇద్దరి కొరకు వ్రాయబడును.

**4. రహ్మ** : రహిమహుల్లాహు ***అన్హు/అన్హా/అన్హుమ్***–(అర్థము) అల్లాహ్ వారిని కరుణించు గాక! ***అన్హు***: ఏకవచనము, అన్హా: స్త్రీ కొరకు, ***అన్హుమ్***: బహువచనము. ***అన్హుమా***: ఇద్దరి కొరకు వ్రాయబడును.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు,

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు కాక మృతి చెందిన గొప్ప ముస్లిం సత్యవంతుల నామముల తర్వాత వ్రాయబడును.

**5. అ.త.బి.అ** :అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ – (అర్థము) అల్లాహ్ వారికి తన విశిష్ట సహాయమందించుగాక!

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రస్తుత ఖలీఫా నామము తర్వాత వ్రాయబడును.

**6. ఖలీఫతుల్ మసీహ్:** హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం ఉత్తరాధికారిని అందురు.

✡✡✡

# పదకోశం

**అల్లాహ్**: ఇస్లాంలో ఇది దేవుని స్వంత నామము. అల్లాహ్ గొప్పదనము కొరకు ముస్లిములు అల్లాహ్ వైభవమునకు 'తఆలా' అని కూడ అందురు.

**అజాన్**: ప్రతి రోజు ఐదు పూటల ప్రార్థన కొరకు ఇచ్చే పిలుపు.

**అహ్మదీ ముస్లిం లేదా అహ్మదీ**: అహ్మదియ్య ముస్లిం సంఘ సభ్యుడు.

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్**: హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాంను మసీహ్ మౌవూద్, మహ్దీ మౌవూద్‌గా స్వీకరించిన ముస్లిముల సంఘము. ఇది 1889లో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం ద్వారా స్థాపించబడినది. ప్రస్తుతము వారి ఐదవ ఖలీఫా అయిన హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారు నాయకత్వము వహించుచున్నారు.

**అల్ ఇమామ్ అల్ మహ్దీ**: అర్థము మార్గదర్శనము చూపబడిన నాయకుడు. రాబోవు సంస్కర్తకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఇవ్వబడిన బిరుదు.

**ఆమీన్**: ఏదేని ప్రార్థన చేసిన తర్వాత అనే పదము. (అర్థము) అల్లాహ్ అలాగే చేయుగాక!

**అస్సలాము అలైకుమ్**: (అర్థము) మీకు శాంతి కలుగుగాక! – ముస్లిములు పరస్పరము మాట్లాడుకునే ముందు పలికే పదము. అస్సలాము అలైకుమ్ తర్వాత వరహ్మతుల్లాహి వబరకాతుహు అని కూడ అనవచ్చును. అనగా

అల్లాహ్ దయానుగ్రహములు కలుగుగాక!.

**బైఅత్** : ఒక మత నాయకుని విధేయత స్వీకరించుటకు చేయు ప్రమాణం. ఇది ప్రవక్త లేదా అతని ఖలీఫా చేతిలో చేయబడును.

**బుఖారి**: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనముల పుస్తకము. ఇది ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారి (194హి–256హి) ద్వారా వ్రాయబడినది. పవిత్ర ఖుర్ఆన్ తర్వాత అత్యంత ప్రామాణికమైన పుస్తకముగా దీనిని ముస్లిములు నమ్ముదురు.

**చందా**: మంచి కార్యము కొరకు ఇవ్వబడే విరాళములు

**దజ్జాల్**: ఇదొక అరబ్బి పదము. దీని అర్థము గొప్ప మోసగాడు. ఇస్లాం పరిభాషలో దురాలోచనలు కలిగించే వాడు. ఇస్లాం తుది కాలములో బహిర్గతమై మసీహ్ మౌవూద్, ఇమామ్ మహ్దికి విరుద్ధముగా పని చేయు శక్తులను దజ్జాల్ అని అందురు.

**దురూద్**: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దీవెనలు పంపుచు చదివే ప్రార్థన. నమాజ్‌లో అత్తహియ్యాత్ తర్వాత చదివే దురూద్. దీనిని దురూదె ఇబ్రాహీమి అని కూడ అందురు.

**దుఆ**: ప్రార్థన. అల్లాహ్‌ను ప్రశంసించుట, కష్టములను దూరము చేయుటకు, తన అవసరాలను తీర్చుటకు అల్లాహ్‌ను సహాయమాచించుటను దుఆ అందురు.

**ఈద్**: ఒక ముస్లిం పర్వదినము. ముస్లిములు రమజాన్ మాసము, తీర్థయాత్ర హజ్ తర్వాత జరుపుకొను పండుగలను అందురు.

**హదీస్**: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనము. దీని బహువచనము అహాదీస్.

**హజ్రత్**: సత్యము, సన్మార్గమును చూపిన వ్యక్తి గౌరవార్థం శ్రీయుత అను పదము వలె ఉపయోగించే పదము.

**హజ్**: సవూది అరేబియాలోని మక్కా నగరములో ముస్లిముల ద్వారా సం॥లో ఒక సారి చేయబడు తీర్థయాత్ర. ఇది ఇస్లాం ఐదవ సూత్రము కూడ.

**హలాల్**: ఇస్లాం శాసనము ప్రకారము ధర్మ బద్ధము చేయబడినది.

**హరామ్**: ఇస్లాం శాసనము ప్రకారము నిషేధించబడినది.

**హఖ్ఖె మెహెర్**: వివాహ సందర్భములో భర్త తన భార్యకు బహుకరించే కానుక. వివాహ ప్రకటన సమయమున తప్పక దీనిని నగదు రూపంలో ప్రకటించవలసి యుండును. లేనిచో నికాహ్ ధర్మబద్ధము కాదు.

**పవిత్ర ఖుర్ఆన్**: మానవజాతి మార్గదర్శనము కొరకు అల్లాహ్ పంపిన గ్రంథము. 23 సం॥ల కాల వ్యవధిలో ఇది ఇస్లాం సాప్థపకులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించినది.

**హుజూర్**: శ్రీయుత గౌరవనీయులైన.

**ఇమామ్**: ఇదొక అరబ్బి పదము. దీని అర్థము నాయకుడు. సజీవముగా నున్న ప్రవక్త లేదా వారి ఉత్తరాధికారి కొరకు దీనిని ఉపయోగింతురు. ప్రస్తుతము అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఖలీఫా అయిన అధినేత, అధ్యక్షుని కొరకు ఉపయోగించుచున్నారు.

**ఇన్షాఅల్లాహ్**: అల్లాహ్ కోరినచో. ఏదేని పని చేసే ముందు అందురు.

**ఇస్తిఖారహ్**: మంచి కోరుట. (ఏదేని కార్యపు మంచి చెడు తెలుసుకొనుటకు నిర్ణీత పద్ధతిలో దుఆ చేయుటను ఇస్తిఖారహ్ అందురు)

**ఇస్తిఘ్ఫార్**: అల్లాహ్ క్షమాపణను యాచించుట.

**జల్స సాలానా**: వార్షిక సభ. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా క్రీ.శ.1891లో ఖాదియాన్‌లో ప్రారంభించబడిన వార్షిక సభను 'జల్స సాలానా ఖాదియాన్' అందురు. ఇప్పటికిది ప్రతి సంవత్సరం డిశంబర్ నెలలో అంగరంగ వైభవముగా కొనసాగుచున్నది.

**జమాఅత్**: దీని అర్థము సంఘము, సంస్థ. కాని ఈ పుస్తకములో అహ్మదియ్య ముస్లిం సంఘము కొరకు జమాఅత్ అను పదము వ్రాయబడెను.

**జిజ్యా**: సైనిక సేవలకు బదులుగా చెల్లించే రుసుము. ముస్లిం పాలనలో నివసించుచున్న ముస్లిమేతరులు తమ ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రతి ఫలముగా చెల్లింతురు.

**కలిమాయె తయ్యిబహ్:**లాఇలాహ అల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహి. అనగా అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవము లేదు. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ ప్రవక్త.

**ఖలీఫా**: ఇదొక అరబ్బి పదము. దీని అర్థము ఉత్తరాధికారుడు, వారసుడు. ఇస్లాం పరిభాషలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తర్వాత జరిగిన నలుగురు ఖలీఫాలను 'ఖులఫాయె రాషిదీన్' అందురు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత అహ్మదియ్య సంఘమునకు నాయకత్వము వహించుచున్న ఖలీఫాను 'ఖలీఫతుల్ మసీహ్' అందురు.

**ఖలీఫతుల్ మసీహ్ 1**: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత మొదటి ఖలీఫాగా సేవలందించిన హకీమ్ మౌలానా నూరుద్దీన్ రజియల్లాహు అన్హు గారు. (1841-1914). వీరు 1908 నుండి 1914 వరకు నాయకత్వము వహించిరి.

**ఖలీఫతుల్ మసీహ్ 2**: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత

ద్వితీయ ఖలీఫాగా సేవలందించిన హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ రజియల్లాహు అన్‌హు గారు. (1889-1965). వీరు 1914 నుండి 1965 వరకు నాయకత్వము వహించిరి. 1947లో దేశ విభజన సమయమున పాకిస్తాన్‌కు ప్రస్థానము చేసిరి. తానే 'ముస్లిహ్ మౌవూద్' నని 1944లో దైవాదేశానుసారము ప్రకటించుకొనిరి. వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సుపుత్రులు. వీరు దేశ విభజన కంటే ముందు హైద్రాబాద్‌ను సందర్శించండతో ఆ భూమి పవిత్రమైనది.

**ఖలీఫతుల్ మసీహ్ 3**: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత తృతీయ ఖలీఫాగా సేవలందించిన హజ్రత్ హాఫిజ్ మిర్జా నాసిర్ అహ్మద్ రహిమహుల్లాహు అన్‌హు గారు. (1909-1982). వీరు 1965 నుండి 1982 వరకు నాయకత్వము వహించిరి. ఖలీఫాగా ఎన్నికయ్యే ముందు జమాఅత్‌లో అనేక కీలక పదవులను అలంకరించి తనదైన శైలిలో సేలవందించిరి.

**ఖలీఫతుల్ మసీహ్ 4**: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత చతుర్థ ఖలీఫాగా సేవలందించిన హజ్రత్ మిర్జా తాహిర్ అహ్మద్ రహిమహుల్లాహు అన్‌హు గారు. (1928-2003). వీరు 1982 నుండి 2003 వరకు నాయకత్వము వహించిరి. వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనుమలు. వీరు జన్మించిన 19.12.1927 తేదీన మొదటి సారి ఖాదియాన్‌కు రైలు నడుపబడెను. పాకిస్తాన్ ప్రభుత్వముచే హక్కుల ఉల్లంఘన జరిగినందున 1984లో లండన్‌కు ప్రస్థానము చేసిరి. 1991లో జరిగిన 'వార్షిక జల్సా సాలానా ఖాదియాన్' లో పాల్గొనిరి. వీరు ఇస్లాం శాంతియుత సందేశమును ప్రపంచవ్యాప్తముగా అందించుటకు, అహ్మదియ్య

ముస్లిం జమాఅత్ సభ్యుల శిక్షణ నిమిత్తం 'అహ్మదియ్య ముస్లిం టెలివిజన్ ఇంటర్నేషనల్' టీ.వి. చానల్‌ను పూర్తి స్థాయిలో 1993లో ప్రారంభించిరి. ప్రస్తుతము 3 చానల్లు నడచుచున్నవి.

**ఖలీఫతుల్ మసీహ్ 5**: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత ఐదవ ఖలీఫాగా లండన్ కేంద్రముగా సేవలందించుచున్నారు. వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మునిమనుమలు. ప్రపంచవ్యాప్తముగా శాంతి స్థాపనకు విశేష కృషి చేయుచున్నారు.

**ఖుద్దాముల్ అహ్మదియ్య**: అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌లో గల 15-40 సం॥ల మధ్య వయసు గల యువకుల శాఖను ఖుద్దాముల్ అహ్మదియ్య అందురు. ఖుద్దామ్ అనగా సేవకులు. దీని ఏకవచనము ఖాదిమ్. అహ్మదియ్య సంఘములోని యువకుల శిక్షణ, సంస్కరణ కొరకు ద్వితీయ ఖలీఫా హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ రజియల్లాహు అన్హు క్రీ.శ.1934లో దీనిని ప్రారంభించిరి.

**లజ్న ఇమాఇల్లాహ్:** అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌లో గల 15 సం॥ల పై వయసు గల స్త్రీల శాఖను లజ్న ఇమాఇల్లాహ్ అందురు. అహ్మదియ్య సంఘములోని స్త్రీల శిక్షణ, సంస్కరణ కొరకు ద్వితీయ ఖలీఫా హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ రజియల్లాహు అన్హు క్రీ.శ.1922లో దీనిని ప్రారంభించిరి.

**మహ్దీ**: అర్థము మార్గదర్శనము చూపబడిన నాయకుడు. చివరి కాలములో అవతరించబోవు సంస్కర్తకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఇవ్వబడిన బిరుదు.

**మౌలానా, మౌల్వీ**: ఒక ముస్లిం మత బోధకుడు.

**ముల్లా**: ముస్లిం మతతత్వ కఠిన భావాల వాదకుడు.

**నికాహ్**: ఇస్లాం సంప్రదాయము ప్రకారము వివాహ ప్రకటన.

**నవాఫిల్**: ఐచ్ఛికముగా చేయు అదనపు ప్రార్థనలు. (నఫిల్ ఏకవచనము)

**మసీహ్ మౌవూద్**: అహ్మదియ్య ముస్లిం జమాఅత్ స్థాపకులు మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం కొరకు దీనిని ఉపయోగింతురు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము ఇస్లాం పునరుజ్జీవము కొరకు ముస్లిములలో నుండే అవతరించు సంస్కర్త. వీరిని ఇమామ్ మహ్దీ అని కూడ అందురు.

**రక్అత్**: ఇస్లాం సంప్రదాయ పద్ధతిలో నమాజ్‌లోని భాగము. దీని బహువచనము రక్ఆత్.

**రుకు**: నమాజ్‌లో మోకరిల్లు స్థితి

**సున్నత్**: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణ పద్ధతి.

**సూర**: పవిత్ర ఖుర్ఆన్‌లోని ఒక అధ్యాయము. పవిత్ర ఖుర్ఆన్‌లో మొత్తం 114 అధ్యాయములు వుండగా 30 (పారా) విభాగాలు గలవు.

**షిర్క్**: అన్యారాధన, అల్లాహ్‌తో మరొకరిని భాగస్వామి చేయుట.

**తహజ్జుద్**: గొప్ప దైవ శుభములను పొందుటకు రాత్రి చివరి భాగములో చేయు ఐచ్ఛిక ప్రార్థన. దీని ప్రస్తావన పవిత్ర ఖురాన్‌లోని బనీఇస్రాయీల్ సూక్తి 80 లో గలదు.

**తబ్లీఘ్**: ఇస్లాం, దైవ ఏకత్వ సందేశమును ఇతరులకు అందించుట.

**వజూ**: ప్రక్షాళనము. నమాజ్ చేసే ముందు నిర్ణీత పద్ధతిలో ముఖము, చేతులు, పాదములను శుభ్రపరచుకొనుట. ఇటుల నమాజ్‌పై పూర్తి శ్రద్ధ,

ఏకాగ్రత కలుగును.

**తయమ్మమ్**: వజూ చేయలేని స్థితిలో తయమ్మమ్ చేయవచ్చును. నీరు లభించని యెడల లేదా అనారోగ్యము వలన నీటితో వజూ చేసినచో ఆరోగ్యమునకు హానికరము అని భావించినచో మట్టిని రెండు చేతులతో ముట్టుకొని ముఖము, చేతలపై రుద్దుకొనుట.

**తౌహీద్**: దైవ ఏకత్వము. అల్లాహ్ ఒక్కడే, అతన్ని మాత్రమే ఆరాధించాలని అను విషయము ఈ పదములో ప్రతిబింబించును.

**ఉలమా**: ముస్లిం విద్యావంతులు.

**ఉమ్మ**: ముస్లిం సమాజము.

**వలీమా**: వివాహము తర్వాత వరుని తరపున బంధుమిత్రులకు ఇవ్వబడే విందు.

**జకాత్** :దీని అర్థము పెరుగుదల, శుద్ధిపరచుట. ఇస్లాం సూత్రాలలోని నాలుగవ సూత్రము. ఇస్లాం శాసనము ప్రకారము నిర్ణీత ధనము కంటే ఎక్కువ వున్న వారు రెండున్నర శాతం ప్రతి సం॥ దానమిచ్చుట.

❖❖❖

# ముందుమాట

మనపై అల్లాహ్ గొప్ప ఉపకారము, శుభము గలదు. ఎందుకనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము అవతరించిన మసీహ్ మౌవూద్ మహ్ది మాహూద్ సయ్యద్నా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాంను గుర్తించి నమ్మే అనుగ్రహము అతడు మనకు కల్గించెను. ఫల్‌హందులిల్లాహ్ అలా జాలిక్. అల్లాహ్ తరపున బైఅత్ తీసుకొను అనుమతి హుజూర్‌కు లభించినప్పుడు 12 జనవరి 1889 తేదీన తక్మీలె తబ్లీఘ్ కరపత్రములో పది బైఅత్ నిబంధనలను పొందుపర్చిరి. హుజూర్ అలైహిస్సలాం గారి సంస్థలో ప్రవేశించు ప్రతి వ్యక్తి ఈ నిబంధనలను పాటించుటకు ప్రతిజ్ఞ చేయును. ఈ నిబంధనలను విపులముగా తెలుసుకొనుట, వాటిని ఆచరించుట మనందరికి చాలా అవసరము.

మన మార్గదర్శనము, సౌలభ్యము కొరకు హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ వివిధ ఉపన్యాసములు, జుమా ప్రసంగాలలో పవిత్ర ఖుర్‌ఆన్, హదీసులు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశముల ఆధారముగా ఈ బైఅత్ నిబంధనలను ఎంతో అద్భుతముగా వివరించిరి. ఇంగ్లాండ్ జల్సా సాలానా సందర్భమున తమ ముగింపు ఉపన్యాసములో 27 జూలై 2003న దీనిని ప్రారంభించిరి. ఇందులో హుజూర్ పది నిబంధనలలోని మొదటి మూడు నిబంధనలను వివరముగా ప్రస్తావించిరి. ఆ తర్వాత జర్మని జల్సా సాలానా సందర్భమున 24 ఆగస్టు 2003 తేదీన

తన ముగింపు ఉపన్యాసములో నాలుగవ, ఐదవ, ఆరవ బైఅత్ నిబంధనలను విపులముగా ప్రస్తావించిరి. అనంతరం 29 ఆగస్టు తేదీన షివర్లెట్ హాలె, ఫ్రంక్‌ఫోర్ట్, జర్మనిలో జుమా ప్రసంగములో ఏడవ, ఎనిమిదవ బైఅత్ నిబంధనలను చాలా విస్తారముగా వివరించిరి. తొమ్మిదవ నిబంధనను తన జుమా ప్రసంగములో 12 సెప్టెంబర్ 2003 తేదీన మస్జిద్ ఫజల్ లండన్‌లో వివరించిరి. పదవ బైఅత్ నిబంధనను మస్జిద్ ఫజల్ లండన్‌లో జుమా ప్రసంగము 19 సెప్టెంబర్ 2003 తేదీన చాలా విపులముగా ప్రస్తావించిరి.

హుజూర్ అయ్యదహుల్లాహు తఆలా పున:పరిశీలించిన అనంతరం మేము ఈ ఉపన్యాసాలను, జుమా ప్రసంగాలను పుస్తక రూపంలో ముద్రించే భాగ్యము పొందుచున్నాము. ఈ నిబంధనలను ఉత్తమ రీతిలో అర్థము చేసుకొని వాటిని ఆచరించు అనుగ్రహము కలిగించవలెనని అల్లాహ్‌ను వేడుకొంటున్నాము. హజ్రత్ మసీహ్ పాక్ అలైహిస్సలాం ఆశించినట్లు నిజమైన, యదార్థమైన అహ్మదీ అగుటకు అనుగ్రహించుగాక! ఆమీన్.

ఈ పుస్తకములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రవచనముల సూచనలు ఇవ్వబడినవి. వాటిలో "క్రొత్త ఎడీషన్" వ్రాయని చోట క్రీ.శ 1984లో ప్రచురించిన రూహాని ఖజాయిన్, మల్ఫూజాత్‌గా భావించవలెను. "క్రొత్త ఎడీషన్" అని వ్రాసిన చోట ఐదు సంపుటిలలో ప్రచురించిన మల్ఫూజాత్‌గా భావించవలెను.

ఇట్లు
మునీరుద్దీన్ షంస్
ఎడీష్నల్ వకీలుత్తస్నీఫ్ లండన్

# విజ్ఞప్తి

ఈ పుస్తకపు ప్రధమ ముద్రణ లండన్ (ఇంగ్లాండ్) నుండి ప్రచురించబడినది. జమాఅత్ సభ్యుల శిక్షణను దృష్టియందుంచుకొని అంశపు ప్రాముఖ్యత వలన ప్రతి అహ్మదీ దీనిని చదువుట, దీనిలో బోధించబడని మార్గదర్శనముల ప్రకారము తమ జీవితమును చక్కదిద్దుకొనుట అనివార్యము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నిర్ణయించిన బైఅత్ ప్రతిజ్ఞ నిబంధనలను హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అయ్యదహుల్లా తఆలా బినస్రిహిల్ అజీజ్ తమ జుమా ప్రసంగాలు, ఇతర ఉపన్యాసాలలో ఎంతో ఆసక్తికర, ఆకట్టుకునే రీతిలో వివరించిరి. వీటిని పాటించే అనుగ్రహము అల్లాహ్ మనకు కల్గించుగాక!

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన తర్వాత వారి అనుచరులలో, అహ్మదీయులలో ఏర్పడిన గొప్ప మార్పు, విప్లవమును తెలిపే వివిధ విశ్వాసభరిత సంఘటనలను హుజూర్ 26 సెప్టెంబర్ 2003 నుండి 10 అక్టోబర్ 2003 వరకు తమ జుమా ప్రసంగాలలో ప్రస్తావించిరి. ఆయా సంఘటనలను కూడ ఈ పుస్తకములో చేర్చితిమి. ఇందుకు సహకరించిన వారందరికి అల్లాహ్ గొప్ప ప్రతి ఫలము నొసంగుగాక! ఆమీన్.

ఖాలిద్ మసూద్
**నాజిర్ ఇషాఅత్**
(ప్రచురణ విభాగ కార్యదర్శి)

# ప్రకాశకుల మనవి

అల్లాహ్ తరపున బైఅత్ తీసుకొని ఒక పవిత్ర సంఘమును స్థాపించు అనుమతి ఈ కాలపు ఇమామ్ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు లభించినప్పుడు 'తక్మీలె తబ్లీఘ్' అను కరపత్రములో 12 జనవరి 1889 తేదీన పది నిబంధనలను పొందుపర్చిరి. ఇవి ఇస్లాం బోధనల సారాంశము. హృదయపూర్వకముగా వాటిని గౌరవించి, ఈ నిబంధనలను పాటించనంత వరకు కేలవము బైఅత్ విలువలేనిదని వారు తమ సంస్థకు అనేక సార్లు సూచించిరి. ఒక సందర్భమున ఇట్లనిరి.

"మా బోధనను కార్యాచరణగా చేసుకొని, తన శక్తి సామర్థ్యము మేరకు దానిని పాటించు వాడే మా సంస్థలో ప్రవేశించును".

(మల్ఫూజాత్ సంపుటి 3 క్రొత్త ఎడీషన్ పుట 621)

ఈ నిబంధనలను, వాటి విశ్లేషణను స్పష్టముగా పదే పదే తమ అంతిమ శ్వాస వరకు వారు బోధించిరి. వారి తర్వాత వారి ఖలీఫాలు కూడ బైఅత్ వాస్తవికతను తెలుపుచూ వచ్చిరి.

నేటి కాలములో కూడ హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ బైఅత్ నిబంధనల వాస్తవికత వివరించు అవసరము దృష్ట్యా సంస్థ సభ్యుల సౌలభ్యము కొరకు వార్షిక సభ ఇంగ్లాండ్ 2003 నుండి ప్రసంగముల, జుమా ఉపన్యాసాల పరంపరను మొదలు పెట్టిరి. ఇందులో పవిత్ర ఖుర్ఆన్, హదీసులు, సయ్యద్నా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశముల ఆధారముగా బైఅత్ నిబంధనలను ఎంతో ఆసక్తికర రీతిలో వివరంగా విశ్లేషించిరి. అనంతరం ఈ విశ్లేషణ పుస్తక రూపంలో "బైఅత్ నిబంధనలు

మరియు అహ్మదీయుని బాధ్యతలు" పేరున ప్రచురితమైనది.

ఈ పుస్తక ప్రాముఖ్యత, ప్రాధాన్యత వలన ప్రపంచములోని అనేక భాషలలో అనువాదములు ముద్రించబడినవి. సంస్థ సభ్యులు సరైన రీతిలో, తమ తమ మాతృ భాషలో సులభముగా బైఅత్ నిబంధనలను అర్థము చేసుకొనుటకు భారత దేశములోని ప్రాంతీయ భాషలలో అనువాదము చేయబడుచున్నది. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యద హుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదముతో ఈ పుస్తకమును మొదటి సారి తెలుగులో ప్రచురించు అనుగ్రహము నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్ పొందుచున్నది. ఫల్‌హందులిల్లాహి అలా జాలిక్. దీని ప్రచురణను అన్ని విధాలా అల్లాహ్ శుభకరము చేయుగాక! ఈ సత్కార్యములో సేవలందించిన (అనువాదకులు గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్, పునఃపరిశీలన, ప్రూఫ్ రీడింగ్ చేసిన రివ్యూ కమిటి సభ్యులు గౌ॥ షేఖ్ ఇబ్రాహీమ్ నాసిర్, గౌ॥ షబ్బీర్ అహ్మద్ యాకూబ్, గౌ॥ ముహమ్మద్ లతీఫ్ షరీఫ్, ప్రచురణ తెలుగు విభాగ అధ్యక్ష్యులు తన్వీర్ అహ్మద్) గార్లకు అల్లాహ్ సత్ఫలితము, శుభములందించుగాక! అమీన్.

అహ్మదీయులందరు ఈ పుస్తకమును తప్పక చదివి, తమ సంతానమును కూడ ప్రోత్సహించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో స్వచ్ఛమైన బైఅత్ బంధమును కలుగుటకు క్రొత్తగా సంస్థలో ప్రవేశించిన వారిని కూడ ఇందుకు ప్రోత్సహించగలరు. దీని ప్రకారము జీవించుటకు అల్లాహ్ మనందరిని అనుగ్రహించుగాక! అమీన్.

హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్
**నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్**
(ప్రచురణ విభాగ కార్యదర్శి)

# హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం 13 ఫిబ్రవరి 1935 తేదీన ముఘల్ గొప్ప వంశములో హజ్రత్ మిర్జా గులాం ముర్తజా–చరాఘ్ బీబీ దంపతులకు జిల్లా గుర్దాస్‌పూర్‌లోని ఒక కుగ్రామము ఖాదియాన్ (పంజాబ్) లో జన్మించిరి. బాల్యము నుండే ఇస్లాం, పవిత్ర ఖుర్‌ఆన్, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల అమితాసక్తి కలిగి వుండిరి. తమ నీతి, నిజాయితి, మృదు స్వభావములో పేరు గాంచిరి.

వారు అంతర్జాతీయ అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను క్రీ.శ. 1889లో స్థాపించిరి. వివిధ మత గురువుల ద్వారా విభిన్న నామములతో సూచించబడిన, నిరీక్షించబడుచున్న వాగ్దత్త సంస్కర్త తానేనని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ, అలైహిస్సలాం దైవాదేశముతో తమను తాము ప్రకటించుకొనిరి. మానవజాతిని మొత్తం ఒకే ఒక్క విశ్వ ధర్మము ఇస్లాం పతాక నీడన చేర్చుటకు ఇటువంటి ఒక సంస్కర్త అవతరించవలసి యుండెనని దైవవాణి ద్వారా తెలుసుకొని వారు ప్రకటించిరి. ఈ వాగ్దత్త సంస్కర్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరునిగా, శిశ్యువునిగా అవతరించునని కూడ వారు తెలిపిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ భవిష్యవాణీలలో రాబోవు వాగ్దత్త సంస్కర్తను మసీహ్ ద్వితీయ అవతరణగా అభివర్ణించిరి. అల్ ఇమామ్, అల్‌మహ్ది అని కూడ వారు నామకరణం చేసిరి. కావున ఇటువంటి భవిష్యవాణీలు పూర్తి అయినవి.

ప్రపంచ పటములో మనుగడ సాధించిన ధర్మములన్ని సత్యమైనవే, దేవుని తరపున వచ్చినవేనని వారు విశ్వసించేవారు. కాని తర్వాతి కాలములో

ఆయా ధర్మములు పలువురు అమాయకుల, స్వార్థపరుల వలన మార్పుకు గురైనవని వారు తెలిపిరి. అన్ని మతాలు గౌరవించదగ్గవే. కావున ఎవరు కూడ తమ రచనలు, ఉపన్యాసాలు, సంభాషణలలో ఇతర మతాలను, ఇతర మతాల స్థాపకులను, అవతార పురుషులను అవమానించకూడదు. ఈ సూత్రమును పాటించనిదే శాంతి స్థాపన అసాధ్యమని వారు నొక్కిచెప్పిరి. ఇందుకు తమ రచనలు, ప్రసంగాలతో నిర్విరామ కృషి కూడ చేసిరి. దైవారాధన, ప్రజా సేవ మతమునకు రెండు చక్రాలని వారు ఉద్బోధించిరి. శాంతి స్థాపనకు చక్కటి మార్గాలను నిర్దేశించుచు తమ జీవిత చివరి రోజులలో 'శాంతి సందేశము' అను గొప్ప పుస్తకము రచించిరి. ఇదే వారి అంతిమ రచన.

వారు 80కు పైగా పుస్తకములు రచించిరి. 'ఇస్లాం తత్వజ్ఞానం' అను పుస్తకములో సూచించబడిన ఐదు ప్రశ్నలకు నిరుపమాణ సమాధానాలిచ్చి సభికులందరిని ఆకట్టుకొనిరి. ఇస్లాం, పవిత్ర ఖుర్‌ఆన్ సందేశమును అర్థము చేసేకొనుటకు ఇదొక గొప్ప రచన. 60 భాషలలో ఇది అనువాదము చేయబడినది. 'యేసు క్రీస్తు భారత దేశములో' అను నామముతో వారు మరొక గొప్ప పుస్తకము దైవానుగ్రహముతో 1899లో రచించిరి. యేసు క్రీస్తు భారత దేశమునకు వచ్చినట్లు ఇందులో సాక్ష్యాధారాలతో నిరూపించిరి. 26 మే 1908 తేదీన వారు పరమపదించిరి.

వారి జీవితములోనే లక్షలాది మంది వారిని విశ్వసించి వారి సంస్థలో చేరిరి. ప్రస్తుతము 206 దేశాలలో కోట్లాది మంది ఈ సంస్థలో చేరి దైవారాధన, ప్రజా సేవలో నిమగ్నమై, శాంతి స్థాపనకు కృషి చేయుచున్నారు. వారి తర్వాత వారి ఉత్తరాధికారులు దీనిని కొనసాగించుచున్నారు. ❖❖❖

# రచయిత పరిచయం

హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అంతర్జాతీయ అహ్మదియ్యా ముస్లిం జమాఅత్‌నకు నాయకత్వము వహించుచున్నారు. వారు ప్రస్తుతము మసీహ్‌కు ఐదవ ఖలీఫాగా వున్నారు. నాలుగవ ఖలీఫా హజ్రత్ మిర్జా తాహిర్ అహ్మద్ (రహ్మ) పరమపదించిన తర్వాత 22 ఏప్రిల్ 2003వ తేదీన వారీ పదవిపై ఇంగ్లాండ్‌లోని మస్జిద్ ఫజల్ లండన్‌లో ఖిలాఫత్ ఎన్నికల సమితి ద్వారా ఎన్నికైరి.

హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ 15 సెప్టెంబర్ 1950 తేదీన రబ్వా పాకిస్తాన్‌లో జన్మించిరి. వారి తండ్రి పేరు హజ్రత్ మిర్జా మన్సూర్ అహ్మద్ కాగా తల్లి పేరు హజ్రత్ నాసిరహ్ బేగం. హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ రజియల్లాహు అన్‌హు మనుమలు కాగా, హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం మునిమనుమలు. ప్రాథమిక విద్య తాలీముల్ ఇస్లాం హైస్కూల్ రబ్వాలో అభ్యసించి, తాలీముల్ ఇస్లాం కళాశాల రబ్వా పాకిస్తాన్ నుండి బి.ఏ పట్టా పొందినారు. అనంతరం క్రీ.శ. 1976లో Agriculture University Faisalabad, Pakistan నుండి Masters of Science in Agricultural Economics పట్టా పొందిరి.

1967లోనే అల్ వసియ్యత్ అను ఆకాశ వ్యవస్థలో చేరిరి. వారి వివాహము 31 జనవరి 1977 తేదీన గౌ॥ సయ్యద్ ముజఫ్ఫర్ షాహ్ గారి కూతురు సయ్యదహ్ అమ్తుస్సుబూహ్‌తో జరిగినది. 1977లో తమ జీవితమును జమాఅత్ సేవకు అంకితము చేసిరి. అనంతరం తృతీయ ఖలీఫా (రహ్మ) ఆదేశానుసారము 'నుస్రత్ జహాఁ పథకము' ఆధ్వర్యములో సేవ చేయుటకు ఆగస్టు 1977లోనే ఘానా (ఆఫ్రికా) వెళ్ళిపోయిరి. అక్కడ

అహ్మదియ్య ముస్లిం సంఘమునకు చెందిన వివిధ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిరి. అహ్మదియ్య సెకండరీ స్కూల్ ప్రారంభమునకు వారు సహకరించి, దానికి మొదటి రెండు సం॥లు ప్రిన్సిపాల్‌గా కూడ సేవలందించిరి.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబె రహ్మహుల్లాహు తఆలా అనుమతితో 1985లో పాకిస్తాన్‌కు తిరిగి వచ్చిరి. వివిధ పదవులను అలంకరించిన తర్వాత 10 డిశంబర్ 1997 తేదీన అహ్మదియ్య జమాఅత్ పాకిస్తాన్ ప్రధాన కార్యదర్శి (నాజిరె ఆలా వ అమీరె మఖామి రబ్వా) గా నియమితులైరి. వీరి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు 1907లో దైవవాణి అందినది. اِنِّیْ مَعَكَ يَامَسْرُوْرُ అనగా ఓ మస్రూరు! నేను నీతో వున్నాను. 1999లో పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తులను కించపరచిరని బూటకపు వాజ్యము వేసినందున రబ్వా కారాగారములో 11 రోజుల పాటు నిర్బంధనకు గురైరి. అనంతరం నిర్దోషిగా విడుదలైరి.

క్రీ.శ.2005లో ఖాదియాన్ వార్షిక సభలో పాల్గొనిరి. తర్వాత 2008లో దక్షిణ భారత రెండు రాష్ట్రాలు తమిళనాడు, కేరళను సందర్శించిరి. ఒక ఖలీఫా ఈ రాష్ట్రాలను సందర్శించడం ఇదే తొలిసారి.

హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారు ఖలీఫాగా ఎన్నికైనప్పటి నుండి మానవ జాతి సేవ పట్ల దాతృతముతో వ్యవహరించుచు సేవా, విద్యా కార్యక్రమాలు చేపడుచున్నారు. వివిధ దేశములలో ఉన్నత సభలలో శాంతి స్థాపన ఆవశ్యకత, అందుకు అనుసరించాల్సిన, పాటించాల్సిన సూత్రములను ఇస్లాం బోధన రూపంలో వివరించుచున్నారు. అల్లాహ్ వారికి ఆయురారోగ్యములు ప్రసాదించుగాక! ఆమీన్. ❖❖❖

# పది బైఅత్ నిబంధనలు

**1.** సమాధి అయ్యే వరకు 'షిర్క్' (అల్లాహ్‌కు భాగస్వాములు చేయుట) నుండి దూరముగా నుందునని బైఅత్ చేసిన వాడు ప్రతిజ్ఞ చేయవలెను.

**2.** అబద్ధము, వ్యభిచారము, చెడుచూపు, ప్రతి దుష్కార్యము, దౌర్జన్యము, అన్యాయము, అవినీతి, ఉపద్రవము, ఎదురు తిరుగుదనము, ప్రతి వ్యసనము మొదలగు దుష్కార్యములకు దూరముండి కామోద్రేకాలకు లొంగక వుందును.

**3.** అల్లాహ్ అతని ప్రవక్త ఆదేశాల మేరకు క్రమబద్ధముగా ఐదు సమయముల ప్రార్థనలు (నమాజ్) సలుపును. సాధ్యమైనంత వరకు తహజ్జుద్ ప్రార్థన సలుపుటకు, నబియే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పై దురూద్ పంపుటకు, ప్రతి రోజు తమ పాపముల క్షమాపణ యాచించుటకు, సంసిద్ధుడై సహృదయముతో అల్లాహ్ వరములను స్మరించుచు, ప్రశంసించుచు, స్తుతించుచు ప్రతి రోజును గడుపును.

**4.** అల్లాహ్ ప్రాణులకు సాధారణముగా, ముస్లిములను ప్రత్యేకముగా కామోద్రేకములకు లోనై నాలుకతో గాని, చేతులతో గాని, మరే విధముగా గాని పీడించడు.

**5.** సుఖ దు:ఖాలలో, ఇబ్బందులలో, సౌభాగ్యములో ఆపదలలో

గాని, జీవిత ఒడుదొడుకులలో గాని, అల్లాహ్‌నే నమ్ముకొని అతని ఇష్టానుసారము జీవించును. అతని మార్గము నందు అవమానము, కష్ట నష్టములకు సిద్ధమైవుండి, ఆపదలు సంభవించినపుడు వెనుకాడక ముందుకు సాగును.

**6.** ఇస్లాం విరుద్ధ ఆచార వ్యవహారములకు దూరముగా నుండి పవిత్ర ఖురాన్ ఆదేశాలను పూర్తిగా పాటించును. అల్లాహ్ ప్రవక్త ఆదేశాలను తమ జీవిత సూత్రాలుగా చేసికొనును.

**7.** అహంకారము, గర్వమును పూర్తిగా వీడి, వినయ విధేయత, సత్ప్రవర్తన, సహనము దీనత్వమునవలంభించి జీవించును.

**8.** తమ ప్రాణము, సంతతి, సంపత్తి, ప్రీతి పాత్రుల కంటే ధర్మమును, ధర్మ గౌరవ మర్యాదలను ఎక్కువగా అభిమానించును.

**9.** అల్లాహ్ ప్రీతి కొరకు, అల్లాహ్ సృష్టించిన ప్రాణుల ఎడల సానుభూతి కలిగి వుండును. అల్లాహ్ ప్రసాదించిన బహుమతుల, శక్తుల ద్వారా సాధ్యమైనంత వరకు మానవాళికి లాభము చేకూర్చును.

**10.** కేవలము అల్లాహ్ ప్రీతి కొరకు నాతో సోదర భావము కలిగి మరణించు వరకు వినయ విధేయతను ప్రదర్శించును. ఈ బాంధవ్యము ఇతర బంధాలలో కానరాని విధముగా ఉన్నత స్థాయి నందుకొని వుండును.

**ఇష్తిహార్ తక్మీలె తబ్లీఘ్**
**12 జనవరి 1889 క్రీ.శ**

بسم الله الرحمن الرحيم

మేము పునఃప్రతిజ్ఞ (బైఅత్) చేసినాము. ప్రతిజ్ఞ నిబంధనలను పాటించుటకు అంగీకారము, వాగ్దానము కూడ చేసినాము. కాని మేము నమ్మిన ఆ బైఅత్ ప్రతిజ్ఞ పది నిబంధనలు ఏమిటో మాకు పూర్తిగా తెలియవు అని కొందరు మిత్రుల నుండి ఉత్తరములు వచ్చినవి. ఈ సభ సందర్భముననే ఈ శీర్షికపై మాట్లాడుట మంచిదని నాకు ఆలోచన వచ్చెను. అదే నేను ఊహించితిని. ఇది చాలా విశాలమైన అంశము. అన్ని నిబంధనలను ప్రస్తావించుట ఇచట కష్టము. కనుక కొన్నిటిని వివరింతును. ఆ తర్వాత ఖుత్బాలో లేదా మరో ఇతర సందర్భమున ఈ అంశమును ప్రస్తావింతును.

## బైఅత్ ప్రతిజ్ఞ అనగా నేమి ?

బైఅత్ ప్రతిజ్ఞ అనగానేమి ? అనునది మొట్టమొదటి విషయము. హదీసులు, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రవచనముల ద్వారా దీనిని నేను వివరింతును.

హుజూర్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి. “తనను తాను

విక్రయించుటయే ఈ ప్రతిజ్ఞ (బైఅత్) నిజమైన అర్థము. ఈ నిబంధనతోనే దీని శుభములు, ప్రభావాలు ముడిపడివున్నవి. ఎట్లనగా భూమిలో ఒక విత్తనము నాటబడినప్పుడు దాని ప్రారంభ స్థితి ఇట్లుండును. అది ఒక రైతు ద్వారా నాటబడినది. దాని భవిష్యత్తు ఏమియును తెలియదు. కాని ఈ విత్తనము ఉత్తమమైనచో, దానిలో అభివృద్ధి చెందు శక్తి వున్నచో అల్లాహ్ కృపానుసారము, ఆ రైతు కృషితో అది పైకి వచ్చి ఒక గింజ నుండి వెయ్యి గింజలగును. ఇటులనే ప్రతిజ్ఞ చేయువాడు మొదట నిరాడంబరతను అలవర్చుకొనవలెను. తన గర్వమును వదిలిపెట్టవలసి యుండును. అప్పుడతడు అభివృద్ధి చెందుటకు అర్హుడగును. కాని ప్రతిజ్ఞతో స్వార్థములు కలిగిన వాడు ఎప్పటికి లాభము పొందలేడు".

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 173)

## బైఅత్ అనగా అల్లాహ్‌కు ప్రాణమర్పించుట

మరల వారిట్లు తెలిపిరి. "బైఅత్ (ప్రతిజ్ఞ) అనగా అల్లాహ్‌కు ప్రాణమర్పించుట. నేడు మేము మా ప్రాణమును అల్లాహ్ హస్తమున విక్రయించినామని దీని భావము. అల్లాహ్ మార్గములో నడిచిన వాడు తుదకు నష్ట పోవునను విషయము శుద్ధ తప్పు. సత్యవంతుడు ఎప్పటికి నష్టపోడు. అసత్యుడు నష్టపోవును. ప్రపంచము కొరకు అల్లాహ్‌తో చేసిన బైఅత్, ప్రతిజ్ఞను భంగపరచువాడు, ప్రపంచ భయముతో ఇటువంటి విషయాలకు పాల్పడు వాడు మరణ సమయమున ఏ అధికారి, రాజు రక్షించలేడని గుర్తుంచుకొనవలెను. అందరి కంటే ఎక్కువ మంచి తీర్పు చేయువాని వద్దకు అతడు పోయినప్పుడు అతనిని అతడిట్లడుగును. నీవు నన్ను ఎందుకు గౌరవించలేదు ? కనుక భూమ్యాకాశముల అధిపతి అయిన

అల్లాహ్‌ను ప్రతి విశ్వాసి విశ్వసించి, పశ్చత్తాప పడవలెను.”

(మల్ఫూజాత్ సంపుటి 7, పుట 29,30)

బైఅత్ అంటే ఏమిటో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ ప్రవచనములతో స్పష్టమైనది. ఇప్పుడు నా ఉనికి నాది కాదు, అల్లాహ్ ఆజ్ఞలను తు.చ. పాటించవలెను. వాటిని అనుసరించవలెనని మనలో ప్రతి ఒక్కరు అర్థము చేసుకొనవలెను. అప్పుడు మన ప్రతి కార్యము అల్లాహ్ ఇష్టానుసారమగును. పది నిబంధనల సారాంశమిదే.

బైఅత్ గురించి వివిధ పదములు గల విభిన్న హదీసులను ఇప్పుడు నేను ప్రస్తావింతును.

ఆయిజుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ ఇట్లు తెలిపెను. ఉబాద బిన్ సామిత్ (రజి) బదర్ యుద్ధములో, బైఅత్ ఉఖ్బాలో పాల్గొనిన అనుచరులలోని వారు. ఉబాద బిన్ సామిత్ రజియల్లాహు అన్‌హు వారికిట్లు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట అనుచరుల ఒక సమూహము వున్నప్పుడు ఇట్లనిరి. రమ్ము ఈ నిబంధనపై నా బైఅత్ చేయుము. ‘‘**اَلَّا تُشْرِكُوْا بِاللّٰهِ شَيْئًا**’’ మీరు ఏ వస్తువును అల్లాహ్‌కు భాగస్వామిగా చేయరు. మీరు దొంగతనమునకు పాల్పడరు. వ్యభిచారము చేయరు, మీ సంతానమును చంపరు, మీరు నిందారోపణలు చేయరు. నా మంచి మాటను మీరు తిరస్కరించరు.

ఈ బైఅత్ ప్రతిజ్ఞను మీలో ఎవడైతే పూర్తి చేయునో అతనికి ఫలితమిచ్చు బాధ్యత అల్లాహ్‌ది. ఈ ప్రతిజ్ఞలో తక్కువ చేసిన వానికి ఈ ప్రపంచములో శిక్ష పడినచో ఆ శిక్ష జరిమానా అగును. ఈ ప్రతిజ్ఞలో తక్కువ చేసిన తర్వాత అల్లాహ్ కప్పిపుచ్చినచో అతని సమస్య అల్లాహ్

చేతిలో నుండును. అతడు కోరినచో శిక్షించును లేదా అతడు కోరిచనో క్షమించును.

(సహీ బుఖారి, కితాబ్ మనాఖిబుల్ అన్సార్–బాబ్ వుఫూదుల్ అన్సార్ ఇలన్నబియ్యి (స) బిమక్కత వబైఅతిల్ ఉఖ్బహ్)

మరొక కథనము ఇట్లు గలదు. హజ్రత్ ఉబాద బిన్ సామిత్ (రజి) ఇట్లు తెలిపిరి. ఈ నిబంధనపై మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బైఅత్ చేసియుంటిమి. మేము వినెదము సౌకర్యములో, కష్టములో కూడ సంతోషములో, దు:ఖములో కూడ విధేయత వహింతుము. అధికారులతో జగడమునకు పాల్పడము. మేమెక్కడున్నను నిజాయితిపై నిలిచెదము. అపనిందలు చేయువాని నిందలకు భయపడము.

(బుఖారి కితాబుల్ బైఅతి బాబుల్ బైఅతి అలస్సమ్‌యి వత్తాఅతి)

ఉమ్ముల్ ముమినీన్ హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా ఇట్లు తెలిపిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ క్రింది పవిత్ర సూక్తి ప్రకారము స్త్రీలతో బైఅత్ తీసుకొనేవారు.

﴿ يَاَيُّهَا النَّبِيُّ اِذَا جَاءَكَ الْمُؤْمِنٰتُ يُبَايِعْنَكَ عَلٰٓى اَنْ لَّا يُشْرِكْنَ بِاللّٰهِ شَيْئًا وَّلَا يَسْرِقْنَ وَلَا يَزْنِيْنَ وَلَا يَقْتُلْنَ اَوْلَادَهُنَّ وَلَا يَاْتِيْنَ بِبُهْتَانٍ يَّفْتَرِيْنَهٗ بَيْنَ اَيْدِيْهِنَّ وَاَرْجُلِهِنَّ وَلَا يَعْصِيْنَكَ فِيْ مَعْرُوْفٍ فَبَايِعْهُنَّ وَاسْتَغْفِرْ لَهُنَّ اللّٰهَ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴾

(అల్ ముమ్తహినహ్:13) అనగా ఓ సందేశహరుడా! విశ్వాస స్త్రీలు నీ

వద్దకు వచ్చి, వారు అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరిని చేయము, దొంగతనము గాని, వ్యభిచారము గాని చేయము. తమ సంతానమును చంపము, తమ వైపు నుండి కల్పించుకొని ఎవరికీ నిందారోపణలు అంటగట్టము, మంచి విషయములలో నిన్ను అతిక్రమించమని నీతో విధేయత ప్రమాణము చేయగోరినచో నీవు వారి విధేయతా ప్రమాణము స్వీకరించుము. వారి కొరకు అల్లాహ్‌తో క్షమాపణ కోరుము. నిశ్చయముగా అల్లాహ్ గొప్ప క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి.

బైఅత్ తీసుకునే సమయమున తమ స్వంత స్త్రీ తప్ప ఏ స్త్రీ హస్తమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముట్టుకునేవారు కాదని హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా తెలిపిరి.

(సహీ బుఖారి కితాబుల్ అహ్‌కామ్ బాబ్ బైఅతున్నిసా)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ తీసుకొనుట ప్రారంభించక ముందు సత్యస్వభావము, ఇస్లాం సానుభూతి గల పలువురు సత్పురుషులు ఇట్లు భావించిరి. ఇప్పుడు ఈ మునుగుతున్న ఇస్లాం నావను రక్షించువాడు, ఇస్లాం పట్ల నిజమైన సానుభూతి గల వ్యక్తి ఎవడైనా వున్నాడంటే అతడు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ గారే, వారే మసీహ్ మహ్దీ. మీరు బైఅత్ తీసుకోగలరని ప్రజలు వారిని కోరేవారు. కాని వారు "لَسْتُ بِمَأْمُوْرٍ" నాకు ఆజ్ఞ అందలేదని ప్రతి సారి సమాధానమిచ్చేవారు. ఒక సారి వారు (అ) మీర్ అబ్బాస్ అలి గారి ద్వారా మౌల్వీ అబ్దుల్ ఖాదిర్ (రజి) గారికిట్లు వ్రాసిరి. "ఈ బలహీనుని స్వభావములో అల్లాహ్ ఏకత్వము, అల్లాహ్ ఆదేశానుసారము అధికముగా గలదు. బైఅత్ గురించి ఇప్పటి వరకు అల్లాహ్ తరపున ఎటువంటి ఆదేశము

అందలేదు. అందుకే బాధాకర దారిలో నడుచుట సమంజసము కాదు. **لَعَلَّ اللّٰهُ يُحدِثُ بَعْدَ ذٰلِکَ اَمْرًا** మౌల్వీ గారు! ధార్మిక సోదరభావమును పెంచుటకు కృషి చేయుము. విశ్వాసము, అనురాగపు శుభ్రమైన చెలిమతో ఈ మొక్కను పోషించుటలో నిమగ్నమగుము. ఈ విధానవే లాభదాయకమగును. ఇన్షాఅల్లాహ్.

(హయాతె అహ్మద్ సంపుటి 2, పుట 12,13)

## అల్లాహ్ తరపున బైఅత్ తీసుకొను ఆదేశము

తుదకు ఆరు, ఏడు సంవత్సరముల తర్వాత క్రీ.శ. 1888లో మొదటి త్రైమాసికములో బైఅత్ తీసుకొను ఆదేశము అల్లాహ్ తరపున వారికి అందినది. ఈ అల్లాహ్ ఆదేశము అందిన అక్షరాలు ఇట్లు గలవు.

**''اِذَا عَزَمْتَ فَتَوَكَّلْ عَلَى اللّٰهِ وَاصْنَعِ الْفُلْکَ بِاَعْيُنِنَا وَوَحْيِنَا– اَلَّذِيْنَ يُبَايِعُوْنَکَ اِنَّمَا يُبَايِعُوْنَ اللّٰهَ يَدُاللّٰهُ فَوْقَ اَيْدِيْهِمْ – ''**

(ఇష్తిహార్ 1 డిశంబర్ 1888, పుట 2)

అనగా నీవు ఏదేని నిర్ణయించుకొనినచో అల్లాహ్‌నే విశ్వసించుము. మా కళ్ళ ముందు మా సువార్త వాణి ప్రకారము ఓడను నిర్మించుము. నీతో విధేయతా ప్రతిజ్ఞ చేయువారు నిశ్చయముగా అల్లాహ్‌తోనే విధేయతా ప్రతిజ్ఞ చేయుదురు. వారి చేతిపై అల్లాహ్ హస్తముండును.

మంచివారు, చెడ్డవారందరు ఈ వ్యవస్థలో చేరుటను హుజూర్ మనస్సు ఇష్టపడేది కాదు. గట్టి విశ్వాస స్వభావము గల పవిత్రులు మాత్రమే ఈ శుభకర వ్యవస్థలో ప్రవేశించాలని వారు కోరుకునే వారు. కనుక

దాంబికుల, విశ్వాసుల మధ్య వ్యత్యాసమును చూపు ఒక మహోత్సవము కొరకు వారు నిరీక్షించిరి. అల్లాహ్ తన సంపూర్ణ వివేకము, కరుణతో అదే సంవత్సరము నవంబర్ క్రీ.శ 1888లో ప్రథమ బషీర్ మరణముతో ఆ మహోత్సవమును ఏర్పరచెను. (వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కుమారులు) దేశములో వారికి విరుద్ధముగా ఒక వ్యతిరేక తుఫాను లేచెను. పరిపక్వత లేని వారు అపోహ పడి దూరమైరి. కావున ఈ శుభప్రద వ్యవస్థ ప్రారంభమునకు ఈ సమయము అనువైనదని వారు భావించిరి. వారు 1 డిశంబర్ 1888 తేదీన బైఅత్ గురించి ఒక కర పత్రము ద్వారా బహిరంగ ప్రకటన చేసిరి. ఇస్తిఖార మస్నూన (సున్నత్ ప్రకారము మంచి చెడు తెలుసుకొను ప్రార్థన) తర్వాత బైఅత్ కొరకు హాజరు కావలెనని హజ్రత్ అఖ్దస్ ఉపదేశించిరి.

(ఇష్తిహార్ తక్మీలె తబ్లీఘ్ 12 జనవరి 1889)

అనగా ముందు దుఆ చేయుము, ఇస్తిఖార చేయుము, అప్పుడు బైఅత్ చేయుము.

ఈ కరపత్రము తర్వాత హజ్రత్ అఖ్దస్ ఖాదియాన్ నుండి లుధ్యానా వెళ్ళి, క్రొత్త బస్తీలో గల హజ్రత్ సూఫీ అహ్మద్ జాన్ (రజి) గారి గృహములో బస చేసిరి.

(హయాతె అహ్మద్ సంపుటి 3 భాగము 1 పుట 1)

## బైఅత్ ప్రయోజనములు, ఉద్దేశములు

ఇక్కడి నుండి 4 మార్చి 1889 తేదీన బైఅత్ ప్రయోజనములు, ఉద్దేశములను వివరించుచు మరొక కరపత్రము వ్రాసిరి.

"ధర్మ నిష్టాపరుల పక్షమును సిద్ధము చేయుట అనగా దైవభీతి

గల వారిని ఒక సంస్థలో సమావేశ పరచుటయే ఈ బైఅత్ పరంపర ఉద్దేశము. ఇటువంటి నిష్టాపరుల ఒక పెద్ద సమూహము ప్రపంచముపై ప్రభావము చూపును. వారి ఐక్యత ఇస్లాం శుభము, గొప్పదనము, సత్ఫలితములకు కారణమగును. వారు ఏకత్వ కలిమాపై ఏకమైన శుభము వలన ఇస్లాం పవిత్ర, పరిశుద్ధ పనులకు త్వరగా ఉపయోగపడెదరు. సోమరి, లోభి, నిరుపయోగ ముస్లిం కాకూడదు. తమ విభేదము, అనైక్యత వలన ఇస్లాంకు ఘోర నష్టము జరిగినది. దాని అందమైన ముఖమునకు తన పాపిష్టి స్థితులతో మచ్చ అంటించిరి. ఇస్లాం అవసరాల పట్టింపు లేని నిర్లక్ష్యముగా మూలకు కూర్చున్న వృద్ధుల వలె కాకూడదు. తమ సోదరుల సానుభూతి పట్టదు. మానవ జాతి పట్ల ఎలాంటి ఉత్సాహము లేదు. వారు పేదలకు రక్షణగా నుండు జాతి సహాయకులు కావలెను. అనాథలకు తండ్రులుగా మారవలెను. ఇస్లాం కార్యములను నిర్వర్తించుటకు త్యాగ స్వభావము గల ప్రేమికుల వలె సిద్ధముగా నుండవలెను. వారి సాధారణ శుభములు ప్రపంచములో వ్యాపించవలెనని అన్ని విధాలా కృషి చేయవలెను. అల్లాహ్ ప్రేమ, మానవ సేవ, అల్లాహ్ పవిత్ర చెలిమ ప్రతి హృదయము నుండి వెలువడి ఒక చోట చేరి ఒక నది రూపంలో ప్రవహించునట్లు కనిపించవలెను......తన గొప్పతనమును బహిరంగపరచుటకు తన శక్తిని చూపుటకు అల్లాహ్ ఈ పక్షమును పుట్టించి, అభివృద్ధి పరచదలచెను. తద్వారా దైవ ప్రేమ, సంపూర్ణ పశ్చత్తాపము, పవిత్రత, నిజమైన పుణ్యము, శాంతి, సామర్థ్యము, మానవ సేవను వ్యాపింపచేయును. ఈ పక్షము అతని ప్రత్యేక పక్షమగును. తన ఆత్మతో వారికి శక్తినిచ్చును. వారిని మలినము నుండి శుభ్రపరచును. వారి జీవితములో పవిత్ర మార్పు

కలిగించును. తను తన పవిత్ర భవిష్యవాణీలలో వాగ్దానము చేసినట్లు ఈ పక్షమును ఎంతో పెంచును, వేలాది సత్యవంతులను ఇందులో చేర్చును. తుదకు వారి ఆధిక్యత, శుభము చూపరులను ఆశ్చర్యపరచును. ప్రపంచ నలుమూలలలో తన కాంతిని వ్యాపింపజేయును. ఇస్లామీ శుభములకు ఆదర్శముగా నుందురు. అతడు ఈ పరంపర సంపూర్ణ అనుయాయులకు ప్రతి రకమైన శుభములో ఇతర పరంపర వారిపై విజయము నొసంగును. ఆమోదము, సహాయము అందించబడు వారు ప్రళయ దినము వరకు వారిలో జన్మింతురు. గొప్ప పోషకుడు ఇటులనే తలచెను. అతడు సర్వాధికారుడు కోరినదే చేయును. ప్రతి శక్తి, సామర్థ్యము అతనికే కలదు".

బైఅత్ చేయదలచిన వారు 20 మార్చి తర్వాత లుధ్యానా చేరుకోవాలని వారు ఇదే కరపత్రములో సూచించిరి.

(తబ్లీఘె రిసాలత్ సంపుటి 1 పుట 150–155)

## బైఅత్ పరంపర ఆరంభము

దీని ప్రకారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం 23 మార్చి 1889 తేదీన క్రొత్త బస్తీలో గల సూఫీ అహ్మద్ జాన్ గారి గృహములో బైఅత్ తీసుకొనిరి. హజ్రత్ మున్షీ అబ్దుల్లాహ్ సనోరి (రజి) కథనము ప్రకారము చారిత్రాత్మక బైఅత్ జ్ఞాపకార్థము ఒక రిజిస్టరు సిద్ధము చేసిరి. దాని పేరు "బైఅత్ తౌబహ్ బరాయె తఖ్వా వ తహారత్" (ధర్మనిష్టాపరత, పవిత్రతకై పశ్చత్తాప ప్రతిజ్ఞ) అని పెట్టబడెను.

హుజూర్ అలైహిస్సలాం ఆ కాలములో బైఅత్ చేయుటకు ఒక గదిలో ప్రతి ఒక్కరిని విడి విడిగా పిలిచి బైఅత్ తీసుకునేవారు. వారు మొట్ట మొదటి బైఅత్ హజ్రత్ మౌలానా నూరుద్దీన్ రజియల్లాహు అన్హు

గారిది తీసుకొనిరి. బైఅత్ చేయువారిని ఇట్లు ఉపదేశించేవారు.

"ఈ జమాఅత్‌లో చేరి, మొదటగా జీవితములో మార్పు తెచ్చుకోవలెను. ప్రతి ఆపదలో అతడు సహాయపడుటకు అల్లాహ్ పై నిజమైన విశ్వాసము కలిగి వుండవలెను. రెండవది అతని ఆజ్ఞలను చిన్నచూపు చూడకూడదు. ఒక్కొక్క ఆజ్ఞను గౌరవించవలెను. ఆచరణాత్మకముగా ఆ గౌరవమును నిరూపించు కొనవలెను".

"వివిధ వస్తువుల ముందు తలవంచుట, వాటినే నమ్ముట, అల్లాహ్‌పై నమ్మకముండక పోవుట అనగా అల్లాహ్‌ను నిరాకరించుట యగును. ఇవన్నియు అన్యారాధన అగును. అన్యారాధన స్థాయి కంటే తక్కువగానే వస్తువులను ఉపయోగించవలెను. మేము వస్తువులను వినియోగించరాదని అనము కాని వాటినే నమ్మకూడదని మా అభిమతము. చేతులతో పని హృదయముతో దైవస్మరణ చేయవలెను".

వారిట్లు తెలిపిరి. "బైఅత్ చేసిన మీరు ఇప్పుడు నాలుకతో ఒప్పుకొనుట సులభమే కాని పాటించుట కష్టము. ఎందుకనగా మానవున్ని ధర్మ భ్రష్టుడు చేయాలని షైతాన్ సదా ప్రయత్నించును. ప్రపంచము దాని ప్రయోజనాలను సులభముగా, ధర్మమును దూరముగా చూపును. ఇటుల హృదయము కఠినమగును. గత స్థితి మునుపటి కంటే దుర్భరమగును. అల్లాహ్‌ను రాజీ చేయుటకు పాపము నుండి తప్పించుకొను ఒప్పందమును నెరవేర్చుటకు ధైర్యముగా సిద్ధమగుము".

ఇట్లనిరి. "పీడనము గల విషయమును మాటలాడకుము. దుష్టత్వమును వ్యాపింపజేయకుము. దూషించినచో సహనము వహించుము. ఎవరిని ఎదురించకుము. ఎదురించిన వానితో కూడ

మంచిగా, సత్ప్రవర్తనతో వ్యవహరించుము. తియ్యని సంభాషణల ఉదాహరణను చూపుము. అల్లాహ్ రాజీ అగుటకు ప్రతి ఆజ్ఞను సహృదయముతో అవలంభించుము. బైఅత్ చేసిన తర్వాత మునుపటిలా ఇతను లేడని శత్రువు కూడ తెలుసుకొనవలెను. వ్యాజ్యములలో నిజమైన సాక్ష్యమివ్వుము. ఈ వ్యవస్థలో చేరిన వాడు సంపూర్ణ హృదయము, పూర్తి ధైర్యము, మనసారా సత్యమును పాటించవలెను".

(జిక్రె హబీబ్ పుట 436-439)

క్రీ.శ 1903 మార్చిలో పండుగ రోజు కొందరు అనుచరులు కూర్చొని వుండగా వారిట్లనిరి.

"చూడుము! ఇప్పుడు ఎవరైతే మీలో బైఅత్ చేయుటకు వచ్చినారో, (బైఅత్ చేయుటకు ప్రజలు వచ్చి యుండిరి కావచ్చును) ఎవరైతే ఇంతకు ముందే చేసినారో! వారి కొరకు కొన్ని విషయాలు ఉపదేశముగా అందును. శ్రద్ధతో వినవలెను".

"మీరు చేసిన ఈ బైఅత్, పశ్చాత్తాప బైఅత్. పశ్చత్తాపము రెండు రకాలుగా వుండును. **ఒకటి** గత పాపముల నుండి అనగా వాటి సంస్కరణ కొరకు, గతములో చేసిన తప్పులను మానుటకు, శక్తిమేర ఆ దుష్టత్వములను సరిదిద్దుకొనుటకు కృషి చేయుట. **(రెండవది)** మున్ముందు పాపముల నుండి దూరముండవలెను. తనను ఈ అగ్ని నుండి రక్షించుకొనవలెను.

పశ్చత్తాపముతో గతములో జరిగిన పాపములన్నియు క్షమించబడునని అల్లాహ్ వాగ్దానము గలదు. కాని సహృదయము, సదుద్దేశముతో హృదయములో ఎలాంటి గుప్త కపటము లేనిదై ఆ

పశ్చత్తాపముండవలెను. హృదయములో గల గుప్త, దాగివున్న రహస్యములను అతడు ఎరుగును. అతడు ఎవరి ద్వారా మోసపోడు. అతన్ని మోసము చేయుటకు ప్రయత్నించ కూడదు. దాంబికముగా కాక సదుద్దేశముతో అతని ఆస్థానములో పశ్చత్తాప పడవలెను. పశ్చత్తాపము మానవుని కొరకు అదనపు లేదా నిష్ప్రయోజనమైనది కాదు. దాని ప్రభావము కేవలము ప్రళయ దినముపైనే ఆధారపడి లేదు. దానితో మానవుని ఇహ, పరలోకము రెండు గాడిలో పడును. ఇహ, పరలోకము రెండింటిలో అతనికి సుఖము, సంతోషము లభించును".

(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 187, 188)

# మొదటి బైఅత్ నిబంధన

**సమాధి అయ్యే వరకు 'షిర్క్' (అల్లాహ్‌కు భాగస్వాములు చేయుట) నుండి దూరముగా నుందునని బైఅత్ చేసిన వాడు ప్రతిజ్ఞ చేయవలెను.**

## అల్లాహ్ అన్యారాధనను క్షమించడు

అన్నిసా అధ్యాయము 49వ సూక్తిలో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿ اِنَّ اللّٰهَ لَا يَغۡفِرُ اَنۡ يُّشۡرَكَ بِهٖ وَيَغۡفِرُ مَا دُوۡنَ ذٰلِكَ لِمَنۡ يَّشَآءُ وَمَنۡ يُّشۡرِكۡ بِاللّٰهِ فَقَدِ افۡتَرٰۤى اِثۡمًا عَظِيۡمًا ﴾

(అన్నిసా:49) అనగా దీని అనువాదమిట్లు గలదు. అల్లాహ్‌కు భాగస్వామి చేసినచో అతడు నిశ్చయముగా క్షమించడు. దానికి తప్ప అతడు తలచినదంతయు క్షమించును. అల్లాహ్‌కు భాగస్వామిని చేసిన వాడు నిశ్చయముగా మహాపాపము చేసినవాడు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దీనిని గూర్చి ఇట్లు తెలిపిరి. "ఇటులనే అల్లాహ్ ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

**وَيَغْفِرُ مَادُوْنَ ذٰلِكَ**......الخ అనగా ప్రతి పాపము క్షమించబడును. కాని అన్యారాధనను అల్లాహ్ క్షమించడు. అన్యారాధన దరి చేరకుము. దానిని దురదృష్ట వృక్షముగా భావించుము".

(జమీమ తుహ్ఫా గోల్డవియా, రూహానీ ఖజాయిన్ సంపుటి 17, పుట 323, 324 హాషియా)

మరల వారిట్లనిరి. "ఇచట అన్యారాధన అనగా రాళ్ళు మొదలగు వాటిని పూజించుట మాత్రమే కాదు, వస్తువులను పూజించుట కూడ అన్యారాధనే. ఇహలోక ఆరాధ్యదైవములను నమ్ముట కూడ అన్యారాధనే అగును".

(అల్ హకమ్ సంపుటి 7 సంచిక 24, దివి 30 జూన్ 1903 పుట 11)

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَاِذْ قَالَ لُقْمٰنُ لِابْنِهٖ وَهُوَ يَعِظُهٗ يٰبُنَيَّ لَا تُشْرِكْ بِاللّٰهِ اِنَّ الشِّرْكَ لَظُلْمٌ عَظِيْمٌ﴾

(లుఖ్మాన్, సూక్తి 14) దీని అనువాదమిట్లు గలదు. లుఖ్మాన్ తన కుమారునికి ఉపదేశించినపుడు ఇట్లనెను. "ఓ నా ప్రియమైన కుమారుడా! అల్లాహ్‌తో భాగస్వాములను చేయకుము. నిశ్చయముగా అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయుట ఒక గొప్ప అన్యాయము."

తన సమాజములో అన్యారాధన గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు భయముండెను. ఒక హదీసు ఇట్లు గలదు.

షద్దాద్ బిన్ ఓస్ గురించి మాకు ఉబాద బిన్ నసీ ఇట్లు తెలిపిరి.

వారు ఏడ్చుచుండగా వారెందుకు ఏడ్చుచున్నారని ప్రశ్నించబడెను. వారిట్లనిరి. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో వినిన ఒక విషయము గుర్తు వచ్చినందుకు ఏడ్చుచున్నాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనునది నేను వింటిని. నేను నా సమాజము గురించి అన్యారాధన, రహస్య కోరికలతో భయపడుచున్నాను. కథకుడు ఇట్లడిగెను. ఓ రసూలుల్లాహ్ ! మీ సమాజము మీ తర్వాత అన్యారాధనలో నిమగ్నమగునా? అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అవును. నా సమాజపు ప్రజలు సూర్య చంద్రాదులు, విగ్రహాలు, రాళ్ళను పూజించరు. కాని తమ కర్మల ప్రదర్శనకు పాల్పడుదురు. గుప్త కోరికలలో నిమగ్నమగుదురు. వారిలో ఒకడు ఉదయం ఉపవాసమున్నచో తర్వాత ఏదేని కోరిక అడ్డుపడినచో అప్పుడు ఉపవాసమును వదిలిపెట్టి తన కోరికను తీర్చుకొనును".

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 4 పుట 124 ముద్రణ బేరూత్)

## అన్యారాధన వివిధ రకాలు

బహిరంగ అన్యారాధన కాక విగ్రహాలు, చంద్రున్ని పూజించకున్నను కపటము, ప్రదర్శన, కోరికల అనుసరణ కూడ అన్యారాధనే అని ఈ హదీసు ద్వారా తెలియును. ఒక ఉద్యోగి తన అధికారి విధేయత కంటే ఎక్కువ అతని చుట్టు తిరుగుచూ అతనిపైనే నా ఉద్యోగం ఆధారపడివున్నదని భావించుట కూడ ఒక రకమైన అన్యారాధనే. నాకు కుమారులున్నారు, వీరు పెరిగి పని చేసి సంపాదింతురు, నాకు సహకరింతురు, నేను నిశ్చింతగా శేష జీవితము గడిపెదనని ఎవరైనా గర్వపడును. లేదా నా

ఈ కుమారుల వలన నా దాయాదులు నాతో పోటీ పడలేరు. (ఆసియాలోనే కాక మొత్తం ప్రపంచములో దాయాదుల నీచమైన ఆచారము గలదు) పూర్తి ఆధారము ఆ కుమారులపైనే గలదు. వారు అసమర్థులుగా తేలినచో, ప్రమాదములో మరణించినచో, వికలాంగులైనచో ఇటువంటి వ్యక్తి ఆశలన్ని ఆవిరైపోవును.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"నాలుకతో లాఇలాహ ఇల్లల్లాహ్ ప్రకటించుచు హృదయములో వేలాది విగ్రహాలు గుమికూడుట ఏకత్వ వాదము కాదు. ఎందుకనగా ఒకరు అల్లాహ్‌కివ్వవలసిన గౌరవము తన కార్యము, కుట్ర, మోసము, ఉపాయముకు ఇచ్చినచో, లేదా అల్లాహ్‌ను నమ్మవలసినంత ఒక మానవునిని నమ్ముట, లేదా అల్లాహ్‌కు సమానముగా తన మనస్సుకు గౌరవమిచ్చినచో ఇవన్ని సందర్భాలలో అల్లాహ్ దృష్టిలో అతడు విగ్రహారాధకుడగును. బంగారము, వెండి, రాగి లేదా రాయితో సిద్ధము చేసి, వాటిని నమ్ముట మాత్రమే విగ్రహారాధన కాదు, అల్లాహ్‌కు సత్సమానముగా గౌరవమివ్వబడు ప్రతి మాట, కార్యము కూడ అల్లాహ్ దృష్టిలో అన్యారాధనే అగును........మోక్షముతో కూడిన అంగీకారము లేదా మనము అంగీకరించాలని అల్లాహ్ కోరు స్వచ్ఛమైన ఏకత్వ వాదము ఏమనగా అల్లాహ్ ఉనికిని ప్రతి భాగస్వామి, విగ్రహము, మానవుడు, సూర్య చంద్రాదులు లేదా మన మనస్సు లేదా ఉపాయము, కుట్ర, మోసముతో పవిత్రమైనదిగా భావించవలెను. అతనికి ఎదురుగా ఎవరిని శక్తిమంతుడిగా ఊహించకూడదు. ఎవరిని ఆహారమిచ్చువాడిగా నమ్మకూడదు. గౌరవమిచ్చువాడు, అగౌరవపర్చు వాడు అని ఎవరిని

భావించరాదు. సహాయకుడు, ఆసరానిచ్చువాడిగా ఒప్పుకోకూడదు. మరొకటేమనగా తన ప్రేమను అతనికే అంకితం చేయవలెను. తన ఆశలను అతనితోనే ప్రత్యేకించవలెను. అతనితోనే భయపడవలెను. ఈ మూడు రకాల ప్రత్యేకతలు తప్ప మరో ఏకత్వ వాదము లేదు. **ఒకటి** ఉనికి పరంగా ఏకత్వము. అనగా అతని ఉనికి ముందు మిగతా వాటన్నిటిని శూన్యము, నాశనమగు, అవాస్తవమైనవిగా భావించవలెను. **రెండవది** లక్షణముల పరంగా ఏకత్వము. అనగా పోషణ, ఆరాధన లక్షణములను అతనికి మాత్రమే ఒప్పుకొనవలెను. బాహ్య రూపములో కనిపించుచున్న వివిధ పోషకులు, లబ్ధిచేకూర్చు వారిని అతనే ఏర్పరచిన వ్యవస్థగా నమ్మవలెను. **మూడవది** తన ప్రేమ, సత్యము, స్వచ్ఛత పరంగా ఏకత్వ వాదము. అనగా ప్రేమానురాగము మొ॥ ఆరాధన మర్యాదలలో ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా అంగీకరించక అతనికే అంకితమగుట."

(సిరాజుద్దీన్ ఈసాయి కె చార్ సవాలోంకా జవాబ్ – రూహానీ ఖజాయిన్ సంపుటి 12, పుట 349, 350)

దీనిని నేను గతములో సంక్షిప్తముగా వివరించి యుంటిని.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజియల్లాహు అన్‌హు ఈ విషయమును గురించి ఇట్లు తెలిపిరి.

"అల్లాహ్ తప్ప అతని ఏదేని నామము, ఏదేని కార్యము, ఏదేని ఆరాధన లో మరొకడిని చేర్చుట అన్యారాధన అగును. మంచి పనులన్ని అల్లాహ్ ప్రీతి కొరుకు చేయుటయే ఆరాధన. అల్లాహ్ తప్ప మరొకడు పుట్టించువాడు లేడని ప్రజలు నమ్ముదురు. మరణము, జీవనము అల్లాహ్ చేతి, అతని అధీనము, శక్తిలోనే గలదని కూడ నమ్ముదురు. ఇది నమ్మి

కూడ ఇతరులకు సాష్టాంగము చేయుదురు, అసత్యమాడుదురు, ప్రదక్షిణలు చేయుదురు. అల్లాహ్ ఆరాధనను వదిలి ఇతరులను పూజింతురు. అల్లాహ్ ఉపవాసములను విడిచి ఇతరుల ఉపవాసములను పాటింతురు. అల్లాహ్ ప్రార్థనలను విస్మరించి ఇతరుల ప్రార్థనలు చేయుదురు. వారి కొరకు దానమిత్తురు. ఈ అవాస్తవ అపోహల అంతమునకే ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అల్లాహ్ పంపెను."

(ఖుత్బాతె నూర్ పుట 7,8)

# రెండవ బైఅత్ నిబంధన

**"అబద్ధము, వ్యభిచారము, చెడుచూపు, అన్యాయము, అవినీతి, ఉపద్రవము, ఎదురు తిరుగుదనము, ప్రతి వ్యసనము మొదలగు దుష్కార్యములకు దూరముండి కామోద్రేకాలకు లొంగక వుండును."**

◈ ◈ ◈

ఈ ఒక్క నిబంధనలో తొమ్మిది రకాల దుష్కార్యాలను తెలుపనైనది. బైఅత్ చేయు ప్రతి వ్యక్తి, ఎవరైతే తనను తాను హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లో ప్రవేశించినట్లు ప్రకటించుకొనునో ఈ దుష్కార్యముల నుండి దూరముండవలెను.

## అబద్ధము అతి పెద్ద దుష్టత్వము

వాస్తవముగా అబద్ధము అతిపెద్ద దుష్టత్వము. అందుకే ఒక వ్యక్తి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి నాలో అన్ని దుష్టత్వములు గలవు. నేను ఏ దుష్టత్వమును వదలలేను, కావున నేను పాటించదగ ఒక ఉపదేశము నాకు చేయగలరని అన్నప్పుడు వారిట్లనిరి. ఎల్లప్పుడు సత్యమే పలుకుదువని, ఎప్పుడు అబద్ధమాడవని ప్రతిజ్ఞ

చేయుము. దీని వలన ఒక్కొక్కటి చొప్పున తుదకు అతని అన్ని దురలవాట్లు అతని నుండి దూరమైనవి. ఎందుకనగా అతనికి చెడు ఆలోచన ఎప్పుడు వచ్చినా అతడిట్లు భావించేవాడు. నేను పట్టుబడినచో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు ప్రవేశపెట్టబడుదును. నేను అబద్ధమాడనని వారితో వాగ్దానము చేసియుంటిని. నిజము చెప్పినచో అవమాన పడాల్సి వచ్చును లేదా శిక్ష పడును. ఇటుల క్రమ క్రమంగా అతని దుష్టత్వములన్ని అంతమైనవి. వాస్తవముగా అబద్ధమే అన్ని దుష్టత్వములకు మూలము.

నేనిప్పుడు దీనిని ఇంకా వివరింతును. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿ذٰلِکَ وَمَنۡ یُّعَظِّمۡ حُرُمٰتِ اللّٰہِ فَھُوَ خَیۡرٌ لَّہٗ عِنۡدَ رَبِّہٖ وَاُحِلَّتۡ لَکُمُ الۡاَنۡعَامُ اِلَّا مَا یُتۡلٰی عَلَیۡکُمۡ فَاجۡتَنِبُوا الرِّجۡسَ مِنَ الۡاَوۡثَانِ وَاجۡتَنِبُوۡا قَوۡلَ الزُّوۡرِ﴾

(అల్ హజ్ సూక్తి : 31) దీని అనువాదమిట్లు గలదు. అల్లాహ్ గౌరవము ప్రసాదించిన వాటిని ఆదరించు వానికిది అతని ప్రభువు వద్ద ఉత్తమమైనది. మీకు తెలుపబడు చతుష్పాదములు తప్ప మీ కొరకవి ధర్మ బద్ధములు కావు. కనుక అపవిత్రమైన విగ్రహములతో దూరముండుము. అబద్ధములాడకుము.

ఇచట అన్యారాధనతో పాటు అబద్ధమును వుంచబడెను. మరల ఇట్లు నుడివెను.

﴿اَلَا لِلّٰہِ الدِّیۡنُ الۡخَالِصُ وَالَّذِیۡنَ اتَّخَذُوۡا مِنۡ دُوۡنِہٖۤ اَوۡلِیَآءَ مَا نَعۡبُدُھُمۡ اِلَّا لِیُقَرِّبُوۡنَاۤ اِلَی اللّٰہِ زُلۡفٰی اِنَّ اللّٰہَ یَحۡکُمُ بَیۡنَھُمۡ فِیۡ مَا ھُمۡ فِیۡہِ یَخۡتَلِفُوۡنَ اِنَّ اللّٰہَ لَا یَھۡدِیۡ مَنۡ ھُوَ کٰذِبٌ کَفَّارٌ﴾

(అజ్జుమర్ సూక్తి 4) జాగ్రత్తా! కపటము లేని ధర్మమే అల్లాహ్ వైభవమునకు తగినది. అతనికి తప్ప మిత్రులను చేసికొనిన వారు (ఇట్లందురు). వారు మమ్ములను అల్లాహ్ సామీప్యమును కలుగ చేసి, ఉన్నత స్థానముల వరకు గొనిపోవుదురను ఉద్దేశముతో మేము వారిని ఆరాధింతుము. అల్లాహ్ వారి మధ్య వారు వైమనస్యము చేయుచుండిన దానికి నిశ్చయముగా తీర్పు చేయును. అల్లాహ్ ఎన్నడూ అబద్ధమాడుచు, కృతఘ్నత తెలుపు వానికి మార్గదర్శనము చేయడు.

సహీ ముస్లింలో ఒక హదీసు ఇట్లు గలదు. అబ్దుల్లాహ్ బిన్ అమర్ ఇబ్నుల్ ఆస్ కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నాలుగు విషయములు ఎవరిలో వుండునో అతడు శుద్ధ దాంబికుడు. వీటిలోని ఏదేని ఒకటి ఎవడిలోనైనా వున్నచో దానిని వదలనంత వరకు అతనిలో ఒక దాంబిక లక్షణము వున్నట్లే.

1. అతను మాట్లాడేటప్పుడు అబద్ధమాడును. (అతడు మాట్లాడే సమయమున అబద్ధమును కలుపును, అసత్య మాటలు మాట్లాడును.)

2. ఒప్పందము చేసినప్పుడు భంగపరచును.

3. వాగ్దానము చేసినప్పుడు పూర్తి చేయడు. (ఇది కూడ ఒక రకమైన అబద్ధమే)

4. జగడమాడినప్పుడు తిట్టును.

ఇవన్నియు అబద్ధమునకు సబంధించినవి.

మరో హదీసు ఇట్లు గలదు. హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మా) ఇట్లు తెలిపిరి. అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) ఇట్లనే వారని నాకు తెలిసినది. మీరు సత్యమునే అవలంభించవలెను. ఎందుకనగా సత్యము

సత్కార్యమునకు కారణమగును. సత్కార్యము స్వర్గమునకు కారణమగును. అబద్ధము నుండి దూరముండుము. ఎందుకనగా అబద్ధము అవిధేయతకు కారణమగును. అవిధేయత నరకమునకు కారణమగును. ఒకడు సత్యమాడి విధేయుడయ్యెను. అబద్ధమాడి పాపములలో మునిగెనని మీకు తెలియదా.

(మొతా ఇమామ్ మాలిక్- బాబ్ మా జాఅ ఫిస్సిద్ఖి వల్‌కిజ్బి)

ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్‌లో మరో హదీసు ఇట్లు గలదు. హ్రజత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఒక చిన్న పిల్లాడిని నేనేదైనా నీకిస్తానని ఒకడు పిలిచి అతడు అతనికేమి ఇవ్వనిచో ఇది కూడ అబద్ధముగా పరిగణించబడును.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్- బాబ్ మాజాఅ ఫిస్సిద్ఖి వల్ కిజ్బి)

శిక్షణ కొరకు ఇది అత్యవసరము. పిల్లల శిక్షణ కొరకు హాస్యములో ఇటువంటి మాటలు మాట్లాడరాదు. లేనిచో ఇటులనే హాస్యములోనే తప్పుడు మాటలు మాట్లాడే అలవాటు పిల్లలకు కూడ పాకును. ముమ్ముందు ఇది గట్టి అలవాటుగా మారి అబద్ధమాడుటలో ఎలాంటి అభ్యంతరముండదు. దీని భావమే అంతమైపోవును.

హ్రజత్ ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. సత్యము సత్కార్యము వైపు, సత్కార్యము స్వర్గము వైపు తీసుకెళ్ళును. సదా సత్యమే పలికే మానవుడు అల్లాహ్ దృష్టిలో సత్యవంతుడిగా లిఖింపబడును. అబద్ధము పాపము, నేరము వైపు తీసుకెళ్ళగా పాపము, నేరము నరకము వైపు

తీసుకెళ్ళును. సదా అబద్ధమాడే మానవుడు అల్లాహ్ దృష్టిలో అసత్యవంతుడిగా లిఖింపబడును.

(బుఖారి కితాబుల్ అదబ్ బాబ్ ఖౌలుల్లాహి ఇత్తఖుల్లాహ్ వకూనూ మఅస్సాదిఖీన్)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ బిన్ ఆస్ కథనము ప్రకారము ఒక వ్యక్తి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనెను. ఓ రసూలుల్లాహ్ స్వర్గపు కార్యమేమిటి ? ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. సత్యము పలుకుట. సత్యము పలికిన వ్యక్తి విధేయుడగును. విధేయుడైన తర్వాత అతడు స్వచ్ఛమైన విశ్వాసి అగును. ఫలితముగా స్వచ్ఛమైన విశ్వాసుడైన వ్యక్తి స్వర్గములో ప్రవేశించును. ఆ వ్యక్తి మరల ఇట్లడిగెను. ఓ రసూలుల్లాహ్ నరకములో పడవేయు కర్మ ఏది ? ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అబద్ధము. ఒక వ్యక్తి అబద్ధమాడినచో అవిధేయుడగును. అవిధేయత వలన కృతఘ్నుడగును, కృతఘ్నుతపై స్థిరపనడిన వ్యక్తి ఫలితముగా నరకములో ప్రవేశించును.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్- సంపుటి 2 పుట 176, ముద్రణ బేరూత్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అబద్ధమును కూడ పవిత్ర ఖురాన్ ఒక మలినముగా, అపవిత్రముగా వర్ణించెను. ఇట్లు నుడివెను. (అల్ హజ్ సూక్తి:31)

﴿فَاجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْاَوْثَانِ وَاجْتَنِبُوْا قَوْلَ الزُّوْرِ﴾ ఇచట అబద్ధమును విగ్రహమునకెదురుగా చూపెను. వాస్తవానికి అబద్ధము కూడ ఒక

విగ్రహమే. లేనిచో సత్యమును వదిలి మరో వైపు ఎందుకు పోవును. విగ్రహము క్రింద ఎలాంటి వాస్తవము లేనట్లే అబద్ధము క్రింద కూడ మోసము తప్ప మరేమి వుండదు. అబద్ధము చెప్పువారిపై నమ్మకము ఎంత వరకు దిగజారుననగా వారు నిజము చెప్పినా ఇందులో తప్పక అబద్ధమున్నదని భావించబడును. అబద్ధము చెప్పువారు అబద్ధము చెప్పుట తగ్గించదలచినను తొందరగా దూరము కాదు. సుదీర్ఘ కాలము సాధన చేసిన తర్వాతనే నిజము చెప్పే అలవాటు అగును."

(మల్ఫూజాత్ సంపుటి 3, పుట 350)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"మానవ సహజ స్థితులలో సత్యము ఒకటి. స్వార్థపరుడైనంత వరకు మానవుడు అబద్ధమాడగోరడు. అబద్ధమాడుటకు వెనుకాడును. ఒప్పుకోడు. అందు వలననే అబద్ధము నిరూపణ అయిన వానిని చూచి సంతసించును. అతనిని ఏవగించును. కాని కేవలము ఈ సహజ గుణము నైతిక విలువ నైతిక స్థితి అనబడదు. ఎందుకనగా దీనిని పిచ్చివారు గాని శిశువులు గాని అలవరచుకొన వచ్చును. స్వార్థమును వీడి దాని అడ్డంకులను ఎదుర్కొను నంతవరకు మానవుడు సత్యవాది కాలేడు. తమకు నష్టము కానపుడు సత్యమాడి తమ లాభము, గౌరవమునకు నష్టము వాటిల్లినప్పుడు సత్యమును వీడి అసత్యమాడినచో అతనికి, పిచ్చివారికి గాని, శిశువులకు గాని తేడా ఏమిటి ? పిచ్చివారు గాని, యుక్త వయస్సు రాని పిల్లలు ఈ విధమైన సత్యము పలుకరా ? ప్రోద్బలము లేనిదే ఎవడు కూడ ప్రపంచము నందు అసత్యమాడడు. కనుక నష్టము కలిగినపుడు సత్యమును వీడుట వాస్తవముగా నైతిక విలువ కానే గాదు. తమ ప్రాణ,

ధన, గౌరవమునకు నష్టము వాటిల్లునపుడే సత్యమాడు సమయ సందర్భమూ. దీనినే అల్లాహ్ ఈ విధముగా వ్యాఖ్యానించెను.

﴿ فَاجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْاَوْثَانِ وَاجْتَنِبُوْا قَوْلَ الزُّوْرِ ﴾(1) ﴿ وَلَا يَأْبَ الشُّهَدَآءُ اِذَا مَا دُعُوْا ﴾ (2) ﴿ وَلَا تَكْتُمُوا الشَّهَادَةَ وَمَنْ يَّكْتُمْهَا فَاِنَّهٗ اٰثِمٌ قَلْبُهٗ ﴾ (3) ﴿ وَاِذَا قُلْتُمْ فَاعْدِلُوْا وَلَوْ كَانَ ذَا قُرْبٰى ﴾ (4) ﴿ كُوْنُوْا قَوّٰمِيْنَ بِالْقِسْطِ شُهَدَآءَ لِلّٰهِ وَلَوْ عَلٰى اَنْفُسِكُمْ اَوِالْوَالِدَيْنِ وَالْاَقْرَبِيْنَ ﴾ (5) ﴿ وَلَا يَجْرِمَنَّكُمْ شَنَاٰنُ قَوْمٍ عَلٰى اَلَّا تَعْدِلُوْا ﴾ (6) ﴿ وَالصّٰدِقِيْنَ وَالصّٰدِقٰتِ ﴾ (7) ﴿ وَ تَوَاصَوْا بِالْحَقِّ وَتَوَاصَوْا بِالصَّبْرِ ﴾(8) ﴿ لَا يَشْهَدُوْنَ الزُّوْرَ ﴾(9)

దీని అనువాదము వారిట్లు తెలిపిరి. విగ్రహారాధన నుండి అబద్ధము నుండి తమను తప్పించుకొనుము. అబద్ధము ఒక విగ్రహము. దానిని నమ్మిన వాడు అల్లాహ్‌పై నమ్మకము పెట్టలేదు. అబద్ధమాడినచో అల్లాహ్ దూరమగును. నిజసాక్ష్యమునకు పిలిచినపుడు నిరాకరించకుము. నిజసాక్ష్యమును దాచకుము. దాచినచో అతని హృదయము పాపముతో నిండి పోవును. మాటలాడవలసి వచ్చినపుడు సమీప వ్యక్తి అయినను న్యాయ సమ్మతమైన సత్యమునే చెప్పుము. ప్రతి సాక్ష్యము అల్లాహ్ కొరకే వుండవలెను. అసత్యమాడకుము. తమ ప్రాణాలకు నష్టము కలిగినను,

*1–అల్ హజ్ సూక్తి:31, 2–అల్ బఖరహ్ సూక్తి: 283, 3–అల్ బఖరహ్ సూక్తి: 284, 4–అల్ అన్ఆమ్ సూక్తి:153, 5–అ న్నిసా సూక్తి: 136, 6–అల్ మాయిదహ్ సూక్తి: 9, 7–అల్ అహ్‌జాబ్ సూక్తి: 36, 8–అల్ అస్ర్ సూక్తి: 4, 9–అల్ ఫుర్ఖాన్ సూక్తి: 73*

తల్లిదండ్రులకు హాని కలిగినను లేదా తమ పూర్తి సమీప బంధువులనగా కుమార్తె, కుమారుడైనను సత్యమును వీడకుము. సత్యమాడినచో ఒక జాతి శత్రువగునని వెనకాడకుము. సత్య స్త్రీ, పురుషులు గొప్ప ప్రతి ఫలమును పొందగలరు. ఇతరులను సత్యమాడుటకు ప్రోత్సహింతురు, బోధింతురు, అసత్యవాదుల సభలలో కూర్చొనరు. ఇది వారి అలవాటు."

(ఇస్లామి ఉసూల్‌కి ఫిలాసఫీ, రూహాని ఖజాయిన్ సంపుటి 10, పుట 360, 361)

## వ్యభిచారము నుండి దూరముండుము

ఇదే రెండవ నిబంధనలో వ్యభిచారము నుండి దూరముండు నిబంధన గలదు. దీని గురించి అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَلَا تَقْرَبُوا الزِّنٰى اِنَّهٗ كَانَ فَاحِشَةً وَسَآءَ سَبِيْلًا﴾

(బనీ ఇస్రాయీల్ సూక్తి : 33) అనగా వ్యభిచార దరిచేరకుము. నిశ్చయముగా ఇది సిగ్గుమాలినది. చాలా దుర్మార్గము.

ఒక హదీసు ఇట్లు గలదు. ముహమ్మద్ బిన్ సీరీన్ కథనము మేరకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ క్రింది విషయాలను ఉపదేశించిరి. తర్వాత ఒక పెద్ద కథనము తెలిపిరి. అందులో ఈ ఉపదేశము గలదు. వ్యభిచారము, అబద్ధము కెదురుగా పవిత్రత, సత్యము ఉత్తమమైనవి, స్థిరమైనవి.

(సునన్ దారెఖుత్నీ, కితాబుల్ వసాయా, బాబ్ మా యస్తహిబ్బు బిల్‌వసియ్యతి మినత్తష్‌హది వల్‌కలామి)

ఇచట వ్యభిచారము, అబద్ధము రెండింటిని కలిపి ప్రస్తావించ బడెను. దీనితో కూడ అబద్ధము ఎంత పెద్ద పాపమో స్పష్టమగును.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"వ్యభిచారమును పుట్టించు మార్గముల నుండి, విందుల నుండి దూరముగా నుండుము. వ్యభిచారము చేయువాడు పాపపు అంతిమ సరిహద్దులను చేరును. వ్యభిచారము గమ్యానికి దూరము చేయును. వివాహము కాని వారు ఉపవాస వ్రతమునాచరించి, అల్పాహారము నుండి తమ ఉద్రేకములను అదుపు చేయవలెను."

(ఇస్లామి ఉసూల్‌కి ఫిలాసఫీ, రూహాని ఖజాయిన్
సంపుటి 10, పుట 342)

వారిట్లనిరి. హృదయములో ఆలోచన కలిగించే విషయాల నుండి కూడ దూరముండుము. నవయువకులలో పలు మార్లు ఈ భావముండదు. సినిమాలను చూచు అలవాటుండును. అతి నీచమైన,చూడలేని సినిమాలను చూతురు. వీటి నుండి దూరముండవలెను. ఇది వ్యభిచారపు ఒక రకము.

## చెడు చూపు నుండి దూరముండుము

రెండవ నిబంధనలో మూడవ రకపు దుష్కార్యము చెడు చూపు నుండి దూరముండుట గలదు. ఇదేమిటి 'ఘిజ్జె బసర్' దృష్టిని క్రింద పెట్టుటయే గదా!

ఒక హదీసు ఇట్లు గలదు. అబూరీహాన (రజి) కథనము ప్రకారము వారొక యుద్ధములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట యుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక రాత్రి ఇట్లనునది వారు వినిరి. "అల్లాహ్ మార్గములో మెలకువగా నున్న కంటిపై అగ్ని నిషేధించబడెను. అల్లాహ్ భీతితో కన్నీరు ప్రవహించిన కంటిపై అగ్ని నిషేధించబడెను."

ఒక కథకుడు ఇట్లు చెప్పినట్లు నేను విన్నానని అబూషరీఫ్ తెలిపిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు కూడ అనిరి. అల్లాహ్ నిషేధించిన వస్తువులను చూడక క్రిందికి వంగిన కంటిపై అగ్ని నిషేధించబడెను. వైభవోపేతుడైన అల్లాహ్ మార్గములో పగులగొట్టబడిన కంటిపై అగ్ని నిషేధించబడెను.

(సునన్ దార్మీ, కితాబుల్ జిహాద్. బాబ్ ఫిల్లజీ యస్హరు ఫీ సబీలిల్లాహి హారిసన్)

మరొక హదీసులో ఉబాద బిన్ సామిత్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. మీరు మీ గురించి ఆరు విషయాలలో నాకు వాగ్దానము చేయుము. (మీరు స్వర్గములో ప్రవేశించు శుభవార్త మీకు నేనిత్తునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అంటున్నారు) వారిట్లనిరి. మీరు మాట్లాడినపుడు సత్యము పలుకుము. మీరు వాగ్దానము చేసినపుడు పూర్తి చేయుము. మీ వద్ద న్యాసము పెట్టబడినచో తిరిగి అడిగినపుడు ఇచ్చి వేయుము. (రేపు మాపని దాటవేయ కూడదు) తమ రహస్యాంగములను కాపాడుము. దృష్టి క్రింద వుంచుము. తమ చేతులను దౌర్జన్యము నుండి ఆపుకొనుము.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 5, పుట 323, ముద్రణ బేరూత్)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనము మేరకు నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరి. రహదారులలో సమావేశములు నిర్వహించకుము. వారిట్లు విన్నవించుకొనిరి. ఓ రసూలుల్లాహ్! రహదార్లలో సమావేశమగుట తప్ప మాకు మరో గత్యంతరము లేదు. అందుకు

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అలాంటప్పుడు దారి హక్కు చెల్లించుము. దాని హక్కు ఏమిటని? వారు మనవి చేసిరి. వారిట్లనిరి. ప్రతి వచ్చి పోవు వాని సలామ్‌నకు సమాధానము చెప్పుము. దృష్టి క్రింద వుంచుము. దారి అడిగిన వానికి దారి చూపుము. ఉత్తమత్వమును బోధించుము. దుష్టత్వము నుండి ఆపుము.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 3, పుట 16, ముద్రణ బేరూత్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"మానవుని స్వభావములోని అవసరాలు, లోపములకనుగుణంగా ఎంతో ఉత్తమమైన అభిప్రాయమును పవిత్ర ఖురాన్ అవలంభించినది.

﴿قُل لِّلۡمُؤۡمِنِيۡنَ يَغُضُّوۡا مِنۡ اَبۡصَارِهِمۡ وَيَحۡفَظُوۡا فُرُوۡجَهُمۡ ذٰلِكَ اَزۡكٰى لَهُمۡ﴾

(అన్నూర్ సూక్తి : 31) అనగా తమ దృష్టిని క్రిందికి పెట్టమని, తమ గుప్తాంగములను కాపాడవలెనని విశ్వాసులకు చెప్పివేయుము. వారి కొరకు ఈ విషయము చాలా పవిత్రతకు కారణమగును. ఫురూజ్ అనగా గుప్తాంగము మాత్రమే కాదు ప్రతి రంధ్రము అనగా చెవులు మొ॥ కూడ ఇందులో గలవు. పరస్త్రీ రాగమును వినుటను కూడ ఇందులో వ్యతిరేకించనైనది. మరల గుర్తుంచుకొనుము! వేలాది, వేలాది అనుభవములతో నిరూపితమైనదేమనగా ఏ విషయముల నుండి అల్లాహ్ ఆపునో తుదకు వాటి నుండి మానవుడు దూరముండవలసినదే".

(మల్ఫూజాత్ సంపుటి 7, పుట 135)

మరల వారిట్లనిరి. "స్త్రీ పురుషులిద్దరు నిబంధనలు తప్పక పాటించాలని ఇస్లాం అనివార్యము చేసెను. స్త్రీలకు తెర ధరించు ఆజ్ఞ వున్నట్లే పురుషులకు కూడ దృష్టిని క్రింద వుంచవలెనను అనివార్య ఆజ్ఞ గలదు. నమాజ్, ఉపవాసము, దానము, హజ్, ధర్మబద్ధము, నిషేధములో భేదము, అల్లాహ్ ఆదేశాలకు విరుద్ధముగా నున్న తమ అలవాట్లు, ఆచారాలు, సంప్రదాయములను వీడుట మొ॥. వంటి ఆంక్షలు గలవు. వీటితో ఇస్లాం ద్వారము చాలా ఇరుకుగా గలదు. ఇందుకే ప్రతి వ్యక్తి ఈ ద్వారములో ప్రవేశించలేడు."

(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 614,
క్రొత్త ప్రచురణ)

తమ దృష్టిని సదా క్రింద వుంచవలెనని పురుషులకు కూడ స్పష్టమైనది కాబోలు. స్త్రీలకు మాత్రమే సిగ్గు పరిమితం కాదు పురుషులకు కూడ గలదు.

మరల వారిట్లనిరి. "అల్లాహ్ కేవలము ఇహ్సాన్ అనగా మానవ భద్రత కొరకు ఉత్తమ బోధనే గాక మానవ పవిత్రత పొందుటకు ఐదు మార్గములు కూడ చూపించినాడు. అనగా (1) పరస్త్రీల పై దృష్టి సారించుటను అరికట్టుట, (2) పరస్త్రీల ధ్వనిని వినకుండా చెవులను నివారించుట, (3) పరస్త్రీల కథలను వినకుండుట, (4) కామాన్ని ప్రోత్సహించు అన్ని విందుల నుండి తమను దూరముంచుట, (5) వివాహము కానిచో ఉపవాస వ్రతమును నిర్వహించుట, మొదలగునవి.

ఈ ఉపాయములతో ఇట్టి ఉత్తమమైన బోధన పవిత్ర ఖురాన్ బోధించినది కేవలము ఇస్లాం నందే గలదని మేము నమ్మకముగా

ప్రకటించుచున్నాము. మానవుని యందు కామము సహజ విలువగా నుండి పరిస్థితులకనుగుణంగా బయల్పడక వుండలేదు. అనగా కామవాంఛలు అపాయకరమైన రూపము దాల్చుట సహజము. ఇది మనము మరువరాదు. అందుకనే పరస్త్రీల నృత్యగానములు, గుప్తాంగములను పవిత్ర దృష్టితోనైనను చూచుటకు అల్లాహ్ బోధించలేదు. యువతుల నృత్యగానాలు, అందచందాల గాథలు విను బోధ కూడ మనకు ఒసంగబడలేదు. పరస్త్రీల గుప్తాంగములు గాని, స్త్రీలను గాని, వారి నృత్యగానాలు గాని, మంచి దృష్టితో గాని, చెడు భావముతో గాని వినకూడదని, చూడకూడదని మనకు బోధించబడినది. అదుపు దప్పిన దృష్టి వలన ఒకనాడు తప్పక కామవాంఛలకు లోనగుట తథ్యము. కనుక మనము మన కన్నులు, హృదయము పవిత్రత కలిగివుండాలని అల్లాహ్ ఇట్టి ఉత్తమ బోధను బోధించెను. ఒక ఆకలిగా వున్న కుక్క ముందు రొట్టెలుంచి వాటి వైపు అది చూడదని భావించుట మన తప్పిదము. కనుక కామ వాంఛలను పూర్తిగా చేయు సౌలభ్యము గలిగి దూరముండుట అసాధ్యము. అందు వలన ఆ కామవాంఛలు పుట్టు సమయమే, అవకాశమే సంభవించకూడదని అల్లాహ్ కోరిక".

(ఇస్లామి ఉసూల్‌కి ఫిలాసఫీ, రూహాని ఖజాయిన్
సంపుటి 10, పుట 343,344)

## దుష్కార్యముల నుండి దూరముండుము

ఇదే ద్వితీయ నిబంధనలో నాలుగవ దుష్టత్వము దుష్కార్యము నుండి దూరముండుట గురించి గలదు. అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

﴿وَاعۡلَمُوۡۤا اَنَّ فِيۡكُمۡ رَسُوۡلَ اللّٰهِ لَوۡ يُطِيۡعُكُمۡ فِىۡ كَثِيۡرٍ مِّنَ الۡاَمۡرِ لَعَنِتُّمۡ وَلٰـكِنَّ اللّٰهَ حَبَّبَ اِلَيۡكُمُ الۡاِيۡمَانَ وَزَيَّنَهٗ فِىۡ قُلُوۡبِكُمۡ وَكَرَّهَ اِلَيۡكُمُ الۡكُفۡرَ وَالۡفُسُوۡقَ وَالۡعِصۡيَانَ‌ؕ اُولٰۤـئِكَ هُمُ الرّٰشِدُوۡنَۙ﴾

(అల్‌హుజరాత్ : 8) అనగా మీలో అల్లాహ్ ప్రవక్త వున్నాడని ఎరుగుడు. అతడు మీ పలు మాటలను ఒప్పుకొనినచో మీరు తప్పక కష్టములో పడుదురు. కాని మీ కొరకు విశ్వాసమును అల్లాహ్ ప్రియముగా చేసివున్నాడు. దానిని మీ హృదయములలో అలంకరింపజేసి వున్నాడు. అవిశ్వాసము, దుర్మార్గము, అవిధేయత నుండి మీలో ఏవగింపును పుట్టించి వున్నాడు. మార్గదర్శనము పొందిన వారే వీరు.

ఒక హదీస్ ఇట్లు గలదు. అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు ఇట్లు చెప్పినట్లు అస్వద్ తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరి. మీలో ఎవరైనా ఉపవాసమున్నప్పుడు అసభ్యకరముగా మాట్లాడకూడదు. దుర్భాషలాడకూడదు, మూర్ఖత్వపు మాటలు మాటలాడకూడదు, అతనితో ఎవరైనా మూర్ఖముగా వ్యవహరించినచో నేను ఉపవాసమున్నాను, నన్ను క్షమించమని అనవలెను.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 2, పుట 356, ముద్రణ బేరూత్)

ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. విశ్వాసునితో దుర్భాషలాడుట పాపము, అతనితో యుద్ధము చేయుట అవిశ్వాసము.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 1, పుట 439, ముద్రణ బేరూత్)

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని అబ్దుర్రహ్మాన్ బిన్ షబల్ (రజి) తెలిపిరి. వ్యాపారులు దుర్మార్గులు. కథకుడి ప్రకారము ఇట్లు విన్నవించబడెను. ఓ రసూలుల్లాహ్! వ్యాపారము ధర్మబద్ధము చేయబడలేదా? రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఎందుకు చేయబడలేదు? కాని వారు వ్యాపారము చేయునప్పుడు అబద్ధమాడుదురు. ప్రమాణములు చేసి మరీ ధర పెంచుదురు.

కథకుని ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరిట్లు తెలిపిరి. దుష్టులు నరకవాసులు. దుష్టులు ఎవరు ? అని మనవి చేయబడెను. అందుకు ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. స్త్రీలలో కూడ దుష్టులుందురు. ఒక వ్యక్తి ఇట్లు మనవి చేసెను. వారు మా తల్లులు, అక్కాచెల్లెల్లు, భార్యలు కారా? ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి.ఎందుకు కారు? కాని వారికి ఏదైనా ఇచ్చినప్పుడు వారు కృతజ్ఞత తెలుపరు. వారికి ఏదైనా పరీక్ష ఎదురైనప్పుడు సహనం పాటించరు.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 3, పుట 428, ముద్రణ బేరూత్)

వ్యాపారస్తులకు కూడ ఈ విషయము ఆలోచించదగినది. నిజాయితితో స్పష్టమైన వ్యాపారము జరగవలెను. బైఅత్ నిబంధనలలో కూడ ఇదొక నిబంధన.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి. “అవిశ్వాసుని కంటే ముందు దురాచారికి శిక్ష విధించవలెనని ఖురాన్ ద్వారా ఋజువగును. ఒక జాతి నేరమయమైనప్పుడు మరో జాతికి దానిపై అధికారమిచ్చుట అల్లాహ్ సంప్రదాయము.”

(మల్ఫూజాత్ సంపుటి 2 పుట 653, క్రొత్త ప్రచురణ)

మరల ఇట్లనిరి. "పాపము, నేరములలో హద్దులు దాటి, అల్లాహ్ ఆదేశములను కించపరచి, దైవ పవిత్ర స్థలములను ద్వేషించి, ప్రపంచ ఆనందము, అందములోనే మునిగిపోయినప్పుడు అల్లాహ్ హలాకూ, చంగేజ్ ఖాన్ ద్వారా వీరిని ఇటులనే నాశనమొనర్చెను. అప్పుడు ఆకాశము నుండి ఇట్లు శబ్దము వచ్చేదని వ్రాసియున్నది. اَيُّهَا الْكُفَّارُ اُقْتُلُوا الْفُجَّارَ (ఓ అవిశ్వాసులారా! నేరస్తులను హతమార్చుము). వాస్తవముగా అల్లాహ్ దృష్టిలో నేరస్తుడు, పాపిష్టుడు అయిన వ్యక్తి ద్వేషించదగినవాడు."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 108, క్రొత్త ప్రచురణ)

మరల ఇట్లనిరి. "క్రూరుని, నేరస్తుని దుఆ స్వీకరించబడదు. ఎందుకనగా అతడు అల్లాహ్‌ను విస్మరించును. కనుక అల్లాహ్ కూడ అతన్ని విస్మరించును. ఒక కుమారుడు తండ్రిని గౌరవించక విస్మరించినచో తండ్రి అతన్ని పట్టించుకోనప్పుడు అల్లాహ్ ఎందుకు పట్టించుకొనును."

(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంపుటి 3 పుట 611, క్రొత్త ప్రచురణ)

## దౌర్జన్యము చేయకుము

దౌర్జన్యము చేయడని రెండవ నిబంధనలో గలదు. పవిత్ర ఖురాన్‌లో ఇట్లు గలదు.

﴿فَاخْتَلَفَ الْاَحْزَابُ مِنْۢ بَيْنِهِمْ فَوَيْلٌ لِّلَّذِيْنَ ظَلَمُوْا مِنْ عَذَابِ يَوْمٍ اَلِيْمٍ﴾

(అజ్జుఖ్రుఫ్ : 66) దీని అనువాదము: కనుక వారిలో నుండే పక్షములు భేదాభిప్రాయపడిరి. కనుక అన్యాయము చేసిన వారికి బాధాకరమైన దినపు

శిక్ష రూపములో నాశనము సంభవించుగాక!

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు తెలిపిరి. దౌర్జన్యము చేయకుము. ఎందుకనగా దౌర్జన్యము ప్రళయ దినమున అంధకార రూపములో ప్రత్యక్షమగును. అత్యాశ, లోభితనము, కపటము నుండి దూరముండుము. ఎందుకనగా అత్యాశ, లోభితనము, కపటము గడిచిన వారిని నాశనము చేసెను. అది వారిని రక్తపాతము వైపు ఆకర్షించెను. గౌరవనీయ వస్తువులను అవమానింపజేసెను.”

(ముస్నద్ అహ్మద్ సంపుటి 2 పుట 323)

మరొకని హక్కు చెల్లించకపోవుట కూడ దౌర్జన్యమే. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. ఓ రసూలుల్లాహ్! ఏ దౌర్జన్యము అన్నికంటే పెద్దదని నేను అడిగితిని. ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. తన సోదరుని హక్కులోని ఒక జానెడు భూమి ఆక్రమించుట అన్నికంటే పెద్ద దౌర్జన్యము. దౌర్జన్యముతో తీసుకొనిన ఆ భూమిలోని ఒక్క కంకర క్రింది మొత్తం పొరలు తాళ్ళ రూపంలో ప్రళయ దినమున అతని మెడలో వేయబడును. భూమి లోతు దానిని సృష్టించిన వానికి తప్ప మరెవరికి తెలియదు.”

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 1 పుట 396,
ముద్రణ బేరూత్)

కొందరు తమ సోదరీ, సోదరుల లేదా పొరుగువారి హక్కులు చెల్లించరు. జగడములో ఆస్తులను ఆక్రమింతురు, భూములు లాక్కొందురు అటువంటి వారు దీనిని గ్రహించవలెను. అహ్మది అయిన తర్వాత అనగా

ఎవరి హక్కును మేము హరించము, దౌర్జన్యము చేయమని ప్రతిజ్ఞ చేసిన తర్వాత ఇది చాలా భయపడాల్సిన స్థానము.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని ఒక హదీసులో హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు తెలిపిరి. నిరుపేద ఎవడో మీకు తెలుసా ? ధనము, సామాగ్రి లేనివాడని మేమంటిమి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నా సమాజములో నిరుపేద ఎవడనగా ఒకడు ప్రళయ దినమున నమాజ్, ఉపవాసము, దానము, హజ్ మొ॥ కర్మలతో వచ్చును. అతడు ఒకన్ని దూషించి వుండును, ఒకనిపై నిందమోపి వుండును, ఒకని ధనము హరించియుండును, ఒకన్ని చట్టవిరుద్ధముగా హత్య చేసివుండును లేదా కొట్టివుండును. కనుక ఆ బాధితులకు అతని సత్కర్మలు ఇవ్వబడును. వారి హక్కులు చెల్లించే లోపు అతని సత్కర్మలు అయిపోయినచో వారి దుష్కర్మలు అతనికివ్వబడును. ఇటుల స్వర్గము బదులు అతన్ని నరకములో వేయబడును. వాస్తవముగా ఇతడే నిరుపేద."

(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్ తహ్రీముజ్జాలిమ్)

ఇప్పుడు ఆలోచించుము, గ్రహించుము, మనలో ప్రతి ఒక్కరు ఆలోచించవలెను. ఇటువంటి కార్యములకు పాల్పడుచున్న వారికిది భయానక స్థానము. మనలో ఏ ఒక్కడు కూడ ఇటువంటి బీద స్థితిలో అల్లాహ్ ఆస్థానములో ఎన్నడు ప్రవేశపెట్టబడకూడదు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు నుడివిరి. "ఇక్కడ వున్న లేదా తమ ప్రాంతాలలో నివసించుచున్న నా సంస్థ మొత్తం ఈ ఆదేశమును శ్రద్ధతో వినుము. ఈ సంస్థలో చేరి నాతో గురుతర సంబంధము ఏర్పరచుకొను ఉద్దేశమేమనగా వారు సత్కర్మలు, సదుద్దేశము,

దైవభీతిలో గొప్ప స్థానముకు చేరవలెను. ఎటువంటి పీడనము, అల్లరితనము, దుష్టత్వము వారి దరిచేరకూడదు. వారు ఐదు పూటల నమాజ్‌కు కట్టుబడి వుండవలెను. అబద్ధమాడకూడదు. నాలుకతో ఎవరిని బాధించకూడదు. వారు ఎటువంటి పాపమునకు పాల్పడకూడదు. ఎటువంటి అల్లరితనము, దౌర్జన్యము, పీడనము, కుట్ర ఆలోచన కూడ హృదయములో కలుగకూడదు. ప్రతి రకమైన పాపములు, నేరములు, చేయకూడనివి, మాట్లాడకూడనివి, మనస్సు కోరికలు, అసమంజస పనుల నుండి దూరముండవలెను. పవిత్ర హృదయము, హానిరహిత, నిరాడంబర వ్యక్తిత్వము కలిగిన అల్లాహ్ దాసులగుము. ఎటువంటి విషపూరిత స్వభావము వారిలో వుండకూడదు. సర్వ మానవుల సానుభూతి వారి నియమము కావలెను. అల్లాహ్‌తో భయపడుము. పీడనము సృష్టించు మార్గములు, అవినీతితో దూరముండుము. ఐదు పూటల నమాజ్ సక్రమంగా సలుపుము. దౌర్జన్యము, పెద్దరికము, అవినీతి, లంచము, హక్కుల ఉల్లంఘన, అనవసర పక్షపాతము నుండి దూరముండవలెను. దుష్ట సహవాసములో కూర్చొనకుము. తమతో రాకపోకలు కలిగివున్న వ్యక్తి అల్లాహ్ ఆజ్ఞలను పాటించడని, మానవుల హక్కులను గౌరవించడని, క్రూర మనస్తత్వము, దుష్ట స్వభావము, చెడు అలవాట్లు గలవాడని లేదా మీరు బైఅత్, గురుత్వ బంధము పెట్టుకున్న వ్యక్తి గూర్చి అసమంజస, అనవసర దుర్భాష, తిట్టువాడని, అలవాటుగా ఆరోపణలు చేయువాడని, అల్లాహ్ దాసులను మోసగించు వాడని తెలిసినచో ఈ దుష్టత్వమును తమ నుండి దూరము చేసుకొనుట అనివార్యము. ఇటువంటి హానికర వ్యక్తి నుండి దూరముండుము. ఏ మతము, జాతి, పక్షమునకు చెందిన

వ్యక్తికి హాని కలిగించుటకు సంకల్పించకుము. ప్రతి ఒక్కరి కొరకు నిజమైన ఉపదేశకుడగుము. దుష్టులు, దురలవాట్లు గల వారు, పీడనము సృష్టించువారు, దుష్కర్మలు చేయువారికి మీ సమావేశములలో స్థానముండకూడదు. ఎప్పుడైనా అతడు మిమ్ములను మోసగించవచ్చును. కనుక మీ గృహములలో అతడుండకూడదు."

ఇంకను ఇట్లనిరి. "ఈ విషయములు, నిబంధనలను నేను మొదటి నుండే తెలుపుచు వచ్చుచున్నాను. ఈ ఆదేశములన్నిటిని పాటించుట నా సంస్థలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఏదేని అపవిత్రత, అవహేళన, ఎగతాళి మీ సమావేశములలో వుండకూడదు. సహృదయము, పవిత్ర స్వభావము, పరిశుద్ధ ఆలోచనతో భూమిపై నడువుము. ప్రతి దుష్టత్వము ఎదురించదగినది కాదని గుర్తుంచుకొనుము. కనుక తరచుగా క్షమాగుణము, విస్మరింపును అలవర్చుకొనుము. ఓర్పు, సహనముతో వ్యవహరించుము. అక్రమ పద్ధతిలో ఎవరిపై దాడి చేయకుము. ఆత్మవాంఛలను అదుపులో పెట్టుకొనుము. ఏదేని వాదించినచో, ధార్మిక సంభాషణ జరిగినచో మెత్తని, నైతిక పద్ధతిని అవలంభించుము. ఎవరేని మూర్ఖత్వము ప్రదర్శించినచో త్వరగా సలాం చెప్పి ఇటువంటి సభ నుండి వెళ్ళిపొమ్ము. మీరు బాధించబడినచో, తిట్టబడినచో, మీ పట్ల చెడు మాటలు అనబడినచో తస్మాత్ జాగ్రత్త! అవివేకమును అవివేకముతో ఎదురించకుము. లేనిచో మీరు కూడ వారి వలె అగుదురు. మీరు మొత్తం ప్రపంచమునకు పుణ్య, సన్మార్గములో ఆదర్శము కావలెనని అల్లాహ్ కోరెను. కావున దుష్టత్వము, చెడు, పీడనము, పాపపు స్వభావముగల వానిని తమ మధ్య నుండి తొందరగా తీసివేయుము. మా సంస్థలో పేదరికము,

పుణ్యము, సన్మార్గము, సహనము, మెత్తగా మాట్లాడుట, పుణ్యస్వభావము, సత్ప్రవర్తనతో వుండలేని వ్యక్తి మాతో తొందరగా విడిపోవలెను. ఎందుకనగా ఇటువంటి వ్యక్తి మాలో వుండుటకు మా అల్లాహ్ ఆశించడు. అతడు సన్మార్గము అవలంభించ నందున దుష్ట మరణమునకు గురి అగును. కావున మీరు జాగరూకులై సహృదయము, నిరాడంబరత, సన్మార్గమును అవలంభించుము. మీరు ఐదు పూటల నమాజ్, సత్ప్రవర్తనతో గుర్తించబడుదురు. పాపపు విత్తనము గల వ్యక్తి ఈ ఉపదేశమును పాటించలేడు."

(ఇష్తిహార్ దివి 29 మే 1898– తబ్లీఘె రిసాలత్
సంపుటి 8 పుట 42,43)

## ద్రోహమునకు పాల్పడకుము

ద్రోహమును గూర్చి పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَلَا تُجَادِلْ عَنِ الَّذِيْنَ يَخْتَانُوْنَ اَنْفُسَهُمْ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ خَوَّانًا اَثِيْمًا﴾

(అన్నిసా: 108) అనగా తమను తాము వంచించు కొనువారి పక్షము వహించి వాదించకుము. నిశ్చయముగా అల్లాహ్ ద్రోహబుద్ధులు గల మహా పాపాత్ములను ప్రేమించడు.

ఒక హదీస్‌లో ఇట్లు గలదు. హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహివసల్లం ఇట్లు నుడివిరి. మీ వద్ద ఒకడు ఏదేని వస్తువు న్యాసముగా పెట్టినప్పుడు అతని న్యాసమును అతనికి తిరిగివ్వుము. మీకు ద్రోహము చేసిన వ్యక్తికి కూడ మీరు ద్రోహము చేయకుము.

(అబూ దావూద్ కితాబుల్ బుయూ బాబ్ ఫిర్రజులి యాకుజు హక్కహు)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"చెడును వీడుటకు ఉపయోగించు రెండవ గుణము నీతి, నిజాయితి, అనగా పరసంపత్తిని అక్రమముగా ఆక్రమించి అతనిని కష్టపెట్టుటకు వెనుకాడుట, నిరాకరించుట, నీతి, నిజాయితి మానవ సహజ స్థితులలో ఒక స్థితి. కనుకనే ఒక శిశువు కూడ తన సహజ సాధుత్వమును ప్రదర్శించును. శిశువుగా వున్నందు వలన దురలవాట్లకు లోనుకాడు. పరస్త్రీ పాలు త్రాగుటకు ఇష్టపడడు."

(ఇస్లామి ఉసూల్‌కి ఫిలాసఫీ, రూహానీ ఖజాయిన్ సంపుటి 10, పుట 344)

## పీడనము నుండి దూరముండుము

మరల పీడనము గూర్చి అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَابْتَغِ فِيمَآ اٰتٰكَ اللّٰهُ الدَّارَ الْاٰخِرَةَ وَ لَا تَنْسَ نَصِيْبَكَ مِنَ الدُّنْيَا وَ اَحْسِنْ كَمَا اَحْسَنَ اللّٰهُ اِلَيْكَ وَلَا تَبْغِ الْفَسَادَ فِى الْاَرْضِ ۚ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْمُفْسِدِيْنَ﴾

(అల్ ఖసస్: 78) అనగా అల్లాహ్ నీకు ప్రసాదించిన దాని ద్వారా పరలోక గృహమును కోరుము. ప్రపంచ జీవితములో నుండి తన నిర్ణీత భాగమును కూడ విస్మరించకుము. అల్లాహ్ నీతో మేలుగా వ్యవహరించినట్లు నీవు వ్యవహరించుము. భూమిపై ఉపద్రవము (వ్యాపించుటకు) ఇష్టపడకుము. నిశ్చయముగా అల్లాహ్ ఉపద్రవము చేయువారిని ఇష్టపడడు.

హజ్రత్ మఆజ్ బిన్ జబల్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరి. రెండు రకాల యుద్ధము గలదు. అల్లాహ్ ప్రీతి కొరకు ఇమామ్ విధేయతలో

చేయబడునది ఒకటి. ఇటువంటి వ్యక్తి తన మంచి ధనమును అల్లాహ్ మార్గములో వినియోగించును. తన తోటి ప్రయాణికుని కొరకు సౌలభ్యము ఏర్పరచును. ఉపద్రవము నుండి దూరముండును. కనుక ఇటువంటి వ్యక్తి నిద్రించుట, లేచి వుండుట ఇవన్నియు ఫలితార్హతలు గలవి. మరొకడు గర్వము, దర్శన నిమిత్తం, తన సాహస కథలు వినిపించుటకు యుద్ధము చేయును. ఇటువంటి వ్యక్తి ఇమామ్‌నకు అవిధేయత వహించును. భూమిలో ఉపద్రవమును సృష్టించును. కావున ఇటువంటి వ్యక్తి, పై వ్యక్తి వలె స్థానము పొంది తిరిగి రాలేడు.

(సునన్ అబూదావూద్ కితాబుల్ జిహాద్,
బాబ్ ఫీమన్ యఘ్జూ వయల్తమిస్)

నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించిరని హజ్రత్ అస్మా (రజి) బిన్తె యజీద్ తెలిపెను. మీలో ఉత్తమోత్తముల గురించి మీకు తెలుపుదునా ? అవును ఓ రసూలుల్లాహ్! తప్పక తెలుపగలరని అనుచరులు (రజి) అనిరి. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఒక మంచి దృశ్యమును చూచినప్పుడు వారు దైవస్మరణలో నిమగ్నమగుదురు. మరల ఇట్లనిరి. నేను మీలో అతి దుష్టుల గురించి తెలుపుదునా ? అతి దుష్టులు ఎవరనగా చాడీలు చెప్పుటకు తిరుగుదురు. ప్రేమానురాగము గల వారి మధ్య ద్వేషము పుట్టింతురు. విధేయులు పాపములకు పాల్పడవలెనని వారు కోరెదరు.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 6 పుట 459 ముద్రణ బేరూత్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ స్థాపించిన సంస్థలో చేరినందుకు మాత్రమే మిమ్మలను

వదిలి మీతో విడిపోయినవారితో కలహము, ఉపద్రవమునకు పాల్పడక అల్లాహ్ తన కృపతో మీకందించిన తెలివి, జ్ఞానము వారికి ప్రసాదించవలెనని పరోక్షముగా ప్రార్థన చేయుము. మీరు మంచి మార్గమును ఎన్నుకొనిరని తమ పవిత్ర ప్రవర్తన, గొప్ప నడవడితో నిరూపించుము. ప్రతి రకమైన ఉపద్రవము, గందరగోళ ప్రదేశముల నుండి దూరముండి, తిట్లు తిని సహనము వహించుమని మీకు పదే పదే తెలుపుటకు నేను నియమించబడితిని. దుష్టత్వమునకు పుణ్యముతో సమాధానమివ్వుము. ఎవరైనా ఉపద్రవము సృష్టించుటకు సంకల్పించినచో అటువంటి ప్రదేశము నుండి మీరు వెళ్ళిపొమ్ము, మెత్తదనముతో సమాధానమివ్వుము................ఈ సంస్థ వాడై ఒక వ్యక్తి ఎవరితోనో జగడమాడినాడని నేను విన్నప్పుడు నేను ఈ పద్ధతిని ఇష్టపడను. ప్రపంచములో ఆదర్శముగా నిలుచు సంస్థ దుర్మార్గమును అవలంభించుట నేను అస్సలు ఇష్టపడను, అల్లాహ్ కూడ ఇష్టపడడు. ఎవడైనా ఈ సంస్థవాడై సహనము, ఓర్పును పాటించనిచో అతడు ఈ సంస్థలోని వాడు కాడని గుర్తుంచుకొనవలెనని అల్లాహ్ సూచించెను. అతి కోపము, ఉద్రేకముతో నన్ను దూషించ వచ్చును. ఈ విషయమును అల్లాహ్‌కు వదులుము. మీరు దీనిని నిర్ణయించలేరు. నా సమస్య అల్లాహ్‌కు వదులుము. ఆ దూషణలను విని మీరు సహనము, ఓర్పును పాటించుము."

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 157 క్రొత్త ముద్రణ)

## తిరుగుబాటు పద్ధతుల నుండి దూరముండుము

మరల తిరుగుబాటు పద్ధతుల నుండి దూరముండునని ఇదే ద్వితీయ నిబంధనలో గలదు. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్

అలైహిస్సలాం ఇట్లనిరి. وَقَاتِلُوْهُمْ حَتّٰى لَا تَكُوْنَ فِتْنَةٌ وَيَكُوْنَ الدِّيْنُ لِلّٰهِ (అల్‌బఖరహ్: 194) అనగా పీడనము నశించు వరకు, మతము అల్లాహ్ పరమైనంత వరకు, ప్రభుత్వము అల్లాహ్ మతమునకు వశమగునంత వరకు వారితో యుద్ధము చేయుచుండుము.

**قُلْ قِتَالٌ فِيْهِ كَبِيْرٌ وَصَدٌّ عَنْ سَبِيْلِ اللّٰهِ وَكُفْرٌ بِهٖ وَالْمَسْجِدِ الْحَرَامِ وَاِخْرَاجُ اَهْلِهٖ مِنْهُ اَكْبَرُ عِنْدَ اللّٰهِ وَالْفِتْنَةُ اَكْبَرُ مِنَ الْقَتْلِ وَلَا يَزَالُوْنَ يُقَاتِلُوْنَكُمْ حَتّٰى يَرُدُّوْكُمْ عَنْ دِيْنِكُمْ اِنِ اسْتَطَاعُوْا**

(అల్‌బఖరహ్ : 218) అనగా వారితో నీవిట్లనుము. పవిత్ర నగరములో యుద్ధము చేయుట మహా పాపము. కాని అల్లాహ్ మార్గము నుండి ఆపుట, అతనిని నిరాకరించుట, పవిత్ర మస్జిద్ నుండి ఆపుట, అల్లాహ్ అర్హత గల వారిని అచటి నుండి వెడల గొట్టుట అల్లాహ్ దృష్టిలో దీని కంటే మహా పాపము. పీడనము, హననము కంటే నికృష్టము."

(జన్గె ముఖద్దస్ – రూహాని ఖజాయిన్ సంపుటి 6, పుట 255)

ఇట్లనిరి. "హిందువుల నుండి అధికంగా ముస్లిముల నుండి కూడ కొందరు మూర్ఖులు, దుష్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటును సూచించే కొన్ని కార్యములు చేయునట్లు నేను చూచుచున్నాను. ఏదో ఒక సమయమున వారి తిరుగుబాటు వ్యవహారము బహిర్గతమగునని నాకు అనుమానం కలదు. కనుక అల్లాహ్ కృపానుసారము లక్షలలో చేరిన నా సంస్థ సభ్యులు పంజాబ్, భారతదేశములో వ్యాపించివున్నారు. నేను 26 సంవత్సరముల నుండి ఉపన్యాస, వ్యాస రూపములో ఈ ప్రభుత్వము

మన ఉపకారి అయినందున వారి విధేయత వహించవలెనని నొక్కి చెప్పుచున్న విషయమును గుర్తుంచుకోవలెనని నేను గట్టిగా చెప్పుచున్నాను. ............. ఈ ప్రభుత్వమునకు విరుద్ధముగా తిరుగుబాటు ఆలోచన కలిగిన వ్యక్తి నా సంస్థలో వుండలేడు. ఏ ప్రభుత్వము ద్వారా క్రూరుల నుండి మనము రక్షించబడి, దాని అధీనములో మన సంస్థ అభివృద్ధి సాధించు చున్నదో దానికి కృతజ్ఞత తెలుపకపోవడం నా దృష్టిలో కృతఘ్నత అగును. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు తెలిపెను. "**هَلْ جَزَآءُ الْاِحْسَانِ اِلَّا الْاِحْسَان**" (అధ్యాయము అర్రహ్మాన్:61) అనగా మేలునకు ప్రతిఫలము మేలు తప్ప మరొకటి వుండగలదా ? మానవునికి కృతజ్ఞత తెలుపని వ్యక్తి అల్లాహ్‌కు కూడ కృతజ్ఞత తెలుపలేడని పవిత్ర హదీసులో గలదు. ఈ ప్రభుత్వ అధీనము నుండి వెళ్ళిపోయినచో మీకు రక్షణ ఎక్కడుందో ఆలోచించుము. మీకు రక్షణ కల్పించే ఒక ప్రభుత్వము పేరు చెప్పగలరా? మీరు వారి దృష్టిలో అవిశ్వాసి, ధర్మభ్రష్టులైనందున ప్రతి ముస్లిం ప్రభుత్వము మీ రక్తము త్రాగడానికి సిద్ధముగా నున్నది. కావున మీరు ఈ దైవానుగ్రహమును గౌరవించుము.........కావున ఒక రక్తపిశాచి మహ్దీ వచ్చును, క్రైస్తవ రాజులను బంధించునని విశ్వసించుట కల్పిత విషయాలు. వీటి వలన మన ముస్లిమేతరుల హృదయాలు కల్మషము, కఠినమైనవి. ఇటువంటి విశ్వాసము గల వారు ప్రమాదకర మానవులు. ఇటువంటి విశ్వాసాలు ఏదో ఒక సమయమున మూర్ఖుల తిరుగుబాటుకు తప్పక కారణమగును. ముస్లిములు ఇలాంటి విశ్వాసాల నుండి విముక్తి పొందవలెనని మా ప్రయత్నము. మానవ సానుభూతి లేని ధర్మము దైవ ధర్మము కానే కాదు. ఆకాశమున మీరు కరుణించబడుటకు

భూమిపై కరుణించుమని మనకు బోధించబడెను."

(మజ్మూఅ ఇష్తిహారాత్ సంపుటి 3 పుట 582-585)

## మానసిక ఉద్రేకములకు లొంగకూడదు

మానసిక ఉద్రేకముల సమయమున వాటికి లొంగకూడదని ఇదే ద్వితీయ నిబంధనలో సూచించబడెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"ఆధ్యాత్మిక వ్యక్తి నాలుగవ స్థానమును అల్లాహ్ ఈ పవిత్ర సూక్తిలో ఇట్లు తెలిపెను. ﴿وَالَّذِيْنَ هُمْ لِفُرُوْجِهِمْ حٰفِظُوْنَ﴾ (అల్‌ముమినూన్:6) అనగా తమ రహస్యాంగములను నిషేధిత కోరికల నుండి కాపాడువారు, మూడవ దశను దాటిన విశ్వాసులు. ఈ స్థానము మూడవ స్థానము కంటే గొప్పది. ఎందుకనగా మూడవ స్థానములో విశ్వాసి తనకు ఇష్టమైన, ప్రియమైన ధనమును అల్లాహ్ మార్గములో వినియోగించును. కాని నాలుగవ స్థానమునకు చెందిన విశ్వాసి ధనము కంటే ఎక్కువ ఇష్టమైన, ప్రియమైన అనగా మానసిక కోరికలను అల్లాహ్ మార్గములో త్యాగము చేయును. ఎందుకనగా మానవుడు తన మానసిక కోరికలను ఎంత వరకు కోరుననగా వాటిని పూర్తి చేయుటకు తనకిష్టమైన ధనమును నీరులా ఖర్చు చేయును. వేలాది రూపాయలను మానసిక కోరికలను పూర్తి చేయుటకు నాశనము చేయును. మానసిక కోరికలను పొందుటకు ధనమునకు ప్రాధాన్యతనివ్వడు. అవసరము, ఆకలితో వున్న నగ్న వ్యక్తికి అతి లోభితనము వలన ఒక్క పైసా కూడ ఇవ్వలేని పిసినారి స్వభావము గల వ్యక్తులు తమ మానసిక కోరికల ఉద్రేకములో వ్యభిచార స్త్రీలకు వేలాది రూపాయలు ధారపోసి తమ గృహములను నాశనము

చేసుకొనునట్లు చూడవచ్చును. లోభితనము వంటి మలినమును కూడ కొట్టుకుపోగల ఒక వేగమైన వరద మానసిక కోరికలని తెలిసెను. కావున లోభితనమును దూరము చేయ గల దైవ మార్గములో ధన వినియోగము వంటి ఈ విశ్వాస శక్తి కంటే మానసిక కోరికల తుఫాను నుండి దూరముండి శక్తివంతమైన షైతాన్‌ను ఎదురించుటలో అతి గట్టి, దీర్ఘ కాలము వరకు నుండు విశ్వాస శక్తి గొప్పదని తెలియును. ఎందుకనగా దుష్టత్వమును ఆదేశించు ఆత్మ వంటి పురాతన కొండచిలువను తన పాదాల క్రింద నలుగగొట్టుట దీని పని. మానసిక కోరికలను పూర్తి చేయు ఉద్రేకములో, ప్రదర్శన, ప్రఖ్యాతి కొరకు కూడ లోభితనము దూరము కావచ్చును. కాని మానసిక కోరికల ఉత్తేజముతో జనించే తుఫాను చాలా గట్టి, దీర్ఘ కాలము వరకు కొనసాగును. అల్లాహ్ కరుణతో తప్ప ఇది దూరము కాలేదు. శరీర అవయవాలలో అతిగట్టి, దీర్ఘాయువు గలది ఎముక. ఇటులనే ఈ తుఫాన్‌ను దూరము చేయగల విశ్వాస శక్తి కూడ చాలా గట్టిది, దీర్ఘాయువు గలది. ఇది అల్లాహ్ కరుణతో ఇటువంటి శత్రువును దీర్ఘ కాలము వరకు ఎదురించవచ్చును. ఏకేశ్వరుడైన అల్లాహ్ ప్రత్యేక కరుణతో తప్ప మానసిక ఉద్రేకముల ఈ ప్రమాదకర, కల్లోల తుఫాను నుండి రక్షణ కష్టమే. అందుకే విధిలేక హజ్రత్ యూసుఫ్ ఇట్లనిరి.

﴿وَمَآ اُبَرِّئُ نَفۡسِىۡ ۚ اِنَّ النَّفۡسَ لَاَمَّارَةٌ ۢ بِالسُّوۡٓءِ اِلَّا مَا رَحِمَ رَبِّىۡ﴾

(యూసుఫ్:54) నా ఆత్మను పాపరహితమైనదని నేను నిర్ధారించను. నా ప్రభువు అనుగ్రహించిన వానికి తప్ప, ఆత్మ నిశ్చయముగా దుష్టత్వమునకు చాలా ఆదేశించుచుండును. ఈ సూక్తిలో గల వాక్యము ﴿اِلَّا مَا رَحِمَ رَبِّىۡ﴾ లాంటిదే నూహ్ తుఫాను ప్రస్తావన సందర్భమున కూడ గలదు. అక్కడ

అల్లాహ్ ఇట్లు నుడివెను. ﴿لَاعَاصِمَ الْيَوْمَ مِنْ اَمْرِاللّٰهِ اِلَّا مَنْ رَّحِمَ﴾ (హూద్: 44) మానసిక కోరికలు తన ఆకారము, దృఢత్వములో నూహ్ తుఫాన్ను పోలివుండునని ఇందులో సూచన గలదు."

(బరాహీనె అహ్మదియ్య 5వ భాగము, రూహాని ఖజాయిన్ సంపుటి 21 పుట 205, 206)

సారాంశమేమనగా దుష్ట కోరికలు సదా మిమ్ములను జయించుటకు ప్రయత్నించును. కాని మీరు వాటి నుండి దూరముండుము. అల్లాహ్ సహాయము కోరుతూ దూరముండుము. ఈ రోజులలో దీని అనేక మార్గములు పడగ విప్పినవి. కావున ఇంతకు ముందు కంటే ఎక్కువ ప్రార్థన చేయు, అల్లాహ్ వైపు శ్రద్ధ వహించుట, అతని కరుణను యాచించుట అవసరము.

اَلَا لِلّٰهِ الدِّيْنُ الْخَالِصُ ـ وَالَّذِيْنَ اتَّخَذُوْا مِنْ دُوْنِهٖ اَوْلِيَآءَ مَا نَعْبُدُ هُمْ اِلَّا لِيُقَرِّبُوْنَا اِلَى اللّٰهِ زُلْفٰى اِنَّ اللّٰهَ يَحْكُمُ بَيْنَهُمْ فِىْ مَا هُمْ فِيْهِ يَخْتَلِفُوْنَ اِنَّ اللّٰهَ لَا يَهْدِىْ مَنْ هُوَ كٰذِبٌ كَفَّارٌ

(అజ్జుమర్ : 4) అనగా జాగ్రత్తా ! కపటము లేని ధర్మమే అల్లాహ్ వైభవమునకు తగినది. అతనికి తప్ప మిత్రులను చేసికొనిన వారు (ఇట్లందురు). "వారు మమ్ములను అల్లాహ్ సామిప్యమును కలుగ చేసి, ఉన్నత స్థానముల వరకు గొని పోవుదురను ఉద్దేశముతో మేము వారిని ఆరాధింతుము". అల్లాహ్ వారి మధ్య వారు వైమనస్యము చేయుచుండిన దానికి నిశ్చయముగా తీర్పుచేయును. అల్లాహ్ ఎన్నడూ అబద్ధమాడుచు, కృతఘ్నత తెలుపువానికి మార్గదర్శనము చేయడు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "పాత, క్రొత్త నిబంధన, పవిత్ర ఖురాన్ సాక్ష్యమిచ్చిన అల్లాహ్‌నే విశ్వసించుము. ఈ మూడు గ్రంథముల మిశ్రమ సాక్ష్యముతో ఋజువుకాని దేవున్ని మీ కల్పనతో సిద్ధము చేయకుము. వివేకము, ఆత్మాభిప్రాయము సాక్ష్యమిచ్చిన, అల్లాహ్ గ్రంథములు ఏకీభవించిన విషయమునే విశ్వసించుము. అల్లాహ్ గ్రంథములలో విభేదము ఏర్పడే విధంగా అల్లాహ్‌ను నమ్మకుము. వ్యభిచారము చేయకుము. అబద్ధమాడకుము. చెడు చూపు చూడకుము. ప్రతి పాపము, నేరము, హింస, మోసము, పీడనము, తిరుగుబాటు మార్గముల నుండి దూరముండుము. మానసిక ఉద్రేకములకు తలొగ్గకుము. మానవుని స్వభావముపై ఐదు రకాలుగా ఉద్యమము వచ్చును. కనుక ఐదు పూటల నమాజ్ సలుపుము. దయాసాగరుడైన సందేశహరునికి కృతజ్ఞతలు తెలుపుము. అంధకార కాలము తర్వాత మరల అల్లాహ్‌ను పొందు మార్గమును నేర్పినందున వారిపై దురూద్ పంపుము."

ఇట్లనిరి. "నా సంస్థకు ఈ నిబంధనలు విశిష్ట గుర్తులుగా నున్నవి. ఏ విధముగా మానవ సానుభూతి, అహింస, అధికారుల అవిధేయతను వీడుటను ఈ సంస్థ సూచించునో అది ఇతర ముస్లిములలో కనిపించదు. వారి నియమములు తప్పులతో కూడినవి. మరో రకమైనవి. వాటి వివరముల అవసరము లేదు. అయినను ఇది సందర్భము కూడ కాదు".

(జమీమ తిర్యాఖుల్ ఖులూబ్, రూహాని ఖజాయిన్
సంపుటి 15, పుట 524, 526)

# మూడవ బైఅత్ నిబంధన

**"అల్లాహ్ అతని ప్రవక్త ఆదేశాల మేరకు క్రమబద్ధముగా ఐదు సమయముల ప్రార్థనలు (నమాజ్) సలుపును. సాధ్యమైనంత వరకు తహజ్జుద్ ప్రార్థన సలుపుటకు, నబియే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పై దురూద్ పంపుటకు, ప్రతి రోజు తమ పాపముల క్షమాపణ యాచించుటకు సంసిద్ధుడై సహృదయముతో అల్లాహ్ వరములను స్మరించుచు, ప్రశంసించుచు, స్తుతించుచు ప్రతి రోజును గడుపును."**

## ఐదు పూటల నమాజ్ సలుపుము

ఈ నిబంధనలో తెలుపబడిన విషయములలో మొదటిదేమనగా అల్లాహ్, ప్రవక్త ఆదేశానుసారము ఐదు పూటల నమాజ్ క్రమం తప్పకుండా

సలుపుము. స్త్రీ, పురుషులకిరువురికి, పది సంవత్సరముల వయసు దాటిన పిల్లలకు నిర్ణీత సమయమున నమాజ్ చేయమని అల్లాహ్, ప్రవక్త ఆదేశము గలదు. పురుషులకైతే సామూహిక నమాజ్ సలుపుటకు తగు ఏర్పాటు చేసుకొను ఆదేశము గలదు. మస్జిదులకెళ్ళి, వాటిని నింపి, అతని అనుగ్రహమును వెతుకుము. ఐదు పూటల నమాజ్ గురించి ఎలాంటి వెసులుబాటు లేదు. ప్రయాణములో కొంత మినహాయింపు గలదు. లేదా అనారోగ్యములో కూడ మినహాయింపు గలదు. ఉ॥ కలుపుకొని లేదా తగ్గించుకొని చదవచ్చును. అనారోగ్యములో మస్జిదుకు వెళ్ళుటకు వెసులుబాటు వున్నచో సామూహిక నమాజ్ ప్రాధాన్యత ఎంత వున్నదో అంచనా వేయవచ్చును. దీని ప్రాధాన్యత గురించి నేను మరికొన్ని వ్యాఖ్యములు చదివెదను. మనము తమను తాము విక్రయించు ప్రతిజ్ఞ చేయుచున్నాము. కాని పవిత్ర ఖురాన్ ఈ ఆజ్ఞను పాటించుచున్నామా అని ప్రతి బైఅత్ చేసిన వ్యక్తి పరిశీలించు కోవలెను. ప్రతి అహ్మదీయుడు స్వయంగా ఉపదేశించువాడు. స్వయంగా ఆత్మ పరిశీలన చేసుకోవలెను. మనము స్వయంగా మన మనసును పరిశీలించు కొనినచో ఒక విప్లవము ఏర్పడ వచ్చును.

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు తెలిపెను.

﴿وَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ وَاَطِيْعُوا الرَّسُوْلَ لَعَلَّكُمْ تُرْحَمُوْنَ﴾

(అన్నూర్ : 57) అనగా ప్రార్థన (నమాజ్) ను స్థిరపరచుము. దానము (జకాత్) చెల్లించుము. మీరు అనుగ్రహించబడుటకు ప్రవక్తకు విధేయులగుము.

మరల అధ్యాయము తాహా, సూక్తి 15లో ఇట్లు గలదు.

﴿ اِنَّنِیۡۤ اَنَا اللّٰہُ لَاۤ اِلٰہَ اِلَّاۤ اَنَا فَاعۡبُدۡنِیۡ ۙ وَ اَقِمِ الصَّلٰوۃَ لِذِکۡرِیۡ ﴾

అనగా నిశ్చయముగా నేనే అల్లాహ్‌ను. నేను తప్ప మరో ఆరాధ్య దైవము లేదు. కనుక నన్ను ఆరాధించుము. నా స్తోత్రము కొరకు ప్రార్థన (నమాజ్) ను స్థిరపరచుము.

నమాజ్ గురించి పవిత్ర ఖురాన్‌లో అనేక ఆదేశములు గలవు. నేనొక హదీస్‌ను ప్రవేశ పెట్టెదను. హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. నమాజ్‌ను వదులుట మానవున్ని అన్యారాధన, అవిశ్వాసమునకు దగ్గర చేయును.

(ముస్లిం కితాబుల్ ఈమాన్-బాబ్ బయాన్ ఇత్తిలాక్ ఇస్మెల్ కుఫ్రి అలా మన్ తరకస్సలాతి)

నా కనుల ప్రశాంతత నమాజ్‌లో గలదని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించినట్లు హజ్రత్ అబూహురైరహ్ (రజి) తెలిపిరి. ప్రళయ దినమున మొట్టమొదటగా దాసులను నమాజ్ గురించి ప్రశ్నించబడును. ఈ లెక్క సరిపోయినచో అతడు సఫలమై మోక్షము పొందినవాడగును. ఈ లెక్క సరిపోనిచో అతడు విఫలమై నష్టములో పడును. అతని విధులలో ఏమైనా తక్కువైనచో అల్లాహ్ ఇట్లనును. నా దాసుని కొన్ని అదనపు పుణ్యములు కూడ గలవు. అదనపు పుణ్యములున్నచో విధులలో గల లోటును వాటితో పూరించబడును. ఈ విధముగనే అతని ఇతర కర్మలను లెక్కించబడి,

పరిశీలించబడును.

(తిర్మిజి కితాబుస్సలాత్, బాబ్ ఇన్న అవ్వల మా యుహాసబు బాదల్ మౌతి)

మరల హదీసులో ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించినట్లు నేను విన్నానని హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు తెలిపిరి. ఒక వ్యక్తి ఇంటి ముందు నది ప్రవహించు చుండగా అతడు అందులో రోజుకు ఐదు సార్లు స్నానము చేసినప్పుడు అతని శరీరముపై ఎలాంటి మలినముండునా ? ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం! మలినముండదని అనుచరులు వేడుకొనిరి. వారు (స) ఇట్లనిరి. ఇదే సామెత నమాజ్‌కు వర్తించును. అల్లాహ్ వాటి ద్వారా పాపములను క్షమించును, లోపములను దూరము చేయును.

(బుఖారి కితాబ్ మవాఖీతుస్సలాత్ బాబుస్సలాతుల్ ఖమ్స్ కఫ్ఫారహ్ లిల్‌ఖతా)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. “నమాజ్ సలుపుము. నమాజ్ సర్వ శుభములకు మూలమైనందున దానిని సలుపుము”.

(ఇజాలయె ఔహామ్ : పుట 829 ప్రథమ ముద్రణ)

హుజూర్ అలైహిస్సలాం మరల ఇట్లనిరి.

“నా సంస్థలో తమను తాము లెక్కించుకొను సర్వ జనులారా! నిజముగా నిష్టాపర మార్గములో నడిచినప్పుడే మీరు నా సంస్థగా ఆకాశమున గుర్తించబడుదురు. మీరు అల్లాహ్‌ను చూచునట్లు భయము, భక్తితో ఐదు పూటలు నమాజ్ సలుపుము. తమ ఉపవాసములను స్వచ్ఛతతో

అల్లాహ్ కొరకు పూర్తి చేయుము. జకాత్ (దానము) అర్హత గల ప్రతి వ్యక్తి జకాత్ చెల్లించవలెను. హజ్ విధించబడిన వ్యక్తి ఎలాంటి అవరోధము లేనిచో హజ్ చేయవలెను. పుణ్యమును అతి శ్రద్ధతో చేయుము. దుష్టత్వమును అసహ్యతతో వీడుము. దైవభక్తి లేనిదే ఏ కార్యము అల్లాహ్‌కు చేరదు. ప్రతి పుణ్యమునకు మూలము దైవభక్తి. ఏ కార్యములో ఈ వేరు వృధా కాదో, ఆ కార్యము కూడ వృధా కాదు".

(కష్తి నూహ్– రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 15)

వారిట్లనిరి. "నమాజ్ ఏమిటి ? ప్రభువు నామమును ప్రకటించుట, ప్రశంసించుట, పవిత్రత కోరుట, పశ్చత్తాపము, శాంతి ప్రార్ధనలు దైవభక్తితో యాచించు ప్రార్ధనే నమాజ్. మీరు నమాజ్ సలుపునప్పుడు తమ దుఆలలో తెలియని వారి వలె అరబ్బి పదాల వరకే పరిమితం కాకుము. ఎందుకనగా వారి నమాజ్, వారి పశ్చత్తాపములు వాస్తవరహిత ఆచారములు మాత్రమే. కాని మీరు నమాజ్ సలుపునప్పుడు అల్లాహ్ వ్యాఖ్యమైన పవిత్ర ఖురాన్, ప్రవక్త వ్యాఖ్యములైన పలు నిర్ణీత దుఆలు తప్ప మిగతా దుఆలన్ని మీ స్వంత భాషలోనే దుఃఖకర పదాలలో చేయుము. ఇటుల మీ హృదయములపై ఆ నిరాడంబరత ప్రభావము కొంత మేర పడును".

(కష్తి నూహ్– రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 68,69)

మరల వారిట్లనిరి. "నమాజ్‌తో ఆకాశము మానవుని వైపు వంగును. నమాజ్ చేయువాడు తనను తాను మృతిచెందినట్లు భావించును. అతని ఆత్మ కరిగిపోయి అల్లాహ్ ఆస్థానములో పడిపోవునట్లు. ..... ఏ గృహములో ఇటువంటి నమాజ్ చేయబడునో ఆ గృహము ఎన్నటికి

నాశనము కాదు. నూహ్ కాలములో నమాజ్ వుండినచో ఆ జాతి ఎన్నటికి నాశనము కాకుండేది. హజ్ (కాబాయాత్ర), ఉపవాసము, దానము నియమముకు లోబడివున్నవి. కాని నమాజ్ అనివార్యమైనది. అన్ని ఒక సంవత్సరములో ఒక్క సారి వుండగా దీని ఆజ్ఞ ప్రతి రోజు ఐదు పూటలు గలదు. కావున సంపూర్ణ రీతిలో చేయనిదే లభించవలసిన దాని పూర్తి ఫలితాలు లభించవు. ఇంకను ఈ బైఅత్ కూడ ప్రయోజనము లేనిదగును".

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 627 క్రొత్త ప్రచురణ)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "నమాజ్ ప్రతి ముస్లింపై విధించబడినది. పవిత్ర హదీస్‌లో ఇట్లు గలదు. ఒక జాతి ఇస్లాం స్వీకరించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనెను. ఓ రసూలుల్లాహ్! (స) మేము వ్యాపారస్తులము, పశువుల వలన దుస్తులు శుభ్రముగా నుండవు. మాకు తీరిక కూడ వుండదు. కావున మా కొరకు నమాజ్ క్షమించగలరు. సమాధానముగా వారు (స) ఇట్లనిరి. చూడుము! నమాజ్ లేనిచో మరేమి వున్నట్లు ? నమాజ్ లేని ధర్మము ధర్మమే కాదు. నమాజ్ అనగానేమి? నిరాడంబరతతో తన బలహీనతలను అల్లాహ్ ముందుంచి, అతనితోనే సహాయము యాచించుట. ఒక్కోసారి అతని వైభవము, అతని ఆదేశముల పాలనలో వినమ్రతతో నిలుచుట, మరోసారి సంపూర్ణ నిస్సహాయత, దీనతతో అతని ముందు సాష్టాంగములో పడుట, అతనితో తన అవసరాలను యాచించుట ఇదే నమాజ్. ఒక యాచకుని వలె దాతను నీవు ఇట్ల, నీవు అట్లని ప్రశంసిచుట. అతని వైభవము, గొప్పతనమును గుర్తు చేసి అతని కరుణను కంపించి యాచించుట. ఏ మతములో ఇది లేదో అది మతమే కాదు.

మానవుడు సదా దీనుడు. అతని అనుగ్రహముతోనే ఏదో కొంచెం చేయవచ్చును. కనుక అతని ప్రీతి మార్గములను యాచించుచు, అతని అనుగ్రహమును కోరవలెను. ఓ అల్లాహ్! మేము నీ వారమగుటకు, నీ ప్రీతి ప్రకారము నడుచుకొని నీ ప్రీతిని పొందువారమగుటకు అనుగ్రహించుము. అల్లాహ్ ప్రేమ, అతని భక్తి, అతని స్మరణలోనే హృదయముండుటను నమాజ్ అందురు. దీని పేరే ధర్మము.

నమాజ్ నుండే మినహాయింపు కోరువాడు పశువుల కంటే ఎక్కువ ఏమి చేసినట్లు ? అటులనే తిని, త్రాగి పశువుల వలె నిద్రించుట. ఇది ధర్మము ముమ్మాటికి కాదు. ఇది అవిశ్వాసుల జీవితము. నిర్లక్ష్య శ్వాస, అవిశ్వాస శ్వాసతో సమానమను విషయము వాస్తవము, సరైనదే"

(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సంపుటి 3,
పుట 611,612, క్రొత్త ముద్రణ)

నమాజ్‌లో ఆసక్తి ఎట్లు కలుగును. దీని గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"ఓ అల్లాహ్! నీవు నన్ను చూస్తున్నావు. నేను ఎంతటి అంధున్ని, చెవిటి వాడిని, ఇప్పుడు నేను పూర్తిగా నిర్జీవముగా నున్నాను. కొద్ది సమయము తర్వాత పిలుపు వచ్చినచో నేను నీ వైపు వత్తునని నాకు తెలుసు. అప్పుడు నన్నెవరు ఆపలేరు. కాని నా హృదయము అంధకారములో నున్న జ్ఞానరహితమైనది. నీ ప్రేమ, ఆసక్తి అందులో పుట్టునట్లు నీవు కాంతిజ్వాల ప్రసాదించుము. నేను అంధునిగా లేవక, అంధులలో కలిసిపోకుండా కరుణించుము".

(మల్ఫూజాత్ సంపుటి 2 పుట 616 క్రొత్త ముద్రణ)

# ప్రాతఃకాల (తహజ్జుద్) నమాజ్‌కు ప్రయత్నించుము

మరల ప్రాతఃకాల నమాజ్ చదువవలెనని ఈ మూడవ నిబంధనలో గలదు. అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَمِنَ الَّيْلِ فَتَهَجَّدْ بِهٖ نَافِلَةً لَّکَ عَسٰٓى اَنْ يَّبْعَثَکَ رَبُّکَ مَقَامًا مَّحْمُوْدًا﴾

(బనీ ఇస్రాయిల్ : 80)రాత్రి ఒక భాగములో కూడ దీని (ఖురాన్)తో తహజ్జుద్ చదువు చుండుము. ఇది నీ కొరకు నఫిల్‌గా నుండును. (ఇటుల చేసినచో) నీ ప్రభువు నిన్ను సమీపములోనే ప్రశంసనీయ స్థానములో నియమించవచ్చును.

హజ్రత్ బిలాల్ (రజి) కథనము మేరకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీరు తహజ్జుద్ నమాజ్‌కు ప్రయత్నించవలెను. ఎందుకనగా ఇది గత సత్కార్యుల పద్ధతి, దైవ సామీప్యమునకు కారణముగా నున్నది. ఈ అలవాటు పాపముల నుండి దూరముంచును, దుష్టత్వములను అంతము చేయును, శారీరక వ్యాధుల నుండి రక్షించును".

(తిర్మిజి అబ్వాబుద్దావాత్)

మరో హదీసిట్లు గలదు. హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. రాత్రి తుది ఘడియ రాగానే అల్లాహ్ ప్రపంచ ఆకాశమునకు వచ్చి ఇట్లనును. ఎవరైనా నాతో ప్రార్థన చేయుచున్నారా నేను అతని ప్రార్థనను స్వీకరింతును. ఎవరైనా నాతో క్షమాపణ కోరినచో నేను క్షమింతును. ఎవరైనా నాతో ఆహారమడిగినచో నేను ఆహారమిత్తును. ఎవరైనా తన బాధను దూరము

చేయుటకు నాతో దుఆ చేసినచో అతని బాధను నేను దూరము చేయుదును. శుభోదయము వరకు అల్లాహ్ ఇటులనే ప్రకటించు చుండును.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 2 పుట 521 బేరూత్ ముద్రణ)

దుఆ కొరకు అనేకులు వ్రాయుచూ వుందురు. స్వయాన ఈ పద్ధతిని అవలంభించినచో అల్లాహ్ శుభముల వర్షము పడునట్లు చూడవచ్చును.

హజ్రత్ అబూహుర్రైరహ్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సారి ఇట్లనిరి. అల్లాహ్ ఇట్లనును. నా మిత్రునితో శత్రుత్వము నెరిపినవానితో నేను యుద్ధమును ప్రకటింతును. నాకు ఇష్టమైన, నేను విధించిన దానితో నా దాసుడు నా సామీప్యమును పొందినట్లు మరో దానితో పొందలేడు. నవాఫిల్ (అదనపు) తో నా దాసుడు నాకు దగ్గరగును. తద్వారా నేనతన్ని ప్రేమింతును. నేనతని మిత్రుడి నైనప్పుడు నేనతని చెవులగుదును. వాటితో అతడు వినును. అతని కనులగుదును. వాటితో అతను చూచును. అతని చేతులగుదును. వాటితో అతను పట్టుకొనును. అతని పాదములగుదును. వాటితో అతను నడుచును. అనగా నేనే అతని కార్యరూపమగుదును. అతను నన్నడిగినచో నేనతనికిత్తును. నన్ను ఆశ్రయము కోరినచో ఆశ్రయమిత్తును.

(బుఖారి కితాబుర్రిఖాఖ్ బాబుత్తవాజి)

హజ్రత్ అబూహుర్రైరహ్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. రాత్రి నిద్ర లేచి, నమాజ్ చదివి, తన భార్యను నిద్ర లేపిన వ్యక్తిని అల్లాహ్ కరుణించుగాక! ఆమె వెనుకాడినచో నిద్రలేచుటకు ఆమె ముఖముపై నీళ్ళు చల్లును. ఇటులనే

రాత్రి నిద్ర లేచి, నమాజ్ చదివి, తన భర్తను నిద్ర లేపిన మహిళను అల్లాహ్ కరుణించుగాక! అతడు వెనుకాడినచో నిద్రలేచుటకు అతని ముఖముపై నీళ్ళు చల్లును.

(అబూదావూద్ కితాబుస్సలాత్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"మన సంస్థవారు తహజ్జుద్ నమాజ్‌ను అనివార్యము చేసుకోవలెను. ఎక్కువ చదువలేనిచో దుఆ చేయు అవకాశము లభించుటకు కనీసం రెండు రకాతులు చదువవలెను. నిజమైన బాధ, ఉద్రేకముతో వెలువడినందున ఆ సమయపు దుఆలు ఆమోదించబడును. హృదయములో ఒక ప్రత్యేక చింత, విచారము, బాధ లేనంత వరకు సుఖమైన నిద్ర నుండి లేచుట ఎట్లు సాధ్యమగును ? కనుక అప్పుడు నిద్ర లేచుటయే ఒక హృదయ బాధకు దర్పణం. అందు వలన దుఆలో బాధ, దుఃఖకర స్థితి ఏర్పడును. దుఆ ఆమోదమునకు ఇదే బాధ, దుఃఖము కారణమగును. కాని నిద్ర లేచుటలో అలసత్వము, నిర్లక్ష్యము వహించినచో హృదయములో ఆ బాధ, దుఃఖము లేదన్నట్లు. ఎందుకనగా నిద్ర బాధను దూరము చేయును. కాని నిద్ర లేవడంతో నిద్ర కంటే ఎక్కువ ఏదో ఒక బాధ, దుఃఖము వుండి అది నిద్ర నుండి లేపుచున్నదని తెలియును".

(మల్ఫూజాత్ సంపుటి 2 పుట 182 క్రొత్త ముద్రణ)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ మీకు తన దారి చూపుటకు రాత్రులలో నిద్ర లేచి దుఆ చేయుము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు కూడ క్రమేణ ప్రగతి చెందిరి. వారు గతములో ఎట్లుండిరి. ఒక రైతు విత్తనము

వలె నుండిరి. తర్వాత ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం నీరందించిరి. వారు (స) వారి కొరకు దుఆ చేసిరి. విత్తనము సరైనదై, భూమి మంచిదైనందున ఈ నీటితో గొప్ప పంట వచ్చెను. హుజూర్ అలైహిస్సలాం నడిచినట్లే వారు నడిచేవారు. వారు దినము లేదా రాత్రి కొరకు నిరీక్షించేవారు కాదు. మీరు స్వచ్ఛమైన హృదయముతో పశ్చత్తాపపడుము. మీరు తహజ్జుద్ కొరకు లేవగలరు. దుఆ చేయుము. హృదయమును సరిదిద్దు కొనుము. బలహీనతలను వీడుము. అల్లాహ్ ప్రీతికనుగుణంగా తమ మాట, కర్మను సరిచేసుకొనుము.”

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 28 క్రొత్త ముద్రణ)

## ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దురూద్ క్రమం తప్పకుండా పంపుము

ఇదే మూడవ నిబంధనలో ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపుటకు కృషి చేయుచుండునని గలదు. దీనిని క్రమం తప్పకుండా ఆచరించును. దీని గురించి పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿إِنَّ اللّٰهَ وَمَلٰٓئِكَتَهٗ يُصَلُّوْنَ عَلَى النَّبِيِّ يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا صَلُّوْا عَلَيْهِ وَسَلِّمُوْا تَسْلِيْمًا﴾

(అల్‌అహ్‌జాబ్ : 57) అనగా అల్లాహ్, అతని దేవదూతలు, నిశ్చయముగా సందేశహరునిపై దయానుగ్రహములు పంపుదురు. ఓ విశ్వాసులారా! మీరు కూడ అతనిపై దురూద్, శాంతిని తరచుగా పంపుము.

హ్రజత్ అబ్దుల్లాహ్ రజియల్లాహు అన్‌హు బిన్ అమర్ బనిల్ ఆస్

నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు నేను వింటినని తెలిపిరి. ముఅజ్జిన్‌ను అజాన్ (ఆరాధన నిమిత్తం పిలుపు) ఇచ్చునట్లు మీరు విన్నచో అతడనే పదములను మీరు కూడ పలుకుము. ఆ తర్వాత నాపై దురూద్ పంపుము. నాపై దురూద్ పంపిన వానిని అల్లాహ్ పది రెట్లు కరుణించును. మరల ఇట్లనిరి. అల్లాహ్‌తో నా కొరకు మాధ్యస్థమును యాచించుము. అది స్వర్గపు స్థానములలోని ఒక స్థానము. అల్లాహ్ దాసులలో ఒకరికి అది లభించును. ఆ వ్యక్తి నేనే అని నేను ఆశించు చున్నాను. నా కొరకు అల్లాహ్‌తో మాధ్యస్థము యాచించిన వానికి సిఫారసు ధర్మబద్ధమగును.

(సహీ ముస్లిం కితాబుస్సలాత్ బాబిల్ ఖౌలి మిస్ల ఖౌలిల్ ముఅజ్జిని సమిఅహు సుమ్మ యుసల్లి అలన్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం)

అల్లాహ్ ప్రీతిని పొందుటకు, అల్లాహ్ వరకు చేరుటకు, తమ దుఆలను అల్లాహ్ వద్ద ఆమోదింపజేసుకొనుటకు మనము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మాధ్యస్థమును ఆశ్రయించుట తప్పనిసరని మనము గుర్తుంచుకోవలెను. అందుకు ఉత్తమమైన మార్గము హదీసానుసారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ తెలిపినట్లు అధికముగా దురూద్ చదువవలెను.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ عَلٰى اِبْرَاهِيْمَ وَعَلٰى آلِ اِبْرَاهِيْمَ اِنَّکَ حَمِيْدٌ مَّجِيْدٌ.

اَللّٰهُمَّ بَارِکْ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى آلِ مُحَمَّدٍ كَمَا بَارَكْتَ عَلٰى اِبْرَاهِيْمَ وَعَلٰى آلِ اِبْرَاهِيْمَ اِنَّکَ حَمِيْدٌ مَّجِيْدٌ.

హజ్రత్ ఆమిర్ బిన్ రబీఅ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరి. ఏ ముస్లిం అయినను నాపై దురూద్ పంపినప్పుడు అతడు నాపై దురూద్ పంపుతున్న వరకు దేవదూతలు అతనిపై దురూద్ పంపు చుందురు. అతను కోరినచో దానిని తగ్గించవచ్చు లేదా పెంచవచ్చును.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. దుఆ ఆకాశము భూమి మధ్యలో ఆగిపోవును. నీవు నీ నబీ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపనంత వరకు అందులోని ఒక్క భాగము కూడ (అల్లాహ్ ఆస్థానములో ప్రవేశపెట్టబడుటకు) పైకి పోదు.

(తిర్మిజి కితాబుస్సలాత్ బాబ్ మాజాల ఫీ ఫజ్లిస్సలాతి
అలన్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నా పై అత్యధికంగా దురూద్ పంపు వ్యక్తి ప్రళయ దినమున నాకు అత్యంత సమీపములో నుండును.

(తిర్మిజి కితాబుస్సలాత్ బాబ్ మాజాల ఫీ ఫజ్లిస్సలాతి
అలన్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం)

దురూద్ శుభముల గూర్చి తన స్వంత అభిప్రాయమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి. "ఒక సారి దైవికముగా ఇట్లు జరిగెను. దురూద్ షరీఫ్ చదువుట అనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపుటలో ఒక కాలము వరకు నాకు చాలా ఆసక్తి యుండెను. ఎందుకనగా దైవ మార్గములు చాలా సూక్ష్మమైనవి.

అవి నబీ కరీం సల్లం మాధ్యస్థము లేనిదే లభించవని నాకు నమ్మకముండెను. అల్లాహ్ కూడ ఇట్లు నుడివెను. "وَابْتَغُوْا اِلَيْهِ الْوَسِيْلَةَ" అప్పుడొక సుదీర్ఘ కాలము తర్వాత నేను స్వప్నములో ఇట్లు చూచితిని. ఇద్దరు కుండలు మోయువారు అనగా ఒకడు లోపటి దారి నుండి మరొకడు బయటి దారి నుండి నా ఇంట్లో ప్రవేశించిరి. వారి భుజాలపై జ్యోతి కుండలున్నవి. వారిట్లందురు. " هٰذَا بِمَا صَلَّيْتَ عَلٰى مُحَمَّدٍ "

(హఖీఖతుల్ వహీ, హాషియా పుట 128, రూహాని ఖజాయిన్ సంపుటి 22 పుట 131 హాషియా)

అనగా నీవు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై పంపిన దురూద్ వలన ఈ శుభములు గలవు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "దురూద్ షరీఫ్ వలన.....నేనిట్లు చూచెదను. అల్లాహ్ శుభములు విచిత్ర జ్యోతి రూపములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు పోవును. అక్కడికి వెళ్ళి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం యదలో కలిసి పోవును. అనంతరం అక్కడి నుండి వెళ్ళి అనంత కాలువలుగును. స్థోమత ప్రకారము ప్రతి భాగ్యునికి అందును. నిశ్చయముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆధారముగా లేనిదే ఎటువంటి శుభము ఎవరికి లభించదు. దురూద్ షరీఫ్ ఏమిటి ? ఈ కాలువలు వెలువడే రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఆస్థానమును కదిలించుటయే. అల్లాహ్ అనుగ్రహము, శుభమును పొందగోరువాడు అధికంగా దురూద్ షరీఫ్ చదవవలెను. తద్వారా ఆ అనుగ్రహములో కదలిక ఏర్పడును".

(అల్‌హకమ్- దివి 28 ఫిబ్రవరి 1903, పుట 7)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "మానవుడు వాస్తవానికి బానిసే. యజమాని ఆజ్ఞాపించిన దానిని పాటించుటయే బానిస పని. కావున మీరు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభములను పొందగోరినచో తప్పక అతనికి బానిసలగుము. అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను. "قُلْ يٰعِبَادِيَ الَّذِيْنَ اَسْرَفُوْا عَلٰى اَنْفُسِهِمْ" ఇక్కడ దాసులనగా బానిసలే, మానవులు కాదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బానిసగుటకు వారిపై తప్పక దురూద్ పంపుము. వారి ఏ ఆజ్ఞ పట్ల అవిధేయత వహించకుము. ఆజ్ఞలన్నిటిని పాటించుము".

(అల్‌బదర్ సంపుటి 2 నంబర్ 14, తేది 24 ఏప్రిల్ 1903, పుట 109)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

''اَللّٰهُمَّ صَلِّ وَسَلِّمْ وَبَارِكْ عَلَيْهِ وَاٰلِهٖ بِعَدَدِ هَمِّهٖ وَغَمِّهٖ وَحُزْنِهٖ لِهٰذِهِ الْاُمَّةِ وَاَنْزِلْ عَلَيْهِ اَنْوَارَ رَحْمَتِكَ اِلَى الْاَبَدِ۔''

(బరకాతుద్దుఆ రూహాని ఖజాయిన్ సంపుటి 6, పుట 11)

అనువాదము: ఓ అల్లాహ్ దురూద్, శాంతి, శుభములను వారి, వారి కుటుంబముపై పంపుము ఈ సమాజము కొరకు ఎన్ని బాధలు, దు:ఖములు వారి హృదయములో నుండెనో అన్ని పంపుము. వారిపై తన కరుణామయ కాంతులను సదా పంపుచుండుము.

## క్రమం తప్పకుండా ఇస్తిఘ్ఫార్ చదువుము

మరల ఈ మూడవ నిబంధనలో ఇస్తిఘ్ఫార్ గురించి చర్చ గలదు.

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿فَقُلْتُ اسْتَغْفِرُوْا رَبَّكُمْ اِنَّهٗ كَانَ غَفَّارًا ـ يُّرْسِلِ السَّمَآءَ عَلَيْكُمْ مِّدْرَارًا ـ وَّيُمْدِدْكُمْ بِاَمْوَالٍ وَّ بَنِيْنَ وَيَجْعَلْ لَّكُمْ جَنّٰتٍ وَّيَجْعَلْ لَّكُمْ اَنْهٰرًا﴾

(నూహ్: 11-13)

అనగా నేనిట్లంటిని. తమ ప్రభువుతో క్షమాపణ గోరుము. నిశ్చయముగా అతడు క్షమాగుణ ప్రపూర్ణుడు. అతడు మీపై నిరంతరము వర్షించు మేఘమును పంపును. అతడు ధనము, సంతానముతో మీకు సహాయము అందించును. మీ కొరకు తోటలను సృష్టించును. మీ కొరకు కాలువలు ప్రవహింపజేయును.

﴿فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَاسْتَغْفِرْهُ اِنَّهٗ كَانَ تَوَّابًا﴾

(అన్నస్ర్: 4)

అనగా కనుక తమ ప్రభువును ప్రశంసించుచు (అతనిని) స్తుతించుము. అతనితో క్షమాభిక్షను యాచించుము. నిశ్చయముగా అతడు క్షమాగుణ ప్రపూర్ణుడు.

దీనిని గురించి ఒక హదీసు గలదు. అబి బర్ద బిన్ అబీ మూసా తన తండ్రి అబు మూసా (రజి) ద్వారా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని తెలిపిరి. అల్లాహ్ నాపై, నా సమాజముపై రెండు న్యాసములను ఇచ్చినట్లు నాకు దైవవాణి ద్వారా తెలిపెను. అవి ఇట్లు గలవు.

وَمَا كَانَ اللّٰهُ لِيُعَذِّبَهُمْ وَاَنْتَ فِيْهِمْ ـ وَمَا كَانَ اللّٰهُ مُعَذِّبَهُمْ وَهُمْ يَسْتَغْفِرُوْنَ

(అల్ అన్ఫాల్ : 34)

అనగా నీవు వారిలో నున్నప్పుడు, అల్లాహ్ వారిని శిక్షించు వాడు కాడు. వారు పశ్చాత్తప్తులై క్షమాపణ కోరినప్పుడు అల్లాహ్ వారిని శిక్షించువాడు కాడు.

(జామి తిర్మిజి - కితాబ్ తఫ్సీరుల్ ఖుర్ఆన్ తఫ్సీర్ సూరతుల్ అన్ఫాల్)

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఎవరైతే ఇస్తిగ్ఫార్ క్రమం తప్పకుండా చేయునో (అనగా ఇస్తిగ్ఫార్ చేయుచుండును) ప్రతి కొరత నుండి బయట పడే ద్వారము అల్లాహ్ అతని కొరకు తెరుచును. ప్రతి కష్టము నుండి అతనికి సౌకర్యము కల్పించును. అతను ఊహించలేని మార్గముల ద్వారా అతనికి ఆహారము నొసంగును.

(సునన్ అబి దావూద్- కితాబుల్ విత్ర్-బాబ్ ఫిల్ఇస్తిగ్ఫార్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

" విశ్వాస వేర్లు గట్టిపడుటకు కారణమగు ఇస్తిగ్ఫార్‌నకు పవిత్ర ఖురాన్‌లో రెండు అర్థములు గలవు. తన హృదయమును అల్లాహ్ ప్రేమతో దృఢపరచి విడిగా వున్నప్పుడు ఉద్రేకము పొందు పాపములను అల్లాహ్‌తో గల సంబంధముతో నిరోధించుట, అల్లాహ్‌లో లీనమై అతనితో సహాయము కోరుట ఒకటి. సమీపుల ఇస్తిగ్ఫార్ ఇది. వారు రెప్ప పాటు కూడ అల్లాహ్‌తో దూరమగుటను తమ వినాశనముగా భావించుచు అల్లాహ్ తమ ప్రేమానురాగములో వుంచుకొనవలెనని ఇస్తిగ్ఫార్ చేయుచుందురు. రెండవ రకమైన ఇస్తిగ్ఫార్ ఏమనగా పాపము నుండి బయటపడి అల్లాహ్ వైపు పరుగెత్తుట. పవిత్ర పోషణ పొంది పాపపు ఎండిన, క్షీణత నుండి

విముక్తి కలుగుటకు వృక్షము భూమిలో వుండునట్లే హృదయము అల్లాహ్ బంధీ కావలెను. ఈ రెండు స్థితులను ఇస్తిఘ్ఫార్ అని నామకరణం చేయబడెను. ఎందుకనగా కప్పి పెట్టుట, నొక్కి పెట్టుట అను భావము గల **ఘఫర** అను పదము నుండి **ఇస్తిఘ్ఫార్** వెలువడెను. అనగా అల్లాహ్ ప్రేమలో లీనమైన వ్యక్తి పాపమును అల్లాహ్ కప్పి పెట్టును, మానవ వేరులను నగ్నము చేయక దైవ దుప్పటిలో తీసుకొని తన పవిత్రతలో భాగము కల్పించుటయే ఇస్తిఘ్ఫార్ భావమగును. లేదా పాపము వలన ఏదేని వేరు బహిర్గతమైనచో దానిని కప్పిపెట్టి ఆ నగ్నపు దుష్ప్రభావము నుండి రక్షించును. అల్లాహ్ శుభముల ఆలవాలము. అతని కాంతి ప్రతి అంధకారమును దూరము చేయుటకు సదా సిద్ధముండును. కావున పవిత్ర జీవితము పొందుటకు సత్పథము ఏమనగా ఈ భయంకర స్థితి నుండి భయపడి ఆ పవిత్ర చెలిమ వైపు ద్విహస్తములు చాపవలెను. ఇటుల ఆ చెలిమ వేగముగా మన వైపు కదిలి మలినమంతటిని ఒక్కసారిగా దూరము చేయును. వాస్తవముగా మనము అతని మార్గములో మరణమును స్వీకరించి మన ఉనికిని అతని ముందు పెట్టుట కంటే అల్లాహ్‌ను సంతోషపెట్టు మరో మార్గము లేదు".

(సిరాజుద్దీన్ ఈసాయికె చార్ సవాలోఁకా జవాబ్ :
రూహాని ఖజాయిన్ సంపుటి 12 పుట 346, 347)

మరల వారిట్లనిరి. "......అల్లాహ్‌తో శక్తి కోరినప్పుడు అనగా ఇస్తిఘ్ఫార్ చేసినప్పుడు రూహుల్‌ఖుదుస్ సహాయముతో వారి బలహీనత దూరమగును. అల్లాహ్ సందేశహరుడు, ప్రవక్త తప్పించుకొను నట్లు వారు పాపము చేయక తప్పించుకొందురు. పాపిష్టులైవున్నచో ఇస్తిఘ్ఫార్ వారికెట్లు

ప్రయోజనము కలిగించుననగా వారు ఆ పాపపు శిక్ష నుండి రక్షించబడుదురు. ఎందుకనగా జ్యోతి వచ్చినప్పుడు అంధకారము నిలువ లేదు. ఇస్తిఘ్ఫార్ చేయని అనగా అల్లాహ్‌తో శక్తి యాచించని వృత్తి రీత్యా నేరస్తులైన వారు తమ నేరములకు శిక్ష అనుభవించు చుందురు".

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 34)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"కొందరికి పాపము గురించి తెలిసియుండును. కాని మరి కొందరికి పాపము గురించి తెలిసియుండదు. అందుకే అల్లాహ్ శాశ్వతముగా ఇస్తిఘ్ఫార్ ఏర్పాటు చేయించెను. మానవుడు ప్రతి పాపము బహిరంగముగా, గుప్తముగా చేసినను, అతనికి తెలిసినను, తెలియకపోయినను పాదము, నాలుక, ముక్కు, చెవి, నేత్రము అనగా అన్ని రకాల పాపముల నుండి పశ్చత్తాపము కోరుచూ వుండవలెను. ఈ రోజులలో ఆదమ్ అలైహిస్సలాం దుఆ చదువుచుండవలెను.

رَبَّنَا ظَلَمْنَا اَنْفُسَنَا وَاِنْ لَّمْ تَغْفِرْلَنَا وَتَرْحَمْنَا لَنَكُوْنَنَّ مِنَ الْخَاسِرِيْنَ

(అల్ ఆరాఫ్ : 24) ఈ దుఆ ముందే ఆమోదించబడినది. నిర్లక్ష్యముతో జీవితమును గడపకుము. నిర్లక్ష్యముతో జీవితమును గడపనివాడు శక్తికి మించిన ఆపదలో పడే అవకాశము ఎంత మాత్రము లేదు. ఏ ఆపద దైవానుమతి లేనిదే రాదు. నాకిట్లు దైవవాణి అందెను.

"رَبِّ كُلُّ شَیْءٍ خَادِمُکَ رَبِّ فَاحْفَظْنِیْ وَانْصُرْنِیْ وَارْحَمْنِیْ۔"

(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 577 క్రొత్త ఎడీషన్)

# క్షమాపణ (ఇస్తిఘ్ఫార్), పశ్చత్తాపము (తౌబహ్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"وَاَنِ اسۡتَغۡفِرُوۡا رَبَّكُمۡ ثُمَّ تُوۡبُوۡا اِلَيۡهِ" (హూద్:4)

గుర్తుంచుకొనుము. ఈ రెండు విషయములు ఇస్లాం సమాజమునకు బహుకరించబడినవి. ఒకటి శక్తి పొందుటకు, పొందిన శక్తిని ఆచరణ రూపంలో చూపుటకు రెండవది. శక్తిని పొందుటకు క్షమాపణ (ఇస్తిఘ్ఫార్) గలదు. దీనిని సహాయమాచించుట, సహాయము కోరుట అని కూడ అందురు. వ్యాయామములో గద లేపి, త్రిప్పడంతో శారీరక శక్తి, బలము పెరుగును. అదే విధముగా ఆధ్యాత్మిక గద క్షమాపణ. దీనితో ఆత్మకు ఒక శక్తి లభించును. హృదయములో స్థిరత్వము ఏర్పడును. కనుక శక్తి పొందగోరువాడు క్షమాపణ (ఇస్తిఘ్ఫార్) చేయవలెను. ఘఫర అనగా కప్పిపుచ్చుట, నొక్కిపెట్టుట అని అర్థము. అల్లాహ్ నుండి దూరముంచు భావాలను, ఆలోచనలను క్షమాపణ (ఇస్తిఘఫ్ఫార్) తో మానవుడు కప్పిపుచ్చుటకు, నొక్కిపెట్టుటకు ప్రయత్నించును. క్షమాపణ (ఇస్తిఘ్ఫార్) అనగా మానవునిపై దాడి చేసి నాశనము చేయదలచిన విషపూరిత విషయములపై విజయము సాధించుట, అల్లాహ్ ఆదేశములను పాటించుటలో ఎదురయ్యే అవరోధాల నుండి తప్పించుకొని వాటిని ఆచరణ రూపంలో చూపవలెను.

మానవునిలో రెండు రకాల గుణములను అల్లాహ్ పెట్టినది కూడ గుర్తుంచుకోవలెను. ఒకటి విషపూరిత గుణము, దీనిని షైతాన్

ప్రేరేపించును. రెండవది ఔషధ గుణము. మానవుడు గర్వించి, తనను తాను గొప్ప అని ఊహించి ఔషధముతో సహాయము తీసుకోనప్పుడు విషపూరిత గుణము విజయము సాధించును. కాని తనను నీచునిగా, అల్పునిగా ఊహించి తనలో అల్లాహ్ సహాయము అవసరమున్నదని ఊహించినప్పుడు అల్లాహ్ తరపున ఒక చెలిమ పుట్టును. దానితో అతని ఆత్మ కరిగి ప్రవహించును. క్షమాపణ (ఇస్తిఘ్ఫార్) అంటే ఇదే. అనగా ఈ శక్తిని పొంది విషపూరిత విషయములపై విజయము సాధించును."

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 348, 349, క్రొత్త ఎడీషన్)

## అల్లాహ్‌ను ప్రశంసించుచు వుండుము.

అల్లాహ్‌ను ప్రశంసించు వుండునను విషయము కూడ ఈ మూడవ నిబంధనలో గలదు. దీని గురించి పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను. اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ (అల్ ఫాతిహా:2) అనగా ఆ సకల లోకాల సంరక్షకుడైన అల్లాహ్‌కే సకల సంకీర్తనములు.

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِىْ لَهٗ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الْاَرْضِ وَلَهُ الْحَمْدُ فِى الْاٰخِرَةِ وَهُوَ الْحَكِيْمُ الْخَبِيْرُ

(సబా: 2)

అనగా సకల కీర్తనలు అల్లాహ్‌కే. ఆకాశములలో నున్నదంతయు, భూమిలో నున్నదంతయు అతనిదే. పరలోకములో కూడ సకల కీర్తనలతనివే నుండును. అతడు వివేక వంతుడు. సదా జాగరూకుడు.

ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్

అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. ప్రతి ముఖ్యమైన కార్యము అల్లాహ్ కీర్తనలతో ప్రారంభించనిచో అది లోపము కలిగి వుండును.

మరో కథనములో ఈ పదములు కూడ గలవు. అల్లాహ్ కీర్తనలతో మొదలు పెట్టని ప్రతి కార్యము అశుభము, అప్రభావితమగును.

(సునన్ ఇబ్నె మాజ–అబ్వాబున్నికాహ్, సునన్ అబూదావూద్, కితాబుల్ అదబ్)

ఒక హదీసులో ఇట్లు గలదు. నూమాన్ రజియల్లాహు అన్‌హు బిన్ బషీర్ ఇట్లు తెలిపిరి. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం తమ వేదిక బల్ల మీద నిలబడి ఇట్లనిరి. "అల్పముపై కృతజ్ఞత తెలుపని వాడు అధికముపై కూడ కృతజ్ఞత తెలుపడు. ప్రజలకు కృతజ్ఞత తెలుపని వాడు అల్లాహ్ ఉపకారములకు కూడ కృతజ్ఞత తెలుప లేడు. అల్లాహ్ శుభములను స్మరించుట కూడ కృతజ్ఞతయే. అల్లాహ్ శుభములను స్మరించక పోవడం కూడ కృతఘ్నత అగును."

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 4 పుట 278 ముద్రణ బేరూత్)

హజ్రత్ మఆజ్ బిన్ జబల్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నా హస్తము పట్టుకొని ఇట్లనిరి. ఓ మఆజ్ ప్రతి నమాజ్ తర్వాత ఈ దుఆ చేయటను మరచిపోకూడదని నేను మరణ వాంగ్మూలము చేయుచున్నాను.

اَللّٰهُمَّ اَعِنِّیْ عَلٰی ذِکْرِکَ وَ شُکْرِکَ وَحُسْنِ عِبَادَتِکَ۔

ఓ అల్లాహ్ ! నేను నీ స్మరణ, నీ కృతజ్ఞత, మంచి పద్ధతిలో నిన్ను ఆరాధించుటకు నన్ను అనుగ్రహించుము.

(సునన్ అబి దావూద్ కితాబుల్ విత్ర్, బాబ్ ఫిల్ ఇస్తిఘ్ఫార్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"మానవుడు శ్రద్ధగా ఆలోచించినచో సర్వ సంకీర్తనములు, ప్రశంసలకు వాస్తముగా అల్లాహ్‌యే అర్హుడని అతనికి తెలియును. ఏ మానవుడు, ప్రాణులు వాస్తవముగా నిజమైన కీర్తి, ప్రశంసకు అర్హులు కారు. నిస్వార్థముగా మానవుడు ఆలోచించినచో అతనికీ విషయము స్పష్టమగును. ఏ ఉనికి లేని కాలములో, ఏ ఉనికి తెలియని కాలములో అతన్ని పుట్టించిన వాడెవడో అతనికి తెలియనందున ఏదో కీర్తికి అతడు అర్హుడయ్యెను. ఉనికి, అస్థిత్వ స్థిరము, ఆరోగ్య రక్షణ, జీవితము నిలుచుటకు ఏ ఏ అవసరములు గలవో అతనికి ఆ కాలములో తెలియని కారణము కావచ్చును. అతడు ఆ వసతులన్నిటిని అందించెను. అతని పై అనేక ఆపదలు వచ్చే అవకాశమున్న కాలములో అతడు కరుణించి అతన్ని రక్షించెను. కష్టపడు వాని కష్టమును వృధా చేయక, కష్టపడు వారి హక్కులను పూర్తిగా అందించినందుకు కీర్తికి అర్హుడగును. బాహ్య రూపములో కష్టపడు వాని హక్కులను అందించుట పరిహారమే అగును. కాని సంపూర్ణముగా హక్కులను అందించువాడు కూడ ఉపకారి అగును. ఈ లక్షణములు గొప్ప స్థానము గలవి. ఒకరిని కీర్తి, ప్రశంసకు అర్హునిగా చేయును. నిజమైన రూపంలో ఈ లక్షణములన్నిటికి అర్హుడు అల్లాహ్‌యే నని ఇప్పుడు గమనించి చూడుము. అతడే పూర్తిగా ఈ లక్షణములతో వున్నాడు. మరెవరిలో ఈ లక్షణములు లేవు.......

కనుక ఉనికి పరంగా సంపూర్ణ, ఉన్నత రూపములో అల్లాహ్‌యే మొదటగా ప్రశంసకు అర్హుడు. అతనికెదురుగా ఎవడు కూడ ఉనికి పరంగా

ఎటువంటి ప్రశంసకు అర్హుడు కాడు. ఎవడైనా ప్రశంసకు అర్హుడైనా పరోక్షముగనే అగును. అతడు ఒంటరి, సాటిలేని వాడైనను పరోక్షముగా మరొకనిని ప్రశంసకు అర్హుడిగా చేయడం అల్లాహ్ కరుణయే. కాని అతడు పరోక్షముగా కొందరిని తమ లక్షణములలో చేర్పించుకొనెను."

(రూయెదాద్ జల్స దుఆ – రూహాని ఖజాయిన్ సంపుటి 15, పుట 598–602)

జమాఅత్‌ను సామాన్యముగా ఉపదేశించుచు వారిట్లనిరి.

"ఆకాశమున దేవదూతలు మిమ్ములను ప్రశంసించాలని మీరు కోరినచో మీరు దెబ్బలు తిని సంతోషముగా వుండుము. దూషణలు విని కృతజ్ఞత తెలుపుము. అపజయాలను చూసి బంధము తెంచుకోకుము. మీరు అల్లాహ్ అంతిమ జమాఅత్. మీలో అలసత్వము వహించిన ప్రతి ఒక్కడు మలిన వస్తువుగా జమాఅత్ నుండి బయట విసిరి వేయబడును. నిరాశతో చనిపోవును కాని అల్లాహ్‌కు ఎలాంటి నష్టము కలిగించలేడు. మీ అల్లాహ్ నిజముగా వున్నాడని నేను ఎంతో సంతోషముతో తెలుపుచున్నాను. అందరు అతని సృష్టే అయినను అతన్ని ఎన్నుకొనిన వాడిని అతడు ఎన్నుకొనును. అతని వద్దకు పోయిన వాని వద్దకు అతడు వచ్చును. అతన్ని గౌరవించిన వాడిని అతడు గౌరవించును. మీరు మీ హృదయములను పరిశుద్ధము చేసుకొని, నాలుకలను, నేత్రములను చెవులను పవిత్రము చేసుకొని అతని వైపు రమ్ము, మిమ్ములను అతడు స్వీకరించును."

(కష్తి నూహ్ : రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 15)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇంకా ఇట్లనిరి.

"అల్లాహ్ మిమ్ములను వృధా చేయునని ఆలోచించకుము. భూమిలో అల్లాహ్ ద్వారా నాటబడిన ఒక విత్తనము మీరు. ఈ విత్తనము పెరుగును, వ్యాపించును, నలు వైపుల దీని శాఖలు వెలువడి, ఇదొక పెద్ద వృక్షమగునని అల్లాహ్ నుడివెను. అల్లాహ్ వాక్యమును నమ్మిన వానికి శుభాకాంక్షలు. మధ్యలో వచ్చు ఆపదల వలన భయపడకూడదు. ఆపదలు సంభవించుట కూడ అనివార్యము. ఎందుకనగా తమ ప్రకటనలో ఎవరు సత్యవంతులో ఎవరు అసత్యులో అల్లాహ్ పరీక్షించును. ఏదేని ఆపదల వలన తప్పటడుగు వేసిన వాడు అల్లాహ్‌కు ఎలాంటి హాని కలిగించలేడు. ఆ దురదృష్టము అతన్ని నరకము వరకు చేర్చును. అతడు జన్మించక పోయినచో అతనికి బాగుండెడిది. కాని అంతిమము వరకు సహనము పాటించిన వారు, వారిపై ఆపదల వరదలు వచ్చును, కష్టముల భూకంపాలు, తీవ్ర గాలులు సంభవించును. జాతులు అపహాస్యము, అవహేళన చేయును. ప్రపంచము వారితో కఠిన ద్వేషముతో వ్యవహరించును. వారు తుదకు విజయులగుదురు. శుభముల ద్వారములు వారిపై తెరువబడును.

నేను నా జమాఅత్‌కు తెలుపవలెనని అల్లాహ్ నన్నుద్దేశించి ఇట్లనెను. ఇహలోక కలుషితరహితముగా విశ్వసించిన వారు, అట్టి విశ్వాసము దాంబికము, అధైర్య మలినము లేని, విధేయత, విశ్వాసమును ఏ దశలో వీడని వారు అల్లాహ్‌కు ప్రసున్నులైరి. వారి అడుగే సత్యమైన అడుగని అల్లాహ్ నుడివెను."

(రిసాలా అల్ వసియ్యత్ – రూహాని ఖజాయిన్
సంపుటి 20 పుట 309)

దీని పై స్థిరముగ వుండు భాగ్యము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! వాస్తవ రూపంలో మనము నిజమైన అహ్మది ముస్లిం అగుటకు అల్లాహ్ అనుగ్రహించుగాక! మనము మన బైఅత్ ప్రతిజ్ఞపై స్థిరముగా నిలిచి ఆచరించు వారమగు గాక! అల్లాహ్ అతని ప్రవక్త విధేయత నిజముగా, సంపూర్ణముగా వహించువారిగా చేయుగాక! హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఈ ప్రియమైన జమాఅత్‌ను అపనిందకు గురి చేయు ఎట్టి కార్యము మాతో జరగనివ్వకుము. ఓ అల్లాహ్! నీవు మా తప్పులను క్షమించుము. మమ్ములను అవమానమునకు గురి చేయకుము. మమ్ములను సదా నీ విధేయులలో, విశ్వసనీయత గల వారిలో వ్రాసుకొనుము. మమ్ములను మా ప్రతిజ్ఞ, విశ్వసనీయత, బైఅత్‌పై నిలిచేటట్టు చేయుము. మమ్ములను నీ ప్రియులలో చేర్చుకొనుము. ఈ ప్రతిజ్ఞను పాటించే అనుగ్రహము మా సంతానముకు కూడ కలిగించుము. నీతో ఎప్పుడు మమ్ములను విడదీయకుము. మాకు నీ నిజమైన జ్ఞానము ప్రసాదించుము. ఓ అందరి కంటే గొప్ప దయామయుడైన అల్లాహ్! మమ్ములను కరుణించుము. మా దుఆలన్నిటిని ఆమోదించుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన జమాఅత్, జమాఅత్‌లో ప్రవేశించు వారి కొరకు చేసిన దుఆలన్నిటికి మమ్ములను వారసులుగా చేయుము. (ఆమీన్)

(జల్సా సాలానా ఇంగ్లాండ్ 27 జూలై 2003 సందర్భమున ముగింపు ఉపన్యాసము నుండి)

.... ఇది చాలా ముఖ్యమైన, అనివార్యమైన అంశము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలము నుండి మనము దూరము

పోవుచున్నందున నేటి కాలములో దీని అవసరము మరింత ఎక్కువ కలుగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఫలానా అనుచరుని సంతానమనే గర్వము మనకు గలదు. కాని మన తాత ముత్తాతల త్యాగములపై మన దృష్టి తక్కువే గలదు. భవిష్యత్తు తరాలలో శారీరక రక్తము వచ్చినది. కాని ఆధ్యాత్మిక స్థాయి క్షీణించినది. ఏది ఏమైనప్పటికి సందేశహరుని కాలము నుండి దూరమైన కొద్ది కొన్ని లోపాలు, బలహీనతలు ఏర్పడతాయి. కాని ప్రగతి చెందే జాతులు కాలము, పరిస్థితులను పట్టుకొని దుఃఖించుచు అక్కడే ఆగిపోక ప్రయత్నము చేయును. మన గురించి శుభవార్తలు, భవిష్యవాణీలు వున్నందున మనము అదృష్టవంతులము. ముహమ్మదీయ మసీహ్ సంస్థలో చేరి హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనను ప్రపంచములో వ్యాపింపజేయవలెను. మనము దైవ ఏకత్వముపై స్థిరముగా వున్నచో ఇది భాగ్యమగును. ఈ బోధనపై మనము నిలవడమే కాక మన సంతానమును కూడ నిలుపవలెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక ప్రవచన భాగమును ప్రవేశ పెట్టెదను. వారు అలైహిస్సలాం తమ జమాఅత్‌తో ఏమి ఆశించిరో దీనితో స్పష్టమగును. అనంతరం బైఅత్ నిబంధనలోని నాలుగవ నిబంధన నుండి ప్రారంభింతును.

హుజూర్ ఇట్లనిరి.

"నా హస్తముపై బైఅత్ చేయుట ఒక మరణమును కోరును. అనంతరం మీరు క్రొత్త జీవితములో ఒక నూతన జన్మను పొందుదురు.

హృదయపూర్వకముగా బైఅత్ చేయనిచో దాని ఫలితము శూన్యము.

నా బైఅత్‌తో అల్లాహ్ హృదయపూర్వక అంగీకారమును కోరును. నిజమైన హృదయముతో నన్ను స్వీకరించి, తన పాపముల నుండి సత్యమైన పశ్చత్తాపము పడినచో క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి అతని పాపములను తప్పక క్షమించును. తల్లి గర్భము నుండి వెలువడినట్లు అతడగును. అప్పుడు దైవదూతలు అతన్ని రక్షించును."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 262)

# నాలుగవ బైఅత్ నిబంధన

**అల్లాహ్ ప్రాణులకు సాధారణముగా, ముస్లిములను ప్రత్యేకముగా కామోద్రేకములకు లోనై నాలుకతో గాని, చేతులతో గాని, మరే విధముగా గాని పీడించడు.**

ఈ నిబంధనతో స్పష్టమైనదేమనగా కోపములో ప్రకోపమునకు బానిసై తన గర్వమును సమస్యగా చేసుకొని తన అసత్య స్వాభిమానమును వ్యక్తపరచుచు తన చేతితో గాని, తన నాలుకతో గాని ఎవరికి దుఃఖము కలిగించకూడదు. ఇదొక చాలా అనివార్యమైన నిబంధన. ఏ ముస్లిముకు బాధ కలిగించక పోవడం మన బాధ్యత. మన ప్రియాతి ప్రియమైన యజమాని హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంతో సంబంధమున్న మనము వారిని అపఖ్యాతి పాలు చేయుటకు ఊహించనే ఊహించలేము. ఇస్లాం పేరున కలంకితులుగా వున్న నామమాత్రపు విద్యావంతులు తప్ప. వీరే ఈ కాలపు మసీహ్ మౌవూద్,

మహ్దికి వ్యతిరేకముగా తన శత్రుత్వములో హద్దులు దాటి పోయిరి. ఇటువంటి దుష్టులకు వ్యతిరేకముగా శక్తిమంతుడైన, సర్వ శక్తులకు కేంద్రమైన అల్లాహ్‌తోనే సహాయము కోరుతు అతని ఆస్థానములో సాష్టాంగములై ఇట్లందుము. ఓ అల్లాహ్! వీరిని నీవే శిక్షించుము. ఎందుకనగా అల్లాహ్ ప్రవక్త వీరిని అధములనిరి. ఎవరితో మాకు అనవసర శత్రుత్వము గాని, ఎవరికి వ్యతిరేకముగా కోపముగాని లేదు. మేము అల్లాహ్ బోధనను ఆచరించువారము. అల్లాహ్ తమ కోపమును అదుపులో పెట్టుకొనుట గురించి మనకిట్లు ఉపదేశించెను.

﴿الَّذِيْنَ يُنْفِقُوْنَ فِى السَّرَّآءِ وَالضَّرَّآءِ وَالْكٰظِمِيْنَ الْغَيْظَ وَالْعَافِيْنَ عَنِ النَّاسِ ؕ وَاللّٰهُ يُحِبُّ الْمُحْسِنِيْنَ﴾

(ఆలె ఇమ్రాన్: 135) అనగా సంపన్నులైనను దారిద్ర్యమున్నను ఖర్చు చేయువారు, తమ కోపమును నిగ్రహించుకొను వారు, ఇతరులను క్షమించువారు, సత్కార్యములు చేయువారిని అల్లాహ్ ప్రేమించును.

ఈ సూక్తితోనే హజ్రత్ ఇమామ్ హుసేన్ రజియల్లాహు అన్హు బానిస స్వాతంత్ర్యము పొందెను. ఆ కథనము ఇట్లు గలదు. బానిస ఏదో వేడి వస్తువు వారిపై పడ వేసెను. నీరు లేదా ఏదో త్రాగే వస్తువు అది. వారు ఎంతో కోపముతో అతని వైపు చూసిరి. ఆ తెలివిమంతుడు పవిత్ర ఖురాన్ బోధన కలిగి యుండెను. తక్షణమే స్పందించు తెలివి యుండెను. వెంటనే **وَالْكٰظِمِيْنَ الْغَيْظَ** అని అనెను. వారు మంచిదని కోపమును నిగ్రహించుకొనిరి. కోపము నిగ్రహించుకొన్నను మనసులో మాట వుండును.

మరో తప్పిదముపై దెబ్బలు పడవచ్చుననే ఆలోచన కలిగి అతడు వెంటనే **وَالْعَافِيْنَ عَنِ النَّاس** అని అనెను. సరే క్షమించినానని కూడవారనిరి. విద్య, తక్షణ స్పందన మరల పనికొచ్చెను. అతడు **وَاللّٰهُ يُحِبُّ الْمُحْسِنِيْنَ** అనెను. సరే పో నిన్ను స్వతంత్రునిగా చేస్తున్నాని వారనిరి. ఆ కాలములో బానిసలను కొనుగోలు చేసేవారు. ఇంత సులభముగా స్వాతంత్ర్యము లభించేది కాదు. కాని బానిస తక్షణ స్పందన తెలివి, విద్య, యజమాని దైవభక్తి ఫలితముగా స్వాతంత్ర్యము లభించెను. ఇస్లాం బోధన ఇట్లు గలదు.

## క్షమాగుణమును అవలంభించుము

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మేలును పొందు రకముల గురించి అనగా మేలును పొందుటకు సంబంధించిన రెండవ రకము గురించి ఇట్లనిరి.

“మొదటి గుణము అనగా పాపము చేసిన వానిని క్షమించుట. పాపము చేయువాడు హాని చేయును. అతనిని దండించుట, బంధించుట లేక శిక్షించుట అనివార్యము. కాని క్షమించుట ఉత్తమము. ఇది మంచి కార్యము. ఈ విషయమును పవిత్ర ఖురాన్ ఇట్లు బోధించును. **وَالْكٰظِمِيْنَ الْغَيْظَ وَالْعَافِيْنَ عَنِ النَّاسِ** (ఆలె ఇమ్రాన్:135)

**جَزٰٓؤُا سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا فَمَنْ عَفَا وَاَصْلَحَ فَاَجْرُهٗ عَلَى اللّٰهِ**

(అష్షూరా:41) అనగా కోపమును చూపే సమయమున కోపమును మ్రింగువారు సజ్జనులు. క్షమించు సమయము నందు పాపమును క్షమించువారు సజ్జనులు. చెడుకు ప్రతిఫలము దానికి తగినంత

వుండవలెను. సంస్కరణ నిమిత్తము నేరమును క్షమించవలెను. కానిచో దాని ప్రతి ఫలము అతడు పొందును."

(ఇస్లామి ఉసూల్ కి ఫిలాసఫి, రూహాని ఖజాయిన్
సంపుటి 10, పుట 351)

చాలా ఖ్యాతి గడించిన ఒక హదీస్ ఇట్లు గలదు. అనేకులు వినే వుందురు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అందులో తన యద వైపు సంజ్ఞ చేయుచు (దైవభక్తి) ధర్మము ఇక్కడ గలదని అనిరి. అనగా నిజమైన, స్వచ్ఛమైన ధర్మము ఎక్కడైనా వున్నదంటే అది వారి సల్లల్లాహు అలైహి వసల్లం హృదయమే. అందులో ధర్మము తప్ప మరేమియును లేదు.

కనుక ఓ ప్రజలారా! ఓ విశ్వాసులారా! మీరు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అడుగుజాడలను సదా ఆదర్శంగా తీసుకోవలెనను ఆజ్ఞ మీకివ్వబడుచున్నది. కావున తమ హృదయాలను పరిశీలించుము. మీరు ఆ గొప్ప నడవడిని పాటించుచున్నారా! తమను తాము ధర్మముతో పరిపూర్ణము చేసుకొనుటకు కృషి చేయుచున్నారా ? మీలో కూడ అల్లాహ్ భయము, భక్తి దాని ఫలితముగా అతని సృష్టితో సానుభూతి, మేలు గలదా!

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. పరస్పరము ఈర్ష్య పడకుము. పరస్పరము జగడమాడకుము. పరస్పరము వైరము పెంచుకోకుము. ఒకరు మరొకరితో శత్రుత్వము కలిగి వుండకూడదు. ఒకరు మరొకరి బేరముపై కొనుగోలు చేయకూడదు. ఓ అల్లాహ్ దాసులారా! పరస్పరము సోదరులుగా నుండుము. ఎందుకనగా ఒక ముస్లిం మరో

ముస్లిమునకు సోదరుడగును. అతడు తన సోదరున్ని హింసించడు, అతన్ని అవమానించడు. అనంతరం ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తన యద వైపు సంజ్ఞ చేయుచు ఇట్లనిరి. "اَلتَّقْوٰی هٰهُنَا" అనగా ధర్మము ఇచట గలదు. తన తోటి ముస్లిం సోదరున్ని తన కంటే తక్కువ భావించడమే ఒక వ్యక్తి దుష్టత్వమునకు చాలు. ప్రతి ముస్లింపై ఇతర ముస్లిం రక్తము, ధనము, గౌరవము నిషేధించబడినవి.

(సహీ ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్, బాబ్ తహ్‌రీమ్ జుల్ముల్ ముస్లిమి వఖుజ్లహు...అలఖ్)

## ఎవరికి బాధ కలిగించకుము

నాలుకతో, హస్తముతో మరోరకంగాను ఎవరికి బాధ కలిగించనని నాలుగవ నిబంధనలో గలదు. ఈ నిబంధనను వివరముగా తెలిపెదను. నేను చదివిన హదీస్‌ను ఇందులో దృష్టియందుంచుకొనుము. ఇట్లనిరి. "ఈర్ష్య పడకుము" ఈర్ష్య ఎటువంటిదనగా అది పెరుగుచు పెరుగుచు శతృత్వము వరకు వెళ్ళును. ఈ ఈర్ష్య వలన ఎవరితో ఈర్ష్య గలదో అతనికి నష్టము కలిగించాలనే ఆలోచన ఎప్పటికి వుండును. ఈర్ష్య ఎటువంటిదనగా దీని వలన ఎవరితో ఈర్ష్య గలదో అతనికే కాక ఈర్ష్య పడుచున్న వ్యక్తి కూడ ఈ అగ్నిలో ఆహుతి అగుచుండును. చిన్న చిన్న విషయములు ఈర్ష్య కల్గించు చుండును. ఫలానా వ్యాపారము ఎందుకు మంచిగున్నది. ఫలానా వ్యక్తి వద్ద నా కంటే ఎక్కువ ధనము గలదు. ఫలానా వ్యక్తి గృహము నా కంటే మంచిగున్నది. ఫలానా పిల్లలు ఎక్కువ ప్రతిభావంతులు. స్త్రీల పరిస్థితి ఎట్లుండుననగా ఫలానా వద్ద మంచి ఆభరణము లున్నవని ఈర్ష్య మొదలగును. ధర్మ విషయములో స్ఫూర్తి

పొంది, మేము కూడ ముందుకు వెళ్ళి ధర్మ సేవకులు కావలెనని కృషి చేయవలెను. ఇలా చేసే బదులు సేవ చేయుచున్న వారి గూర్చి ఫిర్యాదులు చేసి వారిని వెనక్కి లాగుటకు ప్రయత్నింతురు.

జగడమాడకూడదని ఈ హదీస్‌లో గలదు. చిన్న చిన్న విషయముల లో జగడములు మొదలగును. ఉదాహరణకు ఒక బాలుడు అదే పనిగా అల్లరి చేయుచున్నందున సభలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అతన్ని కొంచెం గట్టిగా నిరోధించి మరల ఇలా చేసినచో నేను శిక్షింతునని హెచ్చరించెను. సమీపములోనే కూర్చున్న తల్లిదండ్రులు చెయ్యి విడిపించుకొని విధులు నిర్వహిస్తున్న ఆ వ్యక్తిని ముప్పుతిప్పలు పెట్టుదురు. అల్లాహ్ రక్షించుగాక! ఇటువంటి విషయములు అనుభవములో వచ్చినవి. ఒక వైపు మీరు మీ ఈ చర్య వలన మీ బైఅత్ ప్రతిజ్ఞను భంగపరచుదురు. తన ప్రవర్తనను చెడగొట్టుదురు. మరో వైపు నూతన తరంలో కూడ వ్యవస్థ గౌరవము లేకుండా చేయుదురు. తప్పొప్పుల మధ్య భేదమును అతని మెదడులో లేకుండా చేయుదురు.

శత్రుత్వము వుంచుకొనకుమని మరల అనిరి. నేడు చిన్న చిన్న విషయాలపై శత్రుత్వములు మొదలై హృదయములు కపటము, ద్వేషముతో నిండిపోవును. నాకు అవకాశము లభించినచో నేను శత్రుత్వమునకు ప్రతీకారము తీర్చుకుందునని నిరీక్షింతురు. కాని ఎవరితో శత్రుత్వము నెరపకుము, ప్రకోపము వుంచుకోకుమనే ఆదేశము గలదు. హదీస్ షరీఫ్‌లో ఇట్లు గలదు. నేను మరచిపోని ఒక సంక్షిప్త విషయము ఉపదేశించగలరని ఒక అనుచరుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను వేడుకొనెను. వారిట్లనిరి. కోపము నుండి దూరముండుము. ఆంహజ్రత్ సల్లల్లాహు

అలైహి వసల్లం మరల ఇట్లనిరి. “కోపము నుండి దూరముండుము.” కావున కోపము నుండి దూరముండుటను సదా దృష్టిలో వుంచుకున్నప్పుడు ప్రకోపము, కపటములు వాటంతటవే అంతమైపోవును. ఒకరికి నష్టము కలిగించు లేదా బాధ పెట్టు మరో అలవాటు ఏమనగా ఏదో రకంగా చెడగొట్టుటకు ఒకరి వ్యాపారముపై వ్యాపారము చేయుదురు. ఈ హదీసులో దీనిని కూడ నిషేధించిరి. ఒకరి వ్యాపారము చెడిపోవాలనే ఉద్ధేశముతో అధిక ధర చెల్లించి ఒక వస్తువును తీసుకొనుటకు ప్రయత్నింతురు. వాస్తవానికి దానితో అతనికి ఏ స్వప్రయోజనము కలగటం లేదు. ఇక్కడ కూడ నేను స్పష్టము చేయునదేమనగా ఒకరి వివాహ సందేశముపై మరొకరు సందేశము పంపుట కూడ ఈ కోవకే చెందును. ఇది కూడ నిషేధమే. కనుక అహ్మదీయులు దీని నుండి దూరముండవలెను.

మరల ఇట్లనిరి. దౌర్జన్యము చేయకూడదు, ఎవరిని కించపరచకూడదు. క్రూరుడు ఎన్నడు అల్లాహ్ సామీప్యమును పొందలేడు. కావున ఒక వైపు అల్లాహ్ ప్రీతి కొరకు దైవ అవతారున్ని మీరు విశ్వసించుచు రెండవ వైపు దౌర్జన్యముతో ప్రజల హక్కులను ఎలా హరించగలరు. సోదరులకు వారి హక్కులు ఇవ్వకపోవడం, సోదరి వివాహము ఇతర వంశములో అయినందున మా తాత ముత్తాతల ఆస్తి ఇతరుల వంశములో పోకూడదని సోదరీమణులకు ఆస్తిలో వారి వాటా ఇవ్వకపోవడం ఒక సాధారణ ఆచారము. భార్యలపై దౌర్జన్యము చేయువారు, వారి హక్కుల పట్ల శ్రద్ధ వహించని వారుందురు. భార్యలు భర్తల హక్కుల పట్ల శ్రద్ధ వహించరు. దౌర్జన్య కోవకు చెందిన ఇటువంటి అనేక విషయాలు దైనందిన జీవితములో ఎదురగును. అనేక విషయాలు ఇటువంటివి సంభవించును.

ఒకరు మరొకరిని హీనముగా చూచెదరు లేదా అవమానపరచెదరని వాటితో తెలియును. ఒక వైపు బైఅత్ ప్రకటింతురు, దుష్టములన్నిటిని వీడే ప్రతిజ్ఞ చేయుదురు కాని రెండవ వైపు ఇటువంటి పనులు చేయుదురు. ఒక ముస్లిం మరో ముస్లింను హీనముగా చూచుట సమంజసము కాదని స్పష్టమైన ఆజ్ఞ గలదు. ముస్లిములపై ఇతర ముస్లిముల రక్తము, ధనము, గౌరవము నిషేధము. వర్తమాన కాల అవతారున్ని విశ్వసించి ఇస్లామీ బోధనలను అందరి కంటే ఎక్కువ ఆచరించు ప్రకటన మీరు చేయుచు, ఇటువంటి పనులను ఎలా సహించబడును. ఈ విషయములను చిన్నవిగా భావించక దీని గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల నడవడి ఎట్లుండెనో, ఇస్లాం స్వీకరించిన తర్వాత వారు తమలో ఏ మార్పులు చేసుకొనిరో, దీనిని గురించి పలు ఉదాహరణలను ప్రవేశపెట్టెదను.

హజ్రత్ అబూజర్ ఘఫ్ఫారి రజియల్లాహు అన్హు ఇట్లు తెలపిరి. వారి ఒక బావి నుండి నీరు త్రాగించబడేది. ఒక వంశపు కొందరు వ్యక్తులు వచ్చిరి. వారిలో ఒకడిట్లనెను. మీలో ఎవడు అబూజర్ వద్దకు వెళ్ళి, వారి తల కేశములను పట్టుకొని వారిని ప్రశ్నించగలడు. నేనిట్లు చేయుదునని ఒక వ్యక్తి అనెను. ఆ వ్యక్తి అబూజర్ వద్దకు వెళ్ళి వారిని ఇబ్బంది పెట్టసాగెను. అబూజర్ అప్పుడు నిలబడి యుండిరి. వారు కూర్చొనిరి. తర్వాత వెలికల పడుకొనిరి. ఓ అబూజర్ మీరెందుకు కూర్చొనిరి, మరల ఎందుకు పడుకొనిరని అప్పుడు వారడిగిరి. బదులుగా వారిట్లు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ములనుద్దేశించి ఇట్లనేవారు. మీలో ఎవరికైనా కోపము వచ్చినప్పుడు అతడు నిలబడి వున్నచో కూర్చొనవలెను. అతని కోపము దూరమైనచో మంచిదే లేనిచో వెలికల

పడుకొనవలెను.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 5 పుట 153 ముద్రణ బేరూత్)

మరో కథనములో కథకుడు ఇట్లు చెప్పెను. మేము ఉర్వ బిన్ ముహమ్మద్ వద్ద కూర్చొని వుంటిమి. వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చెను. అతడు మాట్లాడిన విషయముల వలన వారికి కోపము వచ్చెను. కథకుని మేరకు వారికి తీవ్ర కోపము వచ్చినప్పుడు వారు నిలబడి, వజూ (ప్రక్షాళనము) చేసుకొని మా వద్దకు వచ్చిరి. అనుచరులలో గల నా తాత అత్య ద్వారా ఈ కథనము తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. కోపము షైతాన్ నుండి వచ్చును. షైతాన్ అగ్నితో పుట్టించబడెను. అగ్నిని నీరు చల్లార్చును. కావున మీలో ఎవరికైనా కోపము వచ్చినప్పుడు వజూ చేయవలెను.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 4 పుట 226 ముద్రణ బేరూత్)

హజ్రత్ జయాద్ తమ చిన్నాన్న ఉత్బ రజియల్లాహు అన్హు ద్వారా ఇట్లు తెలిపిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు దుఆ చేసేవారు. ఓ నా అల్లాహ్! నేను దుష్ట ప్రవర్తనలు, దుష్ట కర్మలు, దుష్ట కోరికల నుండి నీ ఆశ్రయము కోరుచున్నాను.

(తిర్మిజి అబ్వాబుద్దావాత్ బాబ్ జామివుద్దావాత్)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విషయము పట్ల ఏమన్నారో, సంస్థతో వారికి ఏ విధమైన ఆశలు యుండెనో తెలిపెదను. ఇట్లనిరి.

“ఇక్కడ ఉపస్థితులైయున్న లేదా తమ ప్రాంతాలలో నివసించుచున్న నా సంస్థ వారందరు అనగా నా వ్యవస్థలో చేరి నాతో అనుబంధ, శిష్యరిక బంధము పెట్టుకున్నవారు ఈ ఆదేశమును శ్రద్ధగా వినగలరు. దీని ఉద్ధేశమేమనగా సత్‌ప్రవర్తన, సద్గుణము, దైవప్రీతిలో ఉన్నత శిఖరానికి చేరవలెను. ఎలాంటి పీడనము, దుష్టత్వము, చేడు అలవాటు వారి సమీపమునకు రాకూడదు. ఐదు పూటల ప్రార్థన సామూహికంగా చేయుటకు కంకణ బద్దులై వుండవలెను. వారు అసత్యమాడకూడదు. వారెవరికి నాలుకతో బాధ కలిగించకూడదు. వారెటువంటి దుష్కార్యమునకు పాల్పడకూడదు. ఎటువంటి దుష్టత్వము, దౌర్జన్యము, పీడనము, కుట్ర ఆలోచన కూడ వారి హృదయములో రానివ్వకూడదు. అనగా ప్రతి రకమైన పాపములు, నేరములు, చేయరాని, మాట్లాడరాని సర్వ మానసిక భావాల, అసమంజస కార్యముల నుండి దూరముండవలెను. సహృదయులు, హానిరహిత, సాధారణ స్వభావము గల అల్లాహ్ దాసులు కావలెను. ఎటువంటి విషపూరిత అంశము వారి ఉనికిలో వుండకూడదు. ............... మానవులందరితో సానుభూతి వారి నియమము కావలెను. అల్లాహ్‌తో భయపడవలెను. తమ నాలుకలను, తమ చేతులను, తమ హృదయమును ప్రతి అపవిత్ర, పీడనమును పుట్టించు అవినీతి పద్ధతుల నుండి రక్షించుకోవలెను. ఐదు పూటల ప్రార్థనను అతి జాగ్రత్తగా సలుపవలెను. దౌర్జన్యము, బలవంతము, అవినీతి, లంచము, హక్కులను హరించుట, అనవసరముగా పక్షపాతము వహించుట నుండి దూరముండవలెను. దుష్ట సహవాసములో కూర్చొనరాదు. వారితో సంబంధము నెరిపిన వ్యక్తి అల్లాహ్ ఆజ్ఞలను పాటించనివాడని, .... దాసుల

హక్కులను నిర్లక్ష్యము చేయువాడని, క్రూర స్వభావము, దుష్ట స్వభావము, దుష్ప్రవర్తన గల వ్యక్తి అని లేదా మీకు బైఅత్, శిష్యరిక బంధము గల వాడి గురించి అసత్యము, అనవసరముగా అధిక ప్రసంగము, దూషణ, నిందారోపణ అలవాటును కొనసాగించి దాసులను మోసము చేయదలచిన వాడని తర్వాత తెలిసినచో ఈ దుష్టత్వమును మధ్యలో నుండి తొలగించుము. ప్రమాదకరమైన వ్యక్తి నుండి దూరముండుము. ఏ మతము, జాతి, పక్షపు వ్యక్తికి నష్టము కలిగించుటకు సంకల్పించకుము. ప్రతి ఒక్కరి పట్ల స్వచ్ఛమైన ఉపదేశకునిగా అగుము. దుష్టులు, నేరస్తులు, పీడన కారకులు, అమర్యాదస్తులు మీ సమావేశాలలో రాకూడదు. ఏదో సందర్భమున మీరు మోసపోవుటకు వారు కారకులు కావచ్చును. కనుక మీ గృహములలో కూడ వారు వుండకూడదు."

ఇట్లనిరి. "నేను మొదటి నుండి చెప్పుచున్న విషయములు, నిబంధనలివి. ఈ ఆదేశములన్నిటికి కట్టుబడి వుండుట నా సంస్థ వారందరికి అనివార్యము. మీ సమావేశములలో ఎటువంటి అపవిత్ర, అవహేళనకర కార్యముండకూడదు. సహృదయము, సత్యస్వభావము, పవిత్ర ఆలోచనతో భూమిపై జీవించుము. ప్రతి దుష్టత్వము ఎదురించదగినది కాదు. కావున తరచు క్షమించుట, విస్మరించుటను అలవర్చుకొనుము. సహనము, ఓర్పును పాటించుము. ఎవరిపై అసమంజస పద్ధతిలో దాడి చేయకుము. మానసిక కోరికలను అణిచిపెట్టుము. ఎవరైనా వాదించినచో, ధార్మిక చర్చ జరిపినచో మెత్తని పదములు, గౌరవనీయ పద్ధతిలో మాటలాడుము. ఎవరైనా మూర్ఖత్వము ప్రదర్శించినచో అటువంటి సమావేశముల నుండి తక్షణమే వెళ్ళిపొమ్ము.

మీరు బాధించబడినచో, దూషించబడినచో, మీ పట్ల దుష్ట చెడు పదాలు పలుకబడినచో మీరు మూర్ఖత్వమునకు మూర్ఖత్వముతో సమాధానమివ్వకుండా జాగ్రత్త పడుము. లేనిచో వారి వలె మీరగుదురు. ప్రపంచమంతటికి సత్య, పుణ్య ఆదర్శముగా మీరు కావలెనని అల్లాహ్ తలచెను. చెడు, దుష్టత్వము, పీడనము కలిగించు, చెడు స్వభావము గల వాడిని తమ మధ్యలో నుండి తొలగించుము. మన సంస్థలో నిరుపేద, పుణ్య, నిష్టాపరత, సహనము, మెత్తని సంభాషణ, పుణ్య స్వభావము, సత్ప్రవర్తనతో వుండలేని వాడు త్వరగా మా నుండి విడిపోవలెను. ఎందుకనగా ఇటువంటి వ్యక్తి మాతో వుండుటను మా అల్లాహ్ ఇష్టపడదు. అతడు సన్మార్గమును అవలంభించనందున నిశ్చయముగా అతడు దురదృష్టముగా మరణించును. కావున మీరు నిజముగా సహృదయులు, నిరాడంబరులు, సత్యవంతులగుము. మీరు ఐదు పూటల ప్రార్థన, సద్గుణములతో గుర్తించబడుదురు. దుష్ట విత్తనము గల వాడు ఈ ఉపదేశముపై నిలువలేడు."

(ఇష్తిహార్ దివి 29 మే 1898, తబ్లీఘె రిసాలత్
సంపుటి 8 పుట 42,43)

మరల వారిట్లనిరి. "మానవుడు గర్వితుడు కాకూడదు. నిర్లజ్జత ప్రదర్శించకూడదు. ప్రాణులతో దుష్టముగా ప్రవర్తించకూడదు. ప్రేమానురాగము, పుణ్యముతో వ్యవహరించవలెను. తమ స్వార్థ కోరికల కొరకు ఎవరితో కోపము వుంచుకోకూడదు. కఠినము, మెత్తదనము, సమయానుకూల, పరిస్థితికనుగుణముగా వ్యవహరించవలెను."

(మల్ఫూజాత్ సంపుటి 5 పుట 609, క్రొత్త ఎడీషన్)

# వినయ, విధేయతను అలవర్చుకొనుము

వినయ, విధేయత గురించి మరల వారిట్లనిరి.

"దైవ శిక్ష వచ్చి పశ్చత్తాపపు ద్వారమును మూసివేయక ముందే పశ్చత్తాపపడుము. ప్రాపంచిక చట్టము నుండి ఇంత భయపడినప్పుడు దైవ చట్టము నుండి ఎందుకు భయపడరు ? ఆపద తల మీదికి వచ్చినప్పుడు దాని రుచి చూడవలసిందే. ప్రతి వ్యక్తి తహజ్జుద్‌లో లేచుటకు ప్రయత్నించవలెను. ఐదు పూటల ప్రార్థనలలో కూడ పవిత్రతను జోడించవలెను. అల్లాహ్‌ను అసంతృప్తి పరచు ప్రతి విషయముతో పశ్చత్తాపపడుము. ఆ పాపములన్నిటిని, దైవ అసంతృప్తి కారణములను వీడి ఒక నిజమైన మార్పు తెచ్చుకొని, ముందడుగు వేయుము, దైవభీతిని అవలంభించుము. ఇందులో కూడ అల్లాహ్ దయ వుండును. మానవ అలవాట్లను సత్ప్రవర్తనగా మార్చుకొనుము. కోపముండకూడదు. దాని బదులు ఆదరా సత్కారము, వినయ, విధేయత వుండవలెను. ప్రవర్తనలను చక్కదిద్దుకొనుచు వీలైనంత వరకు దానములను కూడ చేయుము.

﴿يُطْعِمُوْنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسْكِيْنًا وَّ يَتِيْمًا وَّاَسِيْرًا﴾

(అద్దహ్ర్:9) అనగా దైవ ప్రీతి కొరకు దానిని, బీదవారికి, అనాధలకు, ఖైదీలకు తినిపింతురు. ప్రత్యేకముగా అల్లాహ్ ప్రీతి కొరకు మేమిత్తుము. అతి భయంకరమైన దినము నుండి మేము భయపడెదమని అందురు.

సంక్షిప్త విషయమేమనగా అల్లాహ్ తన అనుగ్రహము, కరుణతో మీతో వ్యవహరించుటకు పశ్చత్తాపపడుము. దానములిచ్చుచుండుము."

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 134, 135 క్రొత్త ఎడీషన్)

మరల వారిట్లనిరి. "కావున ఓ మిత్రులారా! ఈ నిబంధనను గట్టిగా అవలంభించుము. ప్రతి జాతితో మెత్తగా వ్యవహరించుము. మెత్తదనముతో వివేకము పెరుగును. సహనశీలతతో లోతైన ఆలోచనలు కలుగును. ఈ పద్ధతిని అవలంభించని వాడు మాలోని వాడు కాడు. వ్యతిరేకుల దూషణలు, కఠినత్వముపై సహనము పాటించనిచో న్యాయస్థానమును ఆశ్రయించవలెను. కాని కఠినత్వమునకు బదులు కఠినముగా వ్యవహరించి కలహమును సృష్టించకుము. మేము మా సంస్థకిచ్చిన ఆదేశమిది. దీనిని అనుసరించని వానితో విసుగు చెంది మా సంస్థ నుండి అతన్ని బహిష్కరించెదము."

(తబ్లీఘె రిసాలత్ సంపుటి 6 పుట 170)

# ఐదవ బైఅత్ నిబంధన

**సుఖ దుఃఖాలలో, ఇబ్బందులలో, సౌభాగ్యములో ఆపదలలో గాని, జీవిత ఒడుదొడుకులలో గాని, అల్లాహ్‌నే నమ్ముకొని అతని ఇష్టానుసారము జీవించును. అతని మార్గము నందు అవమానము, కష్ట, నష్టములకు సిద్ధమైవుండి, ఆపదలు సంభవించినపుడు వెనుకాడక ముందుకు సాగును.**

◈ ◈ ◈

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَمِنَ النَّاسِ مَنْ يَّشْرِىْ نَفْسَهُ ابْتِغَآءَ مَرْضَاتِ اللّٰهِ وَاللّٰهُ رَءُوْفٌ بِالْعِبَادِ﴾

(అల్‌బఖరహ్:208) అనగా మనుజులలో అల్లాహ్ సంప్రాప్తి కొరకు తమ ఆత్మను అమ్ముకొను వాడు కూడ గలడు. తమ దాసుల పట్ల అల్లాహ్ చాలా కనికరము గల వాడు.

దీని వివరణలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అనగా మానవులలో గొప్ప మానవులు తమ ప్రాణములను విక్రయించి దైవ సంప్రాప్తిని పొందుదురు. వీరిపై దైవ కరుణ గలదు. .... అల్లాహ్ ఈ సూక్తిలో ఇట్లు తెలుపును. నా మార్గములో, నా ప్రీతి కొరకు ప్రాణమును విక్రయించిన వాడు, శక్తిమేర కృషితో అతడు అల్లాహ్ వాడని నిదర్శనమిచ్చువాడు, తన పూర్తి ఉనికిని సృష్టికర్త విధేయత, సృష్టి సేవకు అంకితము చేసిన వాడు సర్వ దుఃఖముల నుండి విముక్తి పొందును......"

(రిపోర్ట్ జల్స ఆజమ్ మజాహిబ్ పుట 131,132)

మరల వారిట్లనిరి.

"అల్లాహ్ ప్రియమైన దాసుడు తన ప్రాణమును అల్లాహ్ మార్గములో సమర్పించును. దానికి బదులు అల్లాహ్ ప్రీతిని కొనుగోలు చేయును. అల్లాహ్ ప్రత్యేక కరుణకు అర్హులు వీరే......"

(రిపోర్ట్ జల్స ఆజమ్ మజాహిబ్ పుట 188)

ఇంకా వారిట్లనిరి.

"ఏదో ఒక విధముగా అల్లాహ్ రాజీ అగుటకు కొందరు తమ ప్రాణాలను అతని మార్గములో విక్రయింతురు."

(పైఘామె సులహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 23 పుట 473)

ఇటువంటి వారి గురించే అల్లాహ్ శుభవార్తనిచ్చుచు ఇట్లనును.

﴾ يَآيَّتُهَا النَّفْسُ الْمُطْمَئِنَّةُ - ارْجِعِىْٓ اِلٰى رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً - فَادْخُلِىْ فِىْ عِبَادِىْ - وَادْخُلِىْ جَنَّتِىْ ﴿

(అల్‌ఫజర్: 28-31) అనగా ఓ సంతృప్తి పొందిన ఆత్మా! సంతోషించుచు,

సంతోషమును పొందుచు తమ ప్రభువు వైపు తిరిగి పొమ్ము. కనుక నా దాసులలో చేరిపొమ్ము. నా స్వర్గములో చేరిపొమ్ము.

దైవ నిర్ణయముతో రాజీ పడువారు, అతని కొరకు బాధ, దుఃఖము అనుభవించు వారిని అల్లాహ్ ప్రతిఫలమివ్వక వదులడు. తప్పులు, లోపములు, బలహీనతలకు లోనైనవారు మనలో అనేకులున్నారు. అనేక తప్పులు, పాపములు మనతో సంభవించును. కాని అల్లాహ్ నిర్ణయముతో రాజీ పడే అలవాటు వున్నచో , అతని కొరకు ప్రతి దుఃఖమును భరించుటకు సిద్ధముగా నున్న, భరించువారు, కొంచెము నష్టముపై ఆకాశాన్ని తలకెక్కించుకొను స్త్రీల వలె కారు, స్త్రీలు అల్లరి చేయుచు ఏడ్చుచు ఆకాశాన్ని తలకెక్కించుకొందురు. ఇటువంటి సహనము వహించు వారి కొరకు అల్లాహ్, ప్రవక్త ఈ శుభవార్త నిచ్చును."

## బాధలు, పాపములకు పరిహారమగును

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు తెలిపిరి. ఒక ముస్లింనకు ఏదేని ఆపద, దుఃఖము, బాధ, శోకము, కష్టము, ఇబ్బంది కలుగదు, తుదకు ముల్లు కూడ కుచ్చుకోదు, కాని ఆ బాధను అతని పాపములకు పరిహారముగా అల్లాహ్ చేయును.

(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్ సవాబుల్ ముమిని ఫీమా యుసీబుహు మన్ మరీజ ఔ హజన)

మరో హదీసులో హజ్రత్ సుహైబ్ బిన్ సనాన్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. విశ్వాసుని సమస్య కూడ విచిత్రమైనది. అతని కార్యములన్నియు

శుభము గలవే. ఈ అనుగ్రహము విశ్వాసునికి మాత్రమే ప్రత్యేకము. అతనికి ఏదేని సంతోషము, ఆనందము, ఆధిక్యత లభించినచో అల్లాహ్‌కు కృతజ్ఞత తెలుపును. అతని కృతజ్ఞత అతని కొరకు మరింత శుభమునకు కారణమగును. అతనికి ఏదేని దుఃఖము, బాధ, కొరత, నష్టము కలిగినచో సహనము వహించును. అతడు సహనము వహించి పుణ్యము పొందినందున అతని ఈ వ్యవహారము కూడ అతని కొరకు శుభమునకు కారణమగును.

(ముస్లిం కితాబుజ్జుహ్‌ద్ బాబుల్ ముమిని అమ్‌రుహు కుల్లుహు ఖైరున్)

కొన్ని సందర్భాలలో సంతానము ద్వారా కూడ అల్లాహ్ దాసులను పరీక్షించును. సంతానము మృతిచెందినప్పుడు ప్రత్యేకంగా స్త్రీలు ఎంతో ఎక్కువ శోకింతురు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు, ఎందుకనగా అతడు అహ్మదియ్యా జమాఅత్‌నకు ఎంతో సహనము వహించు, అతని కోరిక మేరకు రాజీ పడు తల్లులను ప్రసాదించెను. కాని కొన్ని సందర్భాలలో పలు ప్రాంతాల నుండి ప్రత్యేకంగా నిరక్షరాస్య పక్షము నుండి ఫిర్యాదులు కూడ వ్యక్తమగుచుండును. ప్రత్యేకంగా నిరక్షరాస్య పక్షములోనే కాదు కొందరు అక్షరాస్యులలో కూడ కృతఘ్నత, ఫిర్యాదుల పదములు వెలువడునట్లు నేను చూచితిని.

ఒక హదీసు ప్రకారము ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్త్రీలతో ఈ విషయము పట్ల ప్రతిజ్ఞ చేయించేవారు. హదీసు ఇట్లు గలదు. ప్రత్యక్షముగా బైఅత్ చేయు ఒక అనుచర స్త్రీ ద్వారా హ్రజత్ ఉసైద్ తెలిపిరి. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం బైఅత్ తీసుకొను సమయమున వారితో చేయించిన ప్రతిజ్ఞలలో ఈ విషయము కూడ వుండెను. మేము

హుజూర్ పట్ల అవిధేయత వహించము. శోక సమయమున మా ముఖములను గిల్లము, గట్టిగా ఏడ్వము, తమ మెడ కొప్పును చించివేయము, మా కేశములను చిందరవందర చేయము. (అనగా అతి కోపము, తీవ్ర అసహనము, నిరాశ ప్రతిబింబించే విధముగా ప్రవర్తించము.)

(అబూదావూద్ కితాబుల్ జనాయిజ్ బాబ్ ఫిన్నొహి)

## బాధ కలుగగానే వహించునది

## నిజమైన సహనము

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. ఒక సమాధి వద్ద కూర్చొని ఏడ్చుచున్న ఒక స్త్రీ సమీపము నుండి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్ళిరి. వారిట్లనిరి. అల్లాహ్‌తో భయపడుము. సహనము పాటించుము. ఆ స్త్రీ ఇట్లనెను. దూరముగా వెళ్ళిపో, నీ దారి నువ్వు చూసుకో. నాకు ఎదురైన బాధ నీకు ఎదురు కాలేదు. వాస్తవానికి ఆ స్త్రీ వారిని గుర్తించ లేదు. (అప్పుడే ఆమె నోటి నుండి ఇటువంటి అమర్యాదకర వాక్యములు వెలువడినవి.) వీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అని ఆమెకు తెలుపబడగా ఆందోళన చెంది వారి గుమ్మము వద్దకు వచ్చెను. అక్కడ నివారించే ఏ కాపలదారుడు లేనందున నేరుగా లోనికి వెళ్ళి, నేను తమరిని గుర్తు పట్టలేదని వేడుకొనెను. వారిట్లనిరి. ఆపద ప్రారంభములో వహించినదే నిజమైన సహనము. (లేనిచో ఏడ్చి ఏడ్చి తుదకు అందరు సహనము పాటింతురు)

(బుఖారి కితాబుల్ జనాఇజ్ బాబ్ జియారతుల్ ఖుబూర్)

ఐదవ నిబంధనలో ఒక అతి ముఖ్యమైన విషయము ప్రస్తావించబడెను. అదేమనగా ఎటువంటి పరిస్థితులైనా, కొరత, ఇబ్బంది దినములు సుదీర్ఘము అయినను, ప్రాపంచిక ఆశలు ఎదుట కనిపించుచున్నను, నేను ఫలానా పని చేసినచో లేదా ఫలానా వైపు ఆకర్షితుడనైనచో ఈ పెద్ద లాభములు పొందవచ్చుననే ఆలోచన కలుగును కూడ. ఏమి కాదని ప్రాపంచిక శక్తులు కూడ ఆశ చూపుచుండును. అహ్మదీగా వుంటూనే, జమాఅత్‌తో సంబంధము కొనసాగించుచూనే ఈ పని చేసుకొనుము. ఈ వ్యాపారము చేసుకొనుము. తద్వారా మీ పరిస్థితులు కూడ మెరుగు పడును. అనంతరం చందాలిచ్చి కూడ జమాఅత్ సేవ చేసుకోవచ్చును. ఇవన్ని జమాఅత్ నుండి దూరము చేయు, అల్లాహ్ నుండి దూరము చేయు దజ్జాలి కుట్రలు. మీరు బైఅత్ చేసినచో ఈ సమస్యలలో పడకూడదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. ఈ మోసము నుండి దూరముండుము. అల్లాహ్‌తో విశ్వసనీయముగా వ్యవహరించుము. అతని వైపు ఆకర్షితులైనచో మీరు నా వారు. మీకు సర్వము లభించును. దీనిని గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక అతి ప్రియమైన ఉపదేశము గలదు.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. నేనొక సారి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వాహనము వెనుక కూర్చొనగా వారిట్లనిరి. ఓ చిరంజీవి! నేను నీకు కొన్ని విషయములు తెలిపెదను. ఒకటి నీవు అల్లాహ్‌ను గుర్తుంచుకొనుము. అతడు నిన్ను గుర్తుంచుకొనును. నీ చూపును అల్లాహ్‌పైనే వుంచుము. నీవు అతన్ని నీ ముందు పొందెదవు. ఏదైనా అడగవలసినచో అల్లాహ్‌తోనే యాచించుము. నీవు సహాయము

కోరినచో అల్లాహ్‌తోనే సహాయము కోరుము. అల్లాహ్ కోరనిదే, నీ అదృష్టములో లబ్ధి వ్రాయనిదే అందరు ఏకమై నీకు లబ్ధి చేకూర్చదలచినను నీకెట్టి లబ్ధి చేకూర్చలేరని గ్రహించుము. అల్లాహ్ నీ అదృష్టములో నష్టము వ్రాయనిదే వారు నీకు నష్టము కలిగించుటకు ఏకమైనను నీకు నష్టము కలిగించలేరు. కలములు మూయబడినవి. అదృష్ట పుస్తకములు ఎండిపోయినవి.

మరో హదీసులో ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. చూపును అల్లాహ్‌పై వుంచుము నీవు అతన్ని తన ముందు పొందెదవు. ఆనంద కాలములో నీవు అల్లాహ్‌ను గుర్తించుము అతడు నిన్ను ఇబ్బంది కాలములో గుర్తించును. నిన్ను దాటి పోయినది, నీకు లభించనిది నీ అదృష్టములో లేనిదని భావించుము. నీకు లభించినది నీకు లభించక వుండేది కాదు ఎందుకనగా అదృష్టములో అలానే వ్రాసియుండెను. సహనము పాటించు వారి వెంట అల్లాహ్ సహాయము వుండును, దుఃఖము వెంటనే ఆనందము గలదని, ఇబ్బంది వెంటనే సౌఖ్యము గలదని గుర్తించుము.

(సునన్ తిర్మిజి అబ్వాబ్ సిఫతుల్ కియామతి)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ కార్యము దైవ ప్రీతిరహితముగా లేకున్నను ఎంతో కలత చెందుచు దుఆ ద్వారా అల్లాహ్ ప్రీతిని యాచించేవారు.

హదీసు ఇట్లు గలదు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా ఇట్లనిరని ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ తెలిపిరి. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రక్కన పడుకొని వుంటిని. రాత్రి పొద్దుపోయాక

నేను వారిని అక్కడ పొందలేదు. అటు ఇటు వెతుకగా నా హస్తము హుజూర్‌కు తాకినది. హస్తము హుజూర్ పవిత్ర పాదమునకు తాకెను. వారప్పుడు సాష్టాంగము చేయుచుండిరి. అప్పుడు వారు ఇట్లు దుఆ చేయుచుండిరి. ఓ అల్లాహ్ ! నేను నీ అసంతృప్తి నుండి నీ ప్రీతి ఆశ్రయమును కోరుచున్నాను. నీ శిక్ష నుండి నీ క్షమాపణ ఆశ్రయములో వచ్చెదను. నేను నీ ప్రశంసను గణించలేను. స్వయముగా నీవు తన ఉనికి గురించి చెప్పినట్లే వున్నావు.

(సునన్ తిర్మిజి కితాబుద్దవాత్)

మరో హదీసులో ఇట్లు గలదు. ఒక మదీనా నివాసితో హజ్రత్ అబ్దుల్ వహాబ్ బిన్ వర్ద్ ఇట్లు తెలిపిరి. హజ్రత్ ముఆవియా నాకు వ్రాతపూర్వకముగా ఏదేని ఉపదేశము పంపగలరని హజ్రత్ ఆయిషా (రజి) ను కోరిరి. బదులుగా హజ్రత్ ఆయిషా (రజి) వారికిట్లు వ్రాసి పంపిరి. అస్సలాము అలైకుమ్. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించినట్లు నేను విన్నాను. ప్రజలు సమ్మతించకున్నను కూడ అల్లాహ్ ప్రీతిని కోరువాని పట్ల అల్లాహ్ స్వయముగా ప్రజలకెదురుగా అతనికి సరిపోవును. ప్రజల సమ్మతి కొరకు అల్లాహ్‌ను అసంతృప్తి పరచే వానిని అల్లాహ్ ప్రజలకప్పగించును.

(తిర్మిజి కితాబుజ్జుహ్ద్)

## అల్లాహ్ అంతిమ జమాఅత్ మీరే

అల్లాహ్‌తో విశ్వసనీయ సంబంధము ఏర్పరచుకోవలెనని తన జమాఅత్‌కు ఉపదేశించుచు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

ఇట్లు తెలిపిరి.

"గతములో విశ్వాసులను పరీక్షించినట్లే వివిధ రకముల దుఃఖములు, బాధల ద్వారా మీ పరీక్ష కూడ తప్పక జరగవలసినదే. మోసపోకుండా జాగ్రత్త పడుము. మీకు ఆకాశముతో దృఢమైన బంధమున్నచో భూమి మీకు ఏ మాత్రము నష్టము కలిగించలేదు. మీకు నష్టము ఎప్పుడు వాటిల్లినను అది శత్రువు ద్వారా కాదు మీ స్వహస్తములతో వాటిల్లును. భూమిపై మీ గౌరవమంతయు పోయినను అల్లాహ్ మీకు ఆకాశమున తరగని గౌరవము ప్రసాదించును. కావున మీరు అతన్ని వదులకుము. మీరు తప్పక బాధించబడెదరు, అనేక ఆశలతో దూరముంచడబడెదరు. మీరు అతని మార్గములో స్థిరముగా నున్నారా లేదా అని మీ అల్లాహ్ మిమ్ములను పరీక్షించును. కావున ఈ స్థితుల వలన మీరు నిరాశ చెందకుము. ఆకాశములో దేవదూతలు మిమ్ములను ప్రశంసించాలని మీరు కోరినచో దెబ్బలు పడి ఆనందముగా నుండుము, దూషణలు విని కృతజ్ఞత తెలుపుము, విఫలములను చూసి బంధమును తెంచుకోకుము. అత్యంత ఉన్నత దశకు చేరిన సత్కార్యమును ప్రదర్శించుము ఎందుకనగా అల్లాహ్ అంతిమ జమాఅత్ మీరే. మీలో అలసత్వమునకు గురైన ప్రతి ఒక్కడు మలిన వస్తువు వలె జమాఅత్ నుండి విసిరి వేయబడును. అతడు నిరాశతో మరణించును, అల్లాహ్‌కు ఎట్టి నష్టము కలిగించలేడు. మీ ప్రభువు వాస్తవముగా ఉన్నాడని నేను ఎంతో సంతోషముతో తెలుపుచున్నాను. అందరు అతని సృష్టే అయినను అతన్ని ఎన్నుకొనిన వానిని అతడు ఎన్నుకొనును. అతని వద్దకు వెళ్ళిన వాని వద్దకు అతడు వచ్చును. అతన్ని గౌరవించిన వానిని అతడు కూడ

గౌరవించును."

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 15)

మరల వారిట్లనిరి. "అల్లాహ్‌ను మనము సంతోషపెట్టవలెను. అందుకు స్వచ్ఛత, సత్యము, విశ్వసనీయత అవసరము. మన ధైర్యము, ప్రయత్నము మాటల వరకే పరిమితం కాకూడదు. మనము అల్లాహ్‌ను సంతోషపెట్టినప్పుడు అల్లాహ్ కూడ శుభము కలిగించును. తన అనుగ్రహములు, శుభముల ద్వారములను తెరచి వేయును. .... సత్యము, విశ్వసనీయత ద్వారమైన ఈ ఇరుకైన ద్వారము నుండి వెళ్ళుట సులభము కాదు. సత్యస్వప్నము, దైవవాణి అందడం వలన మనము గర్వ పడలేము. ప్రయత్నములను వీడి ప్రశాంతంగా కూర్చొని వుండుటను అల్లాహ్ ఇష్టపడడు."

(అల్‌బదర్ సంపుటి 3 నెం.18,19, దివి 8,16, మే 1904)

మరల వారిట్లనిరి. "ప్రతి విశ్వాసి స్థితి ఇటులనే వుండును. అతడు స్వచ్ఛత, విశ్వసనీయతతో అతని వాడైనచో అల్లాహ్ అతని మిత్రుడగును. కాని విశ్వాస భవనము శిధిలమైనచో నిస్సందేహముగా ప్రమాదముండును. మేమెవరి హృదయ స్థితిని ఎరుగము. ... కాని పూర్తిగా అల్లాహ్ వాడైనచో అల్లాహ్ అతన్ని ప్రత్యేకముగా రక్షించును. అతడు అందరి అల్లాహ్ అయినను తమను తాము ప్రత్యేకించుకొనినచో అతడు వారిపై ప్రత్యేకంగా ప్రకాశించును. మనసు పూర్తిగా చూర్ణమై ఏ మాత్రము మిగలక పోవడమే అల్లాహ్‌కు ప్రత్యేకమగుట. అందుకే బైఅత్‌పై అస్సలు గర్వపడకూడదని నేను పదే పదే మన జమాఅత్‌కు తెలిపెదను. హృదయము పవిత్రముగా లేనప్పుడు హస్తముపై హస్తము పెట్టుటతో ప్రయోజనమేమిటి ? .... కాని

నిజమైన అంగీకారము చేసిన వాని పెద్ద పెద్ద పాపములు క్షమించబడును. తద్వారా అతనికి ఒక నూతన జీవితము లభించును."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 65 క్రొత్త ఎడీషన్)

## నా వారు నా నుండి విడిపోలేరు

మరల వారిట్లనిరి.

"నన్ను అనుసరించలేని వాడు నా నుండి విడిపోవలెను. నేను ఎదుర్కోవలసిన కంపతో నిండిన భయానక అడవులు ఇంకెన్ని వున్నాయో నాకు తెలియదు. సున్నితమైన పాదములు గల వారు నా వెంట వచ్చి ఎందుకు కష్టమునకు గురవుతారు. ఆపదల, ప్రజల విమర్శల, ప్రకృతి వైపరీత్యాల, పరీక్షల వలన నా వారు నన్ను వదిలి పోలేరు. నా వారు కాని వ్యక్తులు అనవసరముగా మిత్రుత్వమును ప్రకటించుచున్నారు. ఎందుకనగా త్వరలోనే వారు వేరు చేయ బడుదురు. వారి పరిస్థితి గతము కంటే హీనముగా నుండును. మనము వరదలతో భయపడ గలమా ? అల్లాహ్ మార్గముల నుండి కష్ట నష్టముల వలన భయపడగలమా ? ఎన్నటికి కాదు. మన ప్రియమైన అల్లాహ్ ద్వారా నిర్వహించబడే పరీక్ష వలన విడిపోగలమా ? అతని అనుగ్రహము, దయతో మాత్రమే మనము అస్సలు విడిపోము. కావున విడిపోదలచిన వారు విడిపోవచ్చును. వారికి వీడ్కోలు అభినందనలు. కాని అపనమ్మకము, బంధమును తెంచుకొనిన తర్వాత ఏదో సమయమున మరల వచ్చినచో ఆ వచ్చుటకు అల్లాహ్ ఆస్థానములో విశ్వసనీయులకు లభించు గౌరవము లభించదని గుర్తుంచుకొనుము. ఎందునగా అపనమ్మకము, మోసపు మచ్చ చాలా పెద్ద మచ్చ."

(అన్వారుల్ ఇస్లాం – రూహాని ఖజాయిన్ సంపుటి 9 పుట 23,24)

# సంపూర్ణ విశ్వసనీయత, స్థిరత్వ ఆదర్శమును చూపుము

నేటికి వంద సం॥ల క్రితము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితములో ఇద్దరు సత్యవంతులు సంపూర్ణ విశ్వసనీయత, స్థిరత్వ నిదర్శమును చూపి వుండిరి. తమ బైఅత్ ప్రతిజ్ఞను పూర్తిగా నిర్వర్తించిరి. బైఅత్ ప్రతిజ్ఞను భంగపరచుటకు వారికి అనేక ఆశలు చూపబడెను. కాని ఆ స్థిరత్వ రాజకుమారులు ఇసుమంత కూడ లెక్కచేయక బైఅత్ ప్రతిజ్ఞపై నిలిచిరి. హజ్రత్ అఖ్దస్ (అ) వారిని గొప్పగా పొగిడిరి. వీరు సాహిబ్జాద సయ్యద్ అబ్దుల్లతీఫ్ షహీద్ (రజి), అబ్దుర్రహ్మాన్ ఖాన్ గార్లు. హుజూర్ (అ) ఇట్లనిరి.

"కుట్ర, మోసము, అబద్ధము, ఆరోపణపై కొనసాగుచున్న సంస్థ ప్రజలు ఇట్టి స్థిరత్వము, సాహసము ప్రదర్శించగలరా అని ఇప్పుడు విశ్వాసము, న్యాయముగా ఆలోచించవలెను. ఈ మార్గములో తొక్కబడుటను ఆమోదించి, తమ భార్యా పిల్లలను కూడ ఏ మాత్రము లెక్కచేయక ఎంతో ధైర్యముతో ప్రాణాలర్పించిరి. బైఅత్‌ను భంగపర్చినచో విడుదల వాగ్దానము పదే పదే చేయబడుచుండెను. అయినను ఈ దారిని వదల లేరు. ఈ విధముగనే షేఖ్ అబ్దుర్రహ్మాన్ కూడ కాబుల్‌లో హతమార్చబడిరి. కాని నన్ను వదలమని, నేను బైఅత్‌ను భంగపరతునని అనలేదు. ఇదే సత్య ధర్మము, నిజమైన ఇమామ్ చిహ్నము. ఎవరికైనా నిజమైన జ్ఞానము లభించినప్పుడు, విశ్వాస తియ్యదనము హృదయము, మనసులో ప్రవేశించినప్పుడు ఇటువంటి వారు ఈ మార్గములో

మరణించుటకు భయపడరు. అసంపూర్ణ విశ్వాసము గల వారు, తమ నాడి, అంగములో విశ్వాసము ప్రవేశించనప్పుడు యహూదా ఇస్క్ర్యూతి వలె కొంచెం ఆశతో ధర్మభ్రష్టులగుదురు. ఇటువంటి అపవిత్ర ధర్మభ్రష్టుల ఉదాహరణలు ప్రతి సందేశహరుని కాలములో చాలా వున్నవి. సన్మిత్రుల ఒక పెద్ద జమాఅత్ నా వెంట వున్నందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు. వారిలో ప్రతి ఒక్కరు నా కొరకు ఒక చిహ్నమే. ఇది నా అల్లాహ్ అనుగ్రహము.

"رَبِّ اِنَّکَ جَنَّتِیُ وَرَحُمَتُکَ جُنَّتِیُ وَاٰیَاتُکَ غِذَائِیُ وَفَضُلُکَ رِدَائِیُ."

(హఖీఖతుల్ వహీ - రూహాని ఖజాయిన్
సంపుటి 22 పుట 360,361)

అనగా ఓ నా పోషకుడా! నీవే నా స్వర్గము. నీ దయ నా రక్షణ కవచం. నీ సూక్తులు, చిహ్నములు నా ఆహారము. నీ అనుగ్రహము నా దుప్పటి.

ఈ విశ్వసనీయత, స్థిరత్వపు ఉదాహరణలు ఏర్పడుచున్నట్లు ఆ తర్వాత కూడ జమాఅత్ వంద సం॥ల కంటే ఎక్కువ చరిత్ర సాక్ష్యముగా గలదు. ఆర్థిక, ధన నష్టము కలిగించబడినది. దైవ మార్గములో హత్య చేయబడిరి. తనయుని ఎదుట తండ్రి, తండ్రి ఎదుట తనయుడు హతమార్చబడిరి. విశ్వసనీయతలకు అందరి కంటే ఎక్కువ సమాధానమిచ్చువాడైన అల్లాహ్ ఈ రక్తమును వృధా చేసినాడా ? లేదు. అతడు గతము కంటే అధికముగా వారి సంతానముపై కరుణల, అనుగ్రహముల వర్షము కురిపించెను. ఇక్కడ వున్న మీలో అనేకులు లేదా ప్రపంచ వివిధ దేశములలో విస్తరించివున్న వారు ఇందుకు ప్రత్యక్ష సాక్షులు.

మీరు అల్లాహ్‌తో నిర్వర్తించిన విశ్వసనీయత, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో చేసిన బైఅత్ ప్రతిజ్ఞను నిజము చేసి చూపిన ఫలితమే ఇది. వసతులలో మీరు గాని మీ సంతానము గాని ఆ బైఅత్ ప్రతిజ్ఞను మరచిపోకుము సుమా. ఈ అనుగ్రహము మీ సంతానములో కూడ ఏర్పడుటకు ఆ ప్రియమైన అల్లాహ్‌తో విశ్వసనీయ బంధమును సదా కొనసాగించుము. ఈ విశ్వసనీయ బంధమును తమ రాబోవు తరాలలో కూడ ఏర్పాటు చేయుచుండుము.

# ఆరవ బైఅత్ నిబంధన

**ఇస్లాం విరుద్ధ ఆచార వ్యవహారములకు దూరముగా నుండి పవిత్ర ఖురాన్ ఆదేశాలను పూర్తిగా పాటించును.**

**అల్లాహ్ ఆజ్ఞలను, అల్లాహ్ ప్రవక్త ఆదేశాలను తమ జీవిత సూత్రాలుగా చేసుకొనును.**

◈ ◈ ◈

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనుచున్నారు. ఆచార వ్యవహారాలను అనుసరించమను ఈ విషయముపై కూడ మీరు నాతో ప్రతిజ్ఞ చేయుము. ఎటువంటి ఆచార వ్యవహారములనగా మీరు నివసించుచున్న సమాజపు భాగములైనందున మాత్రమే వాటిని మీరు ధర్మములో చేర్చుకొనిరి. ఇతర ధర్మములో ఆ ఆచారాలున్నందున మీరు కూడ వాటిని అవలంభించిరి. ఉదాహరణకు వివాహ సమయమున పలు వృధా రకమైన ఆచారాలు గలవు. బరీ చూపుట లేదా వధువు, వరునికిచ్చే కట్న కానుకల సామాగ్రిని ప్రదర్శించుట. కేవలము మహెర్‌ను తెలుపుచు నికాహ్ ప్రకటన చేయుటను ఇస్లాం అనుమతించును. ఇతరములన్నియు

వృధా ఆచారాలే. కేవలము ధనికుల గొప్పతనమును చాటు ఉద్దేశముతోనే బరీ లేదా కట్నము ప్రదర్శించబడును. మా దాయాదులు తమ సోదరుడు, సోదరి లేదా కుమారుడు, కుమార్తె వివాహములో ఇచ్చిన దాని కంటే మేమెంత అధికముగా ఇచ్చినామో చూచితిరా? ఇది పోటీ, ఆడంబరము, ప్రదర్శన మాత్రమే. ఇక్కడికి వచ్చిన తర్వాత అల్లాహ్ తన ప్రత్యేక అనుగ్రహముతో ప్రసాదించిన వారు మీలో చాలా మంది వున్నారు. ఎంతో సౌలభ్యము అందించెను. ఇది కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంస్థలో చేరిన శుభమే. మీ పూర్వీకులు ఇచ్చిన త్యాగముల ఫలితము, వారి దుఆల శుభమే. కొందరు ఈ అనుగ్రహములు, శుభములను వ్యక్తపరచుచు అతని ఆస్థానములో వంగుచు, అతని మార్గములో వినియోగించే బదులు వివాహ వేడుకలు, విందులలో గొప్పతనము కొరకు, గర్వము కొరకు ఇటువంటి ఆచారములలో పడుదురు. వివాహ వేడుక, విందులలో ఆహారము వృధా చేయబడును. ప్రదర్శన నిమిత్తం ఎన్నో రకాల వంటలు చేయుదురు. వీరిని చూచి నిరుపేదలు, స్థోమత లేని వారు కూడ కట్నకానుకల ప్రదర్శన కొరకు అప్పుల పాలగుచున్నారు. కోడలు కట్న కానుకలు తేనందున ప్రజలు ఏమందురని వరుని తరపు వారు అడిగినందున వధువు వారు ఋణగ్రహీతలగుదురు. వరుని తరపు వారు కూడ అల్లాహ్‌తో కొంచమైనా భయపడవలెను. కేవలము ఆచారాల వలన, తమ గొప్పతనము కొరకు నిరుపేదలను కష్టముల, అప్పులలో బంధించకుము. మేము అహ్మదీయులము, పది బైఅత్ నిబంధనలను పాటింతుమని దావా చేయుదురు. నేను సంక్షిప్తముగా వివాహ ఆచారము గురించి తెలిపినాను. నేను దీనిని మరింత వివరించినచో వివాహ ఆచారము

గురించే అనేక భయంకర విషయములు బహిర్గతమగును. అనేక ఉదాహరణలు కూడ లభించును. ఆచారాలు అధికమైనప్పుడు మానవుడు పూర్తిగా అంధుడగును. తర్వాతి అడుగులో సంపూర్ణముగా మానసిక కోరికలకు లొంగిపోవును. వాస్తవానికి బైఅత్ చేసిన అనంతరం అతడిట్లు ప్రతిజ్ఞ చేయును. మానసిక కోరికల నుండి దూరముందును. అల్లాహ్, అతని ప్రవక్త రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పాలనను సంపూర్ణ రీతిలో తన పై విధించు కొందును. అల్లాహ్, ప్రవక్త మనతో కోరునదేమిటి? ఇదే. అనగా ఆచారాలు, సంప్రదాయాలు, మానసిక కోరికలను వీడి నా ఆజ్ఞలను పాటించుము. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿فَاِنۡ لَّمۡ یَسۡتَجِیۡبُوۡا لَکَ فَاعۡلَمۡ اَنَّمَا یَتَّبِعُوۡنَ اَہۡوَآءَہُمۡ وَمَنۡ اَضَلُّ مِمَّنِ اتَّبَعَ ہَوٰىہُ بِغَیۡرِ ہُدًی مِّنَ اللّٰہِ اِنَّ اللّٰہَ لَا یَہۡدِی الۡقَوۡمَ الظّٰلِمِیۡنَ﴾

(అల్‌ఖసస్: 51) అనగా వారు ఈ ఆహ్వానమును స్వీకరించనిచో వారు కేవలము తమ కోరికలను మాత్రమే అనుసరించు చున్నారని ఎరుగుము. అల్లాహ్ మార్గదర్శనమును వదిలి తన కోరికలననుసరించు వాని కంటే దుర్మార్గుడెవడుండును ? అల్లాహ్ ఎన్నడూ అన్యాయ జాతికి మార్గదర్శనము చేయడు.

ఇప్పుడు గమనించుము. తమ కోరికలను మాత్రమే అనుసరించే వారు ఎన్నడు మార్గదర్శనము పొందరని అల్లాహ్ ఈ సూక్తిలో నిర్ణయము వెలువరించెను. ఇది మన కొరకు చాలా భయంకర స్థానము. ఇప్పుడు మనము ఒక వైపు వర్తమాన ఇమామ్‌ను గుర్తించి, నమ్మినామని దావా చేయుచున్నాము. ఇమామ్‌తో ప్రతిజ్ఞ చేసినందున సమాజపు దుష్టత్వములను

వీడవలెను. కాని మనము ఆ దుష్టములను వీడుట లేదు. మనము మరల వెనుకకు మరలు చున్నామా! ప్రతి ఒక్కరు దీనిని పరిశీలించుకోవలెను. ప్రతి ఒక్కరు తమ స్థితి పట్ల ఆత్మశోధన చేసుకోవలెను. మనము ఈ బైఅత్ ప్రతిజ్ఞపై నిలిచివున్నచో, తమ ప్రభువుతో భయపడుచు కోరికల నుండి దూరమున్నచో, ఆ ప్రియమైన అల్లాహ్‌ను ప్రశంసించుచు, కీర్తించుచు, అతని వైపు వంగుచున్నచో అతడు మనకు దీనికి బదులుగా తన స్వర్గపు శుభవార్త ఇచ్చుచున్నాడు. అతడిట్లనెను.

﴿وَاَمَّا مَنْ خَافَ مَقَامَ رَبِّهٖ وَنَهَى النَّفْسَ عَنِ الْهَوٰى فَاِنَّ الْجَنَّةَ هِيَ الْمَاْوٰى﴾

(అన్నాజిఆత్:41,42) అనగా తమ ప్రభువు అంతస్థు నుండి భయపడిన వాడు తన ఆత్మను కోరికలతో ఆపినచో, నిశ్చయముగా స్వర్గమే అతని నివాసమగును.

ఆచార, సంప్రదాయాల గురించి పలు హదీసులను ప్రస్తావింతును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా తెలిపిరి. ధర్మముతో అసంబంధమైన ఏదేని ధర్మ సమస్యలో నూతన ఆచారమును ఎవరైనా పుట్టించినచో ఆ ఆచారము రద్దు చేయదగినది, ఆమోదయోగ్యము కానిది.

(బుఖారి కితాబుస్సులహ్ బాబ్ ఇజా అస్తలహు అలా సల్హ జూదిన్)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ముద్దేశించి ఇట్లు ఉపదేశించిరని హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. వారి నేత్రములు ఎర్రబారినవి. ధ్వని అధికమయ్యెను. ఉద్రేకము పెరిగెను. వారొక దాడి చేయబోవు సైన్యము నుండి మమ్ములను భయపెట్టించుచున్నట్లు అనిపించుచుండెను. వారిట్లనిరి. ఆ సైన్యము ఉదయం లేదా సాయంత్రము

మీపై దాడి చేయవచ్చును. వార తన చూపుడు వ్రేలు, మధ్య వ్రేలు కలిపి చూపి ఈ రెండు వ్రేల్లు కలిసివున్నట్లే నేను ఆ ఘడియ కలిపి పంపబడినామనిరి. ఉత్తమ వాక్యము అల్లాహ్ గ్రంధము. ఉత్తమ ఆదర్శము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శము. ధర్మములో క్రొత్త క్రొత్త ఆచారాలను పుట్టించుట అతి దుష్టమైన కార్యము. ప్రతి ఆచారము దుర్మార్గము వైపు తీసుకెళ్ళునని కూడ వారనిరి.

(ముస్లిం కితాబుల్ జుమ బాబ్ తఖ్ఫీఫుస్సలాత్ వల్‌ఖుత్బతి)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరని హజ్రత్ అమర్ బిన్ ఔఫ్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. నా పద్ధతిని ప్రజలు అమలు చేయు విధముగా ఎవరైనా జీవింపజేసినచో ఆ జీవింపజేసిన వ్యక్తికి అమలు చేసే వారికి సమానముగా ప్రతిఫలము లభించును. వారి ప్రతిఫలములో ఎట్టి తగ్గుదల కాదు. ఎవరైనా ఏదేని క్రొత్త ఆచారమును ఆవిష్కరించినచో దానిని ప్రజలు అమలు చేసినచో దానిని అమలు చేయువారికి కలిగిన పాపములలో ఆ వ్యక్తికి భాగము లభించును. ఆ క్రొత్త ఆచారమును అమలు చేయుచున్న వారి పాపములలో ఎలాంటి తగ్గుదల చేయబడదు.

(ఇబ్నె మాజ బాబ్ మన్ అహ్యా సున్నత ఖద్ అమీతత్)

## క్రొత్త క్రొత్త ఆచారాలు, సంప్రదాయాలు రద్దు చేయదగినవి

ఈ హదీసులో వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ధర్మముతో ఎట్టి సంబంధము లేని ఆచారాలు, ధర్మము నుండి దూరము చేయనట్టివి, అల్లాహ్, అతని ప్రవక్త ఆజ్ఞలు, ఆదేశాలను తక్కువ చేసి

చూపునట్టివన్ని రద్దుచేయదగిన ఆచారములన్నియు వృధాయే, తిరస్కరించదగినవి. కావున వీటితో దూరముండుము. ఎందుకనగా ఇవి ధర్మములో క్రొత్త క్రొత్త ఆచారాలకు అవకాశమిచ్చును. ఇతర ధర్మములలో ఆచారాలు ప్రవేశించి ధర్మమును చెడగొట్టినట్లే ధర్మము చెడిపోవును. ఇది జరగవలసి యుండెను ఎందుకనగా ఈ కాలములో సజీవ ధర్మము కేవలము ఇస్లాం మాత్రమే యుండవలసియుండెను. కాని మీరు పరిశీలించినచో మీకిట్లు తెలియును. ఇతర ధర్మములు ఉదా॥ క్రైస్తవము ఒక ధర్మమైనను వివిధ దేశాలలో, వివిధ ప్రాంతాలలో, వివిధ ప్రదేశాలలో తమ ఆచార, సంప్రదాయాల ప్రకారము తమ ఆచారాలను ధర్మ భాగములుగా చేసికొని యున్నారు. ఆఫ్రీకాలో కూడ ఈ విషయములు దర్శనమిచ్చును. ఆచారాల ద్వారము ఒక సారి తెరువగా క్రొత్త క్రొత్త ఆచారములు ధర్మములో స్థానము కల్పించుకొనును. అందుకే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆచారాలను సృష్టించువారిని కఠినముగా హెచ్చరించిరి. గట్టిగా భయపెట్టిరి. వారికి ఈ విషయములో చాలా కలత వుండెడిది. ఇట్లనిరి. ఈ ఆచారముల వలన, మీరు మానసిక కోరికలకు లొంగిపోవుదురను విషయముతో నేను చాలా భయపడుచున్నాను. దీని వలన ధర్మములో దుష్టత్వము ఏర్పడి మీరు మార్గభ్రష్టులగుదురని నేను ఆందోళన చెందుచున్నాను.

నేడు మీరు ఇక్కడి పశ్చిమ సమాజములో నివాసముంటున్నారు. ఇక్కడ అంతులేని ఆచార, వ్యవహారములు గలవు. అవి మిమ్ములను ధర్మము నుండి దూరము తీసుకెళ్ళును, ఇస్లాం అందమైన బోధనను తెరచాటున పడవేయు ఆచారములు, పద్ధతులివి. ఎందుకనగా ప్రాపంచిక తళుకు

బెళుకు ఎక్కువ ప్రభావితము చేయును. అందుకే ఇక్కడి సమాజములో అతి జాగ్రత్తగా అడుగులు వేయవలసిన అవసరము గలదు. వీరి తప్పుడు ఆచారాలను అనుసరించే బదులు మధురమైన ఇస్లాం బోధనను ప్రవేశపెట్టవలెను. పశ్చిమ సమాజము అతనిని ప్రభావితము చేయలేని విధముగా ప్రతి అహ్మదీయుని క్యారెక్టర్, ప్రవర్తన చాలా గట్టిగా వుండవలెను. ఉదా॥ స్త్రీలకు ముసుగు ఒక ఇస్లామీయ ఆజ్ఞ గలదు. ముసుగు వలన స్త్రీల ఉన్నత స్థానము కనిపించును. కనుక ఇందులోనే వారికి గౌరవము గలదు. పురుషులు ఈ సమాజములో ముసుగు విశిష్టతలను వివరించుచు విహరించే కంటే స్త్రీ స్వయాన ముసుగు ధరించి, ఈ సమాజములో ముసుగు విశిష్టతలను వివరించినచో అది ఎక్కువ ప్రభావము చూపును. ముసుగు ధరించే స్త్రీలకు వ్యక్తిగతముగా ప్రచారము చేయు అవకాశములు కూడ అధికముగా కలుగును. ఇటు వైపు కూడ అధిక శ్రద్ధ వహించవలసిన అవసరము గలదు. ఈ పశ్చిమ సమాజపు అనేక దురలవాట్లు గలవు. ఈ సమాజములో మనము వున్నందున, గతి లేదని మాత్రమే వాటిని అవలంభించుట భయానకమైనది. ఉదా॥ మద్యము సేవించు వ్యక్తితో మీకు మిత్రుత్వము గలదు. అతనితో కలిసి మీరు రెస్టారెంట్ లేదా బార్‌లో పోయినప్పుడు అక్కడతడు మద్యము సేవించును. కాని నేను నిస్సందేహముగా కాఫీ లేదా ఇంకేదైనా పానీయము సేవింతునని పోవుట కూడ తప్పిదమే. చాలా జాగ్రత్త అవసరము. ఏదో ఒక రోజు అతనితో ప్రభావితమై మీరు స్వయముగా ఒక చుక్క త్రాగవచ్చును. ఆ తర్వాత అది అలవాటుగా మారును. ఓ అల్లాహ్! ఇట్లు జరగనివ్వకు. కావున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో కలత వ్యక్తపరచిన

ఈ క్రింది హదీసును తమ దృష్టియందుంచు కొనుము.

హజ్రత్ అబూబర్జ (రజి) కథనము ప్రకారము నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీ కడుపులు, రహస్యాంగములలో పుట్టు కోరికల వలన మీ గురించి నేను ఆందోళన చెందుచున్నాను. అటులనే కోరికల వలన ఏర్పడే దుర్మార్గముల గురించి కూడ భయపడుచున్నాను.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 4 పుట 423 ముద్రణ బేరూత్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"ఇస్లాంలో గల జ్ఞాన నిధి లభించినచో పాపపూరిత జీవితము మరణించును, మానవుడు అల్లాహ్‌ను దర్శించును, అతని ధ్వనిని వినును, నిజమైన కృషి, ప్రయత్నము చేయనిదే మానవునికిది లభించదు. కనుక స్పష్టముగా అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَاَمَّا مَنْ خَافَ مَقَامَ رَبِّهٖ وَنَهَى النَّفْسَ عَنِ الْهَوٰى فَاِنَّ الْجَنَّةَ هِيَ الْمَاْوٰى﴾

(అన్నాజిఆత్ : 41,42) అనగా తమ ప్రభువు అంతస్థు నుండి భయపడిన వాడు తన ఆత్మను కోరికలతో ఆపినచో, నిశ్చయముగా స్వర్గమే అతని నివాసమగును. ఒక వ్యక్తి గర్వముగా నేను అల్లాహ్‌ను విశ్వసించుచున్నాను అని ప్రకటించుట సులభమే. ఇటువంటి దావా ప్రకటించినను విశ్వాస చిహ్నములు, ఫలములు ఎట్లు కలగవు. ఇవి కేవలము నోటి మాటలే అగును. ఇటువంటి వారు అల్లాహ్‌ను ఖాతరు చేయరు. కావున అల్లాహ్ కూడ వారిని లెక్క చేయడు."

(అల్‌హకమ్ సంపుటి 9 నెం. 29, దివి: 17 ఆగస్టు 1905, పుట 6)

మరల వారిట్లనిరి.

"తమ పోషకుని ఎదుట నిలబడుటకు భయపడుచు తన మానసిక కోరికలను నివారించు వాని స్థానము స్వర్గము. మానసిక కోరికలను నివారించుటయే దైవములో లీనమగుట. దీనితో అల్లాహ్ ప్రీతిని పొంది ఇదే ప్రపంచములో స్వర్గ స్థానము వరకు చేరవచ్చును."

(బదర్ సంపుటి 1 దివి: 3 ఆగస్టు 1905 పుట 2)

## ఇస్లామ్ బోధనకు పవిత్ర ఖురాన్ మన మార్గదర్శి

కావున ఆచారముల నుండి దూరముండుట, మానసిక కోరికల నుండి విముక్తి పొందుటయే ఇస్లామ్ బోధన సారాంశము. ఈ బోధనను అర్థము చేసుకొనుటకు పవిత్ర ఖురాన్ మనకు మార్గదర్శిగా యున్నది. వాస్తవానికి ఒక విశ్వాసి సంపూర్ణ పవిత్ర ఖురాన్‌ను తన కార్యాచరణగా చేసుకున్నచో పాపములన్నియు వాటంతట అవే అంతమైపోవును. ఎటువంటి మానసిక కోరికల ఆలోచన కూడ హృదయములో కలుగదు. ఎందుకనగా కార్యాచరణగా శాసనమును సంపూర్ణము చేయుచు, మానవ జీవిత కోణములన్నిటిని ఆవహించియున్న ఈ పవిత్ర గ్రంథమును ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర హృదయముపై అల్లాహ్ అవతరింప జేసెను. అవసరమున్న చోట ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఆచరణ, తమ ప్రవచనము ద్వారా దానిని వివరించిరి. అందుకే దీనిని తు.ఛ. స్వీకరించుమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. ఈ విషయమును గురించి పవిత్ర ఖురాన్, హదీస్, హజ్రత్ మసీహ్ మౌవూద్

అలైహిస్సలాం పలు సూచనలను నేను ప్రవేశపెట్టెదను.

అల్లాహ్ ఇట్లనెను. ﴿وَلَقَدْ يَسَّرْنَا الْقُرْاٰنَ لِلذِّكْرِ فَهَلْ مِنْ مُّدَّكِرٍ﴾ (అల్‌ఖమర్:18) అనగా నిశ్చయముగా మేము ఉపదేశము పొందుటకు ఖురాన్‌ను సులభతరముగా చేసితిమి. కనుక ఉపదేశము పొందువాడెవడైనా వున్నాడా ?

హదీసులో ఇట్లు గలదు. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్ అబూ మూసా అష్అరి (రజి) తెలిపిరి. ఖురాన్‌ను పఠించుచు దానిని ఆచరించు విశ్వాసుడు నారింజ పండును పోలివుండును. దాని రుచి కూడ మంచిగుండును, దాని సువాసన కూడ మంచిగుండును. ఖురాన్‌ను పఠించడు కాని దానిని అమలు చేయు విశ్వాసుడు ఖర్జూరమును పోలివుండును. దాని రుచి మధురమైనను దానికి సువాసన వుండదు. ఖురాన్‌ను పఠించు దాంబికుడు తులసిని పోలివుండును. దాని సువాసన మంచిగుండును. కాని దాని రుచి చేదుగా వుండును. ఖురాన్‌ను పఠించని దాంబికుడు వెఱ్ఱిపుచ్ఛను పోలివుండును. దాని రుచి చేదుగా వుండును, దాని సువాసన కూడ చేదుగా వుండును.

(బుఖారి కితాబ్ ఫజాఇలుల్ ఖురాన్ బాబ్ ఇస్మ్ మన్ రఆ బిఖిరాఅతిల్ ఖురాన్ అవ్ తాకులు బిహి అవ్ ఫఖర బిహి)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"ఖురాన్ అగాధమైన వివేకములతో నిండి యున్నది. క్రొత్త నిబంధనను పోల్చినచో ప్రతి బోధనలో నిజమైన పుణ్యమును నేర్పుటకు ముందడుగు వేయును. ప్రత్యేకముగా సత్యమైన, మార్పునకు లోనుగాని అల్లాహ్‌ను దర్శించు దీపము ఖురాన్ చేతిలోనే గలదు. అది ప్రపంచములో

అవతరించనిచో సృష్టిని ఆరాధించుటలో ఎంత సంఖ్య పెరిగి యుండెడిదో అల్లాహ్‌కే తెలుసు. భూమిపై అదృశ్యమైన దైవ ఏకత్వము మరల ఏర్పడినందుకు కృతజ్ఞతలు."

(తుహ్ఫా ఖైసరియ- రూహాని ఖజాయిన్ సంపుటి 12 పుట 282)

## మీ జీవితము పవిత్ర ఖురాన్‌లోనే గలదు

మరల వారిట్లనిరి.

"పవిత్ర ఖురాన్‌ను విడిచి పెట్టకుము. మీ జీవితము దానిలోనే గలదు. ఖురాన్‌ను గౌరవించిన వారు ఆకాశమున గౌరవము పొందెదరు. ప్రతి హదీస్, ప్రతి ప్రవచనముపై పవిత్ర ఖురాన్‌కు ప్రాధాన్యత ఇచ్చువారికి ఆకాశమున ప్రాధాన్యత కల్పించబడును. ఖురాన్ తప్ప ఇప్పుడు మానవజాతికి ఏ గ్రంధము లేదు. మానవులందరికి ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం తప్ప ఏ ప్రవక్త, సిఫారసు చేయు వాడు లేడు."

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 13)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"పవిత్ర ఖురాన్ తన ఆధ్యాత్మిక ప్రత్యేకత, తన స్వంత కాంతితో తన నిజమైన అనుచరులను తన వైపు ఆకర్షించును. అతని హృదయమును కాంతిమయము చేయును. అనంతరం పెద్ద పెద్ద సంకేతములు చూపించి ముక్కలు ముక్కలు చేయగలిగే ఖడ్గముతో కూడ అవి విరగని గట్టి సంబంధములు అల్లాహ్‌తో ఏర్పరచును. అది హృదయ నేత్రమును తెరుచును. పాపపు మలిన చెలిమను మూసివేయును. మధురమైన దైవ సంబాషణతో సత్కరించును, పరోక్ష విషయములైన విద్యలు తెలుపును. దుఆను ఆమోదించినప్పుడు తన వాక్యముతో ముందే తెలుపును. పవిత్ర

ఖురాన్ నిజమైన అనుచరున్ని ఎదురించదలచిన వానిని అల్లాహ్ తన భయంకర చిహ్నములతో అతనిపై బహిర్గతమగును. తాను తన వాక్యమును అనుసరించు వాని వెంట వున్నానని సూచించును.”

(చష్మ మారిఫత్ – రూహాని ఖజాయిన్
సంపుటి 23 పుట 308,309)

మరల వారిట్లనిరి. “కావున మీరు జాగ్రత్తగా వుండుము. అల్లాహ్ బోధన, ఖురాన్ మార్గదర్శనమునకు విరుద్ధముగా ఒక్క అడుగు కూడ వేయకుము. నేను నిజముగా చెప్పుచున్నాను ఖురాన్‌లోని ఏడు వందల ఆజ్ఞలలో ఒక్క చిన్న ఆజ్ఞను కూడ ఎవడైనా విస్మరించినచో అతడు మోక్షపు ద్వారమును తన స్వహస్తముతో తన కొరకు మూసివేసుకొనును. నిజమైన, సంపూర్ణ మోక్షపు ద్వారములను ఖురాన్ తెరిచెను. మిగతావన్ని వాటి ఛాయలే. కనుక మీరు ఖురాన్‌ను శ్రద్ధతో పఠించుము. ఎవరిని ప్రేమించని విధముగా ఖురాన్‌ను ప్రేమించుము. అందుకే అల్లాహ్ నన్నుద్దేశించి ఇట్లు తెలిపెను. **اَلْخَيْرُ كُلُّهٗ فِى الْقُرْاٰنِ** అనగా శుభములన్నియు ఖురాన్‌లోనే గలవు. ఇదే నిజమైన విషయము. మరో వస్తువునకు దీనిపై ప్రాధాన్యత ఇచ్చేవారిపై విచారము. మీ సంపూర్ణ విజయ, మోక్షమునకు మూలము పవిత్ర ఖురానే. పవిత్ర ఖురాన్‌లో లభించని మీ ఆధ్యాత్మిక ఏ అవసరము లేదు. మీ విశ్వాసమును ప్రళయ దినమున బలపరిచేది లేదా తిరస్కరించేది పవిత్ర ఖురానే. ఖురాన్‌తో సంబంధము లేనిదే మీకు మార్గదర్శనము చేయునది ఆకాశము క్రింద ఖురాన్ తప్ప ఏ గ్రంథము లేదు. ఖురాన్ లాంటి గ్రంథము మీకిచ్చి అల్లాహ్ మిమ్ములను ఎంతగానో అనుగ్రహించెను. నేను నిజముగా చెప్పునదేమనగా మీపై చదవబడిన గ్రంథము క్రైస్తవులపై

చదవబడి యుండినచో వారు నాశనమయ్యేవారు కాదు. మీకందించబడిన శుభము, మార్గదర్శనము యూదులకు బైబిల్ బదులు ప్రసాదించి యుండినచో వారిలో కొన్ని వర్గములు ప్రళయ దినమును నిరాకరించేవి కావు. మీకివ్వబడిన ఈ అనుగ్రహమును గౌరవించుము. ఈ అనుగ్రహము చాలా మధురమైనది. ఇది గొప్ప ఆస్తి. పవిత్ర ఖురాన్ అవతరించనిచో ప్రపంచమంతయు ఒక పేరుకొనిన రక్తములా యుండెడిది. ఖురాన్ ఎటువంటి గ్రంథమనగా దానికెదురుగా మార్గదర్శనములన్నియు హీనమైనవే.”

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 26,27)

ఎంత వరకు ఖురాన్‌ను ప్రేమించుచున్నాడు, దాని ఆజ్ఞలను నమ్ముచున్నాడు, వాటిని ఆచరించుటకు ప్రయత్నించుచున్నాడో మనలో ప్రతి ఒక్కరు తమను తాము పరిశీలించుకోవలెను. ప్రేమను వ్యక్తపరచుటకు కూడ పద్ధతులు గలవు. ప్రతి అహ్మదీయుడు తనపై అన్నిటి కంటే ఎక్కువ విధించు కోవలసినదేమనగా ప్రతి రోజు క్రమం తప్పకుండా పవిత్ర ఖురాన్‌లోని రెండు మూడు రుకూలు పఠించవలెను. తదుపరి అనువాదము చదువవలెను. ప్రతి రోజు పఠనముతో పాటు అనువాదము చదవడంతో క్రమ క్రమంగా ఈ అందమైన బోధన తెలియకుండానే మెదడులో పాతుకుపోవుట మొదలగును.

ఈ ఆరవ నిబంధనలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరొక విషయమును సూచించిరి. అదేమనగా ప్రతి విషయములో అల్లాహ్, అతని ప్రవక్త ఆదేశములను తన ప్రతి సమస్యలో కార్యాచరణగా తన ముందుంచుకొనును. అవసరమున్నప్పుడు వారిని

సలహా కోరును. నోటితో అనవలసిన విషయము కాదు కదా? ఈ ప్రతిజ్ఞను పూర్తి చేయుటకు వ్యక్తి గమనించినచో చాలా కలత కలుగును. ఎందుకనగా అల్లాహ్ ఇట్లనును.

﴿يٰـأَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا اَطِيْعُوا اللّٰهَ وَاَطِيْعُوا الرَّسُوْلَ وَ اُولِى الْاَمْرِ مِنْـكُمْ فَاِنْ تَنَازَعْتُمْ فِيْ شَيْءٍ فَرُدُّوْهُ اِلَى اللّٰهِ وَالرَّسُوْلِ اِنْ كُنْتُمْ تُؤْمِنُوْنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ ذٰلِكَ خَيْرٌ وَّ اَحْسَنُ تَاْوِيْلاً﴾

(అన్నిసా: 60) అనగా ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు, అతని ప్రవక్తకు, మీ అధికారులకు విధేయులైయుండుము. మీలో మీకు ఏదేని విషయమున అభిప్రాయ భేదములేర్పడినచో, అల్లాహ్‌ను, ధర్మ నిర్ణయ దినమును మీరు విశ్వసించు వారైన ఎడల అల్లాహ్‌తో అతని ప్రవక్తతో పరామర్శ చేయుడు. వారి ఆజ్ఞలననుసరించి సమస్యను పరిష్కరించుము. ఇది ఉత్తమమగును, ప్రశస్తముగను పరిణమించును.

మరల ఇట్లనెను. ﴿اَطِيْعُوا اللّٰهَ وَالرَّسُوْلَ لَعَلَّكُمْ تُرْحَمُوْنَ﴾ (ఆలె ఇమ్రాన్: 133) అనగా మీరు అనుగ్రహము పొందుటకు అల్లాహ్‌కు ప్రవక్తకు విధేయులై యుండుము.

మరల ఇట్లనెను.

﴿يَسْـئَلُوْنَكَ عَنِ الْاَنْفَالِ قُلِ الْاَنْفَالُ لِلّٰهِ وَالرَّسُوْلِ فَاتَّقُوا اللّٰهَ وَاَصْلِحُوْا ذَاتَ بَيْنِكُمْ وَاَطِيْعُوا اللّٰهَ وَرَسُوْلَهٗ اِنْ كُنْتُمْ مُؤْمِنِيْنَ﴾

(అల్ అన్ఫాల్:2) అనగా వారు యుద్ధములో లభించిన సామాగ్రిని గూర్చి నిన్ను ప్రశ్నింతురు. నీవు ఇట్లనుము. యుద్ధములో లభించిన సామాగ్రి అల్లాహ్, అతని ప్రవక్తవి. కనుక అల్లాహ్ ధర్మమును పాటించుము. పరస్పరము సంస్కరించుకొనుము. మీరు విశ్వాసులే అయినచో అల్లాహ్‌కు, అతని ప్రవక్తకు విధేయులగుము.

నా ఆజ్ఞలను సరైన రీతిలో నమ్మి వాటిని పాటించమని ఇచట అల్లాహ్ తెలిపెను. ఈ ఆజ్ఞలను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విధముగా వివరించిరో అదే విధముగా అమలు చేయుము. మీ కొరకు నియమించబడిన అధికారులు, నియమిత వ్యవస్థ పట్ల విధేయత వహించినచో మీరు బైఅత్ హక్కును నిర్వర్తించినట్లు అగును. ఈ విషయము గురించి పలు హదీసులను ప్రవేశపెట్టెదను.

హజ్రత్ ఉబాదహ్ (రజి) బిన్ సామిత్ కథనము ప్రకారము ఇష్టమున్నను, ఇష్టము లేకున్నను మేము వారి పట్ల విధేయత వహింతుమను విషయముపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బైఅత్ చేసితిమి.

(బుఖారి కితాబుల్ ఇహ్‌కామ్ బాబ్ యుబాఇవుల్ ఇమామన్నాసి)

అబ్దుర్రహ్మాన్ బిన్ అమర్ సల్మా, హుజర్ బిన్ హుజర్ ఇట్లు తెలిపిరి. వారు అర్బాజ్ బిన్ సారియా (రజి) వద్దకు వచ్చి యుండిరి. అర్బాజ్ ఇట్లనిరి. ఒక రోజు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మాకు ఉదయపు ప్రార్థన చేయించిరి. అనంతరం ఎంతో ప్రభావిత, సాహిత్య, దీర్ఘమైన రీతిలో మాకు ఉపదేశించిరి. ప్రజల కనుల నుండి కన్నీరు వెలువడెను. హృదయములు భయపడినవి. శ్రోతలలో ఒకరిట్లు వేడుకొనెను. ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇది వీడ్కోలు ఉపదేశము అనిపించుచున్నది. మీ ఉపదేశమేమిటి?

వారిట్లనిరి. ఇది నా ఆదేశము. అల్లాహ్ భీతిని అవలంభించుము. మీ అధ్యక్షుడు ఒక అఫ్రీకా బానిస అయినను విషయమును విని విధేయత వహించుము. ఎందుకనగా మీలో ఎవడైనా నా తర్వాత జీవించివున్నచో అతి పెద్ద విభేదాలను చూచే కాలము వచ్చును. మీరు ఆ సున్నితమైన కాలములో నా, నా పవిత్ర ఉత్తరాధికారుల పద్ధతిని అనుసరించుము. దానిని పట్టుకొనుము. దంతములతో గట్టిగా పట్టుకొనుము. ధర్మములో క్రొత్త విషయములను ఆరంభించుటతో దూరముండవలెను. ధర్మము పేరున జారీ అగు ప్రతి క్రొత్త విషయము ఆచారమగును. ప్రతి ఆచారము పచ్చి దుర్మార్గము.

(తిర్మిజి కితాబుల్ ఇల్మ్ బాబుల్ అఖ్జి బిస్సున్నతి, అబూదావూద్ కితాబుస్సున్నతి బాబ్ లుజూముస్సున్నతి)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను సంపూర్ణముగా అనుసరించు, విశ్వాస దావా చేయు అహ్మదీయులైన మనము ఈ ఉపదేశము, హదీసును ఎల్లప్పుడు దృష్టి యందుంచుకొనవలెను. ఇటులనే మరో హదీసు ఇట్లు గలదు.

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మూడు విషయములున్న వాడు విశ్వాస తియ్యదనమును పొందును. **ఒకటి**: ఇతరులందరి కంటే అధికముగా అల్లాహ్, అతని ప్రవక్త అతనికి ప్రియులైవుండవలెను. **రెండవది**: అల్లాహ్ కొరకు మాత్రమే ఎవరినైనా అతడు ఆదరించవలెను. **మూడవది**: అగ్నిలో పడవేయుటకు ఇష్టపడడో అటులనే అవిశ్వాసములో తిరిగి పోవుటను ఇష్టపడరాదు.

(బుఖారి కితాబుల్ ఈమాన్ బాబ్ హలావతుల్ ఈమాని)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"చూడుము పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿ قُلْ اِنْ كُنْتُمْ تُحِبُّوْنَ اللّٰهَ فَاتَّبِعُوْنِىْ يُحْبِبْكُمُ اللّٰهُ ﴾ (ఆలె ఇమ్రాన్:32)

అల్లాహ్ ప్రియులగుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుసరణ మాత్రమే ఏకైక మార్గము. మిమ్ములను అల్లాహ్‌తో కలిపే మరో రెండవ మార్గము లేదు. ఆ ఏకైక, సాటిలేని అల్లాహ్‌ను అన్వేషించుట మాత్రమే మానవుని ఉద్దేశము కావలెను. అన్యారాధన, ఆచారము నుండి దూరముండవలెను. ఆచారాలకు లొంగకూడదు, కోరికల విధేయుడు కాకూడదు. చూడుము! రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దారి తప్ప మానవుడు మరే విధముగను సఫలీకృతుడు కాలేడు.

మన ప్రవక్త ఒక్కడే. పవిత్ర ఖురాన్ ఒక్కటే ఆ ప్రవక్తపై అవతరించెను. దానిని అనుసరించి మనము అల్లాహ్‌ను పొందవచ్చును. నేటి భిక్షకులు మొదలుపెట్టిన పద్ధతులు, పీఠాధిపతులు, వారసత్వ నాయకుల మంత్రములు, దుఆలు, దురూద్, జపములు ఇవన్నియు మానవున్ని సన్మార్గము నుండి దూరము చేయు సాధనాలే. కావున మీరు వాటి నుండి దూరముండుము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తల నాయకుల ముద్రను వీరు విరగ గొట్టదలచిరి. ఒక రకంగా వారు తమ కొరకు మరో శాసనమును చేసుకొనిరి. పవిత్ర ఖురాన్, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును పాటించుట, ప్రార్థన, ఉపవాసము మొ॥ నిర్ణీత పద్ధతులు తప్ప మరేమియును దైవానుగ్రహము, శుభముల ద్వారములను తెరుచుటకు తాళం చెవి లేదు. ఈ మార్గములను వీడి మరో మార్గమును

తీయువాడు మార్గభ్రష్టుడు. అల్లాహ్, అతని ప్రవక్త ప్రవచనమును అనుసరించక ఇతర మార్గముల ద్వారా అతన్ని అన్వేషించువాడు విఫలమై మరణించును.”

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 102, 103 క్రొత్త ఎడీషన్)

మరల వారిట్లనిరి.

“﴿ قُلۡ اِنۡ کُنۡتُمۡ تُحِبُّوۡنَ اللّٰہَ فَاتَّبِعُوۡنِیۡ یُحۡبِبۡکُمُ اللّٰہُ ﴾(ఆలె ఇమ్రాన్:32) ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు నిజమైన విధేయత వహించు పద్ధతి మాత్రమే అల్లాహ్‌ను సంతోషపెట్టు ఏకైక మార్గము. ప్రజలు వివిధ రకాల ఆచారాలలో బంధీలైనట్లు కనిపింతురు. ఎవరైనా మృతి చెందినచో రకరకాల ఆచార వ్యవహారాలు చేయబడును. వాస్తవానికి మృతిచెందిన వాని పట్ల దుఆ చేయవలెను. ఆచారాల నిర్వహణలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను వ్యతిరేకించడమే కాక వారిని అవమానించబడును కూడ. ఈ విధముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనము సరిపోదని భావించబడును. సరిపోవునని బావించబడినచో తమ తరపున ఆచారాలను మొదలుపెట్టే అవసరమేముండును.”

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 306 క్రొత్త ఎడీషన్)

మరల వారిట్లనిరి.

“ఈ కొన్ని రోజుల ప్రపంచము ఏదో విధంగా ముగియును. ఇబ్బందితో లేదా సౌఖ్యముతో నైనా ముగియును. కాని పరలోక సమస్య చాలా కఠినమైన సమస్య. అది శాశ్వత స్థానము. అది ముగియదు. కనుక ఆ స్థానమునకు ఇదే స్థితిలో పోయినచో అనగా అల్లాహ్‌తో లెక్క పరిష్కరించుకొని, దైవభీతి అతని హృదయములో గట్టిపడి, పాపము నుండి

పశ్చాత్తాపపడి అల్లాహ్ సూచించిన ప్రతి పాపము నుండి దూరముండినచో అల్లాహ్ అనుగ్రహము అతనిని రక్షించును. అతనితో అల్లాహ్ రాజీ పడును, అతడు తమ అల్లాహ్‌తో రాజీ పడును. ఇటుల చేయక నిర్లక్ష్యముతో తమ జీవితము గడిపినచో అతని అంతము ప్రమాదకరమైనది. బైఅత్ ఉద్ధేశమేమిటి, దీనితో కలిగే ప్రయోజనమేమిటో బైఅత్ చేయు సందర్భమున నిర్ణయించుకోవలెను. కేవలము ఇహలోకము కొరకే అయినచో నిష్ప్రయోజనమైనది. కాని ధర్మము కొరకు, అల్లాహ్ ప్రీతి కొరకు అయినచో ఇటువంటి శుభకర బైఅత్, తన అసలు ఉద్ధేశము, లక్ష్యము తమ వెంట వుంచుకొనినచో నిజమైన బైఅత్‌తో కలిగే ప్రయోజనములు, లాభములను దానితో పూర్తిగా ఆశించవచ్చును. ”

(మల్ఫూజాత్ సంపుటి 6 పుట 142 క్రొత్త ఎడీషన్)

ఈ కాలపు ఇమామ్ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను హృదయపూర్వకముగా స్వీకరించు అనుగ్రహము అల్లాహ్ మనకు కలిగించుగాక! ఎంత చింతన, శ్రద్ధతో అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రభుత్వమును ప్రపంచములో స్థాపించుటకు తమ సంస్థను వారు సిద్ధము చేయదలచిరో, ఎంత చింతనతో ఉపదేశము చేసిరో అల్లాహ్ మనల్ని అటులనే చేయుగాక! ఏ నిబంధనలతో వారు మనతో బైఅత్ ప్రతిజ్ఞ చేయించిరో వాటిని పూర్తిగా పాటించు వారమగుగాక! వాటిని అమలు చేయువారమగుగాక! సదా వాటిని మన దృష్టి యందుంచుకొను వారమగుగాక! మన ఏ కర్మ, కార్యము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధనకు విరుద్ధముగా సంభవించి నిందించునది కాకూడదు. ఎల్లప్పుడు మనము మన ఆత్మ పరీశిలన చేసుకొను

వారమగుగాక! అల్లాహ్ మనకు సహకరించుగాక! నేడు దుఆ తర్వాత అల్లాహ్ అనుగ్రహానుసారము ఈ సభ ముగియును. ఈ సభ శుభములు, అనుగ్రహములతో మీరు ఈ సంవత్సరమే కాక జీవితాంతం లబ్ది పొందువారగుగాక! అల్లాహ్ మన సంతానములో కూడ అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, ఖిలాఫత్‌తో ప్రేమపూర్వక సంబంధమును కొనసాగించు గాక! అల్లాహ్ మన గత బలహీనతలను, పాపములను కప్పిపుచ్చుచు మనందరిని క్షమించుగాక! తన ప్రియుల సంస్థలో తన దయతో మాత్రమే మనల్ని చేర్చుగాక! ఓ అల్లాహ్! నీవు క్షమించువాడవు, కరుణామయుడవు. మా పాపములను క్షమించుము. మమ్ము కరుణించుము. తన క్షమాపణ, కరుణగల దుప్పటితో రక్షించుము. తనతో మమ్ములను ఎప్పుడు విడదీయకుము."

آمِین یَا رَبَّ الْعَالَمِیْنَ

(వార్షిక సభ జర్మనీ సందర్భమున ముగింపు ఉపన్యాసము – దివి: 24 ఆగస్టు 2003)

# ఏడవ బైఅత్ నిబంధన

**అహంకారము, గర్వమును పూర్తిగా వీడి,**

**వినయ విధేయత, సత్ప్రవర్తన, సహనము**

**దీనత్వమునవలంభించి జీవించును.**

## అన్యారాధన తర్వాత గర్వము లాంటి మరో ఆపద లేదు

గర్వము ప్రదర్శించిన అనంతరం షైతాన్ ఆరంభము నుండే ఇట్లు నిర్ణయించుకొని యుండెను. నేను సర్వ శక్తులనుపయోగించి అపార దయామయుని దాసులుగా కానివ్వను. వివిధ పద్ధతులతో మానవున్ని నా వలలో బంధించెదను. అతనితో పుణ్యములు సంభవించినను తన స్వభావము ప్రకారము వాటిపై గర్వపడేలా చేయుదును. ఈ అహంకారము, గర్వము క్రమ క్రమంగా మానవున్ని గర్వము వైపు తీసుకెళ్ళును. తుదకు ఈ గర్వము అతన్ని ఈ పుణ్యము నుండి ప్రయోజనము కలుగకుండా చేయును. మానవున్ని సన్మార్గము నుండి దూరము చేయుదునని మొదటి

రోజు నుండే షైతాన్ నిర్ణయించుకొనెను. అతడు కూడ స్వయముగా గర్వము వల్లనే అల్లాహ్ ఆజ్ఞను నిరాకరించి యుండెను. అందుకే ఈ ఆయుధమునే షైతాన్ వివిధ రకాలుగా మానవునిపై ఉపయోగించుచుండును. అపారదయామయుని దాసులు అనగా అల్లాహ్ ప్రత్యేక దాసులు, ఆరాధకులు మాత్రమే ఈ దాడి నుండి తప్పించుకొందురు. సాధారణముగా గర్వము అను ఆయుధముతోనే షైతాన్ మానవున్ని తన అధీనములో చేసుకొనుటలో సఫలమగును. దీనిని సామాన్య విషయముగా భావించకూడదు. మేము బైఅత్ చేసినప్పుడు గర్వపడము, అహంకారము ప్రదర్శించము, దానిని పూర్తిగా వీడెదమను నిబంధనను అంగీకరించితిమి. ఇది ఇంత సులభమైన విషయము కాదు. ఇది వివిధ రకాలలో గలదు. వివిధ మార్గాలలో షైతాన్ మానవునిపై దాడి చేయుచుండును. చాలా భయపడవలసిన స్థానము. వాస్తవానికి అల్లాహ్ అనుగ్రహించితేనే దీనితో దూరముండ వచ్చును. అందుకే అల్లాహ్ అనుగ్రహములను పొందుటకు కూడ ఒక మార్గమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ ఏడవ నిబంధనలో చూపిరి. ఇట్లనిరి. మీరు గర్వపడు అలవాటును వీడినప్పుడు ఖాళీ ఏర్పడగా దానిని నిరాడంబరత, వినయముతో పూరించుము. లేనిచో గర్వము మరల దాడి చేయును. కనుక నిరాడంబరతను అవలంభించుము. ఈ మార్గమే అల్లాహ్‌కు ఇష్టమైనది. వారు స్వయాన ఈ వినయ విధేయతను సాటిలేని అత్యుత్తమ స్థాయికి చేర్చిరి. అందుకే అల్లాహ్ సంతోషపడి దైవవాణి ద్వారా ఇట్లు నుడివెను. "నీ వినయ మార్గములను అతడు ఇష్టపడెను". వారి బైఅత్ దావాదారులైన మనము వారిని వర్తమాన ఇమామ్‌గా నమ్మెదము, ఎంత వరకు ఈ

ప్రవర్తనను అవలంభించవలెను. వాస్తవానికి గర్వమును ప్రదర్శించుచు, అహంభావముతో నడుచుటకు మానవుని స్థాయి ఏమియును లేదు. అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

﴿وَلَا تَمْشِ فِي الْاَرْضِ مَرَحًا. اِنَّكَ لَنْ تَخْرِقَ الْاَرْضَ وَلَنْ تَبْلُغَ الْجِبَالَ طُوْلًا﴾

(బనీ ఇస్రాయీల్:38) అనగా భూమిపై గర్వముతో నడవకుము. నిశ్చయముగా నీవు భూమిని చీల్చలేవు. ఎత్తులో పర్వతముల ఎత్తు వరకు చేరలేవు.

మానవుని శక్తి శూన్యమని ఈ సూక్తితో స్పష్టమగుచున్నది. ఎందుకు గర్వపడవలెను. కొందరు తమను తాము అధికారములో వున్న రాజులుగా భావింతురు. తమ పరిధిని దాటుటకు ఇష్టపడరు. తమ పరిధిలో కూర్చొని మేము చాలా గొప్పవారమని భావించుచుందురు. ఇందుకు నేను ఇప్పుడొక అతి చిన్న ఉదాహరణను తెలిపెదను. అనగా అది ఒక కుటుంబ సమాజపు పరిధి గలదు. మీ కుటుంబ వాతావరణము గలదు. పలు పురుషులు తమ భార్యా, పిల్లలతో ఎంత క్రూరంగా ప్రవర్తింతురనగా ప్రాణము తల్లడిల్లిపోవును. పలు అమ్మాయిలు ఇట్లు వ్రాయుదురు. మేము బాల్యము నుండి యవ్వన వయసుకు చేరుకున్నాము. ఇప్పుడు మేమింకా భరించలేము. మా తండ్రి మా తల్లితో, మాతో ఎల్లప్పుడు క్రూర ప్రవర్తన కొనసాగించును. తండ్రి ఇంట్లో ప్రవేశించగానే మేము భయముతో తమ గదులలోకి వెళ్ళిపోవుదుము. తండ్రి స్వభావమునకు వ్యతిరేకమైన విషయమేదైనా మా తల్లి గాని మేము గాని మాట్లాడినచో అందరు అనుభవించ వలసినదే. గర్వమే ఇటువంటి తండ్రులను క్రూరములో ఇంత అధిక స్థాయికి చేర్చెను. ఇటువంటి వారిలో అధికులు సమాజములో తమ వ్యవహారమును చాలా

మంచిగా ప్రదర్శింతురు. వీరి కంటే మంచి వ్యక్తి మరొకడు లేడని బయటి వారు భావించుచుందురు. బయటి సాక్ష్యము వారి పక్షమున వుండును. కుటుంబములోను బయట కూడ సమానమైన వ్యవహారమును అవలంభించు వారు కూడ కొందరుందురు. వీరిది అంతా బహిర్గతమగును. ఇటువంటి దుష్ట గుణము, గర్విత వ్యక్తుల పిల్లలు, ప్రత్యేకంగా కుమారులు యవ్వనమునకు చేరినప్పుడు ఈ హింసకు ప్రతిస్పందనగా అనగా ఆ పిల్లల తల్లి లేదా సోదరీమణుల లేదా స్వయముగా వారితో తండ్రి వ్యవహరించినందున తమ తండ్రులకు ఎదురుగా నిలబడుదురు. తుదకు తండ్రి తన బలహీన వయసుకు చేరినప్పుడు అతనితో ప్రత్యేకంగా ప్రతీకారము తీర్చుకొందురు. ఈ విధమైన గర్వ స్వభావము గల యజమానుల అధికార పరిధిలో ఉదాహరణలు లభించు చుండును. సమాజములో వివిధ పరిధులు గలవు. ఒకటి కుటుంబ పరిధి, మరొకటి బయటి పరిధి. తమ తమ పరిధిలో మీరు పరిశీలించినచో గర్వము గూర్చి ఉదాహరణలు లభించుచు పోవును.

దీని ఘోరమైన దశ ఏ పరిధిలో కనిపించుననగా పలు జాతులు, దేశములు, ప్రభుత్వాలు తమ గర్వము వలన ప్రతి ఒక్కరిని తమ కంటే హీనముగా భావించుచుండును. పేద జాతులను, పేద దేశములను తమ పాదాలతో అణగదొక్కుదురు. నేడు ప్రపంచములో పీడనమునకు ఒక పెద్ద కారణమిదే. ఈ గర్వము అంతమైనచో ప్రపంచములో పీడనము కూడ అంతమైపోవును. గర్వపడువారి గర్వమును అల్లాహ్ నాశనము చేయదలచినప్పుడు వారెక్కడికి పోయినారో కూడ తెలియదని ఆ గర్విత జాతులకు, ప్రభుత్వాలకు తెలియదు.

అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

﴿وَلَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ وَلَا تَمْشِ فِي الْاَرْضِ مَرَحًا ۔ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُوْرٍ﴾

(లుఖ్మాన్: 19)

అనగా మానవుల కొరకు తమ చెంపలను గర్వముతో ఉబ్బించకుము. భూమిపై గర్వమును ప్రదర్శించుచు తిరుగకుము. అల్లాహ్ గర్వపడు వానిని ఇష్టపడడు.

ఈ సూక్తితో కూడ స్పష్టమగుచున్నదేమనగా తమ చెంపలను ఉబ్బించుకొని, గర్వ పడుచు తిరుగకుమని అల్లాహ్ మనకు ఆదేశమిచ్చు చున్నాడు. గర్వపడు వారి ఒక విశిష్ట హావభావముండును. మెడను పైకి లేపి విర్రవీగుచు నడుచుటను అల్లాహ్ ఇష్ట పడడు. తమ కంటే క్రింది వారి ముందు గర్వమును ప్రదర్శించు అలవాటు కొందరిలో వుండును. తమ కంటే గొప్ప వారి ముందు అతి వినయము ప్రదర్శింతురు. ఇటువంటి వారిలో దాంబికము కూడ ప్రతిబింబించును. సంక్షిప్తమేమనగా ఈ గర్వము అనేక దుష్టత్వములకు కారణమగును. పుణ్యములో ప్రగతి మార్గములు క్రమ క్రమంగా మూసుకు పోవును. తద్వారా ధర్మము నుండి కూడ దూరమగుదురు. సంస్థ వ్యవస్థ నుండి కూడ దూరమగుదురు. వీరి అహంకారము పెరిగిన కొద్ది అల్లాహ్, అతని ప్రవక్త, అతని అనుగ్రహముల నుండి దూరమగుచు పోవుదురు.

ఒక హదీసులో ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించినట్లు హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు తెలిపిరి.

మీలో అందరి కంటే ఎక్కువ సద్గుణములు గల వారే ప్రళయ దినమున నాకు అందరికంటే అధిక ఇష్టమైనవారిగా, అందరి కంటే నాకు సమీపముగా నుందురు. **ثَرثَار** అనగా అదుపు లేకుండా మాట్లాడువారు, అధిక ప్రసంగీకులు, **مُتَشَدِّقْ** అనగా నోటిని ఉబ్బించుచు మాట్లాడు వారు, **مُتَفَيْهِقْ** అనగా ప్రజలపై గర్వమును ప్రదర్శించువారు, మీలో అందరి కంటే ఎక్కువ నాకు కోపము కల్గింతురు, అందరి కంటే ఎక్కువ నాకు దూరముందురు. అనుచరులు ఇట్లు విన్నవించిరి. ఓ అల్లాహ్ ప్రవక్తా! **ثَرثَار**, **مُتَشَدِّقْ** అర్థము మాకు తెలుసు. కాని **مُتَفَيْهِقْ** అనగా నేమి? వారిట్లనిరి. **مُتَفَيْهِقْ** అనగా గర్వపూరిత మాటలను మాట్లాడు వారిని అందురు.

(తిర్మిజి అబ్వాబుల్ బిర్ర్ వస్సిలహ్ ఫీ మువాలియల్ అఖ్లాక్)

మరో హదీసు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించినట్లు హజ్రత్ ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్హు తెలిపిరి. మూడు విషయములు ప్రతి పాపమునకు మూలము. వాటితో దూరముండవలెను. గర్వముతో దూరముండుము. ఎందుకనగా ఆదమ్‌నకు సాష్టాంగము చేయకుమని షైతాన్‌ను గర్వమే ప్రేరేపించెను. రెండవది అత్యాశతో దూరముండుము. ఎందుకనగా వృక్షమును భుజించుటకు ఆదమ్‌ను అత్యాశ ప్రేరేపించెను. మూడవది ఈర్ష్యతో దూరముండుము. ఎందుకనగా ఈర్ష్య వల్లనే ఆదమ్ ఇద్దరు కుమారులలో ఒకడు తన సోదరున్ని హత్య చేసియుండెను."

(ఖుషీరియ బాబుల్ హసద్ పుట 79)

మరో హదీసు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించినట్లు హజ్రత్ ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్హు తెలిపిరి. ఎవరి హృదయములో ఇసుమంత గర్వమున్నను అతన్ని అల్లాహ్ స్వర్గములో ప్రవేశించనివ్వడు. ఒక వ్యక్తి ఇట్లు వేడుకొనెను. ఓ అల్లాహ్ ప్రవక్తా! తన దుస్తులు మంచిగుండవలెనని, పాదరక్షలు మంచిగా, అందముగా వుండవలెనని ఒకడు ఇష్టపడును. వారిట్లనిరి. ఇది గర్వము కాదు. వారిట్లనిరి. అల్లాహ్ అందముగానున్నాడు. అందమును అతడు ఇష్టపడును. మానవుడు హక్కును నిరాకరించుట, ప్రజలను హీనముగా భావించుట, వారిని అవహేళనగా చూచుట, వారితో దురుసుగా ప్రవర్తించుట గర్వమనబడును.

(సహీ ముస్లిం కితాబుల్ ఈమాన్ బాబ్ తహ్రీముల్ కిబ్రి వబయానిహి)

మరల హదీసు గలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు తెలిపిరి. నరకము, స్వర్గము మధ్య చర్చ జరిగినది. నరకము ఇట్లనెను. నాలో పెద్ద పెద్ద క్రూరులు, గర్వితులు ప్రవేశింతురు. స్వర్గము ఇట్లనెను. నాలో బలహీనులు, నిరుపేదలు ప్రవేశింతురు. అప్పుడు అల్లాహ్ నరకముతో ఇట్లనెను. నీవు నా శిక్షకు ప్రతి రూపం. నేను కోరిన వానిని నీ ద్వారా శిక్షింతును. స్వర్గముతో ఇట్లనెను. నీవు నా కరుణకు ప్రతిరూపం. నేను కోరిన వానిని నీ ద్వారా కరుణింతును. మీ ఇద్దరిలో ప్రతి ఒక్కరికి తమ సంపూర్ణ భాగము లభించును.

(సహీ ముస్లిం కితాబుల్ జన్నతి వసిఫతు నిమహా వ అహ్లాహా)

ప్రతి అహ్మదీ నిరాడంబరత, వినమ్రత, సత్‌ప్రవర్తన మార్గములపై

నడుచుచు అల్లాహ్ కరుణామయ చూపును పొందువానిగా అల్లాహ్ చేయు గాక! అల్లాహ్ స్వర్గములో ప్రవేశించువాడగు గాక! ప్రతి కుటుంబము గర్వమను పాపముతో పవిత్రమగుగాక! (ఆమీన్)

మరో హదీసులో ఇట్లు వచ్చెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్ అబూసయీద్ ఖుద్రి, హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హుమా తెలిపిరి. గౌరవము అల్లాహ్ వస్త్రము, గొప్పతనము అతని దుప్పటి. అల్లాహ్ ఇట్లనును. నాతో వీటిని గుంజుకొనుటకు ప్రయత్నించిన వానిని నేను శిక్షింతును."

(సహీ ముస్లిం కితాబుల్‌బిర్ర్ వస్సిలహ్)

## గర్వితుడు స్వర్గములో ఎన్నటికి ప్రవేశించడు

గర్వము మానవున్ని అంతిమముగా అల్లాహ్‌కు పోటీగా నిలబెట్టును. అల్లాహ్‌కు భాగస్వామి చేయువాడిని క్షమించనని అల్లాహ్ చెప్పినప్పుడు తనను దైవముగా ప్రకటించుకొనిన వాడిని ఎట్లు క్షమించగలడు. వివిధ కాలములలో ఫిర్‌ఔన్ వంటి లక్షణములు గల వ్యక్తులను ఈ గర్వమే పుట్టించినది. ఇటువంటి ఫిర్‌ఔన్ల అంతమును మీరు చదివితిరి కూడ, ఈ కాలములో చూచితిరి కూడ. ఇది భయపడవలసిన స్థానము. ప్రతి అహ్మదీయుడు గర్వపు చిన్న స్థాయి నుండి కూడ దూరముండవలెను. ఎందుకనగా ఇది వ్యాపించుచు మానవున్ని పూర్తిగా తన వశములో చేసుకొనును. అల్లాహ్ మనలను ఇట్లు హెచ్చరించెను. ఇది నా దుప్పటి అని స్పష్టము చేసెను. నేను సకల లోకాల సంరక్షకుడను. గొప్పతనము నాది. దానిని అంగీకరించుము.

వినయ విధేయత ప్రదర్శించుము. ఈ హద్దులను దాటుటకు ప్రయత్నించినచో శిక్షకు గురిచేయబడుదురు. ఆవ గింజంత గర్వమున్నను మీకు శిక్ష తప్పదు. వెంటనే ఈ శుభవార్త కూడ ఇచ్చెను. కొంచమైనా మీలో విశ్వాసమున్నచో నేను మిమ్ములను అగ్ని శిక్ష నుండి రక్షింతును.

ఒక హదీసులో ఇట్లు గలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్ అబ్దుల్లాహ్ రజియల్లాహు అన్హు తెలిపిరి. ఆవ గింజంత గర్వము ఎవరి హృదయములో వుండునో అతడు స్వర్గములో ప్రవేశించడు. ఆవ గింజంత విశ్వాసము ఎవరి హృదయములో వుండునో అతడు నరకములో ప్రవేశించడు.

(సునన్ ఇబ్నె మాజ కితాబుల్ ముఖద్దమహ్)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. “ప్రళయ దినమున అన్యారాధన తర్వాత గర్వము వంటి మరో ఆపద లేదు. ఈ ఆపద ఎటువంటిదనగా ఇరు లోకాలలో మానవున్ని అవమానపరచును. అల్లాహ్ కరుణ ప్రతి ఏకదైవారాధకున్ని కరుణించును కాని గర్వితున్ని కాదు. షైతాన్ కూడ ఏకదైవారాధకుడిని అని ప్రకటించుకొనెను. కాని దాని తలలో గర్వము వున్నందున, అల్లాహ్ దృష్టిలో ఇష్టమైనవాడైన ఆదమ్‌ను అతడు అవహేళనగా చూచి, అతన్ని విమర్శించెను. అందుకే అతడు నాశనమయ్యెను. శాపభారము అతని మెడలో వేయబడెను. కావున ఒక వ్యక్తి శాశ్వతముగా నాశనమైన ప్రప్రథమ పాపము గర్వమే అయి వుండెను.”

(ఆయినా కమాలాతె ఇస్లాం – రూహాని ఖజాయిన్ సంపుటి 5 పుట 598)

మరల ఇట్లనిరి. "మీలో ఏ కోణములోనైనా అహంకారము, దర్శన, స్వాభిమానము లేదా అలసత్వమున్నచో మీరు ఆమోదించదగిన వస్తువు కాదు. పలు విషయములను మాత్రమే తీసుకొని వేము చేయవలసినదంతయు చేసినామని తమను తాము మోసము చేసుకొను వారు కాకుము సుమా. మీ ఉనికిపై సంపూర్ణ విప్లవము రావలెనని అల్లాహ్ కోరెను. అతడు మీతో ఒక మరణమును కోరుచున్నాడు. అనంతరం మిమ్ములను జీవింపజేయును."

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 12)

## గర్వము, షైతాన్‌కు మధ్య గట్టి సంబంధము గలదు

మరల ఇట్లనిరి. "సందేశహరుల (అలైహిముస్సలాం) స్థాయి కంటే కోట్ల భాగములు దిగువ వున్నను రెండు రోజులు ప్రార్థన చేసి గర్వపడు వారు కూడ కొందరుందురు. ఇదే విధముగా ఉపవాసము, హజ్‌తో పవిత్రతకు బదులు వారిలో గర్వము, అహంకారము కలుగును. గర్వము షైతాన్ నుండి పుట్టెను, షైతాన్‌గా చేయునని గుర్తుంచుకొనుము. మానవుడు దీనితో దూరము కానంత వరకు సత్యామోదము, దైవ అనుగ్రహములను పొందు మార్గములో అవరోధము కలిగించును. విద్యా పరంగా, ఆస్తి పరంగా, గొప్పతనము పరంగా, ఉనికి పరంగా, కుటుంబ పరంగా, వంశ పరంగా అనగా ఏ విధముగను గర్వపడకూడదు. ఎందుకనగా అధికముగా ఈ విషయముల వల్లనే గర్వము కలుగును. మానవుడు ఈ గర్వముల నుండి తనను తాను రక్షించుకొననిదే అల్లాహ్ దృష్టిలో సత్పురుషుడు కాలేడు. కోరికల మలిన వస్తువును ఆహుతి చేయగల జ్ఞానము అతనికి లభించదు. ఎందుకనగా ఇది షైతాన్ భాగము. అల్లాహ్ దీనిని

ఇష్టపడడు.....”

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనుచున్నారు. పలు ప్రాథమిక విషయములు గలవు. వీటి వైపు కూడ శ్రద్ధ వహించవలెను. వీటి నుండి దూరముండుము. కొందరు మూడు నాలుగు రోజులు ప్రార్థన చేసి మేము పెద్ద పుణ్యులమైనామని భావింతురు. ముఖముపై విచిత్రమైన గంభీరతతో పాటు అహంకారము కూడ ప్రతిభింబించును. కొందరు పొడుగాటి అంగీలు ధరించి తస్బీహ్ చేతులలో తీసుకొని మస్జిదుల నుండి బయటకు వచ్చుచున్నట్లు మీరు కూడ చూసివుందురు. వారి మెడపైనే అహంకారము, గర్వము దర్శనమిచ్చు చుండును. కృతజ్ఞతలు. అహ్మదియ్య సంస్థ ఇటువంటి పక్కీరులతో పవిత్రముగా నున్నందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు. హజ్ చేసి వచ్చిన తర్వాత దానిని అంతులేని విధముగా ప్రచారము చేసు కొందురు. ఇటువంటి వారి ఉపవాసాలు చూపించుటకే వుండును. హజ్ చూపించుటకే వుండును. ఫలానా వ్యక్తి గొప్ప పుణ్యుడు, చాలా ఉపవాసాలుండును, హజ్ చేసెను, ఎంతో సత్కార్యుడని ప్రజలు అనవలెనని గొప్పతనము చూపించుటకు ఇదంతా చేయుదురు. ఈ ప్రదర్శనలన్ని గర్వము వలన కలుగును. ప్రదర్శన వలన గర్వము పుట్టును. మరల వారిట్లనిరి. కొందరు మా వంశము చాలా గొప్పదని తమ వంశము వలన గర్వపడుదురు. ఫలానా వ్యక్తి నీచ వంశమునకు చెందిన వాడు. అతడెట్లు మాకు పోటీగా నిలుచును. అందుకే హజ్రత్ అఖ్దస్ ఇట్లనిరి. గర్వము అనేక రకాలు గలదు. అవి మిమ్ములను క్రమంగా దైవ జ్ఞానము నుండి దూరము తీసుకెళ్ళును. అతని సామీప్యము నుండి దూరము తీసుకెళ్ళును. ఈ విధముగా క్రమ క్రమంగా మానవుడు షైతాన్ వడిలో

పడిపోవును.”

మరల వారిట్లనిరి. “నా దృష్టిలో పవిత్రుడగుటకు ఇదొక ఉత్తమ పద్ధతి. దీనిని మించి మరో ఉత్తమ పద్ధతి లభించుట అసాధ్యము. అనగా మానవుడు విద్యా, వంశము, ఆర్థిక పరంగాను కూడ ఎటువంటి గర్వము, అహంకారమునకు పాల్పడకూడదు. ఎవరికైనా అల్లాహ్ నేత్రము ప్రసాదించినప్పుడు అంధకారముల నుండి విముక్తి కల్పించే ప్రతి కాంతి ఆకాశము నుండే వచ్చునని, మానవునికి అనుక్షణం ఆకాశ కాంతి అవసరమని అతడు చూచును. ఆకాశము నుండి వచ్చే సూర్య కాంతి లేనిదే నేత్రము చూడలేదు. ఇదే విధముగా అన్ని రకాల అంధకారమును దూరము చేసి దానికి బదులు దైవభీతి, పవిత్రతను పుట్టించు అంతర్గత కాంతి కూడ ఆకాశము నుండే వచ్చును. నేను నిజముగా చెప్పుచున్నాను. మానవుని దైవభీతి, విశ్వాసము, ప్రార్థన అన్నియు ఆకాశము నుండే వచ్చును. ఇది దైవానుగ్రహముపై ఆధారపడి యున్నది. అతడు కోరినచో స్థిరపరచును, లేనిచో దూరము చేయును.

కావున నిజమైన జ్ఞానమేమనగా మానవుడు తన ఆత్మను బలహీనము, శూన్యముగా భావించవలెను. దైవ సన్నిధిలో పడి నిరాడంబరత, వినమ్రతతో అల్లాహ్ అనుగ్రహమును కోరవలెను. మానసిక కోరికలను ఆహుతి చేసి, లోపల పుణ్యముల కొరకు ఒక శక్తికి, వేడిని కలిగించే కాంతిని యాచించవలెను. తర్వాత అతని దయతో అతనికి భాగము లభించినచో భాగము పొంది ఏదేని సమయములో విశాలత, విస్పష్టత కలిగినచో అందుకు గర్వపడకూడదు, అహంభావమును చూపక మరింత నిరాడంబరత, వినమ్రతలో అభివృద్ధి చెందవలెను. ఎంత వరకు

తనను శూన్యముగా భావించునంత వరకు దైవ స్థితులు, కాంతులు అవతరించును. అవి అతనికి కాంతి, శక్తిని కలిగించును. మానవుడు ఈ అభిప్రాయము కలిగి వున్నచో అల్లాహ్ కృపానుసారము అతని ప్రవర్తన స్థితి ఉత్తమమగునని ఆశించవచ్చును. ప్రపంచములో తమను తాము ఏదైనా భావించుట కూడ గర్వమే. ఇదే స్థితి అగును. తర్వాత మానవుని స్థితి ఎట్లగుననగా సాటి వానిని శాపించును, అతన్ని హీనునిగా భావించును.”

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 212, 213 క్రొత్త ఎడీషన్)

మరల వారిట్లనిరి. “గర్వము తీవ్రమైన వ్యాధి. ఏ మానవునిలో ఇది పుట్టునో అతనికి ఆధ్యాత్మిక మరణమే. ఈ వ్యాధి హత్య కంటే తీవ్రమైనదని నేను నిశ్చయముగా ఎరుగుదును. గర్వితుడు షైతాన్ సోదరుడగును. అందుకే గర్వమే షైతాన్‌ను అవమానకర, నీచునిగా చేసెను. అందుకే విశ్వాసునికి గల నియమమేనగా అతనిలో గర్వముండకూడదు, వినయ విధేయత, నిరాడంబరత వుండవలెను. దైవ నియమితుల విశిష్టత ఇది. వారిలో అత్యుత్తమ స్థాయి గల వినయ విధేయత వుండును. అందరిని మించి ఈ లక్షణము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంలో యుండెను. నీతో వారి వ్యవహారమెట్లుండెనని వారి ఒక సేవకున్ని అడగబడెను. అతడిట్లనెను. సత్యమేమనగా నా కంటే ఎక్కువ వారు నా సేవ చేసేవారు. (اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّ عَلٰى اٰلِ مُحَمَّدٍ وَ بَارِكْ وَسَلِّمْ).”

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 437, 438 క్రొత్త ఎడీషన్)

## గర్వము దైవ దృష్టిలో అతి హేయమైనది

మరల వారిట్లనిరి. “గర్వము నుండి దూరముండవలెనని నేను నా సంస్థను ఉపదేశించు చున్నాను. ఎందుకనగా గర్వము మన

వైభవోపేతుడైన అల్లాహ్ దృష్టిలో అతి హేయమైనది. కాని గర్వమనగా ఏమిటో బహుశా మీరు అర్థము చేసుకోలేరు. కనుక నేను తెలిపెదను. ఎందుకనగా నేను దైవాత్మతో పలికెదను.

తన సోదరున్ని అతని కంటే తాను ఎక్కువ విద్యావంతుడని, వివేకవంతుడని, వృత్తిగలవాడని హీనముగా భావించువాడు గర్వితుడు. ఎందుకనగా అతడు అల్లాహ్‌ను వివేకము, విద్యకు మూలమని భావించక తనను ఏదో భావించుచున్నాడు. అతన్ని పిచ్చివానిగా చేసి తన కంటే తక్కువగా భావించిన ఆ సోదరునికి గొప్ప వివేకము, విద్య, వృత్తి ప్రసాదించుటకు అల్లాహ్ శక్తివంతుడు కాదా? తన ధనము, గొప్పతనమును ఊహించుకొని తన సోదరున్ని హీనముగా భావించువాడు కూడ గర్వితుడే. ఎందుకనగా ఈ గొప్పతనము అల్లాహ్‌యే అతనికిచ్చినాడని అతడు మరచిపోయెను. ఆ శక్తివంతుడైన అల్లాహ్ అతనిపై ఏదేని ఆపద వేసినచో అతడు అందరి కంటే క్రింద పడునని తన కంటే హీనముగా భావించిన ఆ సోదరునికి అతని కంటే అధిక ధనము, ఆస్తి ప్రసాదించునని అంధుడైన అతనికి తెలియదు! ఇటులనే తన శారీరక ఆరోగ్యముపై గర్వపడు లేదా తన అందచందాలు, శక్తి యుక్తులపై గర్వపడుచు తన సోదరున్ని అవహేళన, అవమానకర నామముతో పిలుచుచు అతని శారీరక లోపాలను ప్రజలకు వివరించుచు తిరుగువాడు కూడ గర్వితుడే. అతనిపై ఒక్కసారిగా శారీరక లోపాలను అవతరింపజేసి ఆ సోదరుని కంటే హీనముగా చేయగల, అవమానించబడిన వాని శరీరములో ఒక సుదీర్ఘ కాలము వరకు తరగని, అంతము కాని శుభము కలిగించగల దైవమును అతడెరుగడు. తన శక్తులను నమ్ముకొని దుఆ చేయుటలో అలసత్వము వహించువాడు కూడ గర్వితుడే.

ఎందుకనగా శక్తుల, యుక్తుల చెలిమను అతడు గుర్తించక తనను తాను ఏదో భావించుకొనెను. కావున ఓ చిరంజీవులారా! మీరు ఈ విషయములను గుర్తుంచుకొనుము. మీకు తెలియకుండానే ఏదో ఒక కోణములో కూడ మీరు గర్వితులుగా అల్లాహ్ దృష్టిలో పరిగణింపబడ వచ్చును సుమా! తన సోదరుని తప్పుడు పదమును గర్వముతో సరిచేసిన వాడు కూడ గర్వము నుండి భాగము పంచుకొనెను. తన సోదరుని మాటను శ్రద్ధతో వినదలచక ముఖము త్రిప్పుకొనిన వాడు కూడ గర్వము నుండి భాగము పంచుకొనెను. ఒక పేద సోదరుడు అతని ప్రక్కన కూర్చున్నచో ద్వేషించుకొను వాడు కూడ గర్వము నుండి భాగము పంచుకొనెను. దుఆ చేయువానిని అవహేళన, హాస్యముగా చూచువాడు కూడ గర్వము నుండి భాగము పంచుకొనెను. దైవ ప్రవక్త, సందేశహరుని విధేయత పూర్తిగా చేయదలచని వాడు కూడ గర్వము నుండి భాగము పంచుకొనెను. అల్లాహ్ ప్రవక్త, అవతారుని మాటలను శ్రద్ధతో వినని, అతని వ్రాతలను శ్రద్ధతో చదవని వాడు కూడ గర్వము నుండి భాగము పంచుకొనెను. మీరు నాశనము కాకుండా వుండుటకు, తమ కుటుంబ సమేతముగా విముక్తి పొందుటకు గర్వములోని ఏ భాగము మీలో వుండకుండా మీరు కృషి చేయుము. అల్లాహ్ వైపు దృష్టి సారించుము. ప్రపంచములో ఎవరినైనా ఎంత ప్రేమించగలరో అంత అల్లాహ్‌ను ప్రేమించుము. ప్రపంచములో ఎంత మానవునితో భయపడగలరో అంత అల్లాహ్‌తో భయపడుము. మీరు కనికరించబడుటకు పవిత్ర హృదయము, పవిత్ర సంకల్పము గల, బీద, నిరుపేద, హానిరహితముగా అగుము."

(నుజూలుల్ మసీహ్–రూహాని ఖజాయిన్ సంపుటి 18 పుట 402, 403)

మరల ఈ నిబంధనలో ప్రస్తావించబడిన రెండవ విషయమేమనగా వినయ విధేయత, సత్ప్రవర్తన, సహనము, ధీనత్వమునవలంభించి జీవింతును. ఇంతకు ముందే నేను చెప్పినట్లు మీరు మీ హృదయము, మెదడును గర్వముతో ఖాళీ చేయుటకు ప్రయత్నించినప్పుడు, ఖాళీ చేసినప్పుడు తప్పక ఒక గొప్ప గుణము, ఒక ఉత్తమ లక్షణము, ఒక ఉత్తమ ప్రవర్తన తమలో కల్గించుకోవలెను. లేనిచో మరల షైతాన్ దాడి చేయును. ఎందుకనగా మిమ్ములను వెంటాడుటకే అతడు సమాయత్తమై కూర్చొని వున్నాడు. నిరాడంబరత, వినమ్రతే ఆ సద్గుణము. వినమ్రుడు, గర్వితుడు ఒకే చోట వుండే ప్రసక్తే లేదు. గర్వితులు ఎల్లప్పుడు ఇటువంటి వినమ్రులు అనగా అపారదయామయుని దాసులను నిందించుచు మాట్లాడుచుందురు. ఇలాంటి వారి పట్ల మీరు వారి వలె వైఖరి అవలంభించక అల్లాహ్ ఈ ఆజ్ఞను పాటించవలెను.

﴿وَعِبَادُ الرَّحْمٰنِ الَّذِيْنَ يَمْشُوْنَ عَلَى الْاَرْضِ هَوْنًا وَّاِذَا خَاطَبَهُمُ الْجَاهِلُوْنَ قَالُوْا سَلٰمًا﴾

(అల్‌ఫుర్ఖాన్:63) అనగా భూమిపై వినయ విధేయతతో నడుచువారే దయామయుని దాసులు. మూర్ఖులు వారిని సంబోధించు నప్పుడు సమాధానముగా శాంతి కలుగుగాక! అని అందురు.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రి రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ కొరకు ఒక వంతు ఆదర సత్కారము విధేయత వహించినచో అల్లాహ్ అతని ఒక స్థాయిని పెంచును. తుదకు అతనికి అందరి కంటే ఉన్నత

స్థాయి గలవారిలో చోటు కల్పించును. అల్లాహ్‌కెదురుగా ఒక స్థాయి గర్వపడిన వ్యక్తిని అల్లాహ్ ఒక స్థాయి క్రింద పడవేయును. తుదకు అతన్ని అందరి కంటే అధమ స్థాయిలో పడవేయును.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, బాఖీ ముస్నదుల్ ముకస్సిరీన్ మినస్సహాబతి)

సలాం తెలిపి ఇటువంటి వారి సమావేశముల నుండి లేచిపోవుటయే మీ స్థిరత్వమునకు, మీకు ఉత్తమము. ఎందుకనగా దీనితోనే మీ అంతస్థులు పెరుగు చున్నవి. వ్యతిరేకులు తమ ఈ విషయముల వల్లనే అందరి కంటే క్రింది వారిలో పడిపోవు చున్నారు.

మరల హదీసులో ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. దానమిచ్చినచో ధనము తరగదు. అల్లాహ్ దాసుడు ఒకనిని ఎంత క్షమించునో అంతే ఎక్కువ అల్లాహ్ అతని గౌరవమును హెచ్చించును. ఒకడు ఎంత ఎక్కువ ఆదర సత్కారము, విధేయత వహించునో అల్లాహ్ అంత ఎక్కువ అతనికి గొప్ప స్థాయిని ప్రసాదించును.

(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్ ఇస్తిహ్‌బాబుల్ అఫ్‌వి వత్తవాజిఇ)

అయాజ్ బిన్ హమ్మార్ బిన్ ముజాషి సోదరుని కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మా మధ్య నిలిచి సంబోధించుచు ఇట్లనిరి. మీలో ఒకరు మరొకరిపై గర్వపడకుండా, ఒకరు మరొకరి పై హింసకు పాల్పడకుండా మీరు ఆదర సత్కారములు అవలంభించవలెనని అల్లాహ్ నాకు తన వాణి అందించెను.

మరో హదీసు ఇట్లు గలదు. దీనిని మనము మన పరస్పర సమస్యలలో దృష్టి యందుంచు కోవలెను. హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ మార్గములో ఖర్చు చేసినచో ధనము తరగదు. అల్లాహ్ దాసుడు ఇతరులను ఎంత క్షమించునో అంతే ఎక్కువ అల్లాహ్ అతని గౌరవమును హెచ్చించును. ఒకడు ఎంత ఎక్కువ వినయ విధేయత, ఆదర సత్కారములు అవలంభించునో అల్లాహ్ అంత ఎక్కువ అతనికి గొప్ప స్థాయిని ప్రసాదించును.

(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్ ఇస్తిహ్‌బాబుల్ అఫ్వి వత్తవాజిఇ)

కనుక ప్రతి అహ్మదీ ఒకరు మరొకరిని క్షమించు అలవాటు చేసుకోవలెను. పరలోకములో కూడ స్థాయి పెరుగు చుండును, ఈ ఇహలోకములో కూడ మీ గౌరవములను అల్లాహ్ పెంచుచు పోవును. తన కొరకు చేయబడిన ఏ కార్యమునకు ప్రతిఫలము ఇవ్వనిదే అల్లాహ్ ఎన్నడు వదిలిపెట్టడు.

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దృష్టిలో నిరుపేదల స్థాయి

నిరుపేదల స్థాయి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దృష్టిలో ఎంత వుండెనో, దానిని ఈ హదీసుతో అంచనా వేయుము. హజ్రత్ అబూసయీద్ ఖుద్రి రజియల్లాహు అన్హు ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఇట్లు తెలిపిరి. నిరు పేదలను ఆదరించు చుండుము. (ఇది హజ్రత్ అబూసయీద్ ఖుద్రి రజియల్లాహు అన్హు అంటున్నారు.)

ఎందుకనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు దుఆ చేసినట్లు నేను వింటిని. "اَللّٰهُمَّ اَحْيِنِىْ مِسْكِيْنًا وَاَمِتْنِىْ مِسْكِيْنًا وَاحْشُرْنِىْ فِى زُمْرَةِ الْمَسَاكِيْن" అనగా ఓ అల్లాహ్! నన్ను నిరుపేద స్థితిలో జీవించనిమ్ము. నిరుపేద స్థితిలో నాకు మరణము నొసంగుము. నన్ను నిరుపేదల పక్షము నుండే లేపుము.

(ఇబ్నె మాజ కితాబుజ్జుహ్ద్ బాబ్ మజాలిసుల్ ఫుఖరా)

కనుక ప్రతి అహ్మదీ ఈ దారినే అవలంభించవలెను. మన రారాజు, యజమాని హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం నడిచిన మార్గములనే అనుసరించవలెను. ప్రతి అహ్మదీ తనను తాను నిరుపేదల పక్షములోనే యుండినట్లు ప్రయత్నించవలెను. ఎందుకనగా ధీనత్వమునవలంభించి జీవింతునని బైఅత్ ప్రతిజ్ఞ చేసెను.

ఒక హదీసులో ఇట్లు గలదు. హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఇట్లు తెలిపిరి. జాఫర్ బిన్ అబూతాలిబ్ నిరుపేదలను ఎంతో ప్రేమించేవారు. వారు వారి సమావేశములలో ఉపస్థితులయ్యే వారు. వారు వారితో మాట్లాడేవారు. నిరుపేదలు కూడ వారితో మాట్లాడేవారు. అందుకే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జాఫర్‌ను నిరుపేదల తండ్రి అని సంబోధించేవారు.

(ఇబ్నె మాజ కితాబుజ్జుహ్ద్ బాబ్ మజాలిసుల్ ఫుఖరా)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్‌ను అన్వేషించాలంటే నిరుపేదల హృదయములలో అన్వేషించుము. అందుకే సందేశహరులు నిరుపేదల దుస్తులను ధరించిరి. పెద్ద జాతి వారు చిన్న జాతి వారిని అపహాస్యమునకు గురిచేయకూడదు. నా వంశము పెద్దదని అనకూడదు. మీరు నా వద్దకు వచ్చినప్పుడు మీ

జాతి ఏమిటని నేను ప్రశ్నించనని అల్లాహ్ అనును. కాని మీ ఆచరణ ఏమిటని నేను ప్రశ్నింతును. అటులనే అల్లాహ్ సందేశహరుడు తన కుమార్తెతో ఇట్లనిరి. ఓ ఫాతిమా! అల్లాహ్ జాతిని ప్రశ్నించడు, నీవు ఏదైనా దుష్ట కార్యము చేసినచో నీవు ప్రవక్త కుమార్తె వని అల్లాహ్ నిన్ను క్షమించడు. కావున నీవు ఎల్లప్పుడు జాగ్రత్తగా తమ కర్మలను చేయుచుండుము.

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 370 క్రొత్త ఎడీషన్)

మరల వారిట్లనిరి. "బీదత్వము, దీనత్వములో జీవితమును గడుపుట దైవభీతి గల వారికి నిబంధనగా వుండెను. ఇదొక దైవభీతి శాఖ. దీని ద్వారా అనుచిత కోపమును మనము ఎదురించవలసి యున్నది. గొప్ప గొప్ప జ్ఞానులు, సత్యవంతులు ఈ అంతిమ, తుది అంకము కోపము నుండే దూరముండవలసి యున్నది. కోపముతోనే అహంకారము, గర్వము పుట్టును. ఒక్కోసారి వ్యక్తిత్వమే అహంకారము, గర్వమునకు కారణమగును. మానవుడు తన ఆత్మకు మరొకరిపై ప్రాధాన్యత నిచ్చునప్పుడే కోపము పుట్టును."

(రిపోర్ట్ జల్సా సాలానా 1897 పుట 49)

వారిట్లనిరి. "ఆకాశమున అల్లాహ్ మీతో రాజీ పడాలంటే మీరు పరస్పరము ఒకే కడుపు నుండి పుట్టిన సోదరుల వలె ఏకమగుము. తన సోదరుని తప్పులను ఎక్కువ క్షమించినవాడే మీలో అతి గొప్ప సజ్జనుడు. మొండితనము ప్రదర్శించి క్షమించని వాడు దురదృష్టవంతుడు. అతనికి నాలో భాగము లేదు"

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 12,13)

# ఎనిమిదవ బైఅత్ నిబంధన

## తమ ప్రాణము, సంతతి, సంపత్తి, ప్రీతి పాత్రుల కంటే ధర్మమును, ధర్మ గౌరవ మర్యాదలను ఎక్కువగా అభిమానించును.

◈ ◈ ◈

సంస్థతో క్రమం తప్పకుండా సంబంధమున్న వ్యక్తి ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చుట అను ప్రతిజ్ఞను సమావేశాలు, సభలు మొ॥ వాటిలో పాల్గొనుచు పదేపదే చదువును. ప్రతి సమావేశము, సభ మొ॥ వాటిలో కూడ బ్యానర్లు కట్టబడు చుండును. వాటిలో ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చుట కూడ తరచుగా వుండును. ఈ విషయమునకు ఇంత ప్రాముఖ్యత ఎందుకివ్వబడెను. ఎందుకనగా ఇది లేనిదే విశ్వాసము స్థిరముగా వుండ లేదు. దీనిని ఆచరించుట సులభమైన విషయము కాదు. అందుకే దీనిని పొందుటకు ఎల్లప్పుడు, ప్రతి క్షణము అల్లాహ్ తో సహాయము కోరవలెను. అతను అనుగ్రహించితేనే ఈ గొప్ప ప్రామాణికము ఏర్పడవచ్చును. మనము అల్లాహ్ కృపానుసారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసినవారిలో వున్నాము. పవిత్ర ఖురాన్‌లో మనల్ని అల్లాహ్ ఇట్లు ఆదేశించును.

﴿وَمَا اُمِرُوْا اِلَّا لِيَعْبُدُوْا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ . حُنَفَآءَ وَيُقِيْمُوا الصَّلٰوةَ وَيُؤْتُوا الزَّكٰوةَ وَذٰلِكَ دِيْنُ الْقَيِّمَةِ﴾

(అల్ బయ్యినహ్ : 6)

అనగా వారు అల్లాహ్‌ను ఆరాధించవలెనని. ఎల్లప్పుడు ధర్మమును అతని కొరకే స్వచ్ఛందముగా చేయుచు, అతని వైపు సదా మోకరిల్లుచు, ప్రార్థన (నమాజ్)ను స్థిరపరచవలెనని, విధి దానము (జకాత్) చెల్లించవలెనను ఆదేశము తప్ప మరే ఆదేశములు వారికివ్వబడలేదు. స్థిరముగా నుండి, స్థిరపరచు బోధన ధర్మమిదే.

కావున మనము సామూహిక నమాజులను స్థిరపరిచి అనగా నిర్ణీత సమయములో సామూహిక నమాజ్ చేయుచు, అతని మార్గములో ధనము ఖర్చు చేయుచు, నిరుపేదలను ఆదుకొనినచో మనము నిజమైన ధర్మమును పాటించిన వారమగుదుము. ఈ బోధనలను మన జీవిత భాగములుగా చేసుకొనవచ్చును. వాటి ప్రకారము మన జీవితమును అలవర్చుకొనచ్చును. మనము అల్లాహ్‌ను ఆరాధించినప్పుడు, అతను బోధించిన బోధనను అనుసరించినప్పుడు అల్లాహ్ కూడ మనలను అనుగ్రహించును. మన విశ్వాసములను ఎంతగా గట్టిపర్చుననగా మన ఉనికి, మన కోరికలు, మన సంతానము ధర్మమునకు ఎదురుగా హీనముగా కనిపించును. మనది ఏమి లేకుండా సర్వమును సదుద్దేశముతో అల్లాహ్‌కు సమర్పించినప్పుడు అల్లాహ్ కూడ ఇటువంటి వారిని వృధా చేయడు. అతడు వారి గౌరవములను కూడ రక్షించును. వారి సంతానమును కూడ రక్షించును. వారికి శుభములందించును. వారి ధనమును కూడ పెంచును. వారిని

తన దయ, కృప దుప్పటిలో ఎల్లప్పుడు రక్షించుచూ వుండును. వారి అన్ని రకాల భయాలను దూరము చేయును. అందుకే ఇట్లనెను.

﴿بَلٰى مَنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ فَلَهٗۤ اَجْرُهٗ عِنْدَ رَبِّهٖ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ﴾

(అల్ బఖరహ్ : 113)

అనగా కాదు, ఎవ్వడు అల్లాహ్‌ను సంపూర్ణముగా శరణు పొందునో, సత్కార్యములు చేయునో, తన ప్రభువు ప్రసాదమును అతడు పొందును. ఇట్టి వారిని భయము దరి చేరదు. ఇట్టి వారు శోకిపంరు.

## ఇస్లాం బోధనల సారాంశము

మరల ఇట్లనెను.

﴿وَمَنْ اَحْسَنُ دِيْنًا مِّمَّنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ وَّاتَّبَعَ مِلَّةَ اِبْرَاهِيْمَ حَنِيْفًا. وَاتَّخَذَ اللّٰهُ اِبْرَاهِيْمَ خَلِيْلًا﴾

(అన్నిసా : 126) అనగా అల్లాహ్‌ను శరణు పొందిన వానికంటే మేలు చేయువాని కంటే, ధర్మజ్ఞుడైన ఇబ్రాహీమ్ మతమును అనుసరించు వాని కంటే ఉత్తమ విశ్వాసి ఎవడుండగలడు ? అల్లాహ్ ఇబ్రాహీమ్‌ను స్నేహితునిగా చేసి వుండెను.

ఈ సూక్తిలో ఇస్లాం బోధనల సారాంశము ప్రస్తావించబడెను. అనగా పూర్తి విధేయత, తమ సర్వ శక్తులతో అల్లాహ్ ఆజ్ఞలను మాత్రమే పాటించుట, అతని ధర్మము కొరకు తనను తాను సమర్పించి, ఉపకారము

చేయువాడగుట. అతడు అల్లాహ్ కొరకే ఉపకారము చేయువాడగును. కనుక ప్రతి క్షణం ధర్మము వైపు, ధర్మము సేవలో వున్నచో అతని ధనము, సంతానము వృధా అగునని ఎవరికి ఆలోచన కలుగకూడదు. కాదు, అందరికంటే ఎక్కువ ప్రతిఫలము, పరిహారమిచ్చువాడైన అల్లాహ్, అతని ఈ కార్యమునకు స్వయాన ప్రతిఫలమిచ్చును. ఇంతకు ముందు చెప్పినట్లు అతని ప్రాణము, ధనము, గౌరవమును స్వయముగా రక్షించును. అల్లాహ్ ఇటువంటి వారిని, వారి సంతానమును కూడ వృధా చెయ్యడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "

﴿بَلٰی مَنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ فَلَهٗ اَجْرُهٗ عِنْدَ رَبِّهٖ وَلَاخَوْفٌ عَلَیْهِمْ وَلَا هُمْ یَحْزَنُوْنَ﴾

(అల్ బఖరహ్: 113)

అనగా కాదు, ఎవ్వడు అల్లాహ్‌ను సంపూర్ణముగా శరణు పొందునో, సత్కార్యములు చేయునో, తన ప్రభువు ప్రసాదమును అతడు పొందును. ఇట్టి వారిని భయము దరి చేరదు. ఇట్టి వారు శోకింపరు. అనగా తన సంపూర్ణ శక్తులను దైవమార్గములో వినియోగించి, అల్లాహ్ కొరకు మాత్రమే అతని మాట, కార్యము, నడుచుట, ఆగుట ఇలా పూర్తి జీవితము అంకితమైనచో, స్వచ్ఛమైన పుణ్యమును ఆచరించుటలో క్రియాశీలుడైనచో అల్లాహ్ అతనికి తన వద్ద నుండి ప్రతిఫలము నొసంగును, భయము, దు:ఖము నుండి విముక్తి ప్రసాదించును".

(సిరాజుద్దీన్ ఈసాయీ కె చార్ సవాలోఁకె జవాబ్,
రూహాని ఖజాయిన్ సంపుటి 12, పుట 344)

ఒక హదీసులో ఇట్లు గలదు. ముఆవియా బిన్ హైదహ్ ఖుషైరి రజియల్లాహు అన్‌హు తను ఇస్లాం స్వీకరించే సంఘటనను తెలుపుచు ఇట్లనిరి. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరి, ఇట్లడిగితిని. “మా అల్లాహ్ మీకు ఏ సందేశమిచ్చి పంపినాడు, మీరు తీసుకొచ్చిన ధర్మమేమిటి ?” వారిట్లనిరి. “అల్లాహ్ ఇస్లాం ధర్మమిచ్చి నన్ను పంపెను”. “ఇస్లాం ధర్మమేమిటని నేనడిగితిని”. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు సమాధానమిచ్చిరి. “మీరు మీ ఉనికిని మొత్తం అల్లాహ్‌కు అప్పగించుము, ఇతర ఆరాధ్యదైవములను వదులుము, నమాజ్ సలుపుము, జకాత్ చెల్లించుము”.

(అల్ ఇస్తీఆబ్)

మరో హదీసు ఇట్లు గలదు. హజ్రత్ సుఫ్యాన్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. ఒక సారి నేనిట్లంటిని. ఓ అల్లాహ్ ప్రవక్తా! మరల ఇతరులతో అడగని విధంగా ఇస్లాంకు సంబంధించిన ఒక విషయము నాకు తెలుపుము. అనగా నాకు పూర్తిగా తృప్తి కలుగవలెను. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు సమాధానమిచ్చిరి. నీవిట్లనుము. నేను అల్లాహ్‌ను విశ్వసించినాను. తర్వాత దానిపై గట్టిగా నిలుచుచు సంపూర్ణ స్థితిలో స్థిరపడుము”.

(ముస్లిం కితాబుల్ బాబ్ జామి ఔసాఫుల్ ఇస్లాం)

అనుచరుల అమలు ఎట్లుండెనో ఒక హదీసులో ఇట్లు గలదు. ఆరంభమున ఇస్లాంలో ఇంకా మద్యము నిషేధించబడకుండెను. అనుచరులు కూడ మద్యము సేవించేవారు. తరచు మత్తు కూడ వచ్చేది. కాని ఈ స్థితిలో కూడ వారిపై ధర్మము, ధర్మ గౌరవ ప్రభావముండేది.

అన్నిటి కంటే ధర్మమునకే ప్రాధాన్యత గలదనే కలత వుండెడిది. మద్య నిషేధ ఆజ్ఞ వచ్చినప్పుడు కూడ విందులో కూర్చొని మద్యము సేవించువారిలో కొందరు మత్తులోకి కూడ జారుకొనియుండిరి. వారు దాని నిషేధపు ఆజ్ఞ వినగానే వెంటనే పాటించిరి. దీని గురించి హదీసు ఇట్లు గలదు. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. అబూతల్హా అన్సారి, అబూ ఉబైదహ్ బిన్ జర్రాహ్, ఉబైబిన్ కాబ్‌లకు నేను ఖర్జూరపు మద్యము త్రాగించుచుంటిని. మద్యము నిషేధించబడినదని ఎవరో ఒకరు వచ్చి చెప్పిరి. ఇది విని అనస్! నిలబడి మద్యపు కుండలను పగులగొట్టుమని అబూతల్హా అనెను. అనస్ ఇట్లనిరి. నేను నిలబడి రాయి కొసను కుండ క్రింది భాగాన విసిరి కొట్టితిని. అవి పగిలిపోయినవి.

(బుఖారి కితాబుల్ ఖబ్రుల్ వాహిద్ బాబ్ మా జాఅ ఫీ ఇజాతిల్‌వాహిదిస్సుదూఖ్)

## ఇస్లాం పునరుద్ధరణ మనతో ఒక పరిహారమడుగును

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"ఇస్లాం పునరుద్ధరణ మనతో ఒక పరిహారమడుగును. అదేమిటి? ఈ మార్గములోనే మనము మరణించుట. ఇట్టి మరణము పైనే ఇస్లాం పునరుద్ధరణ, ముస్లిముల జీవితము, సజీవ అల్లాహ్ కాంతి ఆధారపడివున్నది. దీని మరో పేరే ఇస్లాం. ఇప్పుడు ఈ ఇస్లాంనే పునరుద్ధరించుటకు అల్లాహ్ కోరుచున్నాడు. ఈ గొప్ప లక్ష్యమును

ఛేదించుటకు అన్ని విధాలా ప్రభావము చూపగలిగే ఒక గొప్ప సంస్థను తన వైపు నుండి తప్పక స్థాపించవలసి యుండెను. కావున ఆ వివేకవంతుడు, శక్తిమంతుడు మానవ జాతి సంస్కరణ కొరకు ఈ బలహీనున్ని పంపి అటులనే చేసెను."

(ఫతహ్ ఇస్లాం, రూహాని ఖజాయిన్ సంపుటి 3,
పుట 10 నుండి 12)

మరల వారిట్లనిరి. "సత్యము, స్వచ్ఛతతో మానవుడు అల్లాహ్ దాసునిగా కానంత వరకు ఏ స్థానము లభించుట కష్టమే. ఇబ్రాహీమ్ గురించి అల్లాహ్ ఇట్లు సాక్ష్యమిచ్చెను. ﴿وَاِبْرَاهِيْمَ الَّذِىْ وَفّٰى﴾ (అన్నజ్మ్ : 38) అనగా ఇబ్రాహీమ్ తన మాటను నిలబెట్టుకొనిన వ్యక్తి. కనుక ఈ విధముగా తన హృదయమును ఇతరులతో శుభ్రము చేయుట, దైవ ప్రేమతో నింపుట, అల్లాహ్ ఇష్టానుసారము నడుచుట, అసలును ఛాయ పోలినట్లే అనుసరించుట, అతని ఇష్టము అల్లాహ్ ఇష్టము ఒకటిగా, భేద రహితముగా కావలెను. ఈ విషయములన్నియు దుఆతో లభించును. వాస్తవానికి దుఆ కొరకే నమాజ్ గలదు. ప్రతి స్థానములో దుఆ చేయవలెను. కాని ఒకడు నిద్రించుచు నమాజ్ చదివినప్పుడు అతనికి ఏమియును తెలియదు. అది నమాజ్ కానేకాదు. ..... కనుక మానవుడు నమాజ్ చదువుటలో అలసత్వము, నిర్లక్ష్యము వహించకూడదు. మన జమాఅత్ నిజముగా జమాఅత్ కావాలని కోరినచో ఒక మరణమును కోరవలెను. మానసిక విషయాలు, మానసిక ఉద్దేశాల నుండి దూరముండవలెను. అన్నిటి కంటే అధిక ప్రాధాన్యము అల్లాహ్‌కు ఇవ్వవలెను."

(మల్ఫూజాత్ సంపుటి 3, పుట 457, 458 క్రొత్త ఎడీషన్ )

# నమ్మకమే పాపము నుండి విముక్తికి కారణము

మరల వారిట్లనిరి. "అల్లాహ్‌ను కోరు ఓ దాసులారా! చెవులు తెరిచి వినుము. నమ్మకము లాంటిది మరొకటి లేదు. పాపము నుండి నమ్మకమే విముక్తి కల్గించును. పుణ్యము చేయుటకు నమ్మకమే శక్తినిచ్చును. అల్లాహ్ సత్యమైన ప్రేమికునిగా చేసేది నమ్మకమే. నమ్మకము లేనిదే మీరు పాపమును వదులగలరా! మానసిక భావాల నుండి ఖచ్చితమైన నమ్మకము లేనిదే దూరముండగలరా! నమ్మకము లేనిదే ఏదేని సంతృప్తి చెందగలరా! నమ్మకము లేనిదే ఏదేని నిజమైన మార్పును సృష్టించగలరా! నమ్మకము లేనిదే మీరు ఏదేని నిజమైన సంతోషకర స్థితిని పొందగలరా! మీతో పాపమును విడిపించగల ఏదేని జరిమానా లేదా పరిహారము ఆకాశము క్రింద గలదా! ...... నమ్మకము లేనిదే అంధకార జీవితము నుండి మీరు బయటికి రాలేరు లేదా పవిత్ర ఆత్మ మీకు లభించలేదని మీరు గుర్తుంచుకొనుము. నమ్మకమున్న వారికి శుభాకాంక్షలు. ఎందుకనగా వారే అల్లాహ్‌ను పొందుదురు. మీకు శుభాకాంక్షలు ఎందుకనగా విశ్వాసపు నిధి మీకు లభించినప్పుడు మీ పాపము అంతమగును. పాపము నమ్మకము రెండు ఏకము కాలేవు. అతి భయంకరమైన విష సర్పమును చూచుచున్న బిలములో మీరు చెయ్యి పెట్టగలరా ? ఒక అగ్ని పర్వతము నుండి రాళ్ళ వర్షము కురుస్తున్న చోట లేదా పిడుగు పడుచున్న చోట లేదా భయంకరమైన పులి దాడి చేసే చోట లేదా వినాశనకర మహమ్మారి మానవ వంశములను తుడిచి పెడుచున్న చోట మీరు నిలబడ గలరా! సర్పము, పిడుగు, పులి,

మహామ్మారి పై వున్నంత నమ్మకము మీకు అల్లాహ్ పై వున్నచో అతనికెదురుగా అవిధేయత వహించి శిక్షను పొందు లేదా సత్యము, స్వచ్ఛతతో కూడిన బంధమును వదులుట అసాధ్యము."

(కష్తి నూహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 66,67)

వారిట్లనిరి. "భయము, ప్రేమ, గౌరవమునకు మూలము సంపూర్ణ పరిజ్ఞానము. సంపూర్ణ పరిజ్ఞానము అందించబడిన వానికి భయము, ప్రేమ కూడ సంపూర్ణముగా అందించబడెను. సంపూర్ణ భయము, ప్రేమ అందించబడిన వానికి నిర్భయత వలన పుట్టే పాపము నుండి అతనికి విముక్తి ఇవ్వబడెను. ఈ విముక్తి కొరకు మనకు ఎటువంటి రక్తము అవసరము లేదు. ఎటువంటి శిలువ లేదా జరిమానా కూడ మనకు అవసరము లేదు. మన స్వభావము గుర్తించి మన ఆత్మ బలిదానమొక్కటే మనము ఇవ్వవలసిన అవసరము గలదు. ఇటువంటి బలిదానమునకు మారు పేరు ఇస్లాం. బలిదానమగుటకు మెడను వంచుటయే ఇస్లాం. అనగా సంపూర్ణ ఇష్టముతో తన ఆత్మను అల్లాహ్ ముందుంచుట. ఈ ప్రియమైన నామము సర్వ శాసనములు, సర్వ ఆజ్ఞలకు జీవము. బలిదానమగుటకు హృదయపూర్వకముగా ఇష్టముతో మెడను వంచుటకు సంపూర్ణ ప్రేమ, పరిపూర్ణ అభిలాషను కోరును. సంపూర్ణ ప్రేమ, సంపూర్ణ పరిజ్ఞానమును కోరును. నిజమైన బలిదానమునకు సంపూర్ణ జ్ఞానము, సంపూర్ణ ప్రేమ అవసరము తప్ప మరొకటి అవసరము లేదని ఇస్లాం అను పదము సూచించును."

(లెక్చర్ లాహెూర్ పుట 5,6 – రూహాని ఖజాయిన్
సంపుటి 20, పుట 151, 152)

ఈ విషయములన్నిటిని అనుసరించే అనుగ్రహము అల్లాహ్ మనకు కలిగించుగాక!

(ఖుత్బా జుమా ప్రసంగము 29 ఆగస్టు 2003,
షీవర్ట్ హాలె, ఫ్రన్క్‌ఫోర్ట్, జర్మని)

ఇస్లాం బోధన ఒక మధురమైన బోధన. మానవుని జీవితములోని ఏదేని ఒక విషయమును వదిలినట్లు లేదా ఈ విద్యలో తగ్గుదల వున్నట్లు భావించలేని విధముగా గలదు. వైభవోపేతుడైన అల్లాహ్ ఈ ఉపకారములు కోరునదేమనగా అతని ప్రియమైన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన ఈ బోధనను అనునయించి మన జీవిత భాగములుగా చేసుకొని వాటిని మనము పాటించవలెను. మనపై ఇంకా అధిక బాధ్యత మోపబడెను. ఎందుకనగా మనము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన ప్రేమికుడు, దాసుడు అనగా ఈ కాలపు ఇమామ్ జమాఅత్‌లో చేరినాము. చేరినట్లు ప్రకటించుచున్నాము. తనను ప్రార్థించాలని, అల్లాహ్ హక్కులను చెల్లించాలని అల్లాహ్ మనకు సూచించినట్లే దాసుల హక్కులు కూడ చెల్లించవలెనని దృష్టి మరల్చుచు వివిధ బంధుత్వ, బంధముల హక్కులను కూడ చెల్లించాలని ఆజ్ఞాపించెను. ఇదే ప్రాధాన్యత వలన హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ నిబంధనలలో తొమ్మిదవ నిబంధనలో అల్లాహ్ సృష్టితో సానుభూతి, వారి హక్కులను ప్రస్తావించిరి.

# తొమ్మిదవ బైఅత్ నిబంధన

**అల్లాహ్ ప్రీతి కొరకు, అల్లాహ్ సృష్టించిన ప్రాణుల ఎడల సానుభూతి కలిగి వుండును. అల్లాహ్ ప్రసాదించిన బహుమతుల, శక్తుల ద్వారా సాధ్యమైనంత వరకు మానవాళికి లాభము చేకూర్చును.**

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَاعْبُدُوا اللّٰهَ وَلَا تُشْرِكُوْا بِهٖ شَيْئًا وَّبِالْوَالِدَيْنِ اِحْسَانًا وَّبِذِى الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَالْجَارِ ذِى الْقُرْبٰى وَالْجَارِ الْجُنُبِ وَالصَّاحِبِ بِالْجَنْبِ وَابْنِ السَّبِيْلِ وَمَا مَلَكَتْ اَيْمَانُكُمْ .اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ مُخْتَالًا فَخُوْرًا﴾

(అన్నిసా:37) అనగా అల్లాహ్‌ను ఆరాధింపుము. అతనితో ఏ దానిని చేర్చకుము. తల్లిదండ్రుల పట్లను, బంధుమిత్రుల పట్లను, అనాధల పట్లను, పేదల పట్లను, బంధువులైన పొరుగు వారి పట్లను, బంధువులు కాని పొరుగువారి పట్లను, మీ సహవాసము నందున్న వారి పట్లను, బాటసారుల పట్లను, మీ అధీనమున వున్న వారి పట్లను మిక్కిలి దయతో ప్రవర్తింపుము. నిశ్చయముగా అల్లాహ్ గర్వితుని, దాంబికునిని ప్రేమించడు.

## అందరితో మంచిగా వ్యవహరించు బోధన

ఈ సూక్తిలో అల్లాహ్ ఇట్లు నుడివెను. తమ సోదరులు, చిరంజీవులు, బంధు మిత్రులు, తమకు తెలిసినవారు, ఇరుగుపొరుగు వారితో సానుభూతిగా వ్యవహరించుము. వారికి మీ అవసరమున్నచో వారికి సహాయము చేయుము. వారికి ఏ మేరకు లాభము అందించగలరో అంత వరకు లాభము అందించుము. అంతేగాక మీకు తెలియని ఇరుగు పొరుగు వారు, మీతో ఎటువంటి బంధుత్వము లేకున్నను మీరు వారిని తాత్కాలికంగా కలిసినను వారికి కూడ మీ సానుభూతి, మీ సహాయము అవసరమున్నచో మీతో వారికి ఏదైనా లబ్ది కలిగే అవకాశమున్నచో తప్పక వారికి లబ్ది చేకూర్చుము. దీనితో ఒక మధురమైన ఇస్లాం సమాజము ఏర్పడును. మానవ సేవ, అల్లాహ్ సృష్టికి లబ్ది కలిగించే లక్షణము, విశిష్టత తమలో పుట్టించుకొనినచో ఇది పుణ్యమును దాటి ఉపకార జాబితాలో వచ్చుననే ఆలోచనతో చేయుము. నాకు ఏదో పరిహారము లభించునను ఉద్దేశముతో ఉపకారము చేయబడదు. మానవుడు ఉపకారము అల్లాహ్ కొరకు మాత్రమే చేయును. అప్పుడు ఎంతో ఆనందకరమైన సమాజము ఏర్పడును. అందులో భార్యాభర్తల తగాదా వుండదు. అత్త కోడలు

జగడముండదు. సోదరుల మధ్య జగడముండదు. ఇరుగు పొరుగు వారి మధ్య కూడ కలహముండదు. ప్రతి వ్యక్తి మరొక వ్యక్తితో ఉపకారముగా వ్యవహరించును. అతని హక్కులను ప్రేమ పూర్వక భావముతో అందించుటకు కృషి చేయు చుండును. కేవలం అల్లాహ్ ప్రేమ, అతని అనురాగమును పొందుటకు దానిని అమలు చేయును. నేటి సమాజములో దీని అవసరము ఎంతో అధికముగా గలదు. ఇట్లనిరి. వీటిని పాటించనిచో గర్వితులనబడుదురు. గర్వమును అల్లాహ్ ఇష్ట పడలేదు. గర్వము అను వ్యాధితోనే పీడనములన్నియు మొదలగును. .... ఏడవ నిబంధనలో దీని గురించి వివరముగా ప్రస్తావన వచ్చినది. కనుక ఇక్కడ గర్వము గురించి వివరముగా చెప్పవలసిన అవసరము లేదు. సంక్షిప్తమేమనగా అల్లాహ్ దృష్టిలో ప్రియులుగా అగుటకు, రెండు లోకములలో సఫలమగుటకు మానవజాతితో సానుభూతిగా వ్యవహరించుము. ఒకరినొకరు ఎత్తిపొడుచుటకు కాక ప్రేమానురాగము వలన పరస్పరం ఉపకారము చేయవలెను.

అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

﴿وَيُطْعِمُوْنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسْكِيْنًا وَّيَتِيْمًا وَّ اَسِيْرًا﴾

(అద్దహ్ర్ : 9)

అనగా వారు అన్నము అవసరమైనను దానిని, బీదవారికి, అనాధలకు, బందీలకు తినిపింతురు.

దీని ఒక అర్థమేమనగా వారికి తమ స్వంత అవసరాలున్నను అల్లాహ్ ప్రేమను పొందుటకు మాత్రమే అవసరాలు గల వారి అవసరాలను తీర్చుదురు, సానుభూతి చూపుదురు. తాము స్వయముగా ఆకలితో వుండి

వారికి తినిపింతురు. సంకోచ భావముతో కాక అనగా ఇచ్చేవాని అవసరము పూర్తి కాకుండా, అతని ఆకలి తీర్చకుండా ఇవ్వరు. సాధ్యమైనంత వరకు సహాయము చేయుదురు. ఇదంతయు పుణ్యము పొందుటకు చేయుదురు. అల్లాహ్ ప్రీతి కొరకు చేయుదురు. ఏ విధంగాను ఎత్తిపొడుచుటకు చేయరు. వారికి అవసరమున్నదే వారికిత్తురను అర్థము కూడ ఇందులో గలదు. తమకు ఇష్టమున్నదే ఎదుటి వ్యక్తికి అవసరమున్నదే ఇత్తురు. మీరు మీ కొరకు ఇష్టపడుచున్నదే అల్లాహ్ కొరకు ఇవ్వవలెనను అల్లాహ్ ఆదేశమును సదా గుర్తుంచుకొందురు. అవసరమున్న తమ సోదరులకు పలువురు ఎత్తిపొడుచుటకు సహాయము చేయునట్లు వీరు సహాయము చేయరు. కొందరు ఎంత విచిత్ర స్వభావము కలిగి వుందురనగా తాము ఉపయోగించిన వస్తువులను లేదా ధరించిన దుస్తులను కానుకలుగా ఇత్తురు. ఇటువంటి వారు తమ సోదరుల, సోదరీమణుల గౌరవమును గుర్తించవలెను. స్థోమత లేనిచో కానుకలు ఇవ్వకపోవడమే మంచిది. లేదా ఇవి నేను వాడిన దుస్తులు మీకిష్టమున్నచో ఇత్తునని చెప్పి ఇవ్వవలెను. మేము ఒకటి రెండు రోజులు ధరించిన మంచి దుస్తులను నిరుపేద బాలికల వివాహమునకు ఇవ్వదలచితిమని కొందరు వ్రాయుదురు. చిన్నగైనవి లేదా మరో కారణము వలన ఉపయోగించలేక పోతిమి. ఈ విషయము గురించి గుర్తుంచుకోవలసినదేమనగా ఇటువంటి వస్తువులు ఉపశాఖల ద్వారా, లజ్న మొ॥ వారి ద్వారా లేదా ఖుద్దాముల్ అహ్మదియ్య ద్వారా ఇచ్చినను లేదా వ్యక్తిగతంగా ఇచ్చినను నిరుపేదల గౌరవమును గుర్తుంచు కోవలెను. ఆ వస్తువు ఇచ్చేంత మంచి స్థితిలో వుంటెనే ఇవ్వవలెను. విడిచినవి, ఉపయోగించలేని స్థితిలో వున్నవి, మరకలు గలవి, చెమట వాసన గల

దుస్తులను ఇవ్వకూడదు. పేదవానికి కూడ ఒక గౌరవము గలదు. దానిని గుర్తించవలెను. ఇటువంటి దుస్తులు ఇచ్చినను శుభ్రపరచి, ఉతికించి, మంచిగా మడత పెట్టించి ఇవ్వవలెను. ఇంతకు ముందు నేను చెప్పినట్లు మన ఉపశాఖలు కూడ, లజ్న వారు కూడ ఎవరికైతే ఇచ్చుచున్నారో ఇవి ఉపయోగించినవని స్పష్టము చేయవలెను. అటుల తీసుకొనువారు సంతోషముతో తీసుకొందురు. ప్రతి ఒక్కరికి ఆత్మాభిమానము గలదు. నేనింతకు ముందు చెప్పినట్లు ఈ విషయము పట్ల చాలా శ్రద్ధ వహించవలసిన అవసరము గలదు. శ్రద్ధ వహించవలయును కూడ.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

﴿وَيُطْعِمُوْنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسْكِيْنًا وَّيَتِيْمًا وَّ اَسِيْرًا﴾

వివరణలో ఇట్లందురు.

"అల్లాహ్ పుణ్యమును చాలా ఇష్టపడునని గుర్తుంచుకొనుము. అతని సృష్టితో సానుభూతిగా వ్యవహరించవలెనని అతను కోరును. అతడు చెడును ఇష్టపడినచో చెడునకు ఆదేశించును. కాని అల్లాహ్ గొప్పతనము ఇందుకు పవిత్రమైనది. (సుబ్‌హానహు తఆలా షానహు) ........ నాతో సంబంధమున్న మీరు గుర్తుంచుకొనుము. ఏ ధర్మమునకు చెందినను మీరు ప్రతి వ్యక్తితో సానుభూతిగా వ్యవహరించుము. భేదరహితముగా ప్రతి ఒక్కరితో మంచిగా వ్యవహరించుము. ఎందుకనగా ఇదే పవిత్ర ఖురాన్ బోధన. ﴿وَيُطْعِمُوْنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسْكِيْنًا وَّيَتِيْمًا وَّ اَسِيْرًا﴾ (అద్దహ్ర్ : 9) ఆ ఖైదీలు, బంధీలుగా వచ్చేవారిలో అధికులు అవిశ్వాసులే యుండేవారు. ఇస్లాం సానుభూతి ఎంత ఉత్తమమైనదో గమనించుము.

నా దృష్టిలో సంపూర్ణ సద్గుణముల బోధన ఇస్లాంకు తప్ప మరెవరికి ప్రాప్తించలేదు. నాకు స్వస్థత కలిగిన తర్వాత సద్గుణముల గురించి ఒక పూర్తి పత్రిక వ్రాయుదును. ఎందుకనగా నేను కోరునది స్పష్టము కావలెనని నా ఉద్దేశము. నా జమాఅత్ కొరకు అది ఒక పరిపూర్ణ బోధన కాగలదు. అల్లాహ్ ప్రీతిని కోరు మార్గములు అందులో చూపబడును. ఒకరితో ఈ తప్పు మరొకరితో ఈ తప్పు జరిగినదని వినిన ప్రతి రోజు నాకు చాలా దు:ఖము కలుగును. నా స్వభావము ఈ విషయములతో ఆనందపడదు. ఇంకా రెండు పాదములు నడిచి నాలుగు పాదములు క్రింద పడిపోవు బాలుని వలె నేనీ సంస్థను పొందెదను. కాని అల్లాహ్ ఈ సంస్థను పరిపక్వ దశకు చేర్చునని నేను విశ్వసించుచున్నాను. కావున అల్లాహ్ కరుణించుటకు మీరు కూడ ప్రయత్నము, ప్రణాళిక, కృషి, దుఆలో నిమగ్నమగుము. ఎందుకనగా అతను దయ తలచనిదే ఏదియును జరగనే జరగదు. అతను కరుణించినచో మార్గములన్నిటిని తెరుచును."

(మల్ఫూజాత్ సంపుటి 4, పుట 218, 219, క్రొత్త ఎడీషన్)

ఏ వ్యాధుల గురించి అప్పుడు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంకు చింత యుండెనో అవి వారి పవిత్ర శక్తి వలన, వారి బోధనను అనుసరించినందున సంస్థలో అంతమై పోయి యుండెను. అల్లాహ్ కృపానుసారము ఒక పెద్ద భాగము వీటితో పూర్తిగా దూరమై యుండెను. కాని మనము ఆ సమయము, ఆ కాలము నుండి ఎంత దూరము పోవుచున్నామో అంతే సమాజపు దుష్కార్యములతో షైతాన్ దాడులు నిర్వహించుచుండును. కావున ఏ వ్యాకులతను హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బహిర్గతపరచిరో వారి బోధన

అనుసారముగానే ప్రణాళిక, దుఆతో అల్లాహ్ దయను కోరుచు ఈ దుష్కార్యముల నుండి దూరముండుటకు ప్రయత్నించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంస్థను అల్లాహ్ సదా పరిపూర్ణముగా వుంచును గాక. ఇప్పుడు దీని గురించి పలు హదీసులను తెలిపెదను.

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించిరి.

వైభవోపేతుడైన అల్లాహ్ ప్రళయ దినమున ఇట్లనును. ఓ మానవుడా! నేను అనారోగ్యమునకు గురైతిని నీవు నన్ను పరామర్శించలేదు. దాసుడు ఇట్లనును. ఓ నా పోషకుడా! సర్వ ప్రపంచమునకు నీవు పోషకుడవు. నేనెట్లు నిన్ను పరామర్శించెదను. అల్లాహ్ ఇట్లనును. నీకు తెలియదా! నా ఫలానా దాసుడు అనారోగ్యమునకు గురయ్యెను. నీవు అతన్ని పరామర్శించలేదు. నీవు అతన్ని పరామర్శించి యుండినచో నన్ను నీవు అక్కడ పొందేవాడవు. ఓ మానవుడా! నేను నిన్ను ఆహారము అడిగితిని నీవు నాకు ఆహారమివ్వలేదు. అప్పుడు మానవుడు ఇట్లనును. ఓ నా పోషకుడా! నీవు సర్వ లోకాలకు పోషకుడవు. నీకు నేను ఆహారమెట్లిత్తును. అల్లాహ్ ఇట్లనును. నీకు గుర్తు లేదా ! నా ఫలానా దాసుడు నీతో ఆహారమడగగా నీవు అతనికి ఆహారమివ్వలేదు. నీవు అతనికి ఆహారము తినిపించినచో అందుకు నా వద్ద ప్రతిఫలము పొందుదువని నీకు తెలియదా!

ఓ మానవుడా! నేను నీతో నీరు అడిగితిని. నీవు నాకు నీరు త్రాగించలేదు. మానవుడిట్లనును. ఓ నా పోషకుడా! నీవే సర్వ లోకానికి పోషకుడైనప్పుడు నేను నీకు నీరెట్లు త్రాగింతును. అప్పుడు అల్లాహ్ ఇట్లనును. నా ఫలానా దాసుడు నీతో నీరడిగి యుండెను. అతనికి నీవు

నీరు త్రాగించి యుండినచో నా వద్ద అందుకు ప్రతిఫలము పొందేవాడవు.

(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్
ఫజ్‌లు ఇయాదతుల్ మరీజి)

మరో హదీసు ఇట్లు గలదు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ రజియల్లాహు అన్‌హు కథనము మేరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. సృష్టి మొత్తం అల్లాహ్ సంతానము. తన (కుటుంబము) ప్రాణులతో మంచి వ్యవహారము చేయుచు వారి అవసరాలను తీర్చువాడే తన సృష్టిలో అల్లాహ్‌కు అధిక ప్రియుడు.

(మిష్కాత్ బాబష్షఫ్కతి వర్రహ్మతి అలల్ కల్కి)

మరో హదీసు ఇట్లు గలదు. హజ్రత్ అలీ (రజి) కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. "ఒక ముస్లిమునకు మరొక ముస్లింపై ఆరు హక్కులు గలవు. (1) అతను అతనిని కలిసినప్పుడు అస్సలాము అలైకుమ్ అనవలెను. (2) అతడు తుమ్మినప్పుడు يَرْحَمُكَ الله అనవలెను. (3) అతడు అనారోగ్యమునకు గురైనప్పుడు అతన్ని పరామర్శించవలెను."

అల్లాహ్ దయానుసారము కొందరు ఈ మంచి అలవాటు కలిగి వుందురు. అనగా తెలిసిన వారైనా తెలియని వారైనా స్వయముగా ఆసుపత్రులకు వెళ్ళి రోగులను పరామర్శింతురు. వారి కొరకు ఫలములు, పుష్పములు తీసుకెళ్ళుదురు. మానవ సేవకు ఇదో చాలా మంచి పద్ధతి.

"(4) అతడు అతన్ని పిలిచినప్పుడు అతని మాటకు సమాధానమివ్వవలెను. (5) అతడు చనిపోయినప్పుడు అతని అంత్యక్రియ ప్రార్థనకు పోవలెను. (6)తన కొరకు ఇష్టపడినదే అతని కొరకు

ఇష్టపడవలెను. అతను లేని సమయమున కూడ అతని మేలు కోరవలెను.”

(సునన్ దార్మి, కితాబుల్ ఇస్తిజాన్, బాబ్ ఫీ హఖ్ఖిల్ ముస్లిమి అల్ ముస్లిమి)

మరో హదీసులో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి.

“ఒకరు మరొకరిపై ఈర్ష్య పడకూడదు. ఒకరు మరొకరికి నష్టము కలిగించుటకు అధికాధికముగా ధరలు పెంచకూడదు. ఒకరు మరొకరితో అసూయ కలిగి వుండకూడదు. ఒకరు మరొకరి వైపు వీపు త్రిప్పకూడదు అనగా నిర్లక్ష్య ధోరణి వహించకూడదు. ఒకరు బేరము చేసినది మరొకరు కొనుగోలు చేయకూడదు. పరస్పరం అల్లాహ్ దాసులుగా, సోదరులుగా నుండుము. ఒక ముస్లిం తన సోదరునిపై దౌర్జన్యము చేయడు. అతన్ని అవమాన పరచడు. అతన్ని తలదించుకునేలా చేయడు లేదా అతన్ని అగౌరవపరచడు. వారు తమ యద వైపు సంజ్ఞ చేయుచు దైవభీతి ఇచట గలదని అనిరి. ఈ పదములను వారు మూడు సార్లు పలికిరి. మరల ఇట్లనిరి. తన ముస్లిం సోదరున్ని అవమానముగా చూచుటయే మానవుని దురదృష్టమునకు చాలు. ప్రతి ముస్లిం రక్తము, ధనము, గౌరవము, ఆత్మాభిమానము మరొక ముస్లింపై నిషేధించబడినవి. అవి అతనికి గౌరవించదగినవి.

(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్ తహ్రీమ్ జుల్మిల్ ముస్లిమి వఖుజ్లుహు)

మరో హదీసు ఇట్లు గలదు. హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు

అన్హు కథనము మేరకు ఆన్హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఒక వ్యక్తి ఒక ముస్లిం ప్రాపంచిక వ్యాకులత, బాధను దూరము చేసినచో ప్రళయ దినమున అల్లాహ్ అతని వ్యాకులత, బాధలను దూరము చేయును. ఇబ్బందిలో వున్న ఒక వ్యక్తికి విశ్రాంతి కలిగించి, అతనికి సౌకర్యము కల్పించినచో అల్లాహ్ ప్రళయ దినమున అతనికి సౌకర్యములను కల్పించును. ఒకరు మరొక ముస్లిం రహస్యములను దాచినచో అల్లాహ్ ప్రళయ దినమున అతని రహస్యములను కప్పిపుచ్చును. తన సోదరునికి సహాయము చేయుటకు సిద్ధముగా నున్న వానికి సహాయము చేయుటకు అల్లాహ్ సిద్ధముగా నుండును. విద్యాన్వేషణలో బయలు దేరు వానికి అల్లాహ్ స్వర్గ మార్గమును సులభము చేయును. అల్లాహ్ గృహములలోని ఏదేని ఒక గృహములో కూర్చొని అల్లాహ్ పుస్తకమును చదువుచు, దాని పాఠ్యాంశములను బోధించు వారికి అల్లాహ్ శాంతి, సంతృప్తి కలిగించును. అల్లాహ్ కరుణ వారిని రక్షించును. దైవ దూతలు వారిని చుట్టుకొని వుందురు. అల్లాహ్ తన సన్నిహితులలో వారిని ప్రస్తావించును. ఆచరణలో అలసత్వము వహించువానిని అతని వంశము, కటుంబము చురుకుగా చేయలేదు. అనగా అతడు వంశము వలన స్వర్గములో చేరలేడు.

(ముస్లిం కితాబుజ్జిక్ర్ బాబ్ ఫజ్లుల్ ఇజ్తిమాఇ
అలా తిలావతిల్ ఖురాని వఅలజ్జిక్రి)

ఇందులో ఆరంభమున తెలుపబడినదేమనగా ప్రజల హక్కులను అందించుము, తమ సోదరుల వ్యాకులతలు, బాధలను దూరము చేయుము. అల్లాహ్ ప్రళయ దినమున అదే ప్రేమపూర్వక వ్యవహారము మీతో చేయును. మీ వ్యాకులతలు, బాధలను దూరము చేయును. ఆంహజ్రత్ సల్లల్లాహు

అలైహి వసల్లం ఇట్లని మనపై ఉపకారము చేసిరి. అల్లాహ్ మిమ్ములను క్షమించాలని మీరు కోరుకున్నచో వ్యాకులత గల, బాధలో వున్న, ఇబ్బందిలో వున్న వారికి వీలైనంత వరకు సౌలభ్యము కల్పించుము. అల్లాహ్ ప్రేమపూర్వక వ్యవహారము మీతో చేయును. తమ సోదరుల తప్పిదములను కప్పిపుచ్చుము. వారి తప్పును పట్టుకొని ప్రకటించుకుంటూ తిరుగకుము. ప్రళయ దినమున గణించబడు ఎన్ని లోపాలు, బలహీనతలు మీలో వున్నాయో తెలియదు. ఈ ప్రపంచములో మీరు తమ సోదరుల తప్పులను కప్పిపుచ్చినచో, వారి తప్పులను చూచి చర్చించే బదులు వారి సానుభూతి పరులుగా మారి వారికి ఉపదేశము చేయుటకు ప్రయత్నించినచో అల్లాహ్ కూడ మీతో కప్పిపుచ్చే ధోరణే అవలంభించును. ఇవి దాసుల హక్కులు. వీటిని చెల్లించినచో మీరు అల్లాహ్ అనుగ్రహములకు వారసులగుదురు.

మరల హదీసులో ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు తెలిపిరి. దానముతో ధనము తగ్గదు. ఇతరుల తప్పులను క్షమించిన వానికి అల్లాహ్ మరింత గౌరవము అందించును. ఒకరి తప్పులను క్షమించినచో ఎట్టి అవమానము జరగదు.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 2 పుట 235)

మరో హదీసు ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్హు తెలిపిరి. కరుణించు వారిని కరుణామయుడైన అల్లాహ్ కరుణించును. భూనివాసులను మీరు కరుణించుము. ఆకాశము వాడు మిమ్ములను

కరుణించును.

(అబూదావూద్ కితాబుల్ అదబ్ బాబ్ ఫి[రహ్మతి)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ రెండు ఆజ్ఞలు గలవను విషయమును కూడ గుర్తుంచు కొనుము. మొదటిది ఏమనగా అతని ఉనికిలో, అతని లక్షణములలో, అతని ప్రార్థనలలో ఎవరిని చేర్చకుము. రెండవది ఏమనగా మానవజాతితో సానుభూతిగా వ్యవహరించుము. ఉపకారము కేవలము తమ సోదరులు బంధువులతోనే కాదు, ఎవరైనను, ఏ మానవుడైనను, అల్లాహ్ సృష్టిలో ఎవరైనను, అతడు హిందువు, క్రైస్తవుడని భావించకుము. ఎంత వరకు మెత్తదనము, నిరాడంబరత, సామాన్యత అవలంభింతురో అల్లాహ్ అంత సంతోషపడును. తమ శత్రువులను అల్లాహ్‌కు అప్పగించుము. ప్రళయ దినము సమీపములోనే వున్నది. శత్రువులు మీకు కలిగించుచున్న బాధలతో భయపడకూడదు. మీరు వారితో చాలా దుఃఖములు భరించవలసి వచ్చునట్లు నేను చూచుచున్నాను. సభ్యత హద్దును దాటువారి నాలుక ఒక వంతెన తెగినప్పుడు వరద వచ్చునట్లుగా పలుగును. నిష్టాపరుడు తన నాలుకను అదుపులో వుంచుకొనవలెను."

(మల్ఫూజాత్ సంపుటి 9 పుట 164, 165)

మరల ఇట్లనిరి.

"హక్కులు రెండు రకాలు గలవని గుర్తుంచుకొనుము. ఒకటి అల్లాహ్ హక్కు కాగా రెండవది దాసుల హక్కు. అల్లాహ్ హక్కులో కూడ ధనికులకు ఇబ్బంది ఎదురగును. గర్వము, స్వాభిమానము వారిని దూరముంచును. ఉదా॥ ప్రార్థన సమయమున ఒక నిరుపేద ప్రక్కన

నిలుచుటకు ఇష్టపడరు. వారిని తమ వద్ద కూర్చొనబెట్టలేరు. ఇట్లు వారు అల్లాహ్ హక్కు నుండి దూరముందురు. వాస్తవానికి మస్జిదులు నిరుపేదల గృహములుగా నుండును. ధనికులు అందులో పోవుటను తమ స్థాయికి విరుద్ధముగా భావింతురు. ఇటులనే దాసుల హక్కులో కూడ వారు ప్రత్యేక సేవలలో పాల్గొనలేరు. పేదవాడు ప్రతి సేవకు సిద్ధముగా నుండును. కాళ్ళను నొక్కవచ్చును. నీరు త్రాగించవచ్చును. వస్త్రములను శుభ్రపరచును, తుదకు మలినము పారవేయవలసి వచ్చినను అందుకు కూడ వెనుకాడడు. కాని ధనికులు ఇటువంటి పనులను అవమానముగా భావింతురు. దీనిని కూడ కోల్పోవుదురు. సంక్షిప్తమేమనగా ధనము కూడ అనేక పుణ్యములకు అవరోధముగా మారును. అందుకే నిరుపేదలు 500 సం॥లు ముందే స్వర్గములో ప్రవేశింతురని హదీసులో గలదు."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 368

క్రొత్త ఎడీషన్)

ఇట్లనిరి. "మానవ సానుభూతి ఎటువంటి విషయమనగా మానవుడు దానిని విడిచినచో దాని నుండి దూరమగును, తుదకు క్రమేణ మృగముగా మారును. మానవుని మానవత్వము ఇదే కోరును. తన తోటి సోదరునితో ప్రేమపూర్వక వ్యవహారము, ఉపకారము చేసినంత వరకే అతడు మానవుడనబడును. ఇందులో ఎలాంటి భేదము లేదు. సాది (రహ్మ) ఇట్లు పేర్కొనెను. మానవ జాతి ఒకరు మరొకరి అవయవములు.

నా దృష్టిలో సానుభూతి చాలా విశాలమైనది. ఏ జాతి, వ్యక్తిని వేరు చేయకూడదు. మీరు మీ సానుభూతిని ముస్లిములకు మాత్రమే

పరిమితం చేయమని నేను నేటి మూర్ఖుల వలె అనను. కాదు. మీరు అల్లాహ్ సృష్టి అనగా హిందువు అయినను, ముస్లిం అయినను అందరితో సానుభూతితో వ్యవహరించగలరని నేను తెలిపెదను. తమ సానుభూతిని తమ జాతి వరకే పరిమితం చేసే వారిని నేను అస్సలు ఇష్టపడను."

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 216,217 క్రొత్త ఎడీషన్)

ఇట్లనిరి. "ఏది ఏమైనా మానవజాతితో అనురాగము, సానుభూతితో వ్యవహరించుట చాలా పెద్ద ఆరాధనే. అల్లాహ్ ప్రీతిని పొందుటకు ఇదో పెద్ద కారణము. కాని ఈ కోణములో చాలా బలహీనతలను ప్రదర్శించుచున్నట్లు నేను చూచెదను. ఇతరులను (పరామర్శించుట, ఆపదలో కష్టములలో వారికి సహాయపడుటకు బదులు) వారిని హీనులుగా భావింతురు. వారు అవహేళనకు గురి చేయబడుదురు. (బీద వారితో సత్ప్రవర్తన పాటించక వారిని హీనులుగా భావించువారు స్వయముగా ఈ బాధలో పడిపోగలరని నాకు భయము గలదు.) అల్లాహ్ అనుగ్రహించిన వారి కృతజ్ఞత ఏమనగా అతని సృష్టితో ఉపకారముగా వ్యవహరించవలెను. ఈ దైవ అనుగ్రహముపై గర్వ పడకూడదు. మృగాల వలె పేదలను అణచి వేయకూడదు."

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 438, 439 క్రొత్త ఎడీషన్)

వారిట్లనిరి. "తల్లిదండ్రులు, సంతానము, ఇతర బంధుమిత్రులు, నిరుపేదల హక్కుల గురించి పవిత్ర ఖురాన్ ప్రస్తావించినంత మరో పుస్తకము ప్రస్తావించినట్లు నేను ఊహించలేను. అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَاعْبُدُوا اللّٰهَ وَلَا تُشْرِكُوْا بِهٖ شَيْئًا وَّبِالْوَالِدَيْنِ اِحْسَانًا وَّبِذِى الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَالْجَارِ ذِى الْقُرْبٰى وَالْجَارِ الْجُنُبِ وَالصَّاحِبِ بِالْجَنْبِ وَابْنِ السَّبِيْلِ وَمَا مَلَكَتْ اَيْمَانُكُمْ. اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ مُخْتَالًا فَخُوْرًا﴾

(అన్నిసా : 37)

అనగా అల్లాహ్‌ను ఆరాధింపుము. అతనితో ఏ దానిని చేర్చకుము. తల్లిదండ్రుల పట్లను, బంధుమిత్రుల పట్లను, (ఈ వాక్యములో సంతానము, సోదరులు, సమీపపు, దూరపు బంధువులందరు వున్నారు) అనాథల పట్లను, పేదల పట్లను, బంధువులైన పొరుగు వారి పట్లను, తెలియని పొరుగారి పట్లను, మీ సహవాసము నందున్నవారి పట్లను, ఏదేని పనిలో భాగస్వాములైనను, ప్రయాణములో తోడున్నను, ప్రార్థనలో తోడున్నను, ధార్మిక విద్యాభ్యాసములో వెంట వున్నను వారి పట్ల, బాటసారుల పట్లను, మీ అధీనమున వున్న వారి పట్లను మిక్కిలి దయతో ప్రవర్తింపుము. నిశ్చయముగా అల్లాహ్ గర్వితునిని, దాంబికునిని, ఇతరులను కరుణించని వానిని ప్రేమించడు."

(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి 23 పుట 208,209)

దీనిని గురించి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) ఇట్లనిరి.

"ఉద్దేశము ఏముండును, ఎందుకు ఆహారము అందించుదురనగా

﴿اِنَّا نَخَافُ مِنْ رَّبِّنَا يَوْمًا عَبُوْسًا قَمْطَرِيْرًا﴾(అద్దహ్ర్ :11) అనగా నిశ్చయముగా మేము తమ ప్రభువు వైపు నుండి వచ్చు కోపముతో కూడిన కఠినాతి కఠినమైన ఒక దినమునకు భయపడుదుము. ఇబ్బందిని **عَبُوْس** అందురు. సుదీర్ఘమును **قَمْطَرِيْر** అందురు. అనగా ప్రళయ దినము ఇబ్బందికరమైన సుదీర్ఘముగా నుండును. ఆకలితో వున్న వారికి సహాయము చేసినచో అల్లాహ్ అనావృష్టి ఇబ్బందికరమైన సుదీర్ఘము నుండి మోక్షము కల్పించును. ఫలితము ఇట్లుండును. ﴿فَوَقٰهُمُ اللّٰهُ شَرَّ ذٰلِكَ الْيَوْمِ وَلَقّٰهُمْ نَضْرَةً وَّسُرُوْرًا﴾ (అద్దహ్ర్:12) అనగా అల్లాహ్ వారిని ఆ దినపు పీడనము నుండి రక్షించును. వారికి ఉల్లాసము, ఆనందము నొసంగును.

నేటి రోజులలో నిరుపేదల, ఆకలితో వున్న వారికి సహాయము చేసినచో అనావృష్టి రోజుల కొరత నుండి విముక్తి పొందెదరని గుర్తుంచుకొనుము. బాహ్య గౌరవము కొరకు ప్రయత్నించినట్లే శాశ్వత గౌరవము, విశ్రాంతి కొరకు కూడ ప్రయత్నించుటకు అల్లాహ్ నన్ను, మిమ్ములను కూడ అనుగ్రహించుగాక! ఆమీన్."

(హఖాఇఖుల్ ఫుర్ఖాన్ సంపుటి 4 పుట 290, 291)

ఇది అహ్మదియ్య సంస్థ ప్రత్యేకతే, ఎందుకనగా సాధ్యమైనంత వరకు మానవ సేవ కార్యములలో ఇది పాల్గొంటున్నది. అందుబాటులో వున్న వసతులలో వుంటూ వ్యక్తిగతంగా, సంస్థ స్థాయిలో కూడ సమాజ సేవ, మానవ సేవ చేయుచున్నది. సంస్థ సభ్యులు తమ స్థాయి మేరకు

ఆకలిని నివారించుటకు, పేదల చికిత్స కొరకు, విద్యా సహాయము కొరకు, పేదల వివాహము కొరకు సంస్థ వ్యవస్థ ఆధ్వర్యమున సహాయములో పాల్గొని బైఅత్ ప్రతిజ్ఞను పాటించుచున్నారు. పాటించవలయును కూడ. మనము ఈ జాతుల వలె కాకూడదు గాక! అనగా అవి తమ మిగులు పంటను వృధా చేయును కాని దుఃఖముతోనున్న మానవజాతి కొరకు వినియోగించవు. ఎందుకనగా వారి రాజకీయ ఉద్దేశాలు, ప్రయోజనాలు వారితో ముడిపడి లేవు. లేదా పూర్తిగా వారి మాటను ఆమోదించరు, వారి Dictation ను తీసుకొనుటకు సిద్ధముగా నుండరు. శిక్షగా వారిని ఆకలితో, నగ్నముగా వుంచుదురు. గతము కంటే అధికముగా మానవ సేవ చేయుటకు అల్లాహ్ అహ్మదియ్య సంస్థను అనుగ్రహించు గాక! (ఆమీన్)

ఇచట నేను మరో విషయమును కూడ వివరించదలచితిని. సంస్థ స్థాయిలో ఈ మానవ సేవ వీలైనంత వరకు జరుగుచున్నది. సంస్థ సత్పురుషులు మానవ సేవ కొరకు అల్లాహ్ అనుగ్రహించిన కొద్ది పెద్ద పెద్ద మొత్తాలను సమర్పించుచున్నారు. వాటితో మానవ సేవ చేయబడుతుంది. అల్లాహ్ దయానుసారము ఆఫ్రీకాలో, రబ్వా, ఖాదియాన్‌లో కూడ జీవిత సమర్పిత వైద్యులు, ఉపాధ్యాయులు. సేవలందించుచున్నారు. కాని నేను ఏ విధముగానైనా మానవ సేవ చేయగలిగే, పేదల, అవసరాలు గల వారికి సహాయము చేయగలిగే ప్రతి అహ్మదీ వైద్యుడు, అహ్మదీ ఉపాధ్యాయుడు, అహ్మదీ న్యాయవాది, ప్రతి అహ్మదీ తన వృత్తి ఆధారముగా తప్పక పేదల, అవసరాలు గల వారికి సహాయము చేయుటకు ప్రయత్నించ వలెనని నేను తెలుపుచున్నాను. ఫలితముగా అల్లాహ్ గతము కంటే ఎక్కువ మీ ధనములో, కుటుంబములో

శుభము కలిగించును. ఇన్షాఅల్లాహ్. మేము వర్తమాన ఇమామ్‌తో బైఅత్ ప్రతిజ్ఞ చేసినందున దానిని నిర్వర్తించాలనే ఉద్దేశముతో మీరందరు మానవ సేవ చేసినచో అల్లాహ్ అనుగ్రహముల, శుభముల వర్షము మీరు ..........లేని విధముగా కురిసినట్లు ఊహించెదరు.

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దృష్టిలో మానవ సేవ

మానవజాతి సేవ ప్రత్యేకముగా తమ సోదరుల సేవ, సహాయమును ఉపదేశించుచు ఒక సందర్భమున హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

“నా పరిస్థితి ఎట్లున్నదనగా నేను ప్రార్థనలో వుండగా ఒకరికి నొప్పి కలిగి, అతని పిలుపు నా చెవులలో పడినచో ప్రార్థనను విడిచి అతని సహాయమునకు పోవలెనని, అతనికి ప్రయోజనము కలిగినచో ప్రయోజనము కలిగించవలెనని, సాధ్యమైనంత వరకు అతని సేవ చేయాలని నేను కోరెదను. ఒక సోదరుని బాధ, ఇబ్బంది కాలములో అతనికి సహకరించక పోవడం ప్రవర్తనలకు విరుద్ధమైనది. అతని కొరకు మీరేమియును చేయలేనిచో దుఆయే చేయుము. మన వారితోనే కాక ఇతరులు, హిందువులతో కూడ ఇటువంటి ఉదాహరణనే చూపమని, వారితో సానుభూతిగా వ్యవహరించుమని నేనందును. కోపోద్రిక్త స్వభావము అస్సలు కలిగి వుండకూడదు.

ఒక సారి బయట విహారమునకు పోవుచుంటిని. ఒక పట్వారి అబ్దుల్ కరీం నా వెంట వుండెను. అతడు కొంచెం ముందుండగా నేను

వెనుక వుంటిని. 70 లేదా 75 సం॥ల ఆయువు గల ఒక వృద్ధురాలు మార్గములో కలిసెను. ఆమె చదవమని ఒక ఉత్తరము అతనికిచ్చెను. కాని అతడు కోపగించుకొనెను. నా హృదయము గాయపడెను. ఆమె ఆ ఉత్తరము నాకిచ్చెను. నేను అది తీసుకొని నిలబడి, దానిని చదివి వివరముగా తెలిపితిని. అప్పుడతడు ఎంతగానో సిగ్గుపడెను. ఎందుకనగా ఎలాగూ నిలబడవలసి వచ్చెను కాని పుణ్యము లభించలేదు."

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 82,83 క్రొత్త ఎడీషన్)

ఇట్లనిరి. "అతని దాసులను కరుణించుము. వారిపై నాలుక లేదా హస్తము లేదా మరే ప్రణాళికతో దౌర్జన్యము చేయకుము. సృష్టి మేలు కొరకు ప్రయత్నించుచుండుము. ఎవరిపైనను, తమ అధీనములో నున్న వారిపై గర్వ పడకుము. దూషించినను ఎవరిని దూషించకుము. స్వీకరించబడుటకు పేద, సహనశీలుడు, సదుద్దేశము గల, సృష్టి పట్ల సానుభూతిపరునిగా అగుము. ... పెద్దలై చిన్నవారిని అవమానించక వారిని కనికరించుము. విద్యావంతులై బుద్ధిహీనులను అపహాస్యమునకు గురి చేయక వారికి ఉపదేశము చేయుము. ధనికులై పేదలపై స్వాభిమానముతో గర్వము ప్రదర్శించక సేవ చేయుము. వినాశనకర మార్గముల నుండి భయపడుము."

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్ సంపుటి 19 పుట 11,12)

మరల ఇట్లనిరి. "ప్రజలు మీకు దుఃఖము కలిగింతురు. అన్ని రకాలుగా బాధ పెట్టెదరు. కాని మన సంస్థ వారు ఉద్రేకమును ప్రదర్శించకూడదు. ఉద్రేకము వలన హృదయములను బాధించు పదములు పలుకకుము. ఇటువంటి వారిని అల్లాహ్ ఇష్టపడడు. మన సంస్థను అల్లాహ్

ఒక ఆదర్శముగా చేయదలచెను."

మరల వారిట్లనిరి. "అల్లాహ్ నిష్టాపరున్ని ప్రేమించును. అల్లాహ్ గొప్పతనమును స్మరించుచు భయపడుము. అందరు అల్లాహ్ దాసులేనని జ్ఞాపకముంచుకొనుము. ఎవరిపై దౌర్జన్యము చేయకుము. ఎవరిని అవహేళనగా చూడకుము. సంస్థలో ఒకడు మలినమైనచో అతడు అందరిని మలినము చేయునని గుర్తుంచుకొనుము. తాపము వైపు మీ స్వభావము ఆకర్షితమైనచో ఈ తాపము ఏ చెలిమ నుండి పుట్టినదో హృదయమును పరిశీలించుము. ఈ స్థానము చాలా సున్నితమైనది."

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 8,9)

ఇట్లనిరి. "మీ సత్యము, విశ్వసనీయత, విలాపన ఆకాశమునకు చేరునట్లు అగుము. ఎవరి యద సత్యము, ప్రేమతో నిండి యున్నదని చూడునో అటువంటి వ్యక్తిని అల్లాహ్ రక్షించును, అతనికి శుభము కలిగించును. అతడు బాహ్య మాటలను కాక హృదయములపై చూపు వేయును, త్రొంగి చూడును. ఎవరి హృదయము మలినము, అపవిత్ర రహితముగా నుండునో వారి హృదయములో అవతరించి తన గృహము నిర్మించుకొనును."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 181 క్రొత్త ఎడీషన్)

ఇట్లనిరి. "మరల నేనిట్లందును. ప్రజలకు లబ్ది కలిగించే వారు, విశ్వాసము, సత్యము, విశ్వసనీయతలో సంపూర్ణమైన వారు తప్పక రక్షించబడుదురు. కావున మీరు ఈ విశిష్టతలను తమలో పుట్టించుకొనుము."

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 184 క్రొత్త ఎడీషన్)

ఇట్లనిరి. "బాహ్యము, అంతరంగికము ఒకటి కానంత వరకు మీరు అతని ఆస్థానములో స్వీకరించబడలేరు. పెద్దలై చిన్నవారిని అవమానించక వారిని కనికరించుము. విద్యావంతులై బుద్ధిహీనులను అపహాస్యమునకు గురి చేయక వారికి ఉపదేశము చేయుము. ధనికులై పేదలపై స్వాభిమానముతో గర్వము ప్రదర్శించక సేవ చేయుము. వినాశనకర మార్గముల నుండి భయపడుము. అల్లాహ్‌తో భయపడు చుండుము. దైవభీతి మార్గములను అవలంభించుము. ..... అల్లాహ్ నోటితో వెలువడి, నేను తెలిపిన ఈ మాటలను నమ్మని వాడు ఎంతో దురదృష్టవంతుడు. ఆకాశమున అల్లాహ్ మీతో రాజీ పడాలంటే మీరు పరస్పరము ఒకే కడుపు నుండి పుట్టిన సోదరుల వలె ఏకమగుము. తన సోదరుని తప్పులను ఎక్కువగా క్షమించినవాడే మీలో అతి గొప్ప సజ్జనుడు. మొండితనము ప్రదర్శించి క్షమించని వాడు దురదృష్టవంతుడు. అతనికి నాలో భాగము లేదు"

(కష్తి నూహ్: రూహాని ఖజాయిన్
సంపుటి 19 పుట 12,13)

ఇట్లనిరి. "అసలు విషయమేమనగా దైవ సృష్టితో సానుభూతిగా వ్యవహరించుట చాలా పెద్ద విషయము. అల్లాహ్ అతనిని ఇష్టపడును. అతనితో అతనికి సానుభూతి వుండును. ఇంతకంటే ఎక్కువ ఇంకేమి కావలెను. సాధారణముగా ప్రపంచములో కూడ ఇటులనే జరుగును. ఒక వ్యక్తి సేవకుడు అతని ఒక మిత్రుని వద్దకు పోయినప్పుడు ఆ వ్యక్తి ఇతనిని ఆదరించనిచో సేవకుని యజమాని తన ఆ మిత్రునితో సంతోషపడునా? ఎన్నడు కాదు. వాస్తవానికి అతనికి అతడు ఎటువంటి

బాధ కలిగించలేదు. లేనే లేదు. కాని ఆ సేవకుని ఆదరణ, అతనితో మంచి వ్యవహారము యజమానితో మంచి వ్యవహారముగా భావించబడును. అల్లాహ్‌కు కూడ అతని సృష్టితో ఎవరైనా మంచిగా వ్యవహరించనిచో ఇటులనే కోపము కలుగును. ఎందుకనగా అతనికి తన సృష్టి చాలా ఇష్టమైనది. దైవ సృష్టితో మంచిగా వ్యవహరించు వాడు వాస్తవానికి తన అల్లాహ్‌ను రాజీ చేసుకొనును.”

(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 215,216
క్రొత్త ఎడీషన్)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ ఉపదేశములను పాటించు అనుగ్రహము అల్లాహ్ మనకు కలిగించుగాక! వారితో మనము చేసిన బైఅత్ ప్రతిజ్ఞను పూర్తి చేయుటకు అనుగ్రహించుగాక! (ఆమీన్)

(ఖుత్బా జుమా ప్రసంగము 12 సెప్టెంబర్ 2003
మస్జిద్ ఫజల్ లండన్ ఇంగ్లాండ్)

# పదవ బైఅత్ నిబంధన

**కేవలము అల్లాహ్ ప్రీతి కొరకు నాతో సోదర భావము కలిగి మరణించు వరకు వినయ విధేయతను ప్రదర్శించును. ఈ బాంధవ్యము ఇతర బంధాలలో కానరాని విధముగా ఉన్నత స్థాయి నందుకొని వుండును.**

◈ ◈ ◈

## హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ), వర్తమాన ఖలీఫాతో సోదరభావ బంధమును ఏర్పరచుకొనుట అనివార్యము

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ నిబంధనలో మనతో ఇట్లు వాగ్దానము తీసుకొంటున్నారు. ఒక ముస్లిం మరో ముస్లిం సోదరుడైనందున ఈ వ్యవస్థలో చేరి ఒక సోదరభావ బంధమును నాతో ఏర్పరచుకుంటున్నారు. కాని ఇచట ఏర్పడుచున్న ప్రేమ, సోదరభావ బంధము దానిని మించినది. ఎందుకనగా ఇచట సమాన సంబంధము, బంధుత్వము కాక రాబోవు మసీహ్‌ని విశ్వసించుమను ఆదేశము అల్లాహ్,

ప్రవక్తదని మీరు అంగీకరించుచున్నారు. అందుకే అల్లాహ్ కొరకు ఈ బంధమును ఏర్పరచు కుంటున్నాను. అల్లాహ్ ధర్మ ఉన్నతి, ప్రపంచ నలుమూలలలో ఇస్లాంను అందించుటకు, వ్యాపింపజేయుటకు బంధమును కలుపుచున్నారు. ఈ బంధము ఈ అంగీకారముతోనే సఫలము, శాశ్వతమగును. అనగా మంచి విషయాలలో విధేయత ప్రతిజ్ఞ చేసి, తుది ఘడియ వరకు ఈ ప్రతిజ్ఞను పాటించుము. ఈ బంధము ఇక్కడే ఆగక ప్రతి దినము ఇందులో గట్టితనము ఏర్పడవలెనని శ్రద్ధ వహించుము. దీనికి ఎదురుగా ప్రాపంచిక బంధుత్వములు, బంధములు, మిత్రుత్వములన్నియు విలువ లేనివని ఋజువగునట్లు ఇది గట్టిపడి, అత్యుత్తమ స్థాయికి ఎదగవలెను, దీనికెదురుగా అన్ని బంధములు, బంధుత్వములు ఉద్ధేశరహితమని కనిపించునట్లు నిరుపమాణ గట్టి బంధము ఏర్పడవలెను. మరల ఇట్లనిరి. బంధుత్వములో ఇచ్చిపుచ్చుకొను, ఒప్పుకొని ఒప్పించు సూత్రము కొనసాగునను ఆలోచన మనసులో కలుగవచ్చును. కనుక ఈ బంధము బానిస, సేవకుని బంధమే కాక దానిని మించి వుండవలెనని ఇక్కడ స్పష్టము చేయనైనది. మీరు తు.చ. ఈ విధేయత అలవర్చుకొనవలెను. ఈ కార్యము ఇప్పుడు జరగదు లేదా ఇప్పుడు చెయ్యలేనని అనే హక్కు మీకెన్నడు వుండదు. మీరు బైఅత్‌లో చేరినందున, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంస్థ వ్యవస్థలో ప్రవేశించినందున మీ మొత్తమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఇచ్చివేసిరి. ఇప్పుడు వారి ఆజ్ఞలను మాత్రమే పాటించవలెను. వారి బోధనను అనుసరించవలెను. వారి తర్వాత ఖిలాఫత్ వ్యవస్థ ఏర్పడినందున వర్తమాన ఖలీఫా ఆజ్ఞలను, ఉపదేశములను పాటించుట మీ పని. సేవకుడు,

ఉద్యోగస్తుడు విధి లేక పని చేయునను ఆలోచన ఇచట రాకూడదు. సేవకులు ఒక్కోసారి గుణుక్కొందురు కూడ. అందుకే సదా గుర్తుంచుకొనుము. ఇది సేవా స్థితియే కాని దానిని మించియుండును. ఎందుకనగా సోదర బంధుత్వము అల్లాహ్ కొరకు గలదు. అల్లాహ్ కొరకే విధేయత అంగీకారము అయినందున త్యాగ ప్రతిజ్ఞ కూడ గలదు. మానవుడు సంతోషముతో త్యాగము చేసినప్పుడే త్యాగమునకు పుణ్యము లభించును. ఈ నిబంధన పై మీరు ఎంత గ్రహించుదురో అంతే హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ప్రేమలో లీనమగుచు పోవుదురు. సంస్థ విధానమునకు తాము కట్టుబడి వున్నట్లు తమను పొందెదరు, అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

﴿يٰٓاَيُّهَا النَّبِيُّ اِذَا جَآءَكَ الْمُؤْمِنٰتُ يُبَايِعْنَكَ عَلٰٓى اَنْ لَّا يُشْرِكْنَ بِاللّٰهِ شَيْـًٔا وَّلَا يَسْرِقْنَ وَلَا يَزْنِيْنَ وَلَا يَقْتُلْنَ اَوْلَادَهُنَّ وَلَا يَاْتِيْنَ بِبُهْتَانٍ يَّفْتَرِيْنَهٗ بَيْنَ اَيْدِيْهِنَّ وَاَرْجُلِهِنَّ وَلَا يَعْصِيْنَكَ فِيْ مَعْرُوْفٍ فَبَايِعْهُنَّ وَاسْتَغْفِرْ لَهُنَّ اللّٰهَ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ﴾

(అల్‌ముమ్తహినహ్:13) అనగా ఓ సందేశహరుడా! విశ్వాస స్త్రీలు నీ వద్దకు వచ్చి, వారు అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరిని చేయము, దొంగతనము గాని, వ్యభిచారము గాని చేయము. తమ సంతానమును చంపము, తమ వైపు నుండి కల్పించుకొని ఎవరికీ నిందారోపణ అంటగట్టము, మంచి విషయములలో నిన్ను అతిక్రమించమని నీతో విధేయత ప్రమాణము చేయగోరినచో నీవు వారి విధేయతా ప్రమాణము స్వీకరించుము. వారి కొరకు అల్లాహ్‌తో క్షమాపణ కోరుము. నిశ్చయముగా

అల్లాహ్ గొప్ప క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమకారుణ్య మూర్తి.

స్త్రీలతో ఈ విధముగా బైఅత్ ప్రతిజ్ఞ తీసుకొను ఆదేశము ఈ సూక్తిలో గలదు. అనగా అన్యారాధన చేయము, దొంగతనము చేయము. వ్యభిచారము చేయము, సంతానమును హతమార్చము, (సంతాన సంస్కరణ పట్ల దృష్టి సారించెదము) ఎవరిపై అసత్య ఆరోపణ చేయము, మంచి విషయాలలో అవిధేయత వహించము, అల్లాహ్ వైపున నియమించ బడిన సందేశహరుడు కూడ అనుచిత ఆదేశములు ఇవ్వ వచ్చునా ? అను ప్రశ్న ఇచట ఉత్పన్నమగును, సందేశహరులు ఇవ్వగలిగినచో ఖలీఫా కూడ అనుచిత ఆదేశములు ఇవ్వ వచ్చును. సందేశహరుడు ఎన్నడు ఇటువంటి ఆదేశములివ్వలేదు, సందేశహరుడు సముచిత తప్ప వేరే మాట అనలేదు. అందుకే అల్లాహ్, ప్రవక్త ఆదేశముల పట్ల విధేయత వహించి, వాటిని పాటించుమని పవిత్ర ఖురాన్‌లో అనేక చోట్ల ఆదేశము గలదు. సముచిత ఆజ్ఞనే పాటించవలెనని ఎక్కడ వ్రాసి లేదు, మరి రెండు విభిన్న ఆజ్ఞలు ఎందుకను ప్రశ్న ఉత్పన్నమగును, కాని వాస్తవానికి ఈ రెండు వేర్వేరు ఆజ్ఞలు కావు. కొందరు అర్థము చేసుకొనుటలో పొరబడిరి. సందేశహరుని ప్రతి ఆజ్ఞ సముచితముగనే నుండునని నేను అన్నట్లు అల్లాహ్ ఆదేశములకు, శాసన ఆజ్ఞలకు విరుద్ధముగా ఎన్నడు ఆజ్ఞాపించలేదు. ఎందుకనగా అతడు ఈ పని పైనే నియమించబడెను. ఏ పని కొరకైతే నియమించబడెనో దానికి వ్యతిరేకముగా ఎట్లు నడుచును ? సందేశహరున్ని విశ్వసించి, అవతారున్ని నమ్మి, అతని సంస్థలో చేరి సురక్షితులైనందుకు మీకిట్లు శుభవార్త అందించబడెను. ఇప్పుడు ఎటువంటి అనుచిత ఆజ్ఞ మీ కొరకు లేదు. అల్లాహ్ దృష్టిలో ఇష్టమైన ఆజ్ఞయే మీకు గలదు.

## సముచితము, అనుచితము అనగా నేమి ?

కొన్ని సందర్భాలలో సముచిత తీర్మానము లేదా సముచిత ఆదేశముల విధేయత గందరగోళములో పడి తాము స్వయముగా వ్యవస్థ నుండి తొలగిపోయి ఇతరులను కూడ చెడగొడుదురు. సమాజములో కూడ పలు దోషములను కలిగింతురు. కనుక వారికి స్పష్టము చేయునదేమనగా తామంతట తాము సముచిత, అనుచిత తీర్మానముల నిర్వచనములో పడకూడదు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) దీనిని వివరించుచు ఇట్లు నుడివిరి.

"సముచితము పట్ల విధేయత వహించు విషయమును అర్థము చేసుకొనుటలో మరో తప్పిదము గలదు. అనగా మనము సముచితమని భావించని పనులలో విధేయత వహించము. ఈ పదము నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు కూడ వచ్చినది. ﴿وَلَا يَعْصِيْنَكَ فِي مَعْرُوْفٍ﴾ (అల్ ముమ్తహినహ్ : 13) హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం లోపముల ఒక పట్టిక కూడ ఇటువంటి వారు సిద్ధము చేసుకొనిరా ! ఇటులనే బైఅత్ నియమములో హజ్రత్ అలైహిస్సలాం కూడ సముచితము పట్ల విధేయత అని వ్రాసిరి. ఇందులో ఒక రహస్యము గలదు. నేను మీలో ఎవరి గురించి దురాలోచన కలిగి లేను. మీలో ఎవరైనా లోలోపల మోసపోకూడదని నేను ఈ విషయములను స్పష్టము చేసితిని."

(ఖుత్బాతే నూర్ పేజి 420,421)

يَأْمُرُهُمْ بِالْمَعْرُوْفِ ను వివరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు నుడివిరి. "వివేకముతో కూడిన మాటలనే ఈ సందేశహరుడు ఆదేశించును. వివేకము నిరోధించు మాటల నుండి కూడ

నిరోధించును, పవిత్ర వస్తువులను ధర్మ బద్ధము చేయును, అపవిత్ర వస్తువులను నిషేధించును. జాతులు ఏ భారము క్రింద నలిగిపోవుచున్నాయో దానిని వారి తలల నుండి తొలగించును. మెడ గొలుసుల వలన పైకి లేపలేకపోవు మెడలను వాటి నుండి విముక్తి కల్పించును. కనుక అతన్ని విశ్వసించి, తమ ప్రవేశముతో అతనికి శక్తినందించి, అతనికి సహాయపడి, అతని కాంతిని అనుసరించిన వారు ఈ ప్రాపంచిక, పరలోక కష్టముల నుండి విముక్తి పొందెదరు."

(బరాహీనె అహ్మదియ్య హిస్స పంజుమ్, రూహానీ ఖజాయిన్ సంపుటి 21, పుట 420)

అల్లాహ్ ఆదేశాలను సందేశహరుడు విస్మరించనప్పుడు సందేశహరుని తర్వాత అతని మిషన్‌ను నడిపించుటకు విశ్వాసుల ఒక సమూహము ద్వారా అల్లాహ్ తరపున నియమించబడిన ఖలీఫా కూడా అదే బోధనను, ఆదేశములను ముందుకు కొనసాగించును. ఇవి అల్లాహ్ సందేశహరుడు నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా మన వరకు చేరినవి. ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారమే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరించి మనకు తెలిపిరి. కనుక ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా సంస్థలో ఏర్పడిన ఈ ఖిలాఫత్ వ్యవస్థ ప్రళయ దినము వరకు కొనసాగును. ఇన్షాఅల్లాహ్. వీరిలో శాసనము, తెలివికనుగుణముగనే తీర్మానాలు అగుచున్నవి, అగును కూడా ఇన్షాఅల్లాహ్. ఇవే సముచిత తీర్మానములు, ఏదో ఒక సమయమున వర్తమాన ఖలీఫా తప్పుడు లేదా అవగాహన

లోపము వలన నష్టము వాటిల్లు ఆస్కారము గల తీర్మానము చేసినచో దాని దుష్ఫలితాలు బహిర్గతము కాకుండా స్వయాన అల్లాహ్‌యే తగు ఏర్పాట్లు చేయును. దీనిని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి.

"వ్యక్తిగత సమస్యలలో వర్తమాన ఖలీఫాతో పొరపాటు జరిగే అవకాశము గలదు. కాని సంస్థ ఆధ్యాత్మిక, ప్రాపంచిక ప్రగతి ఆదారపడివున్న విషయములో అతనితో పొరపాటు జరిగినను అల్లాహ్ తన సంస్థను రక్షించును. ఏదో ఒక రకంగా ఆ పొరపాటు గరించి అతనికి సమాచారమందించును. మత గురువులు దీనిని అల్ప గౌరవమందురు. అనగా సందేశహరులకు గొప్ప గౌరవము లభించును కాని ఖలీఫాలకు అల్ప గౌరవము లభించును. సంస్థ నాశనమునకు కారణమగు ఏ పెద్ద పొరపాటు అల్లాహ్ వారితో జరగనివ్వడు. వారి తీర్మానాలలో కొంత వరకు సాధారణ పొరపాట్లు జరగవచ్చును. కాని తుది ఫలితము ఇస్లాం విజయ రూపములో వెలువడును, అతని వ్యతిరేకులు పరాజయమునకు గురగుదురు. వారికి అల్ప గౌరవము లభించినందున వారికనుగుణంగా అల్లాహ్ ప్రణాళిక యుండును. నిస్సందేహముగా మాట్లాడేవారు వారే అయినను, వారి నాలుకలే కదులును, వారి చేతులే పని చేయును, వారి మెదడే పని చేయును కాని వీటన్నిటి వెనుక అల్లాహ్ హస్తముండును. వారితో సాధారణ పొరపాట్లు సంభవించ వచ్చును. కొన్ని సార్లు వారి సలహాదారులు కూడ వారికి తప్పుడు సలహాలు ఇవ్వవచ్చును. కాని ఈ మధ్యంతర అవరోధాలను దాటిన పిదప విజయము కూడ వారికే లభించును, కడియములన్ని కలిసి గొలుసు సిద్ధమైనప్పుడు ఏ శక్తి దానిని విరగ్గొట్టలేదు." (తఫ్సీరే కబీర్ సంపుటి 6 పుట 376,377)

అల్లాహ్ ఆజ్ఞలకు, శాసన ఆదేశములకు బద్ధ వ్యతిరేకమైనదే అనుచితమని దీనితో స్పష్టమైనది. ఒక హదీస్ ద్వారా కూడ ఇది వ్యక్తమగుచున్నది. హజ్రత్ అలి (రజి) ఇట్లు తెలిపిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సైన్యమును పంపిరి. అందరు అతని మాట విని అతని విధేయత వహించుటకు దాని కొక సైన్యాధికారిని నియమించిరి. ఆ వ్యక్తి అగ్నిని రాజేసి అగ్నిలో దూకమని తన సహచరులను ఆదేశించెను. కొందరు అతని మాట వినక ఇట్లనిరి, మేము అగ్నితో రక్షణ పొందుటకే ముస్లిములమైతిమి, కాని కొందరు వ్యక్తులు అగ్నిలో దూకుటకు సిద్ధమైరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలిసినప్పుడు ఇట్లనిరి. వీరు అందులో దూకి యుండినచో శాశ్వతముగా అగ్నిలోనే యుందురు. ఇంకా ఇట్లనిరి. అల్లాహ్ అవిధేయత రూపములో ఏ విధేయత అనివార్యము కాదు, సముచిత విషయములలోనే విధేయత తప్పని సరి."

(సునన్ అబుదావూద్, కితాబుల్ జిహాద్)

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనముతో ఈ హదీస్ వివరణ మరింత తెలియును. హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం **అల్ఖమ బిన్ ముజజ్జిజ్**ను ఒక యుద్ధము కొరకు పంపిరి. వారు తమ నిర్ణీత యుద్ధ క్షేత్రమునకు చేరుకున్న తర్వాత లేదా మార్గమధ్యములోనే వుండగా సైన్యములోని ఒక బృందము వారితో అనుమతి కోరెను, కనుక వారు వారికి అనుమతించి వారిపై అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా బిన్ ఖైస్ అస్సహ్మీని నాయకునిగా నియమించిరి. యుద్ధమునకు పోవు వారిలో నేను కూడ వారి వెంట యుంటిని. మార్గమధ్యలో వుండగానే సెగ కొరకు లేదా

ఆహారము వండుటకు వారు అగ్నిని రాజేసిరి. అప్పుడు (హాస్య స్వభావము గల) అబ్దుల్లాహ్ ఇట్లనిరి. మీరు నా మాట విని దాని విధేయత కర్తవ్యము కాదా ? ఎందుకు కాదని వారనిరి. అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) ఇట్లనిరి. నేను ఏ ఆజ్ఞ ఇచ్చినను మీరు దానిని పాటించుదురా ? అవును మేము పాటింతుమని వారనిరి. మరల అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) ఇట్లనిరి. మీరు ఈ అగ్నిలో దూకవలసినదిగా నేను గట్టిగా ఆజ్ఞాపించుచున్నాను. వెంటనే కొందరు వ్యక్తులు నిలబడి అగ్నిలో దూకుటకు సన్నద్ధము కావడము ప్రారంభించిరి. వీరు నిజముగనే అగ్నిలో దూకుటకు సిద్ధమైనారని చూచిన అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా తమను తాము (అగ్నిలో దూకకుండా) నివారించుకోగలరని అనిరి.

మేము ఈ యుద్ధము నుండి తిరిగి వచ్చిన తర్వాత కొందరు అనుచరులు (రజి) నబీ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఈ సంఘటనను ప్రస్తావించిరి. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. "నాయకులలోని ఎవరైనా అల్లాహ్ అవిధేయత వహించుమని ఆజ్ఞాపించినచో అతనిని అనుసరించకుము." (సునన్ ఇబ్నె మాజ, కితాబుల్ జిహాద్, బాబ్ లిఇతాఅతి ఫీ మాఫియతిలిల్లాహి)

ఈ హదీసుతో విధేయత వహించ కూడదను నిర్ణయము కూడ ఒక్క వ్యక్తిది కాదని స్పష్టమైనది. ఎట్టి పరిస్థితిలోనైనా నాయకుని ఆదేశమును పాటించు ఆదేశము గలదని కొందరు అగ్నిలో దూకుటకు సిద్ధమైరి. ప్రతి పరిస్థితి, ప్రతి రూపములో, ప్రతి స్థితిలో అధ్యక్షుని ఆదేశము పాటించవలెనని వారు వినియుండిరి. ఇదే సరైన ఇస్లాం బోధన అని వారు భావించిరి. కాని దైవాజ్ఞల జ్ఞానము అధికముగా కలిగిన, ఆంహజ్రత్

సల్లల్లాహు అలైహి వసల్లం సహవాస ప్రయోజనము ఎక్కువ పొందిన కొందరు అనుచరులు నిరాకరించిరి. ఫలితముగా అభిప్రాయ సేకరణ తర్వాత ఎవరు దానిని పాటించలేదు. ఎందుకనగా ఇది ఆత్మహత్య అగును. ఆత్మహత్య స్పష్టముగా ఇస్లాంలో నిషేధించబడినది. మరోవైపు వారి నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా ప్రజల శ్రద్ధను చూసి వారు కూడ కలత చెందిరి. ఇది హాస్యము మాత్రమేనని వారు కూడ నిరోధించిరి. ఈ సంఘటన తర్వాత సముచితము అనుచితము ఏమిటో తెలుపుచు సముచిత నియమములను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్పష్టపరచిరి. సందేశహరుడు లేదా వర్తమాన ఖలీఫా హాస్యముగా కూడ ఇట్లు మాట్లాడలేడని గుర్తుంచుకొనుము. అందుకే నాయకుని ద్వారా ఏదైనా అదేశమునకు విరుద్ధముగా స్పష్టమైన వ్యతిరేకత మీరు చూసినచో అల్లాహ్, ప్రవక్తను ఆశ్రయించుమని అల్లాహ్ నుడివెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత ఈ కాలములో సన్మార్గ ఖిలాఫత్ (రాషిదహ్) ఏర్పడెను. కావున వర్తమాన ఖలీఫాను ఆశ్రయించుము. అతని నిర్ణయము సదా సముచితముగానే వుండును. అల్లాహ్, ప్రవక్త ఆదేశములకను గుణంగానే వుండును. ఇంతకు ముందు నేను చెప్పినట్లు మీకు శుభవార్త గలదు. ఎందుకనగా మీరు సదా సముచిత ఆదేశాల క్రిందనే వున్నారు.

ఒక ఉద్యోగి ఎంతో మంచిగా పని చేయుచుండగా అనవసరముగా అతన్ని తొలగించి మరొకనికి పని అప్పగించబడినదని నేడు కూడ విమర్శలు చేయబడును. అనగా వర్తమాన ఖలీఫా లేదా సంస్థ వ్యవస్థ తప్పుడు తీర్మానము చేసి అనుచిత నిర్ణయము తీసుకున్నారని వారి భావన. వారు మరేమియును చేయలేరు. కనుక ఇది అనుచిత నిర్ణయమైనందున

(స్వంతముగా నిర్ణయించుకొనిన నిర్వచనము) మాట్లాడే హక్కు మాకుందని, వివిధ చోట్ల కూర్చొని సంభాషించుకొనే హక్కు మాకుందని వారు భావింతురు. మొదటి విషయమేమనగా సంస్థ వ్యవస్థకు వ్యతిరేకముగా వివిధ చోట్ల కూర్చొని మాట్లాడుకునే హక్కు ఎవరికి లేదని నేనింతకు ముందు కూడ సవివరంగా తెలిపి యున్నాను. విధేయత మాత్రమే మీ కర్తవ్యము. విధేయత ప్రమాణము గురించి పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَاَقۡسَمُوۡا بِاللّٰهِ جَهۡدَ اَيۡمَانِهِمۡ لَئِنۡ اَمَرۡتَهُمۡ لَيَخۡرُجُنَّ ؕ قُلۡ لَّا تُقۡسِمُوۡا ۚ طَاعَةٌ مَّعۡرُوۡفَةٌ ؕ اِنَّ اللّٰهَ خَبِيۡرٌۢ بِمَا تَعۡمَلُوۡنَ﴾

(అన్నూర్:54) అనగా నీవు వారిని ఆదేశించినచో వారు తప్పక బయలు దేరుదురని వారు అల్లాహ్ దృఢ ప్రమాణములు చేసిరి, నీవు ఇట్లనుము. ప్రమాణములు చేయకుము, శాసనానుసారము విధేయులగుడు, నిశ్చయముగా మీరు చేయునదంతయు అల్లాహ్ సదా ఎరుగును.

ఈ సూక్తి కంటే ముందు సూక్తులలో కూడ విధేయత అంశమే కొనసాగుచున్నది. విశ్వాసులు సదా ఇట్లందురు. మేము వింటిమి, పాటించితిమి. ఈ దైవభీతి వలన వారు అల్లాహ్ సమీపులగుదురు, సఫలమగుదురు. విశ్వాసుల వలె వినుము, విధేయత వహించుమను ఆదర్శమును చూపుమని ఈ సూక్తిలో కూడ తెలుపబడినది. మేము ఇది చేయుదుము అది చేయుదుమని ప్రమాణములు చేయకుము. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) దీని విశ్లేషణలో ఇట్లు వ్రాసిరి. దాంబికులు కూడ దావాలు చాలా చేయుదురు. ఆచరణాత్మకంగా తెలుపు ముఖ్యమైన విషయము. ఇచట అల్లాహ్ ఇటువంటి వారికి తెలుపునదేమనగా సముచిత

పద్ధతి, సంప్రదాయ బద్ధమైన విధేయతను వహించుము. శాసనమునకు విరుద్ధముగా, వివేకమునకు వ్యతిరేకముగా సందేశహరుడు ఎటువంటి ఆజ్ఞ ఇవ్వడు. ఉదా॥ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నన్ను విశ్వసించినందున ఐదు పూటల ప్రార్థనలకు అలవాటు పడుము. అబద్ధమును వీడుము, గర్వమును వదులుము, ప్రజల హక్కులను హరించుట వీడుము. పరస్పరము ప్రేమానురాగముతో నుండుము. ఇవన్నియు సముచిత ఆజ్ఞ విధేయత కోవలోకే వచ్చును. మీరు ఆదేశించినట్లు మేము చేయుదుమని మేము ప్రమాణము చేయుచున్నామని ప్రకటించి అవిధేయత వహించకుము. ఇటులనే ఆధ్యాత్మిక ప్రగతి కొరకు ఖలీఫాల తరపున కూడ వివిధ సందర్భాలలో వివిధ పిలుపులు వెలువడినవి. ఉదా॥ మస్జిదుల జనావాసముల గురించి, సంతాన సంస్కరణ గురించి, తమలో ఆత్మ స్థైర్యమును పెంచుకొనుట గురించి, అల్లాహ్ వైపు ఆహ్వానించుట లేదా వివిధ ధన ఉద్యమముల గురించిన, ఈ విషయములనే పాటించుట అనివార్యము. మరో రకంగా విధేయత సముచిత విషయాల కోవలోకి వచ్చును. అల్లాహ్ ఆదేశములకు వ్యతిరేకముగా, వివేకమునకు విరుద్ధముగా సందేశహరుడు లేదా ఖలీఫా మీతో ఏ పని చేయించడు. మీరు అగ్నిలో దూకమని, సముద్రములో దూకమని అననే అనరు. వారు మిమ్ములను సదా శాసనము కనుగుణంగానే నడిపింతురు.

## విధేయత గొప్ప ఉదాహరణ

మొదటి కాలపు ముస్లిములలో విధేయత గొప్ప ఉదాహరణ మనకిట్లు లభించును, ఒక యుద్ధము మధ్యలోనే హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు యుద్ధ నాయకత్వమును హజ్రత్ ఖాలిద్ (రజి)

బిన్ వలీద్ నుండి తీసుకొని హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) కు అప్పగించిరి. హజ్రత్ ఖాలిద్ (రజి) బిన్ వలీద్ ఎంతో చక్కగా సమర్థవంతముగా పని చేయుచున్నారనే ఆలోచనతో హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) వారితో బాధ్యత తీసుకోలేదు. హజ్రత్ ఉమర్ (రజి) గారి నుండి ఈ ఆదేశము వెలువడినదని హజ్రత్ ఖాలిద్ (రజి) బిన్ వలీద్ కు తెలిసినప్పుడు వారు హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) వద్దకు వెళ్ళి ఇట్లనిరి. ఇది వర్తమాన ఖలీఫా ఆదేశమైనందున మీరు తక్షణమే దీనిని పాటించగలరు. మీ ఆధ్వర్యములో పనిచేయుటలో నాకెలాంటి అభ్యంతరము లేదు, నేను ఒక సైన్యాధిపతిగా పని చేసినట్లే మీ ఆధ్వర్యములో కూడ పని చేయుదును. ఇది విధేయతకు ప్రమాణము. హజ్రత్ ఉమర్ (రజి) నిర్ణయము అప్పుడు అనుచితమని ఒక అవివేకి అనవచ్చును. ఇది కూడ తప్పుడు ఆలోచన. మనకు పరిస్థితులు తెలియవు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఎందుకు ఈ నిర్ణయము తీసుకొనిరో వారికే మంచిగా తెలియును. ఏదేమైనా ఈ నిర్ణయములో శాసనమునకు విరుద్ధముగా బాహ్య రూపములో ఎటువంటి విషయము కనిపించడం లేదు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ నిర్ణయమును అల్లాహ్ కూడ పూర్తిగా ననుసరించినట్లు మీరు చూడవచ్చును. ఈ యుద్ధము జయించబడెను. ఈ యుద్ధములో పలు మార్లు ఒక్క ముస్లింనకు పోటీగా వంద శత్రు సైనికుల సంఖ్య వుండినను ఈ విజయము లభించెను.

తన యజమాని నిరూపమాణ బానిసత్వములో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు నిర్ణయాధికారి, న్యాయమూర్తి స్థానము లభించెను. కావున ఈ కాలములో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం విధేయత, ప్రేమతోనే హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా

సల్లల్లాహు అలైహి వసల్లం విధేయత, ప్రేమ ప్రకటన నిజమగును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయతతోనే అల్లాహ్‌తో ప్రేమ ప్రకటన నిజమగును. అందుకే అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿قُلْ اِنْ كُنْتُمْ تُحِبُّوْنَ اللّٰهَ فَاتَّبِعُوْنِىْ يُحْبِبْكُمُ اللّٰهُ وَيَغْفِرْلَكُمْ ذُنُوْبَكُمْ .وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ﴾

(ఆలె ఇమ్రాన్: సూక్తి 32) అనగా మీకు అల్లాహ్ పట్ల ప్రేమ వున్నచో నన్ను అనుసరింపుము. అప్పుడు అల్లాహ్ మిమ్ములను ప్రేమించును. మీరు చేసిన దోషములను క్షమించును. అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడు. పరమ కారుణ్యమూర్తి. అని వారితో చెప్పుము.

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పొందినదంతయు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయత వల్లనే పొందిరి

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"నేను ఏదేని నా నైపుణ్యముతో కాక అల్లాహ్ కృపానుసారము మాత్రమే నా కంటే ముందు సందేశహరులు, ప్రవక్తలు, దైవ సత్పురుషులు పొందిన అనుగ్రహములో సంపూర్ణ భాగము పొందితిని. నేను నా నాయకుడు, యజమాని, సందేశహరుల గర్వ కారణమైన, మానవులలో సర్వోన్నతులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం మార్గములను అనుసరించనిచో ఈ అనుగ్రహమును పొందుట నాకు అసాధ్యమై యుండెడిది. కనుక నేను పొందినదంతయు ఈ విధేయతతోనే

పొందితిని. ఈ నబీ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించనిదే ఏ మానవుడు అల్లాహ్ వద్దకు చేరలేడని లేదా సంపూర్ణ జ్ఞానము పొందలేడని నా నిజమైన, సంపూర్ణ విద్యతో నేను తెలుసుకున్నాను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన, సంపూర్ణ అనుసరణ తర్వాత అన్నిటికంటే ముందు హృదయములో కలిగేదేమిటో ఇచట నేను తెలిపెదను. అది ప్రశాంతమైన హృదయమని గుర్తుంచుకొనుము. అనగా హృదయము నుండి ప్రపంచ ప్రేమ దూరమగును, హృదయము శాశ్వత, ఎన్నడు తరగని అభిరుచిని కోరును. ఆ తర్వాత ఈ ప్రశాంత హృదయము వలన ఒక పరిశుద్ధమైన, పరిపూర్ణ దైవానురాగము లభించును. ఈ అనుగ్రహములన్నియు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయత వలన వారసత్వముగా లభించును. అల్లాహ్ స్వయముగా ఇట్లు నుడివెను.
﴿قُلْ اِنْ كُنْتُمْ تُحِبُّوْنَ اللّٰهَ فَا تَّبِعُوْنِىْ يُحْبِبْكُمُ اللّٰهُ﴾ (ఆలె ఇమ్రాన్:సూక్తి 32)
అనగా నీవు వారితో ఇట్లు చెప్పుము. మీకు అల్లాహ్ పట్ల ప్రేమ వున్నచో నన్ను అనుసరింపుము. అప్పుడు అల్లాహ్ మిమ్ములను ప్రేమించును. ఏక పక్ష ప్రేమ ప్రకటన పూర్తిగా అబద్ధము, నోటి మాటే అగును. మానవుడు నిజముగా అల్లాహ్‌ను ప్రేమించినప్పుడు అల్లాహ్ కూడ అతన్ని ప్రేమించును. అప్పుడు భూమిపై అతని కొరకు ఒక ఆమోదము వ్యాపింప జేయబడును. వేలాది ప్రజల హృదయములో అతని పట్ల నిజమైన ప్రేమను కలిగించబడును. ఒక ఆకర్షణ శక్తి అతనికి లభించును. అతని వెంట సదా వుండు ఒక కాంతి అతనికి ఇవ్వబడును. మానవుడు హృదయపూర్వకముగా అల్లాహ్‌ను ప్రేమించి, మొత్తం ప్రపంచముపై అతనికి ప్రాధాన్యత నిచ్చి, దైవేతరుని గొప్పతనము, వైభవము అతని హృదయములో

వుండకపోవడమే కాక అందరిని ఒక నిర్జీవ కీటకము కంటే హీనముగా భావించినప్పుడు అల్లాహ్ అతని హృదయమును చూడును. అప్పుడు అల్లాహ్ ఒక శక్తివంతమైన కాంతితో అతనిపై అవతరించును. సూర్యుని ఎదుట పెట్టబడిన ఒక శుభ్రమైన అద్దములో సూర్యుని ప్రతిబింబము పరోక్షముగా, సూచనప్రాయముగా ఆకాశమున వున్న సూర్యుడే ఈ అద్దములో కూడ వున్నాడనినట్లు పూర్తిగా పడును. ఇటులనే అల్లాహ్ ఇట్టి హృదయములో అవతరించి, అతని హృదయమును తన సింహాసనముగా చేసుకొనును. ఈ విషయము కొరకే మానవుడు పుట్టించబడెను."

(హఖీఖతుల్ వహీ – రూహాని ఖజాయిన్ సంపుటి 22 పుట 64,65)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు గల ఈ ప్రేమానురాగము వల్లనే అల్లాహ్ వారి హృదయమును తన సింహాసనముగా చేసుకొనెను. స్థాయిలను బట్టి భవిష్యత్తులో కూడ అల్లాహ్ హృదయములపై అవతరించుచుండును. కాని ఇప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ప్రేమ ప్రకటన, వారి సంపూర్ణ విధేయత ప్రకటన వారి ఆధ్యాత్మిక సుపుత్రునితో ప్రేమ, విధేయత బంధము కలిగి వున్నప్పుడే నిజముగా ఋజువగును. అందుకే వారిట్లనిరి. అన్ని బంధముల కంటే అధికముగా నాతో ప్రేమ, విధేయత బంధమును ఏర్పరచుకొనుము. ఇప్పుడు మీరు ఈ మార్గము ద్వారనే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరింతురు, అనంతరం అల్లాహ్ ప్రేమను పొందుదురు. వారు వృధాగా ఇట్లు చెప్పడం లేదు. స్వయాన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకీ విషయము ఇట్లు ఉపదేశించియున్నారు. మసీహ్, మహ్దీ కాలమును చూచినచో మోకాళ్ళపై వెళ్ళవలసి వచ్చినను

వెళ్ళి నా సలాం తెలుపుము. ఇంత గట్టిగా, ఇంత బాధ కలిగించి ఈ సందేశమును అందించుటలో ఏ రహస్యము గలదు ? అదేమనగా అతడు నా ప్రియుడు, నేను అతని ప్రియున్ని. ప్రియుల వద్దకు ప్రియుల ద్వారనే చేరవచ్చుననునది ఒక సిద్ధాంతము. కనుక మీరు నన్ను అనుసరించు వారిగా కావాలని కోరినచో మసీహ్ మౌవూద్‌ను అనుసరింపుము. అతన్ని ఇమామ్‌గా స్వీకరించుము. అతని సంస్థలో చేరుము. అందుకే హదీస్‌లో ఇట్లు ప్రస్తావన గలదు. "జాగ్రత్తగానుండుము! మరియమ్మ కుమారుడు ఈసా (మసీహ్ మౌవూద్) మరియు నా మధ్య ఏ సందేశహరుడు, ప్రవక్త రాడు. గట్టిగా వినుము! నా తర్వాత సమాజములో అతడు నా ఖలీఫా అగును. అతడు తప్పక దజ్జాల్‌ను సంహరించును. శిలువను ముక్కలు ముక్కలు చేయును. అనగా శిలువ విశ్వాసమును పటాపంచలు చేయును. పన్నును ఎత్తి వేయును" (ఆ కాలము అనగా వారి కాలములో దీని సంప్రదాయము కనుమరుగైపోవును. ఎందుకనగా అప్పుడు మత యుద్ధములు సంభవించవు. కనుక పన్ను సంప్రదాయము కూడ కనుమరుగైపోవును). గుర్తుంచుకొనుము! వారిని కలిసే అదృష్టము ఎవరికి లభించినా వారికి నా సలాం తప్పక అందించుము".

(తిబ్రాని అల్ ఔసత్ వస్సఘీర్)

ఈ హదీసును గ్రహించే బదులు, దీనిని దీర్ఘంగా గ్రహించి తెలుసుకొన్న వారి మాటను అర్థము చేసుకునే బదులు నేటి విద్యావంతులు దీని బాహ్య అర్థముల వెనుక పడి, సాధారణ ముస్లిములను తప్పుడు మార్గములో పడవేసిరి. అసభ్యకర తుఫానుకు కారణమైనారు. అల్లాహ్‌యే రక్షించునుగాక! మేము అల్లాహ్ శరణమునే అన్వేషించెదము. అతడు వారిని

ఎదుర్కొంటున్నాడు కూడ, ముమ్ముందు కూడ ఎదుర్కొనును. ఇన్షాఅల్లాహ్. న్యాయస్వభావము గల అధికారిగా మసీహ్ మౌవూద్ యుండునని ఈ హదీసు ద్వారా స్పష్టముగా తెలియును. న్యాయమును ప్రపంచములో స్థాపించు ఇమామ్ అగును. అందుకే అతనితో సంబంధము పెట్టుకొనుము, అతని ఆజ్ఞలను పాటించుము, అతని బోధనను అనుసరింపుము. ఎందుకనగా అతడు న్యాయము, నీతినే బోధించును. అది ఖురాన్ బోధన తప్ప మరేమియును కానే కాదు. మసీహ్ అవతరించి సుత్తెలను పట్టుకొని శిలువను విరగ్గొట్టునను భావముతో నేటి ప్రజలు శిలువను ముక్కలు చేయుటకు సంకల్పించిరి. ఇవన్నియు వృధా విషయాలు. స్పష్టమైన విషయమేమనగా ఆ అవతరించు మసీహ్ తన యజమాని అనుసరణలో నిదర్శనములతో ఒప్పించును. నిదర్శనములతో శిలువ విశ్వాసమును ముక్కలు చేసి రూపుమాపును. దజ్జాల్‌ను హతమార్చుట అనగా దజ్జాలీ మోసము నుండి ముస్లిం సమాజమునకు విముక్తి కల్పించును. మత యుద్ధముల ఆచారము ముగియును కనుక పన్ను సంప్రదాయము కూడ అంతమగునను విషయము విధితమే. ఈ హదీసులలో సలాం అందించు ఆదేశము కూడ గలదు. సలాం అందించే బదులు ముస్లిములు రాబోవు మసీహ్ వ్యతిరేకతలో నిమగ్నమైరి. అల్లాహ్‌యే వీరికి వివేకము ప్రసాదించు గాక!

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్థాయి, వారితో విధేయత సంబంధము ఎందుకు కలిగివుండవలెనని తెలుపు మరో హదీసు ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరని హజ్రత్ అబూహురైరహ్ (రజి) తెలిపిరి. న్యాయస్వభావము గల, అధికారి, న్యాయమూర్తి, ఇమామ్‌గా మరియమ్మ కుమారుడు ఈసా అవతరించనంత

వరకు ప్రళయ దినము రాదు. (వారు అవతరించి నప్పుడు) వారు శిలువను పటాపంచలు చేయుదురు. పందిని హతమార్చుదురు, పన్ను సాంప్రదాయమును అంతమొందితురు. ప్రజలు తీసుకొనుటకు సిద్ధముగా నుండని ధనమును పంచి పెట్టుదురు.”

(సునన్ ఇబ్నె మాజ కితాబుల్ ఫితన్ బాబ్ ఫిత్నతుద్దజ్జాలి వఖురూజు ఈసా బిన్ మర్యమ్ వఖురూజు యాజూజ్ మాజూజ్)

ఈ హదీసును కూడ అర్థము చేసుకొనవలసిన అవసరముండెను. బుద్ధిహీనులకు అర్థము కాలేదు. వారు బాహ్య భావమును పట్టుకొనిరి. విచిత్రమైన హాస్యాస్పద వివరణలు చేయుదురు. పందిని హతమార్చుడమనగా పంది లక్షణము గల వారిని అంతము చేయుట అని స్పష్టమైనది. ఇతర జంతువుల కంటే పంది దుష్టత్వములు ఇప్పుడు విధితమే. ఆ దోషములు మానవులలో పుట్టినచో వారిని సంస్కరించుట అనివార్యమగును. వారు ధనము ఇత్తురు, ధనము పంచి పెట్టుదురు. దీనిని కూడ వీరు అర్థము చేసుకోరు. గత కొద్ది రోజుల క్రితం పాకిస్తాన్‌లో విద్యావంతులు సభ నిర్వహించిరి. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు వ్యతిరేకముగా, జమాఅత్‌నకు విరుద్ధముగా అతి హీనమైన భాషను ఉపయోగించుచు ఈ ప్రశ్న కూడ లేవనెత్తిరి. మసీహ్ అవతరించి ప్రజలతో ధనమునడగక ధనమును పంచిపెట్ట వలసి యుండెను. కాని చూడుము! అహ్మదీయులు (వారు ఖాదియానీలు అందురు) చందాలు వసూలు చేయుదురు. కనుక వారు అసత్యులని దీనితో ఋజువైనది. ఈ అవివేకులకు ఏ వివేకి అర్థమయ్యేలా చెప్పలేడు. అనగా మసీహ్ పంచుచున్న ఆధ్యాత్మిక నిధులను మీరు తీసుకొనుటకు నిరాకరించుచున్నారు. వాస్తవమేమనగా వారికి ఒక్క

ప్రాపంచిక నేత్రమే గలదు. ఇంతకు మించి వారు ముందుకు వెళ్ళలేరు. వారి పని అదే. వారిని చెయ్యనివ్వుము. పాకిస్తానీ అహ్మదీయులు ఎక్కువ చింతించ వలసిన అవసరము లేదు. వారి మలినము, వ్యర్థ మాటలను విని సహనము ప్రదర్శించుచు, స్థైర్యమును చూపుచు, ముఖమును త్రిప్పుకొని వెళ్ళిపొమ్ము. వారి మలినమునకు పోటీగా మేము నిజముగనే పరాజయము పాలైనామని అంగీకరించుచున్నాము. మేము వారి మలినముతో పోటీ పడనే పడలేము. కాని నేనొక విషయమును స్పష్టము చేయదును. దాసుడు మాట్లాడనప్పుడు అల్లాహ్ మాట్లాడును. అల్లాహ్ మాట్లాడినప్పుడు వ్యతిరేకుల ముక్కలు గాలిలో చెల్లాచెదురైనట్లు మనము చూసితిమి. ఇన్షాఅల్లాహ్ ముమ్ముందు కూడ చూచెదము. కావున అహ్మదీయులు మసీహ్ మౌవూద్‌తో సత్యమైన బంధమును ఏర్పరచుకొని. దుఆలపై అతిగా శ్రద్ధ వహించి. ఎల్లప్పుడు దుఆలో నిమగ్నమై వుండుము. ఈ హదీసులతో స్పష్టమైన మరో విషయమేమనగా అవతరించే మసీహ్ ఇమామ్ కూడ అగును. న్యాయాధికారి కూడ అగును, న్యాయ, నీతి నిజాయితి గల రాజ కుమారుడగును. అతనితో తప్పక బంధమును ఏర్పరచుకొనుము. న్యాయాధికారి, ఇమామ్ స్థాయిలో అతని విధేయత మీపై తప్పనిసరి. అందుకే మీ శ్రేయస్సు కొరకు, మీ సంస్కరణ కొరకు చెప్పబడిన ఈ విషయములను పాటించుము. తద్వారా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియులలో ప్రవేశింతురు, దైవ సామీప్యము పొందువారిలో చేరుతురు.

## ప్రతి స్థితిలో విధేయత అనివార్యము

విధేయత అంశముపై పలు హదీసులను ప్రవేశపెట్టెదను. వీటితో

విధేయత ప్రాముఖ్యత తెలియును.

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఇబ్బంది, సౌఖ్యము, సుఃఖము, దుఃఖము, న్యాయ, అన్యాయము అనగా ప్రతి స్థితిలో వర్తమాన అధికారి ఆజ్ఞను వినుట, విధేయత వహించుట నీ కర్తవ్యము.

(ముస్లిం కితాబుల్ ఇమారహ్)

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్‌హు కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. తమ నాయకుని, అధికారిలో ఏదైనా తనకు ఇష్టము లేని విషయము చూసిన వ్యక్తి సహనము పాటించవలెను. ఎందుకనగా జమాఅత్ నుండి ఒక జానెడు దూరమైన వ్యక్తి మూర్ఖత్వ మరణము పొందును.

(బుఖారి కితాబుల్ ఫితన్ బాబ్ ఖౌలిన్నబియ్యి సతరూన బాదీ ఉమూరన్)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇట్లనుచుండగా నేను వింటినని హజ్రత్ అర్ఫజహ్ (రజి) తెలిపిరి. మీరు ఒక హస్తముపై ఏకమైనప్పుడు మీకొక నాయకుడు వున్నప్పుడు ఒక వ్యక్తి వచ్చి మీ జమాఅత్‌లో విభేదము సృష్టించుటకు ఈ ఐక్యత కర్రను విరగ్గొట్ట దలచినచో అతన్ని హతమార్చుము. అనగా అతనితో సంబంధము తెంచుకొనుము. అతని మాటను వినకుము. (అతని ఆదేశములను పట్టించుకోకుము)

(ముస్లిం బాబ్ హకమ మన్ ఫరఖ అమ్రల్ ముస్లిమీన హువ ముజ్తమివున్)

హజ్రత్ ఉబాదహ్ (రజి) బిన్ సామిత్ ఇట్లు తెలిపిరి. మేము మాకు ఇష్టమున్నను ఇష్టము లేకున్నను మేము వినెదము, విధేయత వహించెదము. ఇంకా ఏమనగా మేమెక్కడున్నను ఏదేని విషయములో

హక్కుదారునితో వివాదము చేయము. సత్యముపై స్థిరపడదెము లేదా సత్యమునే పలుకెదము. అల్లాహ్ విషయములో అపనిందలు చేయువాని నిందలకు మేము భయపడమను విషయములపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భైఅత్ చేసితిమి.

(ముస్లిం కితాబుల్ అమారతి బాబ్ వజూదు తాఅతిల్ ఉమరాయి)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇట్లనుచుండగా నేను వింటినని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపిరి. అల్లాహ్ విధేయత నుండి వెనుకాడు వ్యక్తి ప్రళయ దినమున అతడి వద్ద ఏ నిదర్శనము గాని, ఏ సాకు గాని లేని స్థితిలో అతడు అల్లాహ్‌తో కలుసుకొనును. వర్తమాన ఇమామ్ భైఅత్ చేయకుండానే మరణించిన వ్యక్తి మూర్ఖత్వ, దుర్మార్గ మృతి చెందెను.

(ముస్లిం కితాబుల్ అమారతి బాబుల్అమ్రి బిలుజూమిల్
జమాఅతి ఇంద జహూరిల్ ఫిత్నతి)

వర్తమాన ఇమామ్‌ను నమ్మి, అతని భైఅత్‌లో చేరిన మీరు అదృష్టవంతులు. ఇప్పుడు స్వచ్ఛతతో అతని విధేయత మాత్రమే వహించవలెను. అతని మొత్తము ఆదేశములను పాటించవలెను. లేనిచో అల్లాహ్ విధేయత వహించని వారిలో చేరుదురు. ప్రతి అహ్మదీయున్ని అల్లాహ్ గొప్ప విధేయత ప్రమాణముపై నిలుపుగాక! ఈ గొప్ప ప్రమాణములు ఎట్లు ఏర్పడును. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బోధనను పాటించితేనే ఈ ప్రమాణములను పొందవచ్చును.

## సంస్థలో ఎవరు చేరుదురు

వారిట్లనిరి. "మా బోధనను కార్యాచరణగా నియమించుకొని, తన

స్థైర్యము, ప్రయత్నము మేరకు దానిని అమలు చేయు వాడే మా సంస్థలో చేరును. కాని పేరు మాత్రమే వ్రాయించి బోధనకనుగుణముగా అమలు చేయని వాడు గుర్తుంచుకోవలసినదేమనగా ఈ సంస్థను ఒక ప్రత్యేక సంస్థగా చేయుటకు అల్లాహ్ సంకల్పించెను. యదార్థముగా సంస్థలో లేని వాడు అనగా కేవలము పేరు వ్రాయించి సంస్థలో చేరిన వానిపై ఏదో ఒక సమయము వచ్చును. అప్పుడతడు విడిపోవును. కావున సాధ్యమైనంత వరకు ఇవ్వబడుచున్న బోధన ప్రకారము తమ కర్మలను చేయుము."

ఆ బోధన ఏమిటి? వారిట్లనిరి."పీడనము మాటలు మాట్లాడకుము. దుష్టత్వము చేయకుము. దూషణపై సహనము వహించుము. ఎవరిని ఎదురించకుము.ఎదురించిన వానితో మంచిగా, పుణ్యముగా వ్యవహరించుము. కమ్మని సంభాషణపు ఉత్తమ ఉదాహరణను చూపుము. అల్లాహ్ రాజీ అగునట్లు సహృదయముతో ప్రతి ఆజ్ఞను పాటించుము. ఇతడు బైఅత్ చేసిన తర్వాత పూర్వపు వ్యక్తిలా లేడని శత్రువు కూడ తెలుసుకోవలెను. వాజ్యములలో నిజమైన సాక్ష్యములివ్వుము. ఈ సంస్థలో ప్రవేశించు వాడు హృదయపూర్వకముగా, సంపూర్ణ ధైర్యము, పూర్తి శక్తితో సత్యమునకు కట్టుబడి వుండవలెను. ప్రపంచము అంతమగు సమయమాసన్నమైనది."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 620, 621 క్రొత్త ప్రచురణ)

ఇప్పుడిక్కడ పీడనమును మాట్లాడకుమని వారనిరి. కేవలము ఆనందము పొందుటకు ఇక్కడి విషయము అక్కడ, అక్కడి విషయము ఇక్కడ చెప్పే అలవాటు కొందరికి వుండును. వాటితో పీడనమునకు అవకాశముండును. వివిధ రకాల స్వభావములుండును. ఒకనితో సంబంధమున్న మాటలు అతనితోనే మాట్లాడినచో అతని మనస్సులో

ఎవరితో అంటగట్టి మాటలాడిన వ్యక్తిని గూర్చి కోపము పుట్టుట చాలా సహజము. నా దృష్టిలో ఇటువంటి కోపము కూడ కలుగ కూడదు. ఈ పీడనముల నివారణకు ఒక పద్ధతి గలదు. అదేమనగా ఇటువంటి విషయములు ఎవరి పేరున చెప్పబడినవో అతన్ని నేరుగా కలిసి నా వరకు ఈ విషయములు ఈ విధముగా చేరినవి. నీవు ఈ విషయములు మాట్లాడినావా లేదా అని వివరణ కోరవలెను. అక్కడే స్పష్టమై పోవును. ఇటువంటి పీడనమును కలిగించే వారి సంస్కరణ కూడ అగును. కొన్ని సందర్భాలలో ఈ పీడనము కలిగించే వారు కుటుంబముల మధ్య కలహములు సృష్టింతురు. ఇటువంటి పీడన విషయముల నుండి మీరు కూడ దూరముండుము. పీడనము సృష్టించే వారితో కూడ దూరముండుము. సాధ్యమైనచో వారి సంస్కరణకు ప్రయత్నించుము. దుష్టత్వము ప్రత్యక్ష జగడములు, దూషణముల వలన ఏర్పడును. దీని వలన పీడనము కూడ ఏర్పడును. అందుకే ఇట్లనిరి. మీకు నాతో సంబంధమున్నచో, నా విధేయతను స్వీకరించినచో ప్రతి పీడనము, దుష్టత్వ విషయముల నుండి దూరముండుమని కూడ నా బోధ. ఆత్మ స్థైర్యముండినచో ఎవరైనా మిమ్ములను దూషించినను మీరు సహనము పాటించగలరు. ఈ బోధనను అనుసరించినచో మోక్షపు ద్వారములు మీ కొరకు తెరుచుకొనును. దైవసమీపులలో మీరు చేరుదురు. ఏ విషయములోను వ్యతిరేకత వుండ కూడదు. సత్యవంతులై అసత్యుల వలె వినమ్రత అవలంభించుము. మిమ్ములను ఎవరు ఏమన్నను మీరు ప్రేమానురాగము, చనువుగా వ్యవహరించుము. తియ్యని మాటలతో కూడిన పవిత్ర సంభాషణను అలవర్చుకొనుము. మీ సత్ప్రవర్తనలు ప్రజలు మీ వైపు ఆకర్షితులగు

నట్లుండవలెను. మీ సమాజములో ప్రతి ఒక్కరికి మీరు అహ్మదీ అని తెలిసిపోవలెను. అతనితో ఉన్నతమైన సద్గుణములు తప్ప మరేమియును ఆశించకూడదు. మీ ఈ సద్గుణములు కూడ ఇతరులను ఆకర్షించుటకు, శ్రద్ధ వహించుటకు కారణమగును.

వాజ్యములలో కొందరు స్వార్థము కొరకు అసత్యపు సాక్ష్యములిత్తురు. తన అబద్ధపు వాజ్యము కూడ ప్రవేశపెట్టుదురు. ఇట్లనిరి. మీరు సత్యమైన సాక్ష్యమిచ్చుటకు మీ స్వలాభము కూడ అడ్డు పడకూడదు. కొందరు ఇక్కడ కూడ, ఇతర దేశములలో కూడ కొన్ని సందర్భాలలో విదేశములకు పోవు సమస్యలో పడి తప్పుడు సమాచారమిత్తురు. ఈ విషయముల నుండి దూరముండుము. సరైన పరిస్థితుల ప్రకారము తమ వాజ్యమును ప్రవేశపెట్టించుము. అంగీకరించబడినచో సరే, లేనిచో తిరిగి వెళ్ళిపొమ్ము. ఎందుకనగా తప్పుడు సమాచారము ఇచ్చినను కొందరి వాజ్యములు (Reject) తిరస్కరించబడును. కావున సత్యముపై నిలిచి పరీక్షించుకొనుము. ఇన్షాఅల్లాహ్ ప్రయోజనమే కలుగును. ఒక వేళ తిరస్కరణకు గురైనా కనీసం అల్లాహ్ అసంతృప్తికి కారణము కాకుండా వుందురు.

## పరస్పరము సోదరభావము, ప్రేమ కలిగి యుండుము, అల్లాహ్‌తో నిజమైన బంధమును సృష్టించుకొనుము

మరల పరస్పరము ప్రేమ, సోదరభావమును బోధించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"పరస్పరము సోదరభావము, ప్రేమ కలిగి మృగత్వము, విభేదమును వీడుము. ప్రతి రకమైన ఎగతాళి, అపహాస్యము నుండి పూర్తిగా దూరముండుము. ఎందుకనగా ఎగతాళి మానవుని హృదయమును సత్యము నుండి దూరము చేసి ఎక్కడికో చేర్చును. పరస్పరము ఒకరు మరొకరితో గౌరవముగా వ్యవహరించుము. ప్రతి ఒక్కరు తన విశ్రాంతిపై తన సోదరుని విశ్రాంతికి ప్రాధాన్యత ఇవ్వవలెను. అల్లాహ్‌తో నిజమైన సంధి ఏర్పరచుకొనుము. అతని విధేయతలో తిరిగి రమ్ము. ప్రతి ఒక్కరు పరస్పర వివాదములు, ఉద్రేకము, శత్రుత్వమును మధ్య నుండి తొలగించుకొనుము. అల్ప విషయములను విస్మరించి ప్రధాన, ఉన్నత స్థాయి కార్యములలో నిమగ్నమయ్యే సమయము ఇప్పుడు ఆసన్నమైనది."

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 266-268)

మరల వారిట్లనిరి. "మా జమాఅత్‌నకు అల్లాహ్‌తో సత్యమైన సంబంధముండవలెను. వారు కృతజ్ఞతలు తెలుపవలెను. ఎందుకనగా అల్లాహ్ వారిని వృధాగా వీడక విశ్వాస శక్తులను నమ్మక స్థాయి వరకు పెంచే వందలాది చిహ్నాములు తన శక్తితో చూపెను. నేను ఏ చిహ్నాము చూడలేదని అనే వాడెవడైనా మీలో వున్నాడా! మా సహవాసములో వుండే అవకాశము లభించిన వ్యక్తి అల్లాహ్ తాజా చిహ్నామును తన కనులతో చూడని వాడు ఒక్కడు కూడ లేడని నేను గట్టిగా చెప్పగలను.

మన జమాఅత్‌నకు అనివార్యమైన విషయమేమనగా వారి విశ్వాసము పెరగవలెను. అల్లాహ్‌పై నిజమైన నమ్మకము, జ్ఞానము కలుగవలెను. సత్కార్యములలో అలసట, అలసత్వము తగదు. ఎందుకనగా అలసత్వమున్నచో ప్రక్షాళనము (వజూ) చేయుట కూడ ఒక ఆపదగా

అనిపించును, తహజ్జుద్ ఎలా చదువును. సత్కార్యముల శక్తి కలగనిచో, సత్కర్మలలో అహమహమిక ఉత్సాహము లేనిచో మాతో సంబంధము ఏర్పరచు కొనుట నిష్ప్రయోజనమగును.”

(మల్ఫూజాత్ సంపుటి 2 పుట 710, 711 క్రొత్త ఎడీషన్)

ఈ బైఅత్ నిబంధనలో అనగా 10వ నిబంధన కొనసాగుచున్నది. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ ప్రాపంచిక సంబంధములో కనిపించని విధముగా తనతో సంబంధముండవలెనను విషయమును ఎంతో గట్టిగా నొక్కి చెప్పిరి. దీనికి కారణము కేవలము మనతో సానుభూతి మాత్రమే. మనలను నాశనము నుండి రక్షించుటకే వారనిరి. ఎందుకనగా నిజమైన ఇస్లాం కేవలము వారిని విశ్వసించినచో లభించును. మునిగిపోకుండా తమను తాము మనము రక్షించుకోవాలంటే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పడవలో ఎక్కవలెను.

వారిట్లనిరి. “నా వైపు పరుగెత్తుము. నా వైపు పరుగెత్తు వానిని తుఫాను సయమున వచ్చి పడవలో కూర్చున్న వ్యక్తితో పోల్చెదను. కాని తనను తాను తుఫానులో పడవేసుకున్న వ్యక్తిలా నన్ను నమ్మని వాడిని రక్షించుకొనుటకు అతని వద్ద ఏ వస్తువు లేనట్లు నేను చూచుచున్నాను. నిజమైన సిఫారసున్ని నేను ఎందుకనగా ఆ మహా సిఫారసుని ఛాయను నేను. ఈ కాలపు అంధులు స్వీకరించని వారి నీడను. వారిని అనగా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంను చాలా అవమానించిరి.”

(దాఫివుల్ బలా– రూహాని ఖజాయిన్ సంపుటి 18 పుట 233)

ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారమే

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటన గలదని ఇట్లనిరి.

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హస్తముపై చేయు బైఅత్ ప్రతిజ్ఞతో రెండు ప్రయోజనములు గలవు

వారిట్లనిరి. "నా హస్తముపై చేయబడు బైఅత్‌తో రెండు ప్రయోజనములు గలవు. ఒకటి పాపములు క్షమించబడును. మానవుడు అల్లాహ్ వాగ్దానము మేరకు క్షమాపణకు అర్హుడగును. రెండవది అవతారుని ఎదుట పశ్చత్తాప పడడంతో శక్తి లభించును. షైతానీ దాడుల నుండి మానవుడు రక్షించబడును. గుర్తుంచుకొనుము! ఈ సంస్థలో చేరుటకు ప్రపంచము ఉద్దేశము కాక అల్లాహ్ ప్రీతియే ఉద్దేశముగా నుండవలెను. ఎందుకనగా ప్రపంచము గడిచిపోవు స్థానము. అది ఏదో ఒక రకంగా గడిచిపోవును. شب تنور گذشت و شب سمور گذشت (అనగా కష్టమైనా లేదా సుఖమైనా రాత్రి మాత్రం గడిచిపోవును.)

ప్రపంచము, దాని ఉద్దేశములు, లక్ష్యములను పూర్తిగా విడిగా వుంచుము. వాటిని ధర్మముతో అస్సలు కలుషితము చేయకుము. ఎందుకనగా ప్రపంచము అంతమయ్యే వస్తువు. ధర్మము, దాని ఫలములు సదా వుండును". (మల్ఫూజాత్ సంపుటి 6 పుట 145)

## ఈ కాలపు దృఢమైన కోట హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

వారిట్లనిరి. "ఓ చిరంజీవులైన మీరు! నా ప్రియులారా! నా వృక్షపు

సశ్యశ్యామలమైన శాఖలారా! మీ పై అల్లాహ్ దయ యున్నందులకే మీరు నా బైఅత్ పరంపరలో చేరితిరి. తమ జీవితము, తమ విశ్రాంతి, తమ ధనమును ఈ మార్గములో ధారపోయుచున్నారు. నేను చెప్పిన మొత్తమును స్వీకరించుటయే తమ అదృష్టముగా భావింతురని మీ శక్తిమేర ప్రయత్నించుటకు వెనుకడుగు వేయరని నాకు తెలుసు. కాని మీ సేవలు నేను చెప్పినందుకు కాక మీ సంతోషముతో కావలెను. అందుకే ఈ సేవ కొరకు నేను నా నోట నిర్ణీత రూపంలో మీపై ఏమియును విధించలేను. నా మిత్రుడెవడు ? నా చిరంజీవి ఎవడు ? నన్ను గుర్తించిన వాడే. నన్నెవడు గుర్తించును ? నేను పంపబడినానని నమ్మిన వాడే నన్ను గుర్తించును. పంపబడిన వారిని గుర్తించే విధముగా నన్ను గుర్తించును. ప్రపంచము నన్ను గుర్తించలేదు. ఎందుకనగా నేను ప్రపంచములోని వాడను కాను. కాని పరలోకపు భాగము ప్రసాదించబడిన వారు నన్ను గుర్తించుచున్నారు, గుర్తింతురు. నన్ను వీడువాడు నన్ను పంపినవాడిని వీడును. నాతో సంబంధము పెట్టుకొనిన వాడు నన్ను పంపినవానితో సంబంధము పెట్టుకొనును. నా చేతిలో ఒక దీపము గలదు. నా వద్దకు వచ్చినవాడు దానితో తప్పక జ్యోతిని పొందును. కాని భ్రమ, అపోహతో దూరము పరుగెత్తువాడు అంధకారములో పడవేయ బడును. నేను ఈ కాలపు దృఢమైన కోటను. నాలో ప్రవేశించువాడు దొంగలు, దోపిడీదారులు, మృగాలతో తన ప్రాణమును రక్షించుకొనును. కాని నా గోడల నుండి దూరముండదలచిన వానిని నలువైపుల నుండి మృత్యువు వెంటాడును. అతని శవము కూడ సురక్షితముగా వుండదు. నాలో ఎవడు ప్రవేశించును! దుష్టత్వమును వీడు వాడు, సత్కార్యమును అవలంభించువాడు, వితండ

వాదమును వీడువాడు, సన్మార్గమును అనుసరించువాడు, షైతాన్ బానిసత్వము నుండి స్వతంత్రుడైనవాడు, అల్లాహ్ విధేయ దాసుడగును. ఇటుల చేయు ప్రతి వ్యక్తి నాలోని వాడు, నేనతనిలోని వాడను. కాని అల్లాహ్ ఎవడిని పవిత్ర ఆత్మ నీడన పడవేయునో అతడే ఇటుల చేయగలడు. అప్పుడతడు, అతని ఆత్మ నరకములో తన పాదమును మోపును. తద్వారా అందులో ఎన్నడు అగ్ని లేనట్లే అది శీతలమైపోవును. అప్పుడతడు ప్రగతిపై ప్రగతి సాధించును. తుదకు అల్లాహ్ ఆత్మ అతనిలో విడిది చేయును. ఒక ప్రత్యేక మహిమతో సర్వలోకాల సంరక్షకుడు అతని హృదయముపై అవతరించును.'' (అనగా అల్లాహ్ అతని హృదయముపై తన సింహాసనమును ఏర్పరచుకొనును) అప్పుడు అతని పూర్వ మానవత్వము ఆహుతై ఒక నూతన, పవిత్ర మానవత్వము అతనికి ప్రసాదించబడును. అల్లాహ్ కూడ ఒక నూతన ప్రభువై క్రొత్తగా, ప్రత్యేకముగా అతనితో సంబంధమునే ఏర్పరచు కొనును. స్వర్గ జీవితపు సంపూర్ణ సామాగ్రి అతనికి ఈ లోకములోనే లభించును.''

(ఫతహ్ ఇస్లాం- రూహానీ ఖజాయిన్ సంపుటి 3 పుట 34,35)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో చేసిన ప్రతిజ్ఞలన్నిటిని పూర్తి చేయు అనుగ్రహము అల్లాహ్ మనందరికి కల్గించుగాక! వారి బైఅత్ నిబంధనలన్నిటిపై మనము నిలిచేవారమగుగాక! వారి బోధనను అనుసరించుచు మన జీవితమును స్వర్గానికి ప్రతిరూపముగా చేసుకొని, పరలోక స్వర్గ వారసులము కూడ అగుదుము గాక! అల్లాహ్ మనకు సహకరించుగాక! ఆమీన్

(ఖుత్బా జుమా ప్రసంగము 19 సెప్టెంబర్ 2003 మస్జిద్ ఫజల్ లండన్ ఇంగ్లాండ్)

# హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) బైఅత్ చేసిన తర్వాత కలిగిన ఆధ్యాత్మిక మార్పుల పలు విశ్వాసపూరిత సంఘటనల ప్రస్తావన

# పదవ నిబంధన "సముచితము పట్ల విధేయత" విషయపు వివేకాత్మక విశ్లేషణ, వివరణ

﴿يٰٓاَيُّهَا النَّبِيُّ اِذَا جَآءَكَ الْمُؤْمِنٰتُ يُبَايِعْنَكَ عَلٰٓى اَنْ لَّا يُشْرِكْنَ بِاللّٰهِ شَيْـًٔا وَّلَا يَسْرِقْنَ وَلَا يَزْنِيْنَ وَلَا يَقْتُلْنَ اَوْلَادَهُنَّ وَلَا يَاْتِيْنَ بِبُهْتَانٍ يَّفْتَرِيْنَهٗ بَيْنَ اَيْدِيْهِنَّ وَاَرْجُلِهِنَّ وَلَا يَعْصِيْنَكَ فِيْ مَعْرُوْفٍ فَبَايِعْهُنَّ وَاسْتَغْفِرْ لَهُنَّ اللّٰهَ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ﴾

(అల్ ముమ్తహినహ్: 13)

గత ఖుత్బాలో బైఅత్ నిబంధనల పదవ, తుది నిబంధన గురించి ప్రస్తావించి యుంటిని. అయినను సముచితము పట్ల విధేయత గురించి నేను మరింత వివరించాలని భావించుచున్నాను. నేను పఠించిన ఈ సూక్తిలో స్త్రీలతో ఈ విధముగా బైఅత్ ప్రతిజ్ఞ తీసుకొను ఆదేశము గలదు. అనగా అన్యారాధన చేయము, దొంగతనము చేయము. వ్యభిచారము చేయము, సంతానమును హతమార్చము, (సంతాన సంస్కరణ పట్ల దృష్టి

సారించెదము) ఎవరిపై అసత్య ఆరోపణ చేయము, మంచి విషయాలలో అవిధేయత వహించము. అల్లాహ్ వైపున నియమించ బడిన సందేశహరుడు కూడ అనుచిత ఆదేశములు ఇవ్వ వచ్చునా ? అను ప్రశ్న ఇచట ఉత్పన్నమగును, సందేశహరులు చెయ్యగలిగినచో ఖలీఫాలు కూడ అనుచిత ఆదేశములు ఇవ్వ వచ్చును. సందేశహరుడు ఎన్నడు ఇటువంటి ఆదేశములు ఇవ్వనే ఇవ్వలేడు, సందేశహరుడు సముచిత తప్ప వేరే మాట అనలేడు. అందుకే అల్లాహ్, ప్రవక్త ఆదేశముల పట్ల విధేయత వహించి, వాటిని పాటించుమని పవిత్ర ఖురాన్‌లో అనేక చోట్ల ఆదేశము గలదు. సముచిత ఆజ్ఞనే పాటించవలెనని ఎక్కడ వ్రాసి లేదు, మరి రెండు విభిన్న ఆజ్ఞలు ఎందుకను ప్రశ్న ఉత్పన్నమగును, వాస్తవానికి ఇవి రెండు వేర్వేరు ఆజ్ఞలు కావు. అర్థము చేసుకొనుటలో పొరపాటు జరిగినది. నేను అన్నట్లు సందేశహరుని ప్రతి ఆజ్ఞ సముచితమే అయి వుండును. అల్లాహ్ ఆదేశములకు, శాసన ఆజ్ఞలకు విరుద్ధముగా సందేశహరుడు ఎన్నడు ఆజ్ఞాపించలేడు. ఎందుకనగా అతడు ఈ పని పైనే నియమించబడెను. ఏ పని కొరకైతే నియమించబడెనో దానికి వ్యతిరేకముగా ఎట్లు నడవగలడు. సందేశహరున్ని విశ్వసించి, అవతారున్ని నమ్మి, అతని సంస్థలో చేరి మీరు సురక్షితులైనందుకు మీకిది శుభవార్త. ఇప్పుడు ఎటువంటి అనుచిత ఆజ్ఞ మీ కొరకు లేనే లేదు. అల్లాహ్ దృష్టిలో ఇష్టమైన ఆజ్ఞయే మీకు గలదు. హ్రజత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) దీనిని వివరించుచు ఇట్లు నుడివిరి.

"సముచితము పట్ల విధేయత వహించు విషయమును అర్థము చేసుకొనుటలో మరో తప్పిదము గలదు. అనగా మనము సముచితమని

భావించని పనులలో విధేయత వహించము. ఈ పదము నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు కూడ వచ్చినది. ﴿وَلَا يَعۡصِيۡنَكَ فِيۡ مَعۡرُوۡفٍ﴾ (అల్ ముమ్తహినహ్ : సూక్తి 13) హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం లోపముల ఒక పట్టిక కూడ ఇటువంటి వారు సిద్ధము చేసుకొనిరా ! ఇటులనే బైఅత్ నియమములలో హజ్రత్ గారు కూడ సముచితము పట్ల విధేయత అని వ్రాసిరి. ఇందులో ఒక రహస్యము గలదు. నేను మీలో ఎవరిని ఎప్పుడు అనుమానించను. మీలో ఎవరైనా లోలోపల మోసపోకూడదని నేను ఈ విషయములను స్పష్టము చేసితిని."

(ఖుత్బాతే నూర్ పేజి 420,421)

**يَاۡمُرُهُمۡ بِالۡمَعۡرُوۡفِ** ను వివరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు నుడివిరి.

"వివేకముతో కూడిన మాటలనే ఈ సందేశహరుడు ఆదేశించును. వివేకము కూడ నిరోధించు మాటల నుండి నిరోధించును, పవిత్ర వస్తువులను ధర్మ బద్ధము చేయును, అపవిత్ర వస్తువులను నిషేధించును. జాతులు ఏ భారము క్రింద నలిగిపోవుచున్నవో దానిని వారి తలల నుండి తొలగించును. ఏ మెడ గొలుసుల వలన మెడలు పైకి లేపలేక పోవుచున్నారో వాటి నుండి విముక్తి కల్పించును. కనుక అతన్ని విశ్వసించి, తన చేరికతో అతనికి సహాయపడి, అతనితో అవతరింపజేసిన కాంతిని అనుసరించు వారు ప్రపంచ, పరలోక కష్టముల నుండి ముక్తి పొందెదరు."

(బరాహీనె అహ్మదియ్య హిస్స పంజుమ్, రూహాని ఖజాయిన్ సంపుటి 21, పుట 420)

అల్లాహ్ ఆదేశాలను పాటించుచు. వివేకము అంగీకరించు, ఆజ్ఞలనే

ఇచ్చుచు, చెడు మాటల నుండి ఆపుచు, మంచి మాటలను ఆదేశించు సందేశహరుడు వీటికి దూరముండనే వుండలేడు. సందేశహరుని తర్వాత అతని కార్యమును నడిపించుటకు విశ్వాసుల ఒక సమూహము ద్వారా అల్లాహ్ తరపున నియమించబడిన ఖలీఫా కూడా అల్లాహ్ సందేశహరుని నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా మనకు అందించిన బోధన ఆదేశములనే ముందుకు కొనసాగించును. ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారమే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరించి మనకు తెలిపిరి. కనుక ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా సంస్థలో ఖిలాఫత్ వ్యవస్థ ఏర్పడెను. ఇది ప్రళయ దినము వరకు కొనసాగును. ఇన్షాఅల్లాహ్. వీరిలో శాసనము, తెలివికనుగుణంగానే తీర్మానాలు అగుచున్నవి, అగును కూడా ఇన్షాఅల్లాహ్. ఇవే సముచిత తీర్మానములు, ఏదో ఒక సమయమున వర్తమాన ఖలీఫా తప్పుడు లేదా అవగాహన లోపము వలన నష్టము వాటిల్లు ఆస్కారము గల తీర్మానము చేసినచో దాని దుష్ఫలితాలు ఎట్టి స్థితిలో కూడ బహిర్గతము కాకుండా స్వయాన అల్లాహ్‌యే తగు ఏర్పాట్లు చేయును. ఇన్షాఅల్లాహ్.

దీనిని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి.

“వ్యక్తిగత సమస్యలలో వర్తమాన ఖలీఫాతో పొరపాటు జరిగే అవకాశము గలదు. కాని సంస్థ ఆధ్యాత్మిక, ప్రాపంచిక ప్రగతి ఆధారపడివున్న విషయములో అతనితో పొరపాటు జరిగినను అల్లాహ్ తన సంస్థను రక్షించును. ఏదో ఒక రకంగా ఆ పొరపాటు గురించి

అతనికి సమాచారమందించును. మత గురువులు దీనిని అల్ప గౌరవమందురు. అనగా సందేశహరులకు గొప్ప గౌరవము లభించును కాని ఖలీఫాలకు అల్ప గౌరవము లభించును. సంస్థ నాశనమునకు కారణమగు ఏ పెద్ద పొరపాటు అల్లాహ్ వారితో జరగనివ్వడు. వారి తీర్మానాలలో కొన్ని సాధారణ పొరపాట్లు జరగవచ్చును. కాని తుది ఫలితము ఇస్లాం విజయ రూపములో వెలువడును, అతని వ్యతిరేకులు పరాజయమునకు గురగుదురు. వారికి అల్ప గౌరవము లభించినందున వారికనుగుణంగా అల్లాహ్ ప్రణాళిక యుండును. నిస్సందేహముగా మాట్లాడేవారు వారే అయినను, వారి నాలుకలే కదులును, వారి చేతులే పని చేయును, వారి మెదడే పని చేయును కాని వీటన్నిటి వెనుక అల్లాహ్ హస్తముండును. కొన్ని ప్రాథమిక విషయాలలో వారితో సాధారణ పొరపాట్లు సంభవించ వచ్చును. కొన్ని సార్లు వారి సలహాదారులు కూడ వారికి తప్పుడు సలహాలు ఇవ్వవచ్చును. కాని ఈ మధ్యంతర అవరోధాలను దాటిన పిదప విజయము కూడ వారికే లభించును. కడియములన్ని కలిసి గొలుసు అయినప్పుడు అది ఎంత దృఢమగుననగా ఏ శక్తి దానిని విరగ్గొట్టలేదు."

(తఫ్సీరే కబీర్ సంపుటి 6 పుట 376,377)

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను.

﴿وَاَقْسَمُوْا بِاللّٰهِ جَهْدَ اَيْمَانِهِمْ لَئِنْ اَمَرْتَهُمْ لَيَخْرُجُنَّ ۔ قُلْ لَّا تُقْسِمُوْا ۔ طَاعَةٌ مَّعْرُوْفَةٌ ۔ اِنَّ اللّٰهَ خَبِيْرٌۢ بِمَا تَعْمَلُوْنَ﴾

(అన్నూర్:54)

అనగా నీవు వారిని ఆదేశించినచో వారు తప్పక బయలు దేరుదురని వారు అల్లాహ్‌తో దృఢ ప్రమాణములు చేసిరి, నీవు ఇట్లనుము. ప్రమాణములు చేయకుడు, శాసనానుసారము విధేయులగుడు, నిశ్చయముగా మీరు చేయునదంతయు అల్లాహ్ సదా ఎరుగును.

ఈ సూక్తి కంటే ముందు సూక్తులలో కూడ విధేయత అంశమే కొనసాగుచున్నది. విశ్వాసులు సదా ఇట్లందురు. మేము వింటిమి, పాటించితిమి. ఈ దైవభీతి వలన వారు అల్లాహ్ సమీపులగుదురు, సఫలమగుదురు. విశ్వాసుల వలె వినుము, విధేయత వహించుమను ఆదర్శమును చూపుమని ఈ సూక్తిలో కూడ చెప్పబడెను. మేము ఇది చేయుదుము అది చేయుదుమని ప్రమాణములు చేయకుము.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) దీని విశ్లేషణలో ఇట్లు వ్రాసిరి. దాంబికులు కూడ దావాలు చాలా చేయుదురు. ఆచరణాత్మకంగా విధేయత వహించుటయే ముఖ్యమైన విషయము. ఇచట అల్లాహ్ ఇటువంటి వారికి తెలుపునదేమనగా విధేయత సముచిత పద్ధతి, సంప్రదాయ బద్ధమైన విధేయతను వహించుము. శాసనమునకు విరుద్ధముగా, వివేకమునకు వ్యతిరేకముగా సందేశహరుడు ఎటువంటి ఆజ్ఞ ఇవ్వడు. ఉదా॥ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నన్ను విశ్వసించినందున ఐదు పూటల ప్రార్థనలకు అలవాటు పడుము. అబద్ధమును వీడుము, గర్వమును వదులుము, ప్రజల హక్కులను హరించుట వీడుము. పరస్పరము ప్రేమానురాగముతో నుండుము. ఇవన్నియు సముచిత ఆజ్ఞ విధేయత కోవలోకే వచ్చును. మీరు ఆదేశించినట్లు మేము చేయుదుమని మేము ప్రమాణము చేయుచున్నామని ప్రకటించి అవిధేయత వహించకుము.

ఇటులనే ఆధ్యాత్మిక ప్రగతి కొరకు ఖలీఫాల వైపు నుండి వివిధ సందర్భాలలో వివిధ ప్రతిపాదనలు వెలువడుచుండును. ఉదా॥ మస్జిదులను నిర్మానుష్యముగా వదలకుము గురించి, సంతాన సంస్కరణ గురించి, తమలో ఆత్మ స్థైర్యమును పెంచుకొనుట గురించి, అల్లాహ్ వైపు ఆహ్వానించుట లేదా వివిధ ధన ప్రతిపాదనలు, ఈ విషయములనే పాటించుట అనివార్యము. మరో రకంగా సముచిత విధేయత కోవలోకివే వచ్చును. అల్లాహ్ ఆదేశములకు వ్యతిరేకముగా, వివేకమునకు విరుద్ధముగా సందేశహరుడు లేదా ఖలీఫా మీతో ఏ పని చేయించడు. మీరు అగ్నిలో దూకమని, సముద్రములో దూకమని అననే అనరు. గత ఖుత్బాలో నేను ఒక హదీసును ప్రస్తావించి యుంటిని. అందులో నాయకుడు అగ్నిలో దూకమని అనెను. దీని గురించి మరో హదీసు లభించినది. అందులో మరింత వివరణ గలదు.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం **అల్ఖమ బిన్ ముజజ్జిజ్**ను ఒక యుద్ధము కొరకు పంపిరి. వారు తమ నిర్ణీత యుద్ధ క్షేత్రమునకు చేరుకున్న తర్వాత లేదా మార్గమధ్యములోనే వుండగా సైన్యములోని ఒక బృందము వారితో అనుమతి కోరెను, కనుక వారు వారికి అనుమతించి వారిపై అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా బిన్ ఖైస్ అస్సహ్మీని నాయకునిగా నియమించిరి. యుద్ధమునకు పోవు వారిలో నేను కూడ వారి వెంట యుంటిని. మార్గమధ్యలో వుండగానే కాచుటకు లేదా ఆహారము వండుటకు వారు అగ్నిని రాజేసిరి. అప్పుడు (హాస్య స్వభావము గల) అబ్దుల్లాహ్ ఇట్లనిరి. మీరు నా మాట విని విధేయత వహించే కర్తవ్యము మీది కాదా?

ఎందుకు కాదని వారనిరి. అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) ఇట్లనిరి. నేను ఏ ఆజ్ఞ ఇచ్చినను మీరు దానిని పాటింతురా ? అవును మేము పాటింతుమని వారనిరి. మరల అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) ఇట్లనిరి. మీరు ఈ అగ్నిలో దూకవలసినదిగా నేను గట్టిగా ఆజ్ఞాపించుచున్నాను. వెంటనే కొందరు వ్యక్తులు నిలబడి అగ్నిలో దూకుటకు సన్నద్ధమైరి. వీరు నిజముగనే అగ్నిలో దూకుటకు సిద్ధమైనారని చూచిన అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా తమను తాము (అగ్నిలో దూకకుండా) ఆపుకోమనిరి.

మేము ఈ యుద్ధము నుండి తిరిగి వచ్చిన తర్వాత కొందరు అనుచరులు (రజి) నబీ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఈ సంఘటనను ప్రస్తావించిరి. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. "నాయకులలో ఎవరైనా అల్లాహ్ అవిధేయతను వహించుమని ఆజ్ఞాపించినచో అతని విధేయత వహించకుము."

(సునన్ ఇబ్నె మాజ, కితాబుల్ జిహాద్, బాబ్ లిఇతాఅతి ఫీ మాఫియతి లిల్లాహి)

సందేశహరుడు లేదా వర్తమాన ఖలీఫా హాస్యముగా కూడ ఇట్లు మాట్లాడలేడని గుర్తుంచుకొనుము. అందుకే నాయకుని ద్వారా ఏదైనా అదేశమునకు విరుద్ధముగా స్పష్టమైన వ్యతిరేకత మీరు చూచినచో అల్లాహ్, ప్రవక్తను ఆశ్రయించుమని అల్లాహ్ నుడివెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత ఈ కాలములో సన్మార్గ ఖిలాఫత్ ఏర్పడెను. కావున వర్తమాన ఖలీఫాను ఆశ్రయించుము. అతని నిర్ణయము సదా సముచితముగానే వుండును. ఇన్షాఅల్లాహ్. అల్లాహ్, ప్రవక్త ఆదేశముల కనుగుణంగానే వుండును. ఇంతకు ముందు నేను చెప్పినట్లు మీకు

శుభవార్త గలదు. ఎందుకనగా మీరు సదా సముచిత ఆదేశాల క్రిందనే వున్నారు. అనుచితమైన ఏ తీర్మానము మీ కొరకు లేదు. ఇన్షాఅల్లాహ్.

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

## ద్వారా

## ఏర్పడిన ఆధ్యాత్మిక విప్లవము

ఇప్పుడు నేను చెప్పదలచినదేమనగా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం జమాఅత్‌లో ప్రవేశించి, వారి బైఅత్ చేసి, వారితో పది బైఅత్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేసి, ఆ నిబంధనలను పాటించితిరా, విధేయత ఉదాహరణను కూడ చూచితిరా. మేము వారితో ఈ నిబంధనలపై బైఅత్ చేయుదుము అనునది నోటి మాటలేనా ? కావున నేను పలు ఉదాహరణలను తీసుకొన్నాను. వాటి ద్వారా బైఅత్ చేయువారు తమలో ఎలాంటి ఆధ్యాత్మిక మార్పులు చేసుకొనిరి, ఏ ఆధ్యాత్మిక విప్లవములు సంభవించినవో తెలియును. ఈ మార్పులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములోను ఈ కాలములో కూడ మనకు కనిపించును.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"కనీసం ఒక లక్ష మంది సహృదయముతో నన్ను విశ్వసించినారని నేను ప్రమాణముగా చెప్పగలను. వారు సత్కార్యములు చేయుదురు, విషయములు వినుచుండగా వారి మెడకప్పు తడిచిపోవు విధముగా విలపింతురు."

(సీరతుల్ మహ్దీ సంపుటి 1 పుట 146)

# అన్యారాధన నుండి దూరముండుము

అన్యారాధన నుండి దూరముండునను ఒక నిబంధన కూడ యుండెను. మన పురుషులే కాక స్త్రీలు కూడ గొప్ప గొప్ప ప్రమాణములను నెలకొల్పిరి. ఎటువంటి ప్రమాణములను చూపిరనగా వాటిని చూసి ఎంత గొప్ప విప్లవము సంభవించెనని హృదయము అల్లాహ్ ప్రశంసతో నిండిపోవును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కొరకు దుఆ వెలువడును.

హజ్రత్ చౌధ్రి జఫ్రుల్లాహ్ ఖాన్ గారి తల్లికి అన్యారాధనతో ఎంతటి ద్వేషముండెనో తెలుపు ఒక ఉదాహరణ. వారి పిల్లలు తరచుగా మృతి చెందేవారని చెప్పుదురు. ఒక సారి వారి ఒక బాలుడు వ్యాధి గ్రస్తుడయ్యెను. బాలునికి చికిత్స చేయబడెను. ఒక వ్యక్తి మంత్రదండము ఇచ్చి పోగా ఒక స్త్రీ దానిని బాబు మెడలో వేయదలచెను. కాని బాబు తల్లి మంత్ర దండమును లాక్కొని ప్రొయ్యిలోని నిప్పులో విసిరేసి, నాకు నా సృష్టికర్త, యజమానిపై నమ్మకము గలదని నేను ఈ మంత్రదండములకు ఎలాంటి ప్రాధాన్యత నివ్వననిరి. బాలుడు రెండు నెలల వాడైన తర్వాత ఆ మాంత్రికురాలు కలిసేందుకు వచ్చెను. బాలున్ని ముద్దాడిన తర్వాత జఫర్ మీది నుండి ఆపదను తొలగించినందుకు కొన్ని పాత్రలు, నగదు కోరెను. వారిట్లు సమాధానమిచ్చిరి. నీవు ఒక నిరుపేద, విధవరాలివి. నీవు దానధర్మాల రూపంలో ఏదైనా అడిగినచో నేను నీకు సంతోషముతో నా స్థోమత ప్రకారము ఇచ్చుటకు సిద్ధముగా నున్నాను. కాని నేను దయ్యాలు,

భూతాలను నమ్మేదానిని కాదు. మరణము, జీవితమునకు యజమానిగా అల్లాహ్‌నే నేను నమ్మెదను. వేరే ఎవరి ప్రమేయమును ఈ విషయములలో విశ్వసించను. ఇటువంటి విషయములను నేను అన్యారాధనగా నమ్ముదును. వాటిని ద్వేషింతును. కనుక ఈ కారణముచే నేను నీకు ఏమియును ఇచ్చుటకు సిద్ధముగా లేను. ఆ మాంత్రికురాలు ఇట్లనెను. ఆలోచించుకొనుము. బాలుని జీవితము కోరుకుంటున్నచో నా యాచనను పూర్తి చేయవలసిందే.

కొన్ని రోజుల తర్వాత వారు జఫర్‌కు స్నానము చేయించుచుండగా మరల ఆ మాంత్రికురాలు వచ్చెను. బాలుని వైపు సంజ్ఞ చేయుచు ఇతడే రాకుమారుడా ? అని అనెను. ‘‘అవును ఇతడే’’ అని వారనిరి. మాంత్రికురాలు మరల అవే వస్తువులను కోరెను. వారు మొదటి సారి ఇచ్చిన సమాధానమే మరల ఇచ్చిరి. అప్పుడు మాంత్రికురాలు కొంత కోపంగా ఇట్లనెను. “బాలున్ని ప్రాణముతో ఇంటికి తీసుకెళ్ళినచో నేను అబద్ధమాడుచున్నానని భావించుము.” వారిట్లు సమాధానమిచ్చిరి. “అల్లాహ్ కోరినదే జరుగును” మాంత్రికురాలు గృహ గుమ్మము దాటక ముందే జఫర్‌కు రక్తముతో కూడిన వాంతులయ్యేను. రక్తముతోనే విరోచనాలయ్యేను. కొన్ని క్షణాలలో బాలుని పరిస్థితి విషమించెను. కొన్ని గంటలలో బాలుడు మరణించెను. వారు అల్లాహ్ ఆస్థానములో ఇట్లు వేడుకొనిరి. ఓ అల్లాహ్! నీవే ఇచ్చియుంటివి. నీవే తీసుకున్నావు. నేను నీ ఇష్టముపై రాజీ పడితిని. ఇప్పుడు నీవే నాకు సహనము ప్రసాదించుము. అనంతరం ఒట్టి చేతులతోనే దస్క (గ్రామము) నకు తిరిగి వచ్చిరి.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 11 పుట 15-16)

ఆ తర్వాత చూడుము! అల్లాహ్ ఎంతటి బహుమానములతో సత్కరించెను. చౌధ్రి జఫ్రుల్లాహ్ ఖాన్ (రజి) వంటి కుమారుడు వారికి బహుకరించెను. వారు సుదీర్ఘ ఆయువు పొందిరి, ప్రపంచములో పేరు ప్రఖ్యాతులు కూడ సంపాదించిరి.

## మానసిక ఉద్రేకములకు లొంగకపోవుట

బైఅత్ చేసిన తర్వాత మానసిక ఉద్రేకముల నుండి ప్రజలు ఎలా సురక్షితముగా వుంటున్నారో ఆ కాలపుది కాక ఈ కాలపు ఉదాహరణ నేనిత్తును. అది కూడ ఆఫ్రీకా వాసులది. ఆఫ్రీకాలో Pagan వర్గీయులుందురు. వారిలో అనేక దురాచారములు, అలవాట్లు గలవు. కాని అహ్మదియ్య సంస్థలో చేరగానే వారు ఆ దురాచారాలను తుడిచిపెట్టి వారిలో ఎన్నడు ఆ దుష్టత్వములు లేని విధముగా తమలో పవిత్ర మార్పులు తెచ్చుకొందురు. వచ్చిన కొన్ని నివేదికల అనుసారము మద్యం బానిసలు తక్షణమే మద్యమును ద్వేషించసాగిరి. దీని గట్టి ప్రభావము ఇతరులపై కూడ పడెను. వారీ విషయమును ప్రస్తావించినప్పుడు అహ్మదియ్య సంస్థ వీరిపై ఇంద్రజాలము చేసినందుకే వారు మద్యమును వీడిరని మౌల్వీలందురు.

ఒక మురబ్బి గారు నాకు చెప్పిన మరో సంఘటన గుర్తుకొచ్చెను. మద్యము, వ్యభిచారము మొ॥ అన్ని రకాల సమస్త దుష్టత్వములు గల ఒక ఘానా వ్యక్తి అహ్మదీ అయ్యెను. అక్కడ బీదత్వము వలన లేదా గృహముల కొరత వలన పెద్ద పెద్ద గృహములుండును. వాటిలో ఒక్క గది అద్దెకు తీసుకొని అందులోనే నివాసముండు ఆచారము గలదు. ఈ వ్యక్తి ఇటువంటి వాతావరణంలోనే వుండేవాడు. స్త్రీలతో మిత్రుత్వముండెను.

కాని అహ్మదియ్య సంస్థలో చేరిన తర్వాత తప్పుడు పని కొరకు నా వద్దకు ఎవరు రాకూడదని అందరికి చెప్పెను. కాని ఒక స్త్రీ అతన్ని వదిలేది కాదు. అందుకు అతడు ఈ పద్ధతిని అవలంభించెను. ఆమెను అతడు దూరము నుండి చూడగానే గదిలోకి వెళ్ళి ఘడియ పెట్టుకొని వెంటనే నఫిల్ నమాజు చదవడం మొదలు పెట్టేవాడు లేదా పవిత్ర ఖురాన్ పఠనమును ప్రారంభించేవాడు. ఈ విధముగా తనను తాను రక్షించుకొనెను. అహ్మదియ్య సంస్థ తెచ్చిన విప్లవములివి.

మరల మన ఒక ముబల్లిఘ్ గౌ॥ మౌలానా బషీర్ అహ్మద్ ఖమర్ గారిట్లు తెలిపిరి. నేను ఒక పండుగ ప్రార్థన తర్వాత ఘానా అహ్మదియ్య సభ్యులతో కలిసి పేరామౌంట్ చీఫ్‌తో కలిసేందుకు వెళ్ళితిని. వారు తమ ముఖ్యులతో కలిసి మా నిరీక్షణలో యుండిరి. మేము లోపలికి ప్రవేశించగానే అహ్మదీ మిత్రులు చీఫ్, వారి అనుచరుల ఎదుట పాడడం మొదలు పెట్టిరి. ఒక వృద్ధ అహ్మదీయుడు చీఫ్ ముందు కర్ర ఊపుచు పాడుతుండగా ఇతర 300 మంది వరకు గల అహ్మదీయులు అతని తర్వాత అవే పదములను పాడుచుండిరి. వీరేమి అంటున్నారని నేను అనువాదకునితో అడిగితిని. అతడు నాకిట్లు చెప్పెను. వీరు అల్లాహ్ ఉపకారములు, ఇస్లాం శుభములను ప్రస్తావించుచున్నారు. వీరిట్లంటున్నారు. మేము అన్యారాధకులు, విగ్రహారాధకులుగా నుంటిమి. మద్యమును నీరులా త్రాగేవారము. మా జీవితము జంతువుల వలె నుండగా మేము మృగములమై యుంటిమి. అహ్మదియ్య సంస్థ మాకు సన్మార్గము చూపెను. మా పాపములు మా నుండి దూరమైనవి. మేము మానవులమైతిమి. వీరు తమ గత అలవాట్లు, ప్రవర్తనలు పూర్తిగా తెలిసిన తమ స్వంత నగర ఒక పేరామౌంట్

చీఫ్, ఇతర పెద్దల ఎదుట తమ మార్పును గట్టిగా ప్రస్తావించుచున్నారు. జమాఅత్ సత్యమును ప్రస్తావించుచుండిరి.

(మాసపత్రిక అన్సారుల్లాహ్ జనవరి 1984 పుట 30,31)

## నమాజుల ఏర్పాట్లు

నమాజుల ఏర్పాట్లు, తహజ్జుద్ ఆచరణ గురించి కూడ బైఅత్ నిబంధనలలో ఆదేశము గలదు. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. “నా బైఅత్ చేయువారిలో దిన దినము శక్తి, ధర్మబద్ధము ప్రగతి చెందుచున్నట్లు నేను చూచుచున్నాను. ముబాహలా (ఒకరు మరొకరిని శపించుట) రోజుల తర్వాత మన జమాఅత్‌లో ఒక క్రొత్త ప్రపంచము ఆవిర్భవించినది. అనేకులు సాష్టాంగములో విలపించుచు, తహజ్జుద్‌లో ఏడ్చుచున్నట్లుగా చూచెదను. అపవిత్ర హృదయులు వారిని అవిశ్వాసులందురు. కాని వారు ఇస్లాం కాలేయము, హృదయములు.”

(అన్జామె ఆథమ్ – రూహాని ఖజాయిన్ సంపుటి 11 పుట 315)

ఇక్కడ మరల నేనొక ఘానా ఉదాహరణను ప్రవేశపెట్టెదను. ప్రజలు తమలో ఎంతటి మార్పులు చేసుకొనిరనగా స్వయాన నా అనుభవములో వచ్చిన విషయమిది. సుదీర్ఘ ప్రయాణము చేసివచ్చిరి. రాత్రి చాలా పొద్దుపోయాక నిద్రకు ఉపక్రమించిరి. దాదాపు 12 గం॥లకు పరుండే అవకాశము లభించెను. రాత్రి నిద్ర లేచి చూచినప్పుడు ఒకటిన్నర అవుతుంది. వారు మస్జిదులో కూర్చున్నారు, సాష్టాంగములో వున్నారు.

మరో కథనము ప్రకారము హజ్రత్ మున్షీ ముహమ్మద్ ఇస్మాయీల్ (రహ్మ) ఇట్లనేవారు. సామూహికంగా చేయలేని ఒక్క ప్రార్థన మాత్రమే నాకు గుర్తుంది. అది కూడ ఎందుకనగా బైతుజ్జికర్ నుండి ఒక అత్యవసర

అవసరము వలన తిరిగి రావలసివచ్చెను.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 1 పుట 196)

హజ్రత్ మున్షీ ముహమ్మద్ ఇస్మాయిల్ (రహ్మ) గారి గురించే ఇట్లు గలదు. అనగా బైఅత్ చేసి వారు సియాల్కోట్ తిరిగిపోయి తమ గత వ్యర్థపు అలవాట్లు అనగా పేకాట ఆడుట, బజారులో కూర్చొని వృధా మాట్లాడుట వంటివన్ని వదిలినది జనులు చూచిరి. తహజ్జుద్ నమాజ్ క్రమం తప్పకుండా చదవడం మొదలు పెట్టిరి. వారి స్థితిలో ఇంతటి అసాధారణ మార్పు చూచి అందరు ఆశ్చర్యమునకు గురైరి.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 1 పుట 200)

ఖాదియాన్‌లో నమాజుల, తహజ్జుద్ ఏర్పాట్ల గురించి హజ్రత్ నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ (రజి) గారిట్లు తెలిపిరి. సూర్య గ్రహణ రోజు నమాజ్‌లో నేను ఖాదియాన్‌లోనే యుంటిని. మౌల్వీ ముహమ్మద్ అహ్సన్ అమ్రూహి గారు నమాజ్ చదివించిరి. నమాజ్‌లో పాల్గొనిన వారు చాలా విలపించు చుండిరి. ఈ రమజాన్‌లో ఎటువంటి పిరిస్థితి వుండెననగా రాత్రి రెండు గంటలకే అహ్మదియ్య చౌరస్తాలో హడావిడి మొదలయ్యేది. అధికులు తమ గృహములలో కొందరు మస్జిద్ ముబారక్‌లో వచ్చియుండేవారు. తహజ్జుద్ నమాజ్ తర్వాత సెహ్రీ (ఉపవాసము రోజున సూర్యోదయం కంటే ముందటి భోజనము) భుజించేవారు. ఆరంభ సమయములో ఉదయపు నమాజ్ చదివేవారు. అనంతరం కొంత సమయము వరకు పవిత్ర ఖురాన్ పఠనము జరిగేది. 8 గం॥ల తర్వాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం విహారమునకు వెళ్ళేవారు. సేవకులందరు వెంట వుండేవారు. ఈ వ్యవహారము దాదాపు

11 గం॥లకు ముగిసేది. ఆ తర్వాత జుహ్ర్ అజాన్ అయ్యేది. ఒంటి గంట లోపు నమాజ్ ముగిసేది. అనంతరం అస్ర్ నమాజు కూడ ఆరంభ ఘడియలోనే చదివేది. అస్ర్ నుండి మఘ్రిబ్ మధ్య విరామము లభించేది. మఘ్రిబ్ తర్వాత భోజనము ముగించుకునేవారు. 8 నుండి 8.30 వరకు ఇషా నమాజ్ చదివేది. అనంతరం ఎంత నిర్మానుష్య స్థితి ఏర్పడేదనగా ఎవరు లేనట్లు అనిపించేది. కాని రాత్రి రెండు గం॥లకు అందరు నిద్ర లేచేవారు, హడావిడి మొదలయ్యేది."

(అస్హాబె అహ్మద్ సంపుటి 2 పుట 77)

హజ్రత్ నవాబ్ ముహమ్మద్ అబ్దుల్లాహ్ ఖాన్ గురించి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబె రహ్మహుల్లాహ్ ఒక కథనము ఇట్లు వ్రాసిరి. వారు నమాజ్ ప్రేమికులై యుండిరి. ప్రత్యేకముగా సామూహిక నమాజ్ కొరకు వారి ఉత్సాహము, కృషి ఎంతో ప్రత్యేకమై యుండెడిది. క్రమం తప్పకుండా ఐదు పూటలు మస్జిద్‌కు పోయేవారు. గుండె వ్యాధి వలన మంచానికి పరిమితమైనప్పుడు అజాన్ ధ్వనిని ప్రేమికుడు తన ప్రియురాలి ధ్వనిని వినునట్లే ఎంతో ప్రేమతో వినేవారు. కొంత నడిచే శక్తి రాగా కొన్ని సందర్భాలలో కుటుంబములోని ఒక బాలున్ని పట్టుకొని ముందట నిలబెట్టి, సామూహిక నమాజ్ చదివినట్లు తృప్తి చెందేవారు. లేదా రతన్ బాఘ్‌లోనే నమాజ్ గదిలో కుర్చీ జరుపుకొని సామూహిక నమాజ్‌లో పాల్గొనేవారు. మాడల్ టౌన్ భవనములోకి పోయిన తర్వాత అక్కడే ఐదు పూటల సామూహిక నమాజ్‌కు ఏర్పాట్లు చేసుకొని గృహమునే మస్జిద్‌గా మార్చుకొనిరి. ఐదు పూటలు అజాన్ ఇప్పించేవారు. వాతావరణము ప్రకారము ఒక్కో సారి బయట గడ్డి మైదానములో ఒక్కో సారి గది లోపల

చాపలు వేయించేవారు. కొన్ని సార్లు అందరికంటే ముందు వచ్చి నమాజ్‌కు వచ్చే ఇతరుల కొరకు ఎదురు చూచేవారు. వివిధ స్వభావము గల వారి కొరకు తన గృహమును ఐదు పూటలు వచ్చి పోవు స్థలముగా మార్చుట సాధారణ పుణ్యము కాదు. ప్రత్యేకముగా గృహ యజమాని నివాస స్థాయి ఎంతో ఉన్నతమై, సామాజిక సంబంధములు అధికమైనప్పుడు ఈ పుణ్యపు ప్రాముఖ్యత మరింత పెరుగును."

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 12 పుట 152, 153)

షేఖ్ హామిద్ అలి (రజి) గారిచే ఐదు పూటల నమాజ్ ఏర్పాటు గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి.

"అల్లాహ్ కొరకే ప్రేమ కలిగిన షేఖ్ హామిద్ అలి. ఒక పుణ్య యువకుడు, పుణ్య వంశస్తుడు. దాదాపు 7,8 సం॥ల నుండి నా సేవలో వున్నాడు. నాతో విశ్వసనీయత, ప్రేమ కలిగివున్నాడని నిశ్చయముగా నాకు తెలుసు. ధర్మబద్ధత రహస్యముల వరకు చేరుట జ్ఞానుల, సత్పురుషుల కార్యమే. కాని అర్థమైనంత వరకు పద్ధతిని అవలంభించుట, ధర్మబద్ధమును పాటించుటలో నిమగ్నమైవున్నాడు. ఎంతో కఠిన, ప్రాణాంతకమైన వ్యాధిగా భావించబడిన సమయమున అతి బలహీనత వలన నిర్జీవముగా నున్నను ఐదు పూటలు నమాజ్ చేయుటలో చురుకుగా వుండెడిది. ఈ స్పృహలేని సున్నితమైన సమయములో కూడ ఏదో విధముగా నామజ్ చదివేవాడు. మానవుని దైవభీతిని అంచనా వేయుటకు అతని నమాజ్ చదువుటను చూచుట సరిపోవునని నాకు తెలుసు. ఎవరైతే పూర్తి ఏర్పాట్లతో నమాజ్ చదువునో, భయము, వ్యాధి, మోసపు స్థితులు అతన్ని నమాజ్ నుండి నివారించలేనిచో అతనికి అల్లాహ్‌పై నిస్సందేహముగా నిజమైన విశ్వాసము

గలదు. కాని ఈ విశ్వాసము పేదలకు ఇవ్వబడినది. దీనిని పొందు ధనికులు చాలా తక్కువే."

(ఇజాలయె ఔహామ్ - రూహాని ఖజాయిన్ సంపుటి 3 పుట 540)

ఈ నిబంధన అనగా "ఐదు పూటల నమాజ్ అల్లాహ్, ప్రవక్త ఆదేశానుసారము క్రమం తప్పకుండా సలుపుదును". దీని గురించి ఒక సత్పురుషులు మౌల్వీ ఫజల్ ఇలాహి గారిట్లు తెలిపిరి. హజ్రత్ మిర్జా అయ్యూబ్ బేగ్ రజియల్లాహు అన్హు గారి ఆదర్శము ఇట్లుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు హజ్రత్ మిర్జా అయ్యూబ్ బేగ్ గారితో చాలా ప్రేమ యుండెను. ఒక రోజు నేను మగ్రిబ్ ప్రార్థన మిర్జా అయ్యూబ్ బేగ్ గారి కుటీరములో చదివితిని. హజ్రత్ ముఫ్తి ముహమ్మద్ సాదిఖ్ గారు కూడ అక్కడే వుండిరి. మిర్జా అయ్యూబ్ బేగ్ గారి ప్రార్థన اَلصَّلٰوةُ مِعْرَاجُ الْمُؤْمِنِ ను పోలివుండెను. నమాజ్ చదివేటప్పుడు ప్రపంచ ఆలోచనలను పూర్తిగా విస్మరించేవారు, కనుల నుండి కన్నీరు కార్చేవారు. ఆ రోజు అసాధారణ రీతిలో సుదీర్ఘ నమాజ్ చదివిరి. నమాజ్ తర్వాత అందరు కూర్చొనిరి. నేడు నమాజ్ చాలా ఎక్కువ సుదీర్ఘముగా చదివిరి కారణమేమిటని మిర్జా గారితో అడగబడెను. మొదట వారు చెప్పలేదు. కాని బలవంతము చేయగా ఇట్లనిరి. నేను దురూద్ చదివేటప్పుడు నాకు స్వప్నము కనిపించెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక ప్లాట్ ఫారమ్ మీద తిరుగుచు ఇట్లు దుఆ చేయుచుండిరి. మిర్జా గారు అరబ్బి పదములు వాటి అనువాదము కూడ చెప్పిరి. అనగా ఓ అల్లాహ్ నా సమాజమును దుర్మార్గము నుండి రక్షించుము. దాని పడవను ఒడ్డుకు చేర్చుము. నేను ఆ దుఆతో పాటు ఆమీన్ అనుచుంటిని. ఆ తర్వాత నేను

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూచితిని. వారు దుఆ చేయుచున్నారు. ఓ అల్లాహ్! ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దుఆలను స్వీకరించుము. వారి సమాజమును దుర్మార్గపు చిక్కుల నుండి రక్షించుము. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆ ముగించగానే నేను కూడ నమాజ్ ముగించితిని."

(అస్హాబె అహ్మద్ సంపుటి 1 పుట 194,195)

ఇదొక విప్లవము. మేలుకతో వుండగానే దర్శనము అగుచున్నది. మిర్జా డా॥ యాఖూబ్ బేగ్ గారు (రజి), హ్రజత్ మిర్జా అయ్యూబ్ బేగ్ గారు (రజి) పై హ్రజత్ మసీహ్ మౌవూద్ (అ) బైఅత్ ప్రభావము పడెను. దీనిని గురించి ఒక కథనము స్వయముగా వారే ఇట్లు తెలిపిరి. మా తండ్రి గారు తమ మిత్రునితో ఇట్లు చెప్పిరి. నా ఈ ఇద్దరు కుమారులు 1892, 1893లో వేసవి సెలవులలో జిల్లా ముల్తాన్‌లోని కక్కర్‌హన ప్రాంతములో నా వద్దకు వచ్చినప్పుడు నేను వారిలో అసాధారణ మార్పు చూచితిని. నేను ఆశ్చర్యముతో ఇట్లనేవాడిని. ఓ అల్లాహ్! నీవు ఎటువంటి కారణాలను వీరికి అందించితివి. వీరి హృదయములో మార్పు కలిగి కాంతిపై కాంతి ప్రకాశించెను. వీరు నిర్ణీత సమయములో అతి ప్రేమానురాగము, విలపించుచు ఎంతో దుఃఖముతో, ఆక్రందనముతో అన్ని నమాజులు చదివెదరు. తరచు వారి ముఖాలను కన్నీరుతో తడిగా చూచెదను. దైవభీతి వారి ముఖముల నుండి ప్రత్యక్షమయ్యేది. అప్పుడు ఆ ఇద్దరి పిల్లల వయసు చిన్నదే. గడ్డము అప్పుడే వచ్చుచుండెను. ఆ వయసులో వారి ఈ స్థితి చూచి నేను కృతజ్ఞతల సాష్టాంగములు చేసేవాడిని. వారి ఆధ్యాత్మిక బలహీనత భారము నా పై నుండి తొలగిపోయెను.

తండ్రి గారు ఆ మిత్రునితో మరిట్లనిరి. ఈ అద్భుత స్థాయి మార్పు ఇంత చిన్న వయసులో ఇంతటి ఆధ్యాత్మిక అనుగ్రహము, శుభములు ఎక్కడి నుండి కలిగిన రహస్యము నాకు తెలియలేదు. కొంత కాలము తర్వాత ఈ మార్గదర్శనము వారికి హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ వలన లభించినదని తెలిసినది. తండ్రి గారిని బైఅత్ చేయువారిలో చేర్చుటకు ఒక పెద్ద కారణము మా మార్పే అయినది. (అనగా పిల్లల మార్పు వలన తండ్రి అహ్మదీ అయినారు) హజ్రత్ అఖ్దస్ పవిత్రత, పరిశుద్ధ ఆత్మలను అంచనా వేయుటకు వారికదొక మంచి అవకాశము కలిగించెను."

(అస్హాబె అహ్మద్ సంపుటి 1 పుట 186)

హజ్రత్ చౌధ్రి జఫ్రుల్లాహ్ ఖాన్ గారి తండ్రి హజ్రత్ చౌధ్రి నస్రుల్లాహ్ ఖాన్ ఉదాహరణను వారి ఒక కుమారుడు ఇట్లు తెలిపిరి.

"నా స్వభావముపై బాల్యము నుండే తండ్రి గారు నమాజ్‌ను సక్రమంగా ఎంతో శ్రద్ధతో చదివేవారనే ప్రభవాము యుండెను. తహజ్జుద్ కూడ క్రమం తప్పకుండా చదివేవారు. నేను నా ఊహలో తరచుగా తండ్రి గారిని నమాజ్ చదువుచు, పవిత్ర ఖురాన్ పఠించుచు చూచెదను. బైఅత్ చేసిన తర్వాత పావురాల మస్జిద్‌లో సామూహిక నమాజ్ చదివేవారు. మస్జిద్ మా ఇంటి నుండి దూరముగా యుండెను. అందుకే తండ్రి గారు చాలా చీకటి వుండగానే ఇంటి నుండి బయలు దేరే వారు."

(అస్హాబె అహ్మద్ సంపుటి 11 పుట 163)

క్రమం తప్పకుండా నమాజ్ చదవడం గురించి మరొక ఉదాహరణను హజ్రత్ బాబు ఫఖీర్ అలి గారు రజియల్లాహు అన్హు

గురించి ప్రవేశపెట్టెదను. వారు "హృదయము దైవముతో చేతులు పనిలో" అను సామెతకు నిలెవెత్తు నిదర్శనం. ఎం. బషీర్ అహ్మద్ గారిట్లు తెలిపిరి. ఆంగ్లేయుల భయమున్న కాలమది, అతడిట్లనేవాడు. మౌల్వీ గారు! ఏదైనా ప్రమాదము చేయింతురా! ఎప్పటికి నమాజ్ చదువుచుందురు. వారతని ఈ మాటలతో చాలా ఇబ్బంది పడిరి. ఒక రోజు (కార్యాలయపు) తలుపు, కిటికీ మూసివేసి అతనికి సమీపమై మాట్లాడుచుండిరి. వారు దాడి చేయవచ్చునని అతడు భయపడెను. నాకలాంటి ఉద్దేశము లేదని వారు అతనికి సంతృప్తి కలిగించిరి. నేను వేరుగా మాట్లాడదలచితిని. అదేమనగా మీరు కార్యాలయములో మలమూత్రాలకు ఇంకా చాయె సిగ్రేట్ కొరకు కూడ సమయము వృధా చేయుదురు. అలాంటప్పుడు నాపై విమర్శలెందుకు? ఇవి ప్రకృతి అవసరాలని అతడనెను. వారిట్లనిరి. నేను మీ క్రింది వాడను. విధుల బాధ్యతల గురించి గల విషయములలో మాత్రమే నేను మీ విధేయత వహింతును. ఇతర విషయములలో విధేయత వహించుట నా కర్తవ్యము కాదు. అందుకే మీరన్నందుకు నమాజులను నేను వదల లేను. నా నిర్లక్ష్యము వలన ప్రమాదము జరిగినచో లేదా రైలులో ఆలస్యము అయినచో నిస్సందేహముగా మీరు నాతో దయతో వ్యవహరించకుము. ఇట్లని వారు తలుపు, కిటికీ తెరిచిరి. అతడు వారి సంభాషణతో చాలా ఆశ్చర్యపడెను. ..........................................

ఈ సంభాషణ ప్రభావముతో అతడు వారు చెంబు పట్టుకోగానే మౌల్వీ గారు మీరు ప్రశాతంగా నమాజు చేసుకోగలరని. నేను మీ పనిని చూసుకొనెదనని అనేవాడు. ఒక రోజు వారి వాడిన ఆహారము చూసి కూడ వారి స్థితి పట్ల అతనిపై ఎంతో ప్రభావము పడెను."

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 3 పుట 55)

ఇక్కడ ఇంగ్లాండ్‌లో ఒక మన పాత అహ్మదీ బిలాల్ నటల్ గారు అహ్మదీ అయినప్పుడు వారు తన కొరకు "బిలాల్" అను పేరును ఎన్నుకొనిరి. అనంతరం బిలాల్ ఆచరణలోనే నమాజ్ కొరకు పిలుచుట (అజాన్ ఇచ్చుట) లో ఒక ప్రత్యేక పేరు పొందిరి. వారికి నిజముగనే నమాజ్ కొరకు పిలుచుటలో అత్యంత ఉత్సాహముండెను.

(మాస పత్రిక అన్సారుల్లాహ్ జూన్ 1965 పుట 36)

## మానసిక ఉద్రేకములను అణచివేయుట

మానసిక ఉద్రేకములను అణచివేయుట అను నిబంధన గలదు. ఇందులో ఎటువంటి ఉదాహరణలు గలవు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్ ఒక ప్రత్యేకతను ఇట్లు వివరింతురు. హిందువులతో ఒక సభ జరుగు చుండెను. అక్కడ జడగమయ్యెను. కాని జమాఅత్ చాలా సహనముతో కూడిన ఉదాహరణను నెలకొల్పెను.

వారిట్లనిరి.

"ఈ దురుద్దేశము గల వారు ఎటువంటి ఉద్రేకమునకు పాల్పడిరనగా పవిత్ర స్వభావము గల ముస్లిములకు తమ సభ్యత ఆలోచన లేనిచో ఖురాన్ బోధన మేరకు సహనము పాటించనిచో తమ కోపమును అదుపులో పెట్టుకొననిచో నిస్సందేహముగా ఆ సభ మైదానము రక్తముతో నిండిపోయేది. కాని మా సంస్థకు వేల ప్రశంసలు. వారు ఓపిక, సహనపు

ఉత్తమ ఆదర్శమును ప్రదర్శించిరి. తూటాల కంటే హీనమైన ఆర్యుల వాక్యములను విని మౌనము పాటించిరి."

మరల ఇట్లనిరి.

"నా వైపు నుండి నా సంస్థకు సహనపు ఉపదేశము లేకున్నచో, దూషణములకు ఎదురుగా సహనము పాటించవలెనని నేను నా సంస్థను బోధించి సిద్ధము చేయనిచో ఆ సభా ప్రాంగణము రక్తముతో నిండిపోయేది. కాని ఆ సహన బోధనే వారి ఉద్రేకములను అణచి వేసెను."

(చష్మ మారిఫత్ – రూహాని ఖజాయిన్ సంపుటి 23 పుట 10)

మానసిక ఉద్రేకములను అణచి వేయుట గురించి హజ్రత్ సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ గారి (రజి) గురించి ఒక విచిత్రమైన ఉదాహరణ గలదు.

"ఒక రోజు హజ్రత్ షాహ్ గారు నమాజ్ చదువుట కొరకు సమీపపు మస్జిద్‌లోకి పోయిరి. అప్పుడు అహ్మదియ్యా సంస్థ ఒక బద్ధ వ్యతిరేకి ఛౌద్రీ రహీమ్ బఖ్ష్ గారు ప్రక్షాళనము కొరకు మట్టి చెంబు చేతిలో పట్టుకొని అక్కడే వుండిరి. హజ్రత్ డాక్టర్ గారిని చూచి (డాక్టర్ గారు అక్కడ ప్రభుత్వ వైద్యులుగా నుండిరి. ప్రభుత్వ ఆసుపత్రిలో నియమితులై యుండిరి) ధార్మిక చర్చ మొదలు పెట్టెను. హజ్రత్ డాక్టర్ గారి ఏదో ఒక మాటపై ఛౌద్రీ రహీం బఖ్ష్ గారు తీవ్ర కోపమునకు లోనై మట్టి చెంబు గట్టిగా వారి నుదుట కొట్టిరి. చెంబు నుదుటు తాకగానే పగిలిపోయెను. నుదుటి ఎముక గాయపడి, రక్తము వేగంగా ప్రవహించసాగెను. డాక్టర్ గారి దుస్తులు రక్తసిక్తమైనవి. వారు గాయపడిన చోట చేతితో పట్టుకొని వెంటనే ఆసుపత్రికి చికిత్స కొరకు పోయిరి. వారు తిరిగి పోగానే ఛౌద్రి రహీం బఖ్ష్ గారు

ఇప్పుడేమి జరుగునని ? తీవ్ర ఆందోళనకు గురయ్యిరి. వీరు ప్రభుత్వ వైద్యులు. అధికారులు కూడ వారి మాటనే నమ్ముతారు. ఇప్పుడు నా రక్షణకు ఏ దారి లేదు. నేనెక్కడికి పోవుదును, ఏమి చేయుదును ? అతడీ ఆలోచనలతో, భయపడుచు (మస్జిద్) లోనే నక్కి కూర్చొనెను. అటు డాక్టర్ గారు ఆసుపత్రికి వెళ్ళి గాయమునకు చికిత్స చేయించుకొని, మందు పెట్టించుకొని, రక్తముతో నిండిన దుస్తులను మార్చుకొని మరల నమాజ్ కొరకు అదే మస్జిద్ వచ్చిరి. డా॥ సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ గారు మరల మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు ఛౌధ్రి రహీం బఖ్ష్ గారిని అక్కడ చూచి చూడగానే వారు చిరునవ్వు నవ్విరి, నవ్వుతూనే ఇట్లడిగిరి. ఛౌధ్రి రహీం బఖ్ష్! ఇప్పుడు మీ కొపము చల్లారినదా లేదా ?"

ఈ వాక్యము వినగానే ఛౌధ్రి రహీం బఖ్ష్ స్థితి మారిపోయెను. వెంటనే చేతులు జోడించుచు క్షమాపణ కోరిరి. అనంతరం ఇట్లనిరి. షాహ్ గారు! నా బైఅత్ ఉత్తరము వ్రాయండి! ఎందుకనగా సహనపు ఇంతటి గొప్ప ఆదర్శము, మెత్తదనము, క్షమాగుణపు వ్యవహారము దైవ సంస్థ సభ్యులు తప్ప మరెవరు చూపించలేరు. ఈ విధముగా ఛౌధ్రి గారు అహ్మదీ అయిరి. కొంత కాలము తర్వాత వారి మిగతా కటుంబ సభ్యులు కూడ అహ్మదియ్య సంస్థలో చేరిరి.

(సీరత్ హజ్రత్ డా॥ సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ గారు పుట 63, ముద్రణ మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్య పాకిస్తాన్)

ఈ పలు ఉదాహరణలను నేను ప్రస్తావించితిని. ఇవి మొదటి మూడు నాలుగు బైఅత్ నిబంధనలకు సంబంధించినవి. బైఅత్ చేసిన తర్వాత ప్రజలలో ఎటువంటి విప్లవములు ఏర్పడినవో తెలియుటకు

మున్ముందు కూడ పలు ఉదాహరణలను తెలిపెదను. ఇటుల రాబోవు సంతానమునకు తెలియును. వారు కూడ తమలో ఇటువంటి పవిత్ర మార్పులు సృష్టించుకొందురు. వారిపై దజ్జాల్ భయము ఎన్నడు పడకుండా వుండు గాక! ఆమీన్

(ఖుత్బా జుమా ప్రసంగము 26 సెప్టెంబర్ 2003,
మస్జిద్ ఫజల్ లండన్)

# అహ్మదియ్యా సంస్థను స్వీకరించిన తర్వాత పుణ్య విప్లవ మార్పుల విశ్వాసపూరిత ప్రస్తావన

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము ఇట్లనిరి.

గత జుమా కంటే ముందు జుమాలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లో ఈ పది బైఅత్ నిబంధనలను పాటించు ప్రతిజ్ఞ చేయుచు ప్రవేశించిన తర్వాత అహ్మదీయులలో ఎటువంటి మార్పులు సంభవించినవి అను అంశమును ప్రస్తావించియుంటిని. ఇప్పుడు ఇదే అంశమును ముందుకు కొనసాగింతును.

## సుఃఖ దుఃఖములలో అల్లాహ్‌తో విశ్వాసముగా నుండుట

ఐదవ నిబంధనలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

ఇట్లు ప్రతిజ్ఞ చేయించిరి. మీరు సుఖ దు:ఖము, ఇబ్బంది, కష్టము, ఎగతాళి, అవమానకరమైన ఏ పరిస్థితులు ఎదురైనను ఎన్నటికి అల్లాహ్‌తో ఫిర్యాదు చేయకూడదు. కాని అతని ఇష్టముపై రాజీ పడుదునని అతని అనుగ్రహమును యాచించవలెను. దీని పలు ఆచరణాత్మక ఉదాహరణలను నేను ప్రవేశపెట్టెదను.

అందరి కంటే ముందు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) ఉదాహరణ గలదు. ఆగస్టు 1905లో వారి తనయుడు అబ్దుల్ ఖయ్యూమ్ కొన్ని రోజులు తట్టు (పిల్లలు గురయ్యే చర్మ వ్యాధి) వ్యాధితో బాధపడి చనిపోయెను. అప్పుడు వారి వయసు సుమారు రెండు సంవత్సరములు వుండెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) చూపిన ఆదర్శము ఏమనగా వారు నబీ సల్లల్లాహు అలైహి వసల్లం పద్ధతిని అనుసరించుచు మొదట బాలున్ని ముద్దాడిరి. అప్పుడు వారి కనులలో నీరు తిరిగెను. అనంతరం ఇట్లనిరి. "నాకు ఏదేని ఆందోళన వున్నందు వలన నేను బాలుని ముఖమును విప్పినానని భావించుట సరికాదు. ఎందుకు విప్పినానగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తనయుడు ఇబ్రాహీమ్ మరణించినప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని ముఖమును చుంబించిరి. వారు కన్నీరు కార్చిరి. అనంతరం అల్లాహ్‌ను స్తుతించి, ఇట్లనిరి. ఎడబాటు కొద్ది సమయము కొరకు కూడ ఇష్టముండదు. కాని మేము అల్లాహ్ శుభములపై రాజీ పడెదము. ఈ పద్ధతిని పూర్తి చేయుటకు నేను ఇతని ముఖమును విప్పి, చుంబించినాను. ఒక పద్ధతిని పూర్తి చేయు అనుగ్రహము లభించినందున ఇది అల్లాహ్ అనుగ్రహము, సంతోషించదగ్గ సమయము."

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా ఇట్లు తెలుపబడిన వ్యక్తి ఆచరణ ఇది.

چہ خوش بودے اگر ہر یک ز اُمت نورِ دیں بودے
ہمیں بودے اگر ہر دل پُر از نور یقیں بودے

అనగా సమాజపు ప్రతి వ్యక్తి నూరుద్దీన్ అయినచో ఎంత బాగుండును. కాని ప్రతి హృదయము నమ్మక కాంతితో నిండివున్నప్పుడే ఇది సాధ్యమగును.

మరో ఉదాహరణ గౌ॥ హజ్రత్ ఛౌధ్రి నస్రుల్లాహ్ ఖాన్ రజియల్లాహు అన్హు గారిది. ఛౌధ్రి జఫ్రుల్లాహ్ ఖాన్ రజియల్లాహు అన్హు గారిట్లు తెలిపిరి. "అజీజమ్ షుక్రుల్లాహ్ ఖాన్ రజియల్లాహు అన్హు గారి కంటే చిన్న అజీజమ్ ఛౌధ్రి అబ్దుల్లాహ్ ఖాన్ రజియల్లాహు అన్హు గారి కంటే పెద్ద వారైన హమీదుల్లాహ్ ఖాన్ నామము గల ఒక మా సోదరులు ఎనమిది తొమ్మిది సం॥ల వయసులో కొన్ని రోజులు అనారోగ్యముతో బాధ పడి మృతి చెందిరి. వారు ఫజర్ సమయమున మృతి చెందిరి. తండ్రి గారు రాత్రంతా వారి సేవలో నిమగ్నమైయుండిరి. వారి మరణము తర్వాత వారి అంత్యక్రియలు, ప్రార్థన, సమాధి చేసిన తర్వాత న్యాయస్థానము తెరుచుకోగా రోజు వారి మామూలు ప్రకారము న్యాయస్థానమునకు హాజరైరి. క్లయింట్లకు ఎవరికి అనుమానము రాలేదు. వారు తమ గారాల తనయున్ని సమాధి చేసి తన దైవ ఇష్టమునే తన ఇష్టముగా భావించి రాజీ అయి కృతజ్ఞత తెలుపుచు తన విధులు నిర్వహించుటకు మామూలు ప్రకారము వచ్చినారని న్యాయస్థాన

అధికారులకు లేదా తోటి న్యాయవాదులకు ఏ మాత్రము తెలియలేదు.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 11 పుట 165,166)

హజ్రత్ ఖాజి జియావుద్దీన్ (రజి) గారిట్లు వ్రాసిరి. "భార్య, ముగ్గురు పిల్లల మరణముతో పాటు వ్యతిరేకులు కూడ ఆందోళన చేయుచుండిరి. అవమానపర్చడమే కాక వివిధ రకాలుగా ఆర్థిక నష్టము కలిగించుటలో ఏ అవకాశమును వదిలిపెట్టే వారు కారు. నా గృహములో దొంగతనము కూడ జరిగినది. ఈ ఆపదలన్నిటిని ఒకే కోణంలో పరిశీలించగా నేను కొంత మేరకు విచార హృదయము, తీవ్ర బాధలో యుంటిని. హుజూర్ (అ) ముందుగానే సూచన ప్రాయంగా తెలిపిన ప్రకారము ఈ ఆపదలు, కష్టములు సంభవించినవి. ఈ సమయములోనే హుజూర్ (అ) ఎంతో దయతో పరామర్శించు ఒక తృప్తి కలిగించే ఉత్తరము కూడ పంపిరి. అది కూడ ఒక భవిష్యవాణితో కూడినదై యుండెను. అది పూర్తి అయినది, అగుచున్నది. నిజముగనే మీకు కఠిన పరీక్ష ఎదురైనదని వ్రాసిరి. ఇది అల్లాహ్ పద్ధతి. అతడు స్థిరత్వముపై నిలిచే తన దాసుల స్థిరత్వమును ప్రజలకు తెలుపుటకు, సహనముపై గొప్ప గొప్ప ఫలితము అందించుటకు ఇటుల చేయును. అల్లాహ్ ఈ ఆపదలన్నిటి నుండి మోక్షము కలిగించును. శత్రువులు నీచులై అవమానించబడుదురు. అనుచరుల (రజి) కాలములో అయినట్లు అల్లాహ్ మునుగుచున్న వారి నావను రక్షించెను. అదే విధముగా ఇక్కడ కూడ జరుగును. వారి శాపములు తుదకు వారి పైనే పడును. అల్‌హందులిల్లాహ్. హుజూర్ (అ) దుఆతో ఇటులనే జరిగెను. నేను ప్రతి స్థితిలో స్థిరత్వము, సహనములో ముందుకే వెళ్ళినాను."

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 2 పుట 12,13)

హజ్రత్ మౌల్వీ బుర్హానుద్దీన్ రజియల్లాహు అన్హు గారిట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆరంభములో సియాల్కోట్ వచ్చినప్పుడు హుజూర్ ఒక లెక్చర్ ఇచ్చుటకు ఒక ప్రాంతము నుండి మరో ప్రాంతమునకు వెళ్ళుచుండిరి. ఇతర వ్యక్తులు కూడ హుజూర్ వెంట వుండిరి. వీధి నుండి వెళ్ళుచుండగా ఎవరో ఒకరు దుర్బుద్ధితో ఇంటి పై కప్పు నుండి బూడిద గంప పారవేసెను. అల్లాహ్ కృపానుసారము హుజూర్ వెళ్ళిపోయిరి. కాని గంపలోని బూడిద తండ్రి గారిపై పడినది. (ఇది వారి కుమారుని వాంగ్మూలము) ఇంకేమి కావలెను. వృద్ధుడు, తెల్లటి వెంట్రుకలు, ప్రజలకు ఒక ప్రదర్శన అయినది. వారికి హజ్రత్ గారితో ఎనలేని ప్రేమ, అనురాగము వుండెను. కనుక అక్కడే నిలబడి అంతులేని ఆనందముతో ఇట్లనుచుండిరి. "ఓ తల్లి ఇక్కడ పడవేయుము". అల్లాహ్‌కు కృతజ్ఞతలు. హజ్రత్ గారి వలన ఈ దైవానుగ్రహము లభించినది.

ఇటులనే మరో సంఘటన ఇట్లు గలదు. హజ్రత్ గారు సియాల్కోట్ నుండి తిరిగి వచ్చే సందర్భమున సేవకులు వారిని రైలు బండి ఎక్కించి తిరిగి తమ తమ గృహములకు వచ్చుచుండిరి. కాని ఏదో ఒక కారణముతో వీరొక్కరే వెనుక వుండిపోయిరి. కనుక వ్యతిరేకులు పట్టుకొని, అతి హేయమైన రీతిలో ప్రవర్తించి, వారి నోట్లో పేడ వేసిరి. కాని తండ్రి గారు ఇదే అవమానములో ఇదే బాధలో ఆనందము పొందుచుండిరి. పదే పదే ఇట్లనుచుండిరి. "ఓ బుర్హాన్ ! ఈ అనుగ్రహములు ఎక్కడి నుండి లభించును"? అనగా ధర్మము పేరున ఎవడు ఒకనికి బాధ కలిగించును. ఇది అదృష్టమే.

(మాస పత్రిక అన్సారుల్లాహ్ రబ్వా సెప్టెంబర్ 1977 పుట 14,15)

# సహనము, స్థిరత్వము

హజ్రత్ మౌల్వీ బుర్హానుద్దీన్ రజియల్లాహు అన్హు గారి గురించి హజ్రత్ మౌల్వీ అబ్దుల్ ముఘ్నీ గారు (అనగా వారి తనయులు) ఇట్లు వ్రాసిరి. "అహ్మదియ్య సంస్థలో చేరిన తర్వాత మేము నెలల తరబడి ఆ పుష్కలమైన కాలములో నెయ్యి ముఖమే చూడలేదు. ఇంధనమును కొనుగోలు చేసే బదులు నువ్వుల ఎండిన ఆకులను కాల్చేవారము. కాని ఎండిన ఆకులతో వంట అయ్యేది కాదు. అందుకే పప్పును ముందుగానే ఇంట్లో ఏన్చేవారము. అనంతరం దానిని రుబ్బే వారము. గిన్నెలో నీరు, ఉప్పు, కారం వేసి క్రింద ఆకులు అంటించే వారము. నీరు మసిలినప్పుడు ఆ ఏన్చిన, రుబ్బిన పప్పు వేసేవారము. మేము రొట్టెలు తినుటకు మా శాఖహారమిదే."

"సాధారణముగా జొన్నలు, సజ్జలు, ఎప్పుడో ఒక సారి గోదుమల రొట్టె, మరల నెయ్యి బదులు నువ్వుల నూనే వాడేవారము. ఆకు కూరల బదులు వృక్షముల చిగురును ఆకుకూరలుగా వండే వారము. వస్త్రములు మౌల్వీల వలె కాక పాత కాలపు వ్యవసాయదారుల వలె వుండెను. వాస్తవమేమనగా తండ్రి గారు హజ్రత్ గారిని కలిసిన అనంతరం ఒక ప్రేమ, అనురాగము, ఉత్సాహము, ఉత్తేజము పొందిరి. అందుకే తమ విశ్రాంతి, వసతులు, ఆహారమును అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒకే ఒక ఆలోచన యుండెడిది. వారిలో రగిలిన దైవ ప్రేమ, ప్రవక్త అనురాగము, హజ్రత్ గారి ప్రేమను ప్రజల హృదయములలో కలిగించాలనే ప్రేమాగ్ని యుండెడిది. అనుక్షణం ఇదే ఆలోచన, ఇదే ధ్యాస, ఇదే ప్రేమ, ఇదే బాధ, ఇదే చింత అనగా అహ్మదియ్య సంస్థ ఎలా వ్యాపించునని

వుండెడిది. అన్నపానీయాలు, దుస్తుల పట్ల శ్రద్ధ వుండెడిది కాదు. నేను నా తల్లి ఈ పరిస్థితులలో ఏ విధముగా సమయము గడిపినామో అది అల్లాహ్‌కే బాగుగా తెలుసు. ఇంత ఇబ్బంది, లేమితనములో కూడ ఆత్మాభిమానము, సహనము, స్థిరత్వములో ఒక గట్టి పర్వతము వలె యుండిరి. ధర్మము విషయములో ఎంత ఆత్మాభిమానము కలిగి యుండిరనగా ఎటువంటి ఆశ, మిత్రుత్వము, బంధుత్వమును మధ్యలో జోక్యము కలగనివ్వలేదు. **الحمدللّٰہ ثم الحمدللّٰہ** (సర్వ ప్రశంసలు అల్లాహ్‌కే) మా శిక్షణ కూడ అటువంటి వాతావరణములో జరిగినది మా దృష్టిలో కూడ ప్రపంచము, దానిలో నున్నదంతయు హీనమైనదే అనిపించెను. ఈ ఆత్మాభిమానమును చూసి మిర్జా గారు వీరికి వేతనమిస్తారని ప్రజలు అనడం మొదలు పెట్టిరి."

(మాసపత్రిక అన్సారుల్లాహ్ రబ్వా
సెప్టెంబర్ 1977 పుట 11,12)

## సహనపు సాటిలేని ఉదాహరణ

హజ్రత్ ఉమ్ముల్ ముమినీన్ రజియల్లాహు అన్‌హా సాటిలేని సహనపు ఉదాహరణలకు మరో ఉదాహరణ లభించదు. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితపు అంతిమ ఘడియలలో హజ్రత్ ఉమ్ముల్ ముమినీన్ ప్రాపంచిక స్త్రీల వలె విలపించి, అసహన మాటలు నోటితో పలికే బదులు కేవలం అల్లాహ్ ఆస్థానములో పడి సాష్టాంగములో అతి వినమ్రత, నిరాడంబరతతో దుఆల రూపంలో యాచించే పవిత్ర ఆదర్శమును నెలకొల్పిరి. తుది ఘడియలో యాసీన్ చదవబడినప్పుడు

హుజూర్ (అ) ప్రాణము ఈ బంధమును తెంచుకొని తన నిజమైన ప్రియుని ఆస్థానములో హాజరయ్యేను. అప్పుడు హజ్రత్ ఉమ్ముల్ ముమినీన్ اِنَّا لِلّٰهِ وَاِنَّا اِلَيْهِ رَاجِعُوْنَ (మేము నిశ్చయముగా అల్లాహ్ వారమే. మేము నిశ్చముగా అతని వైపునకే తిరిగి పోవువారము) అని, నిశ్శబ్దము పాటించిరి. ఎటువంటి రోదన, దుఃఖమును ప్రదర్శించలేదు. కొందరు స్త్రీలు లోపల ఏడ్చుడం మొదలు పెట్టిరి. వారు ఆ స్త్రీలను గట్టిగా నిరోధించి ఇట్లనిరి. నా భర్త అయినను నేను రోదించడం లేదు. ఏడ్చుటకు మీరెవరు? ఎంతో గారాబంగా పెరిగిన ఒక స్త్రీ, ఆమె ఆధ్యాత్మిక రారాజు, ఆమె గారాబాన్ని భరించే భర్త మృతి చెందినప్పుడు చూపిన గొప్ప సహన, స్థిరత్వ గొప్ప అద్భుతమైన ఉదాహరణ.

(తారీఖె అహ్మదియ్యత్ సంపుటి 2 పుట 547)

ఆ తర్వాత పిల్లలకు కూడ ఇట్లు ఉపదేశించిరి. మీ తండ్రి మీకేమియును వదల లేదని ఊహించకుము. ప్రార్థనల ఒక గొప్ప నిధి వదిలిపోయిరి. అది సమయానుసారము మీకు సహాయపడును.

వారి జమాఅత్‌లో చేరు ప్రతి వ్యక్తి పవిత్ర ఖురాన్ ఆదేశములను అమలు చేయువాడు కావలెనని, కనీసం అమలు చేయుటకు ప్రయత్నించవలెనని, దానిని నమ్మవలెనని హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కోరేవారు. ఒక్క ఆదేశమును నమ్మకున్నను అతనికి నాతో సంబంధము లేదు. వారిని నమ్మేవారు ప్రాపంచిక ఆచారాలను వీడి ఇహలోక ఆశలు, వృధా సంప్రదాయాల నుండి దూరముండవలెనని అల్లాహ్, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన వాటిని మాత్రమే పాటించుటకు కృషి చేయువారు కావలెనని వారు ఆశించేవారు.

ఖుర్‌ఆన్‌లో వున్నదానినే అల్లాహ్, ప్రవక్త ఆదేశించెను. అందుకే ఒకడు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సద్గుణముల గురించి చెప్పగలరని ప్రశ్నించగా 'ఖురాన్ పఠించరా! ఖురాన్‌లో ప్రస్తావించబడిన సద్గుణములే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సద్గుణములు' అని వారనిరి. అందుకే హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నేను నా యజమాని, విధేయతార్వునిని అనుసరింతును. ఖురాన్ ప్రతి ఆదేశమును నా కార్యాచరణగా చేసుకొందును. మీరు కూడ ఇటువంటి అనుసరణకు ప్రయత్నించినచో నా సంస్థలో లెక్కించబడుదురు. బైఅత్ చేసిన తర్వాత దీని ఉదాహరణలను కూడ జమాఅత్ చూపినది.

## ఆచారాల నుండి దూరముండుట

మొట్ట మొదటగా ఒక మహిళ ఉదాహరణమును నేనిక్కడ ప్రస్తావింతును. వీరు హజ్రత్ ఛౌధ్రి జఫ్రుల్లాహ్ ఖాన్ గారి తల్లి. వారి మేనల్లుడు ఛౌధ్రి బషీర్ అహ్మద్ గారిట్లు తెలిపిరి. తల్లి గారికి దురాచారాలతో ఎంతో ద్వేషముండెనని ఛౌధ్రి గారు వ్రాసిరి. దాని అంచనా దీనితో అగును. వారిట్లనిరి. నా (ఛౌధ్రి బషీర్ అహ్మద్ గారి) వివాహ సందర్భమది. నికాహ్ తర్వాత నన్ను స్త్రీల విభాగంలో తీసుకెళ్ళిరి. గ్రామాలలో నిర్వహించే ఆచారము ప్రకారము అక్కడ ఇద్దరు ఎదురెదురుగా కూర్చునే ఏర్పాట్లు గలవు. నేను ఒక చోట కూర్చుంటానని నాతో ఆశించబడుచున్నది. రెండవ చోట వధువును కూర్చోబెట్టదలచిరి. అనంతరం పలు ఆచారాలు నిర్వహించబడును. వీటిని పంజాబీ భాషలో 'బేడూ ఘోడి' ఆడుట అందురు.

నేను మనసులో ఆందోళనకు లోనైతిని. ఇప్పుడు స్త్రీలతో మొండితనము, వాదించుట సమంజసము కాదని నేను ఆలోచించితిని. నా కొరకు కేటాయించబడిన చోట నేను కూర్చొంటిని. ఈ దురాచారము కొరకు సిద్ధము చేయబడిన వస్తువుల వైపు హస్తము వాల్చితిని. ఇంతలోనే మామ భార్య గారు (ఛౌద్రి గారి తల్లి) నా హస్తము మణికట్టును గట్టిగా పట్టుకొని వెనుకకు లాగి ఇట్లనిరి. వద్దు బిడ్డా! ఇవి అన్యారాధన విషయములు. దీనితో నాకు కూడ ప్రోత్సాహము కలిగెను. నేను ఆ వస్తువులను నా చేతితో చెదరగొట్టి, నిలబడి ఇట్లంటిని. నేను ఈ దురాచారాలలో పాల్గొనను. ఈ విధముగా నాకు మోక్షము లభించెను. నేడు కూడ స్త్రీలు ఈ విషయమును గుర్తుంచుకోవలెను. తమ ప్రాంత లేదా దేశ దురాచారాలను అనుసరించక ఎక్కడైనా అన్యారాధనకు ప్రోత్సాహము కలిగే ఇటువంటి దురాచారములను చూచినచో వాటి నుండి దూరముండుటకు ప్రయత్నించవలెను. ఇదే ఉత్సాహముతో అహ్మదీ స్త్రీలందరు తమ సంతానమును సంస్కరించు వారగుగాక! మన దేశములలో అనగా పాకిస్తాన్, భారత దేశము మొ॥లో ముస్లిములలో కూడ కూతురుకు ఆస్థిలో పూర్తి వాటా ఇవ్వని ఆచారము గలదు. పూర్తిగా ఏమిటి ? ప్రత్యేకముగా గ్రామస్తులలో, వ్యవసాయదారులలో ఇవ్వనే ఇవ్వరు. ఛౌద్రి నస్రుల్లాహ్ ఖాన్ గారి ఒక ఉదాహరణ గలదు. ఛౌద్రి గారిట్లు వ్రాసిరి. మా సోదరికి ఆ కాలపు ఆచారము మేరకు వారి వివాహ సందర్భమున మా తండ్రి గారు చాలా వరకు కట్న కానుకలు ఇచ్చిరి. తర్వాత వారిట్లు ఆదేశించిరి. వారి ఆస్తి ముహమ్మదీయ శాసనము ప్రకారము బాల బాలికలలో విభజించబడును. దాని ప్రకారము వారి మరణము తర్వాత వారి

కూతురునకు కూడ శాసనము ప్రకారము వాటా ఇవ్వబడెను.

## విధేయత అరుదైన ఉదాహరణములు

ఒక సంఘటన ఇట్లు గలదు. 1892లో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జాలంధర్ వెళ్ళి వుండిరి. హుజూర్ పై అంతస్తులో విడిది చేసిరి. ఎవరో ఒక సేవకురాలు ఇంట్లో గుడ్గుడి పెట్టి వెళ్ళిపోయెను. ఈ మధ్యలోనే గుడ్గుడి క్రింద పడి కొన్ని వస్తువులు అగ్ని వలన కాలిపోయినవి. ఈ సందర్భమున హుజూర్ గుడ్గుడి త్రాగే వారి పట్ల అసంతృప్తి, గుడ్గుడితో ద్వేషమును వ్యక్తపరచిరి. ఈ విషయము క్రింద అహ్మదీయులకు తెలిసెను. వారిలో అనేకులు గుడ్గుడి త్రాగేవారు. వారి గుడ్గుడులు కూడ ఇంట్లోనే వుండెను. హుజూర్ అసంతృప్తి వారికి తెలిసినప్పుడు గుడ్గుడి (హుక్కా) త్రాగే వారందరు తమ గుడ్గుడులను పారేసి త్రాగడము మానేసిరి. హుజూర్ గుడ్గుడిని ద్వేషించిరని సాధారణ జమాఅత్‌నకు తెలియగా అనేక సాహసోపేతమైన అహ్మదీయులు గుడ్గుడిని వదిలిపెట్టిరి.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 10, పుట 157– 313లో ఒకరు)

మిర్జా అహ్మద్ బేగ్ సాహీవాల్ ఇట్లనిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఒక సారి నా మామ మిర్జా గులాముల్లాహ్ గారితో ఇట్లనిరి. గుడ్గుడిని వదిలి పెట్టాలని మిత్రులకు ఆదేశమివ్వుము. మామ స్వయాన గుడ్గుడి త్రాగేవారు. చాలా మంచిది హుజూర్ అని వారనిరి. ఇంటికి వచ్చి గోడకు నిలబెట్టిన తన గుడ్గుడిని విరగ్గొట్టిరి. ఈ రోజు గుడ్గుడి ఎండలో నున్నందుకు కోపముతో ఇలా చేసిరని అత్తమ్మ భావించిరి. కాని మామ ఎవరిని ఏమి అననందుకు ఈ రోజు గుడ్గుడిపై కోపమెందుకని

అత్తమ్మ అడిగిరి. వారిట్లనిరి. గుడ్గుడి త్రాగకూడదని ప్రజలకు ఆదేశించాలని హజ్రత్ గారు నాకు చెప్పిరి. కాని నేను స్వయముగా గుడ్గుడి త్రాగెదను. అందుకే నేను మొదట నా గుడ్గుడిని విరగ్గొట్టినాను. ఈ విధముగా మామ గారు మృతి చెందే వరకు గుడ్గుడిని ముట్టు కోలేదు. గుడ్గుడి వదిలిపెట్టవలెనని ఇతరులను ఆదేశించేవారు.”

(సవానిహ్ ఫజ్లె ఉమర్ సంపుటి 2 పుట 34)

నేడు ఇదే దుష్టత్వము గుడ్గుడి (హుక్కా) సిగ్రెట్ రూపమును దాల్చుకొనెను. సిగ్రెట్ త్రాగేవారు కూడ సిగ్రెట్‌ను వదిలిపెట్టుటకు ప్రయత్నించవలెను. ప్రత్యేకముగా చిన్న వయసులోనే సిగ్రెట్ అలవాటు వుండుట అపాయకరము. సిగ్రెట్ అనేక రకాలు. వాటిలో మత్తు పదార్థములను కలిపి త్రాగెదరు. నవయువకుల జీవితమును నాశనము చేయు ఇదొక దజ్జాల్ వ్యాపింప జేసిన వలయము. దురదృష్టవశాత్తు ముస్లిం దేశములు కూడ ఇందులో చేరినవి. ఏది ఏమైనా సిగ్రెట్ త్రాగే అలవాటును వదిలిపెట్టుటకు మన నవయుకులు కృషి చేయవలెను.

హజ్రత్ అఖ్దస్ అనుచరులైన హజ్రత్ మున్షి బర్కత్ అలి గారు షిమ్లాలో ఉద్యోగము చేయుచుండిరి. అహ్మది కాక ముందు వారొక లాటరి వేసియుండిరి. ఆ లాటరి వెలువడగా ఏడు వేల ఐదు వందల రూపాయలు వారికి లభించినవి. (ఆ కాలములో) వారు హుజూర్‌ను అడగగా హుజూర్ దానిని జూదముగా నిర్ణయించి, తన కొరకు ఒక్క పైసా కూడ వినియోగించకూడదని చెప్పిరి. హజ్రత్ మున్షి గారు ఆ నగదు మొత్తం పేదలు, దీనులలో పంచిపెట్టిరి.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 3 పుట 33)

నేడు ఇక్కడ యూరప్‌లో ఇదే ఆచారము గలదు. పశ్చిమములో కూడ లాటరి విధానము గలదు. లాటరి వేయు వారి కొరకు నగదు వెలువడినచో అవి వారికి ఏమాత్రము ధర్మబద్ధము కావు. జూదము నిషేధించబడినట్లే ఇది కూడ నిషేధమే. అసలు తీసుకోకూడదు, తీసుకున్నను తన స్వంతము కొరకు వినియోగించకూడదు.

మీ ఇంగ్లాండ్ వాసి గౌ॥ బషీర్ అహ్మద్ ఆర్చర్డ్ గారి ఉదాహరణను పరిగణించుము. అహ్మదియ్య సంఘమును స్వీకరించిన తర్వాత వారు తమలో మార్పులు కల్పించుకొని, తన జీవితమును అంకితము చేసిరి. 1944లో అహ్మదీ అయిరి. ఖాదియాన్‌లో కొంత కాలము ధార్మిక విద్యనభ్యసించిరి. నేను చెప్పినట్లు జీవితమును అంకితము చేసిరి. ఆ తర్వాత వారి జీవితములో గొప్ప విప్లవము సంభవించెను. దైవారాధన, ప్రార్థనలలో వారికి అనంత ఉత్సాహము కలిగెను. ఖాదియాన్ మొదటి ప్రయాణపు ఫలము మద్యమును వీడుట అయ్యెను. మద్యము అధికముగా సేవించేవారు. తక్షణమే వారు మద్యమును వీడిరి. తర్వాత జూదము, మద్యము నుండి పశ్చత్తాపము చెందిరి. ఈ రెండు వస్తువుల నుండి శాశ్వతముగా దూరమైరి, వదిలిపెట్టిరి.

(అల్‌ఫజల్ 10 జనవరి 1978,
అజీమ్ జిందగి పుట 8,9)

## మద్యపాన నిషేధము

ఆ కాలములో, నేడు కూడ పలువురు అహ్మదీయులచే ఇక్కడ జర్మని మొ॥ మరియు ఇతర దేశాలలో కూడ రెస్టారేంట్, హొటళ్ళలో మద్యపాన వ్యాపారము జరుగుచున్నది. హదీసు ప్రకారము మద్యమును

సిద్ధము చేయువాడు, మద్యము త్రాగించేవాడు, మద్యము విక్రయించేవాడు, పెట్టువాడు, అన్ని రకాల వారిని నరక వాసులని పేర్కొనబడెను. అందుకే హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబె రహ్మహుల్లాహ్ ఇట్లు ప్రకటించిరి. ఈ వ్యాపారములో కొనసాగుచున్న ప్రతి అహ్మదీ వెంటనే ఈ వ్యాపారమును వీడవలెను. లేనిచో వారికి వ్యతిరేకముగా కఠిన చర్య తీసుకోబడును. అనంతరం స్వయాన హుజూర్ (రహ్మ) ఇట్లనిరి. అల్లాహ్ కృపానుసారము చాలా పెద్ద సంఖ్య ఈ వ్యాపారమును వదిలి వేసిరి. కొందరికి అల్లాహ్ వెంటనే మంచి మంచి వ్యాపారములు ప్రసాదించెను. మరి కొందరిని పరీక్షించెను కూడ. వారు సుదీర్ఘ కాలము వరకు వ్యాపారము చేయలేక పోయిరి. కాని వారు గట్టిగా తమ నిర్ణయములపై నిలిచిరి. వారు ఈ అపవిత్ర వ్యాపారములో దిగుటకు ఇష్టపడలేదు.

## పవిత్ర ఖురాన్‌ను తమ కార్యాచరణగా చేసుకొనుము

ఒక జమాఅతేతర అమృత్సర్ నివాసి మియా ముహమ్మద్ అస్లమ్ మార్చి 1913లో ఖాదియాన్ వచ్చిరి. వారు హజ్రత్ ఖలీఫా అవ్వల్ గారి గురించి ఇట్లు వ్రాసిరి. "మౌల్వీ నూరుద్దీన్ గారు మిర్జా గారి ఖలీఫా అయినందున ఇప్పుడు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ అధికారిక నాయకులు. వారి ఉపదేశము, పవిత్ర ఖురాన్ పాఠపు సమావేశములలో రెండు రోజులు వుండి వారి పనిని గమనించితిని. అల్లాహ్ కొరకు మాత్రమే స్వచ్ఛమైన నియమములపై నాకు కనిపించిరి. ఎందుకనగా మౌల్వీ గారి కార్యాచరణ విధానము కపటము, మోసముతో పవిత్రమైనది. వారి

హృదయములో ఇస్లాం సత్యమునకు ఒక గొప్ప ఉత్సాహము గలదు. అది దైవ ఏకత్వ జ్ఞాన పరిశుభ్ర చెలిమ ప్రకారము పవిత్ర ఖురాన్ సూక్తుల విశ్లేషణల రూపంలో అనుక్షణం కపటమును కోరని హృదయము నుండి పొంగి దైవ ఏకత్వ దప్పికతో నున్న వారికి ప్రయోజనము కలిగించుచున్నది. నిజమైన ఇస్లాం పవిత్ర ఖురాన్ అయినచో మౌల్వీ గారిలో పవిత్ర ఖురాన్‌తో గల సత్యమైన ప్రేమను నేను ఏ వ్యక్తిలో చూడలేదు. ఈ అనుసరణ విధిలేక చేయునది కాదు. వారు ఒక గొప్ప తత్వజ్ఞానులు. అతి గొప్ప రీతిలో తత్వజ్ఞాన విమర్శ ద్వారా పవిత్ర ఖురాన్ ప్రేమలో బంధీ అయిరి. ఎందుకనగా నేను ఎంత గొప్ప తత్వజ్ఞానము కూడిన పవిత్ర ఖురాన్ విశ్లేషణను పవిత్ర ఖురాన్ పఠనము సందర్భమున వారి నోట విన్నానో నేడు ప్రపంచములో పలువురు తప్ప ఎవరు అటువంటి సామర్థ్యము కలిగి యుండలేరు."

(బదర్ మార్చి 1913 – హయాతె నూర్ పుట 611,612)

హజ్రత్ డా॥ సయ్యద్ అబ్దుస్సత్తార్ (రజి) గారు తన సంతానమునకు చేసిన ఒక మరణాదేశము గలదు. వారిట్లనిరి. పవిత్ర ఖురాన్‌ను తమ కార్యాచరణగా చేసుకొనుము. సున్నత్‌ను అనుసరింపుము. అహ్మదియ్య సంస్థ అభివృద్ధి, ఇస్లాం ప్రచారములో సర్వ సన్నద్ధులై వుండుము. తమ రాబోవు తరాలను కూడ ఈ విషయముల కొరకు సిద్ధము చేయుము.

(సీరత్ సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ గారు పుట 193)

ఈ ఉపదేశమును అహ్మదీయులందరు తమ దృష్టిలో పెట్టుకోవలెను.

హజ్రత్ మలిక్ మౌలా బఖ్ష్ గారు రజియల్లాహు అన్హు గురించి హజ్రత్ మిర్జా అబ్దుల్ హఖ్ గారిట్లు వ్రాసిరి. వారికి పవిత్ర ఖుర్ఆన్‌తో ప్రత్యేక ప్రేమ యుండెను. అనారోగ్యము, బలహీనత గానున్నను పవిత్ర ఖురాన్ జ్ఞానములు, వాస్తవికతలను వినుటకు సంకల్పించేవారు. ఒకసారి ఎన్నో నెలల వరకు చలికాలములో దారుల్ ఫజల్ వీధి నుండి దారుర్రహ్మత్‌లో వచ్చి ఉదయపు ఫజ్ర్ నమాజ్ చేసేవారు. ఎందుకనగా అక్కడి మస్జిద్‌లో గౌ॥ గులాం రసూల్ రాజేకీ గారు (రజి) ఖురాన్ పాఠమిచ్చేవారు. ఇటుల వారి జ్ఞానములు, వాస్తవికతలతో లబ్ధి పొందుటకు ఇట్లు చేయువారు. పవిత్ర రమజాన్ సందర్భమున మస్జిద్ అఖ్సాలో జరిగే పాఠము కొరకు కూడ క్రమం తప్పకుండా వచ్చేవారు. పవిత్ర ఖురాన్‌ను అధికముగా, చాలా శ్రద్ధతో చదివేవారు. స్వయముగా బోధను పొందడమే గాక ఇతరులను కూడ చేర్చుకొనువారు. జీవితపు తుది భాగములో ఎప్పుడు చూచిన రోజు అనేక సార్లు పవిత్ర ఖురాన్‌ను చదివేవారు. కాపీ, కలము తన దగ్గర వుంచుకొనేవారు. ఏదేని సూక్తి మధురమైన వివరణ అర్థమైనచో దానిని వ్రాసుకొని, తర్వాత తమ కుటుంబీకులకు కూడ వినిపించేవారు. వారు తమ కుటుంబీకులకు వినిపించుచున్నప్పుడు వారి ముఖము నుండి ఆనందము వ్యక్తమయ్యేది. తమ సంతానము పవిత్ర ఖురాన్ ప్రియులు కావలెనను కోరిక వారిలో వున్నట్లు స్పష్టమయ్యేది.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 1 పుట 124,125)

గేంబియాలోని ఒక క్రైస్తవ నవయువకుడు అహ్మదియ్యత్‌ను స్వీకరించెను. అతని తల్లి తీవ్రంగా వ్యతిరేకించ సాగెను. మొదట్లో అతడు భరించుచు పోయెను. కాని అతని తల్లి పవిత్ర ఖురాన్‌ను అవమానించడం

మొదలు పెట్టగానే ఇల్లు వదిలిపోయెను. మరల ఆ ఇంటికి వెళ్ళలేదు.

(మాస పత్రిక అన్సారుల్లాహ్ అనుబంధము
సెప్టెంబర్ 1987 పుట 6)

ఈ కాలములో కూడ ఆఫ్రీకా లాంటి సుదూర దేశములలో కూడ ఈ మహిమలు ప్రత్యక్షమగుచున్నవి.

ఇస్లాంలో నాలుగు వివాహాల వరకు అనుమతి గలదు. కొందరు దీనిని ఆజ్ఞగా మార్చుకొందురు. కాని ఇది కేవలము అనుమతే. ఆఫ్రీకాలో ఎంత పెద్ద వ్యక్తి గాని, అధిక ధనికుడు గాని, చీఫ్ గాని యున్నచో కొన్ని సార్లు కొన్ని తెగలలో నాలుగు కంటే ఎక్కువ తొమ్మిది, పది వివాహాల వరకు చేసుకునే ఆచారము గలదు. సీరాలియోన్‌కు చెందిన అలి రోజర్జ్ గారు అహ్మదీ అయినప్పుడు యవ్వనంలో వుండిరి. వారికి పన్నెండు భార్యలుండిరి. జమాఅత్ మురబ్బి మౌలానా నజీర్ అహ్మద్ గారు వారితో ఇట్లనిరి. ఇప్పుడు మీరు అహ్మదీ అయినారు. అందుకే పవిత్ర ఖురాన్ బోధనానుసారము మీరు నలుగురు భార్యలను వుంచుకోగలరు. మిగతా వారికి తగిన భరణి ఏర్పాటు చేసి విడాకులిచ్చి వేయుము. వారు ఈ ఉపదేశమును వెంటనే పాటించడమే కాక వారన్నందుకు మొదటి నలుగురు భార్యలను తమ వద్ద వుంచుకొని మిగతా యువ భార్యలను పంపివేసిరి. ఈ మార్పు ఒక విప్లవము.

మన ఒక మురబ్బి యూనుస్ ఖాలిద్ గారిట్లు వ్రాయుదురు. మౌలానా ముహమ్మద్ సిద్ధీఖ్ అమృత్సరీ కాలములో వి.వి. కాహ్‌లూ గారు దైవ స్వప్నముచే అహ్మదీ అయిరి. తర్వాత వారు అహ్మదియ్య జమాఅత్ సీరాలియోన్ అమీర్‌గా కూడ యుండిరి. అహ్మదీ కాక ముందు పూర్తిగా

స్వాతంత్ర్య వాతావరణముండెను. వారు వృత్తిపరంగా డ్యాన్సర్ అయినందున వారి వాతావరణము ఇంకా స్వాతంత్ర్యముగా నుండెను. కాని బైఅత్ చేసిన వెంటనే తమలో మార్పు సృష్టించుకొనిరి. నిష్టాపరత, పవిత్రత, దైవభీతి, ప్రార్థనలో ఒక స్థానము సంపాదించిరి. అల్లాహ్ వారిని గొప్ప ప్రగతితో సత్కరించెను. వారు తమ ప్రాంత పేరామౌంట్ చీఫ్‌గా కూడ యుండిరి. వారు ఏ ప్రాంతములో పేరామౌంట్ చీఫ్‌గా యుండిరో అ ప్రాంతములో వజ్రముల గనులుండెను. వారు సంపూర్ణ అధికారిగా యుండిరి. ఎందుకనగా ఈ ప్రాంతములలో చీఫ్‌లు అధిక అధికారాలు కలిగి యుందురు. వారు కోరినచో లక్షలాది, కోట్ల రూపాయల లాభమార్జించేవారు. కాని అహ్మదియ్య మధురమైన, పవిత్ర బోధన వలన ఈ ధనమును తనపై నిషేధించుకొనిరి. సాధారణ, నిరాడంబరత గల జీవితము గడిపిరి. మిస్టర్ కాహ్‌లూ గారు ఒక గొప్ప నిజాయితి గల చీఫ్‌గా, తాను స్వయముగా లంచము తీసుకోడు, తన సిబ్బందిని కూడ తీసుకోనివ్వడని పై స్థాయిలో కూడ పేరుగాంచిరి. వారు అనారోగ్యమునకు గురైనప్పుడు ఒక రోజు నేను వారిని పరామర్శించుటకు పోయితిని. వారు నన్ను పిలిచి ఇట్లనిరి. యూనుస్! నా కనుల ముందు ఎల్లప్పుడు పచ్చని రంగులో కలిమా తయ్యిబహ్ వ్రాసి వుంటుంది. దీనికి కారణమేమిటి ? నేనిట్లంటిని. మీకున్న అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ప్రేమానురాగముల ఫలితమిది. నేను రెండు నెలల వరకు పోవు చుంటిని. పచ్చని రంగులో వ్రాయబడిన కలిమా తయ్యిబహ్ నాకెల్లప్పుడు కనిపించునని వారనేవారు.

తర్వాత వారు ఆసుపత్రిలో చేరినప్పుడు పరిస్థితి విషమించెను.

ఒక అహ్మదీ స్నేహితుడు మిస్టర్ కోజ్ వారి హస్తము పట్టుకొని ఇట్లనిరి. చీఫ్ "**لَااِلٰهَ اِلَّااللّٰهُ**" చదువుము! వారు "**لَااِلٰهَ اِلَّااللّٰهُ**" చదివిరి. తర్వాత మిస్టర్ కోజి "مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰه" అనిరి. వారు "**مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰه**" చదవగానే తల వంగెను. (అనగా ప్రాణము పోయెను)

## వినయ, విధేయత

ఏడవ నిబంధన ఇట్లుండెను. వినయ, విధేయత, సత్ప్రవర్తన, బీదత్వము మొ॥ వాటి వైపు శ్రద్ధ కలిగి వుండును. సందేశహరులను అధికముగా బీద స్వభావము, ఆర్థికంగా తక్కువ స్థాయి కలిగినవారే విశ్వసింతురు. కాని త్యాగములలో ధనికుల కంటే అధిక ఉత్సాహముతో తమ ధనము ఖర్చు చేయుదురు. ప్రాణ త్యాగము చేయుటకు కూడ వెనుకాడరు. గొప్పతనమును ఎప్పుడు ప్రస్తావించరు లేదా గర్వము, అహంకారమును వ్యక్తపరచరు. ప్రతి చిన్న, పెద్ద వారితో అతి వినయ, విధేయతతో వుందురు. వినయ, విధేయతకు సంబంధించిన అతి గొప్ప ప్రమాణములు స్థాపింతురు. దైవ సంస్థల ప్రగతి రహస్యము ఇందులోనే గలదు. ఎంత అధికముగా నిరాడంబరులు, నిరుపేదలు వినయ, విధేయతతో కూడిన ఉన్నత ఉదాహరణలను, చూపువారగుదురో, అంతే అధికముగా ప్రగతి వేగము కూడ పెరుగును. నేను ఇంతకు ముందు చెప్పినట్లు సందేశహరున్ని నమ్మేవారు ఇటులనే వుందురు. సందేశహరుల చూపు ఇటువంటి వారిపై పడినప్పుడు వీరిని మరింత ప్రకాశింపజేయును. వారిని మరింత కాంతిమయము చేయును. నిరాడంబరత చూపు వారికి ఇతరుల కొరకు తమ స్థానమును వీడి పాదరక్షములలో కూర్చొనవలసి

వచ్చినను కూర్చొనుటకు ప్రాధాన్యత నిత్తురు. కాని వర్తమాన ప్రవక్త దూరదృష్టి ఇటువంటి వారిని గుర్తించును. విధేయత ప్రతిఫలమిచ్చుటకు, నా సంస్థలో వినయ, విధేయత కలిగిన వారి స్థానమేమిటో తెలపుటకు, తన జమాఅత్‌కు గుణపాఠము నేర్పుటకు వినయము గల వ్యక్తులను అక్కడి నుండి లేపి తన వద్ద కూర్చొనబెట్టుకొందురు, భోజన సమయమున తన పాత్రలో తినిపింతురు. వీరు ఈ వినయ, విధేయత వల్లనే ధర్మమును త్వరగా స్వీకరింతురు. వారి బోధనలను పూర్తిగా అమలు చేయువారగుదురు. అందుకే సందేశహరులు వీరిని ఆదరింతురు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. పేదలు గర్వపడరు. సంపూర్ణ విధేయతతో సత్యమును స్వీకరింతురు. నేను నిజముగా ధనికులలో ఇటువంటి వారు చాలా అరుదుగా వున్నారు. పేదలు పూర్తిగా పొందే భాగ్యములోని పదవ శాతం కూడ పొందే ధనికులు చాలా తక్కువున్నారని చెప్పుచున్నాను. అందుకే వారిట్లని యుండిరి. సంస్థలో ప్రవేశించుటకు వినయమనే నిబంధన గలదు. తద్వారా ధర్మమును సరైన రీతిలో అర్థము చేసుకొని పాటించగలరు. ఈ మార్పులు ఏ విధముగా సంభవించినవో పలు ఉదాహరణలను ఇప్పుడు ప్రవేశపెట్టెదను.

హజ్రత్ సయ్యద్ ముహమ్మద్ సర్వర్ షాహ్ రజియల్లాహు అన్‌హు గారు ఒక గొప్ప విద్యావంతులు, మంచి ఆర్థిక స్థితి గల వంశమునకు చెందినవారు. అయినను వారి పవిత్రత, వినయము, నిరాడంబరత ఆదర్శమైనదిగా యుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆస్థానముతో సంబంధమేర్పరచుకొని, హుజూర్ బానిసత్వమును స్వీకరించి ప్రాపంచికమును పొందు కోరికను మనసులో నుండి తీసివేసిరి.

అహ్మదియ్యా పాఠశాలలో ఉద్యోగము చేసిన పూర్తి కాలము ఒక చెప్రాసి స్థాయికి కూడ తగని ఒక చిన్న గృహములో గడిపిరి. హుజూర్ ఆస్థాన బానిసత్వము కొరకు ప్రపంచమును వీడినప్పుడు ప్రాపంచిక వస్తువుల సౌఖ్యపు ప్రశ్నే తలెత్తదు.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 5 భాగము 3 పుట 9)

వినయము గూర్చి ఇక్కడ మౌల్వీ బుర్హానుద్దీన్ గారి మరో ఉదాహరణ గలదు. ఒక సారి హుజూర్ సేవలో హాజరై, ఏ ఆలోచన వచ్చినదో అల్లాహ్‌కే తెలుసు, విలపించడం మొదలు పెట్టిరి. హుజూర్ ఎంతో ప్రేమతో క్షేమమేనా ? అని అడిగిరి. వారిట్లు వేడుకొనిరి. హుజూర్ నేను మొదట కోటారమైతిని, తర్వాత బావి అయితిని, మరల ఘజ్నీ అయితిని, ఇప్పుడు మిర్జాయి అయినాను. ఈ విలపించడం ఎందుకనగా జీవిత చివరి దశకు చేరుకున్నాను. కాని నేను అసమర్థుడిగానే వుండిపోయినాను. అనగా నేను మొదట కోటారపు గురువు గారి పాదములో చేరితిని. ఆ తర్వాత బావి అను గురువుకు సేవ చేసితిని. అనంతరం మౌల్వీ అబ్దుల్లాహ్ ఘజ్నవీ గారి సేవలో చేరితిని. ఇప్పుడు నేను హుజూర్ సేవలో వచ్చినాను. కాని దురదృష్టమేమనగా నేను అదే అసమర్థునిగానే యుండి పోయితిని. (ఇది వారి నిరాడంబరతే అయివుండెను)

అందుకే హుజూర్ మౌల్వీ గారిని ఎంతో ఆదరించి, సంతృప్తి పరచుచు ఇట్లనిరి. మౌల్వీ గారు! చింతించకండి! మీరెక్కడికి చేరవలసియుండెనో అక్కడికే చేరుకొనిరి. ఇప్పుడు చింతించవలసిన అవసరము లేదు. అప్పుడు వారికి ప్రశాంతత, తృప్తి కలిగినది.

(మాస పత్రిక అన్సారుల్లాహ్ రబ్వా సెప్టెంబర్ 1977 పుట 14)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు వ్రాసిరి.

"అల్లాహ్ కొరకే నా ప్రియులైన సయ్యద్ ఫజల్ షాహ్ గారు లాహోరి పూర్వము సక్న జమ్మూ రాష్ట్రమునకు చెందిన వారు. ఎంతో పరిశుభ్ర అంతరంగికము, ప్రేమ, అన్యోన్యముతో నిండి యుండిరి. పూర్తి విశ్వాస కాంతితో ప్రకాశితమై వున్నారు. ధన, ప్రాణముతో హాజరైరి. ఈ మార్గములో అవసరమున్న గౌరవము, మంచి ఆలోచన ఒక విచిత్ర నిరాడంబరత వారిలో గలదు. వారు హృదయపూర్వకముగా నిజమైన, పవిత్ర, సంపూర్ణ విశ్వాసము నా పట్ల కలిగివున్నారు. దైవ సంబంధము, ప్రేమలో ఉన్నత స్థానము వారు పొందియున్నారు. ఒకే రకమైన, విశ్వాసపాత్ర లక్షణము వారిలో స్పష్టముగా గలదు. వారి స్వంత సోదరులు నాసిర్ షాహ్ కూడ నాతో బైఅత్ సంబంధము కలిగివున్నారు. వారి మామ మున్షీ కరమ్ ఇలాహీ గారు కూడ నా నిజమైన మిత్రులలో గలరు.

(ఇజాలయె ఔహామ్ – రూహాని ఖజాయిన్
సంపుటి 3 పుట 532)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ కొరకే నా ప్రియులైన మున్షి రుస్తమ్ అలీ డిప్యూటి ఇన్స్పెక్టర్ రైల్వే. (మన దేశములలో పోలీస్ విభాగము చాలా అపఖ్యాతి చెందినది.) ఈ యువ సత్యవంతుడు, వినమ్రతతో నిండిన, నా ప్రథమ స్థాయి మిత్రులలోని వారు. నిరాడంబరత, నిస్వార్థత, వినమ్రత లక్షణములు వారి ముఖముపై ప్రతిబింబించును. ఏ ఆపద సమయములో నేను వారిని వెనుకడుగు వేయునట్లు పొందలేదు. విశ్వాసముతో ఏ రోజు నుండి నా వైపు వచ్చిరో ఆ విశ్వాసములో తగ్గుదల, నైరాశ్యమును కాక ప్రగతి

సాధించుచున్నారు.” అనగా అభివృద్ధి వైపు అడుగులు వేయుచున్నారు.

(ఇజాలయె ఔహామ్ – రూహాని ఖజాయిన్

సంపుటి 3 పుట 532)

## గర్వము నుండి దూరముండుట

ఇందులో “గర్వము నుండి దూరముందుమని” వుండెను. దీని గురించి సయ్యద్ ముహమ్మద్ సర్వర్ షాహ్ (రజి) గారి గురించి ఉదాహరణ ఇచ్చెదను. “విద్యా, సామర్థ్యములో గొప్ప స్థాయి కలిగివున్నను ఈ కాలపు ఇతర నామమాత్రపు విద్యావంతులకు విరుద్ధమైన నిరాడంబరత, విధేయత వారి స్వభావములో ఎంత వరకుండెననగా ఎప్పుడైనా చిన్న బాలుడు కూడ వారితో మాట్లాడదలచినా మాట్లాడే అవకాశముండెను. వారు అతి ప్రేమతో అతని మాట వినేవారు. సంతృప్తి కలిగించే రీతిలో అతని మాటకు సమాధానమిచ్చేవారు. మౌల్వీ ముహమ్మద్ హాఫీజ్ బఖాపూరి తన బాల్యపు సంఘటన ఇట్లు వినిపింతురు. నా సమీప బంధువునకు పుత్రుడు జన్మించెను. ఉత్తరము ద్వారా నాకు తెలియగా నేను శిశువు నామకరణం హజ్రత్ మౌల్వీ గారితో చేయదలచితిని. బహుశా మస్జిద్ అఖ్సాలో పాఠ్యమివ్వడానికి వారు పోవుచుండిరి. లేదా తిరిగి వచ్చుచుండిరి. నేను ముందుకు వెళ్లిపోతిని. నన్ను తమ వైపు వచ్చుచు చూచి ఆగిపోయిరి. ఎంతో శ్రద్ధతో వ్యవహరించి నేను మనవి చేయగా బాలునికి నామకరణం చేసి అతని కొరకు ప్రార్థన చేసిరి.

(అస్హాబె అహ్మద్ సంపుటి 5 భాగము 3 పుట 35)

మరల దీని గురించి హజ్రత్ మౌల్వీ బుర్హానుద్దీన్ (రజి) గారి ఒక సంఘటనను ప్రస్తావించదలచితిని. వారిలో పేరు, ప్రఖ్యాతలు, దర్శన

స్వభావము అసలే లేకుండెనని గత ఉదాహరణలతో కూడ స్పష్టమైనది. గొప్ప విద్యావంతులైనను విద్యా గర్వము, అహంకారము కూడ లేకుండెను. ఖాదియాన్‌లో విడిది చేసినప్పుడు ఎవరైనా "మౌల్వీ గారు" అన్నచో వెంటనే నివారించి, నన్ను మౌల్వీ అనకుము. నేను ఇప్పుడిప్పుడే మిర్జా గారితో ఓనమాలు మొదలు పెట్టినాను. అనగా అ, ఆలు చదవడం ప్రారంభించి నానని అనేవారు.

(మాస పత్రిక అన్సారుల్లాహ్ రబ్వా సెప్టెంబర్ 1977 పుట 12)

అన్ని ఉదాహరణల కంటే ఉత్తమమైన ఉదాహరణ వినయ, విధేయతకు సబంధించనది ఇట్లు గలదు. హజ్రత్ సాహిబ్జాదహ్ సయ్యద్ అబ్దుల్లతీఫ్ షహీద్ గారి గురించి హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"నిస్వార్థము, వినయములో మానవుడు దైవములో లీనమైనంత వరకు పొందలేని స్థాయిని పొంది యుండిరి. కొంత మేరకు ఖ్యాతి, విద్యతో ప్రతి ఒక్క వ్యక్తి కొంత వరకు ప్రభావితమై, తనను తాను ఏదో భావించసాగును. ఆ విద్యే, ఖ్యాతియే సత్యమును కోరుటకు అవరోధముగా మారును. (అనగా సత్యమును గుర్తించుటలో అడ్డంకిగా మారును) కాని ఈ వ్యక్తి ఎంత ఆత్మ శూన్యుడై ఎన్నో విశిష్టతలకు మూలమైనను ఏదేని సత్యమును స్వీకరించుటలో అతనికి తన విద్య, ఆచరణ, వంశ గొప్పతనము ఆవరోధముగా కాలేదు. తుదకు సత్యముపై తన ప్రాణము త్యాగము చేసిరి. వాస్తవముగా అల్లాహ్ ఇష్టముతో కూడిన ఏ ఆదర్శమును పాటించవలెనో దానిని మన జమాఅత్ కొరకు వదిలి పోయిరి."

(తజ్కిరతుష్షహాదతైన్ – రూహాని ఖజాయిన్ సంపుటి 20 పుట 47)

# ప్రపంచముపై ధర్మమునకే ప్రాధాన్యత నిచ్చుట

ప్రపంచముపై ధర్మమునకే ప్రాధాన్యత నిచ్చుట గురించి ఎనిమిదవ నిబంధనలో తన ప్రాణము, ధనము, గౌరవము, ప్రతి దానిని త్యాగము చేయుదునని గలదు. ప్రపంచముపై ధర్మమునకే ప్రాధాన్యత నిచ్చు దృశ్యములు అల్లాహ్ కృపానుసారము అహ్మదియ్య జమాఅత్‌లో కనిపించుచుండును. తల్లులు తమ పిల్లలను ప్రవేశపెట్టుదురు. ఇప్పుడితడు జమాఅత్ స్వంతం, కోరిన చోట అక్కడ ఇతనిని ఉపయోగించవచ్చునని తండ్రులు ఇబ్రాహీమ్ పద్ధతిని అవలంభించుచు తమ పిల్లల వ్రేళ్ళను పట్టుకొని తీసుకొత్తురు. మేము కూడ హజ్రత్ ఇస్మాయీల్ వలె మా ప్రాణమును త్యాగము చేయుటకు సిద్ధముగా నున్నామని పిల్లలు ముందుకు వత్తురు. ఈ దృశ్యములు ఇంతకు ముందుండెను, ఇప్పుడు కూడ వున్నవి. దీని ఒక ఉదాహరణను తెలిపెదను.

క్రీ.శ. 1923లో హిందువులు షుద్ధి ఉద్యమమును ప్రారంబించిరి. దానికి వ్యతిరేకంగా అహ్మదియ్య జమాఅత్ పిల్లలు పెద్దల కంటే వెనుక వుండలేదు. 5 సం॥ల పిల్లలు కూడ మల్కానా ప్రాంతములో పర్యటించుటకు సిద్ధమైరి. ఒక 12 సం॥ల బాలుడు తమ తండ్రికి ఇట్లు వ్రాసెను. సత్యమైన ధర్మ సేవ చేయుట పెద్దల పని మాత్రమే కాదు, మా కర్తవ్యము కూడ. కావున మీరు అల్లాహ్ వైపు ఆహ్వానమునకు వెళ్ళినప్పుడు నన్ను కూడ తీసుకెళ్ళగలరు. మీరు వెళ్ళని యెడల నన్ను తప్పక పంపగలరు.

(తారీఖె అహ్మదియ్యత్
సంపుటి 5 పుట 336)

నేనింతకు ముందు చెప్పినట్లు ఈ విషయములు పాత కథలు

మాత్రమే కావు. ఇప్పుడు కూడ ఈ దృశ్యములు కనిపించును. నేడు కూడ నవ సమర్పిత (వాఖిఫీనె నౌ) పిల్లలు నా వద్దకు వచ్చినప్పుడు ఈ వాతావరణంలో కూడ భవిష్యత్తులో ఏమి చేయుదురు ? ఏమి అగుదురు? అని వారినడిగినచో మీరేమి ఆదేశించినా అటులనే అగుటకు మేము ప్రయత్నింతుము. మేమే ఏమి చేయాలో జమాఅత్ మాకు చెప్పవచ్చుననే వారి సామాధానముండును. ఈ భావము అహ్మదీ బాలునిది. ఇన్షాఅల్లాహ్ ఈ భావము ప్రళయ దినము వరకు కొనసాగును. ఈ భావము కొనసాగినంత వరకు జమాఅత్‌కు ఎవరు ఎట్టి నష్టము కలిగించలేరు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"నాతో ఇప్పుడు ఒక పెద్ద జమాఅత్ గలదు. వారు స్వయాన ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యనిచ్చి తమను తాము సన్యాసిగా చేసుకొనిరి. తమ స్వంత ప్రాంతపు ప్రజల నుండి ప్రస్థానము చేసి, తమ ప్రాచీన మిత్రులను, సమీప బంధువుల నుండి శాశ్వతముగా విడిపోయి నా చుట్టు చేరి నివాసమేర్పరచుకొనిరి."

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 5
భాగము 3 పుట 130)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ కొరకే నాకు ప్రియులైన మౌల్వీ హకీం నూరుద్దీన్ భైర్వీ గారు .....వారి ధనముతో నాకెంత సహాయము లభించినదో దానికి పోటీగా చెప్పుకొనుటకు నేను మరో ఉదాహరణ చెప్పలేను. సహజముగా, విశాల హృదయముతో ధార్మిక సేవలో ఉత్సాహవంతులుగా వారిని నేను పొందితిని. నిస్సందేహముగా అన్ని విధాలా ఇస్లాం, ముస్లిముల నిజమైన

సేవకులుగా వారి దిన చర్యగా నిమగ్నమై యున్నారు. అయినను ఈ సంస్థ సహాయకులలో వారు ప్రథమ శ్రేణిలో నిలిచిరి.”

(ఇజాలయె ఔహామ్–రూహాని ఖజాయిన్
సంపుటి 3 పుట 520)

హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం (రజి) గారి గురించి ఇట్లనిరి.

“వారి జీవితము ఒక అమాయకత్వ విధానములో గడిచెను. ప్రాపంచిక విలాసములోని ఏ భాగము వారు పొందలేదు. ఉద్యోగములో ధర్మమునకు అవమానము జరుగుననే కారణముతోనే వారు వదిలిపెట్టిరి. కొద్ది రోజుల క్రితం నెలకు రెండు వందల ఉద్యోగము వారికి లభించేది. కాని వారు నిక్కచ్చిగా నిరాకరించిరి. నిరాడంబరతతో వారు జీవితమును గడిపిరి. అరిబ్బి పుస్తకములను చదివే రుచి కలిగి యుండెడివారు. అంతర్గతముగా, కేవలము బహిర్గతముగా ఇస్లాంపై జరుగుచున్న దాడులను తిప్పికొట్టుటలోనే జీవితము గడిపిరి. అనారోగ్యము, బలహీనత వున్నను ఎల్లప్పుడు వారి కలము నడుచుచుండేది.”

(సీరత్ హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం సాహబ్ సియాల్కోటి
(రజి) పుట 108)

మాలియర్‌కోట్ల నాయకులైన హజ్రత్ నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారు తమ సోదరునికి ఒక ఉత్తరములో ఇట్లు వ్రాసిరి.

“నేను ఏ విషయముల కొరకు ఖాదియాన్‌లో నివాసము ఏర్పరచుకున్నానో అతి స్పష్టముగా వ్రాయుచున్నాను. నేను హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్, మహ్దీ మసూద్ బైఅత్ చేసి 12 సంవత్సరములు గడిచినవి. నేను నా అవివేకము వలన 11 సం॥ల నుండి ఇంట్లోనే వుండేవాడిని.

ఖాదియాన్ నుండి దూరముండే వాడిని. కొన్ని రోజుల కొరకు అప్పుడప్పుడు నేనిక్కడికి వచ్చేవాడిని. ప్రపంచ వ్యాపారములలో నిమగ్నమై నా ఆయువును చాలా వరకు వృధా చేసుకొంటిని. తుదకు గమనించగా ఆయువు గాలి వలె లేచిపోయినదని తెలిసినది. కాని మేము ధర్మములో గాని ప్రపంచములో గాని ఏమి సాధించలేకపోయితిమి.

నేనిక్కడికి (అనగా ఖాదియాన్) 6 నెలల ఉద్ధేశముతో వచ్చి యుంటిని. ఇక్కడికి వచ్చిన తర్వాత నేను అన్ని సమస్యలను గమనించగా తుదకు హృదయము ఇట్లు తీర్పు చెప్పెను. ధర్మమును ఆచరించుచు ప్రాపంచిక పనులు కూడ చేసుకొన వచ్చును. కాని ప్రపంచము వెనుక మానవుడు పడినప్పుడు ప్రపంచము కూడ చేజారిపోవును, ధర్మము కూడ నాశనమగును. నేను బాగా ఆలోచించగా తెలిసినదేమనగా 11 సం॥లలో నేనేమి సాధించలేదు, నా గౌరవ సోదరులు కూడ ఏమి సాధించలేదు. ఈ నిరాశ పరిస్థితిలో రోజు రోజుకు మా ధర్మమును కూడ నాశనము చేసుకొంటున్నాము. తుదకు ప్రపంచము ఎవరిని అంతము చేయును ? అని భావించి కోట్లకు వీడ్కోలు పలికితిని. ప్రస్థానమునకు నేను దృఢముగా సంకల్పించితిని. కనుక అల్‌హందు లిల్లాహ్. నేను కోట్ల నుండి ప్రస్థానము చేసినానని ఎంతో సంతోషముగా వ్యక్తపరచుచున్నాను. శాసనపరంగా ఒక వలసదారుడు తన మాతృభూమికి తిరిగి తన కోరికతో రాలేడు. అనగా దానిని గృహముగా మార్చుకోలేడు. కాని ప్రయాణికుడిగా వచ్చినచో రావచ్చును. కావున ఈ స్థితిలో నా రాక అసాధ్యము. నేను చాలా సంతోషముగా, ఉత్తమ స్థితిలో వున్నాను. మేము దీపపు పురుగులమో దాని నుండి ఎట్లు విడిపోగలము.........

నా ప్రియమైన పూజ్యులైన సోదరా! నేనిక్కడికి అల్లాహ్ కొరకు వచ్చినాను. నా మిత్రుత్వము, ప్రేమ కూడ అల్లాహ్ కొరకే. నేను కోట్ల నుండి వేరుగా నున్నాను. కాని కోట్ల కిష్టమైన స్థితితో నాకు దుఃఖము కలుగును. అల్లాహ్ స్వయాన మా బంధువులందరికి, కోట్ల నివాసులందరికి ఇస్లాం సేవకులగుటకు అనుగ్రహించు గాక! మనందరి జీవితము, మరణము అల్లాహ్ కొరకే అగుగాక! మనము అల్లాహ్‌కు సంపూర్ణ విధేయులైన ముస్లిములగు గాక! ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత ఇత్తుమని, మన కరుణామయ ప్రభుత్వమునకు కృతజ్ఞులుగా వుందుము. దాని విధేయులై యుందుమని మన బైఅత్ నిబంధనలలో గలదు. విశ్వాసము పెరుగుచున్న కొద్ది ప్రపంచము హీనముగా కనిపించు చున్నది, ధర్మము ప్రధానమగుచున్న విషయమే నన్ను ఇక్కడ ఆపుచుచున్నది. అల్లాహ్, మానవుని ఉపకారమునకు కృతజ్ఞత భావము కూడ పెరుగుచున్నది. అటులనే సర్వోన్నత ప్రభుత్వ విధేయత, కృతజ్ఞత హృదయములో పూర్తిగా బలపడుచున్నది.”

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 2 పుట 126–129)

మరల హకీమ్ ఫజల్ దీన్ గారి ఇస్లాం సానుభూతి ఉదాహరణ గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

“అల్లాహ్ కొరకే నా ప్రియుడైన హకీమ్ ఫజల్ దీన్ గారు బహెర్వీ, హకీమ్ గారు మౌల్వీ హకీమ్ నూరుద్దీన్ గారి మిత్రులు, వారి సద్గుణములతో అలంకృతులైన అతి విధేయులు. అల్లాహ్, అతని ప్రవక్తతో వారికి నిజమైన ప్రేమ గలదని నాకు తెలుసు. అందుకే నన్ను నిజమైన ధర్మ సేవకుడిగా చూచి అల్లాహ్ కొరకు అను నిబంధనను పూర్తి చేయుచున్నారు. ఇస్లాం

ధర్మపు వాస్తవికతను వ్యాపింపజేయుటలో అధిక భాగము మొదటి నుండే నా ప్రియమైన సోదరుడు మౌల్వీ హకీమ్ నూరుద్దీన్ గారికి ఇవ్వబడి నట్లే వారికి కూడ లభించినదని తెలియును. ఈ సంస్థ ధార్మిక ఖర్చులను వారు శ్రద్ధతో చూచి చందా రూపంలో ఏదేని ఉత్తమ ఏర్పాటు కావలెననే చింతలో వుందురు."

(ఇజాలయె ఔహామ్ – రూహాని ఖజాయిన్ సంపుటి 3 పుట 522)

క్రీ.శ. 1923లో షుద్ధీ క్షేత్రము వేడెక్కించబడిన సందర్భమున అహ్మదీ "ప్రచారకులు" మండుటెండలో ప్రతి రోజు ఎన్నో మైళ్ళ ప్రయాణము చేయువారు. కొన్ని సందర్భాలలో ఆహారమటుంచగా త్రాగునీరు కూడ లభించేది కాదు. ఎన్నో సార్లు ఉడికీ ఉడకని చద్దన్నము గాని, ఏంచిన శనగలు గాని తిని, మంచినీరు త్రాగి పూట గడిపేవారు. కొన్ని సార్లు తమ వద్ద వుంచుకున్న సత్తుపిండి తిని పూట గడిపేవారు. సూఫీ అబ్దుల్ ఖదీర్ గారిట్లు తెలిపిరి. మేము ప్రతి రోజు 16 మైళ్ళ చొప్పున 40 గ్రామాల మధ్య ప్రయాణము చేసేవారము.

(తారీఖె అహ్మదియ్యత్ సంపుటి 5 పుట 343)

పెద్ద సంగీత గాయకుడైన ఒక వ్యక్తి అమెరికాలో అహ్మదీ అయిరి. తమ కాలములో సంగీతములో ఎంతో వేగముగా ప్రగతి సాధించుచు, అతి త్వరగా అమెరికా దేశ స్థాయిలో ఖ్యాతి గడించిరి. వారి గురించి నిపుణులు తమ కాలపు అతి గొప్ప సంగీత విద్వాంసులని గుర్తించ బడుదురని అభిప్రాయపడిరి. అహ్మదీ అయిన తర్వాత సంగీతమును లెక్క చేయలేదు. సంగీతము ద్వారా వచ్చే ఆదాయము వైపు కూడ ఆశతో

చూడలేదు. అన్నిటిని పూర్తిగా విడిచిపెట్టి వారు సన్యాసి జీవితము గడుపుచున్నారు. క్రమం తప్పకుండా తహజ్జుద్ చదువుచున్నారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పేరు ఉచ్చరించగానే వారి కనుల నుండి కన్నీరు ప్రవహించసాగును.

(మాసపత్రిక ఖాలిద్ జనవరి 1988)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) ఖిలాఫత్ కంటే పూర్వపు తమ ఒక సంఘటనను ఇట్లు తెలిపిరి.

"నేనిక్కడికి ఎందుకు వచ్చినాను. గ్రహించగలరు! బహెరలో నాకు గట్టి గృహము గలదు, ఇక్కడ నేను గృహములను మట్టితో నిర్మించుకొన్నాను. అన్ని విధాలా ఇక్కడి కంటే ఎక్కువ అక్కడ నాకు సౌకర్యములు గలవు. కాని నేను రోగినని, చాలా వ్యాధి గ్రస్తుడనని, అవసరము, చాలా అవసరము గల వాడినని, నిరుపేదనని, అతి నిరుపేదనని నేను చూచితిని. కనుక నేను నా ఈ బాధలను దూరము చేసుకొనుటకు ఇక్కడికి వచ్చినాను. నా ఉదాహరణను చూచుటకు ఎవడైనా ఖాదియాన్ వచ్చినచో, ఇక్కడికి వచ్చి కొంత కాలము ఇక్కడ వుండి ఇక్కడి ప్రజల గురించి ఫిర్యాదులు చేసినచో అతని చూపు మోసపోవును. అనగా అతడు రోగులను చూచి ఆరోగ్యవంతులుగా భావించుచు వారిని పరీక్షించును. ఇక్కడి మిత్రుత్వము, సంబంధములు, ఇక్కడికి వచ్చుట, ఇక్కడి నుండి పోవుట, ఇక్కడ నివాసముండుట అంతయు "لَا اِلٰہَ اِلَّا اللّٰہُ" కోరకే యుండవలెను. కాని రొట్టెలు, మంచాల కొరకు ఇక్కడికి వచ్చినచో, ప్రియులారా! అటువంటి రొట్టెలు, మొ॥నవి మీలో అధికుల ఇంట్లో వున్నాయి. మరిక్కడికి రావలసిన అవసరమేమున్నది ? మీ పనులన్ని అల్లాహ్ కొరకే అయినప్పుడు మీరు

ఈ విషయమును అంగీకరించువారగుదురు."

(ఖుత్బా జుమా ప్రసంగము 22 జనవరి 1904)

హజ్రత్ సాహిబ్జాదహ్ అబ్దుల్లతీఫ్ షహీద్ గారి గురించి హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నిచ్చే మెచ్చదగ్గ లక్షణము ఆ కీ.శే. సత్పుషురునిలో యుండెను. అల్లాహ్‌తో భయపడి తన నిష్టాపరత, దైవ విధేయతను ఉన్నత శిఖరానికి చేర్చే సత్యవంతులలో యుండెను. అల్లాహ్‌ను సంతోషపెట్టుటకు, అతని ప్రీతిని పొందుటకు తన ప్రాణము, గౌరవము, ధనమును పనికిరాని గడ్డిపోసలా తన చేతి నుండి వదులుటకు సిద్ధముగా నుందురు. అతని విశ్వాస శక్తి ఎంత ఎక్కువగా పెరిగి వుండెననగా పెద్ద పెద్ద పర్వతములతో దానిని నేను పోల్చినచో అది తక్కువగునని నేను భయపడెదను. అధికులు .... బైఅత్ చేసినను, నా దావాను బలపరచినను ప్రపంచమునకు ధర్మముపై ప్రాధాన్యత నిచ్చు విషపూరిత బీజము నుండి సంపూర్ణముగా మోక్షము పొందలేక, కొంత కలుషితము వారిలో మిగిలి నుండును. ప్రాణము గురించి గాని, గౌరవము గురించి గాని, ధనము గురించి గాని సద్గుణముల గురించి ఒక రహస్య లోభితనము వారి అసంపూర్ణ మనసులలో నుండును. అందుకే ఆపదలో పడుదురేమోనని, ఈ సేవను తమకు భారముగా భావించి తన బైఅత్‌కు వీడ్కోలు పలుకుదురేమోనని ఏదేని ధర్మ సేవ వీరికి అప్పగించుటకు వారి గురించి నేను చింతించుచుందును. కాని ఏ పదాలలో నేను ఆ కీర్తిశేషులైన సజ్జనుని కీర్తింతును. అతడు తన ధనము, గౌరవము, ప్రాణమును నా అనుసరణలో ఒక పనికిరాని వస్తువును పారవేసినట్లు పారవేసెను.

అధికులను వారి ఆరంభము, అంతము ఒకే విధముగా యుండక, చిన్న తట్టు లేదా దయ్యపు అనుమానము లేదా చెడు సహవాసముతో పడిపోవునట్లు నేను చూచెదను. కాని ఈ కీ.శే. యువపురుషుని స్థిరత్వ వివరణను ఏ పదాలలో ప్రస్తావింతును. అతడు క్షణ క్షణం విశ్వాస కాంతిలో ప్రగతి సాధించుచుపోయెను."

(తజ్కిరతుష్షహాదతైన్ – రూహాని ఖజాయిన్
సంపుటి 20 పుట 10)

మరల వారిట్లనిరి. "కీ.శే. షహీద్ మృతిచెంది నా సంస్థకు ఒక ఆదర్శమయ్యెను. యదార్థమేమనగా నా సంస్థకు ఒక గొప్ప ఆదర్శము అవసరముండెను. ఇప్పటికి వారిలో కొందరు ఎట్లున్నారనగా అల్ప సేవ చేయువాడు కూడ నేను ఘనకార్యము చేసినానని, చేసితినని నాకు ఉపకారము భావించును. అతనికి ఆ సేవ చేయు అనుగ్రహమిచ్చి నందుకు అల్లాహ్ ఉపకారము అతనిపై గలదు. పూర్తి శక్తి, సంపూర్ణ సత్యముతో ఇటువైపు రాని వారు కొందరున్నారు. ఏ విశ్వాస శక్తి, ఉన్నత స్థాయి సత్యము, పవిత్రతను వారు ప్రకటింతురో దానిపై తుది వరకు స్థిరముగా నుండలేరు. ప్రపంచ ప్రేమ కొరకు ధర్మమును కోల్పోవుదురు. ఎటువంటి అల్ప పరీక్షను కూడ భరించలేరు. దైవ సంస్థలో చేరి కూడ వారి ప్రాపంచికము తగ్గదు. కాని నిజమైన హృదయముతో విశ్వసించిన, సత్యమైన హృదయముతో ఇటువచ్చిన వారు కూడ వున్నందున అల్లాహ్‌కు వేలాది వేలాది కృతజ్ఞతలు. ఈ మార్గము కొరకు ప్రతి ఒక్క దుఃఖమును సహించుటకు సిద్ధముగా నున్నారు. కాని ఏ ఆదర్శమును ఈ యువపురుషుడు చూపెనో ఇప్పటికి ఈ సంస్థలో అటువంటి శక్తులు

దాగివున్నవి. ఈ షహీద్ చూపిన ఆదర్శానుసారము అల్లాహ్ అందరికి ఆ విశ్వాసము నేర్పు గాక! ఆ స్థిరత్వము ప్రసాదించుగాక! షైతానీ దాడులతో కూడిన ఈ జీవితము పరిపూర్ణ మానవుడిగా అగుటకు ఆపును. ఈ సంస్థలో అనేకులు చేరుదురు. కాని విచారము ఇటువంటి ఆదర్శము చూపువారు కొందరే వుందురు."

(తజ్కిరతుష్షహాదతైన్ – రూహాని ఖజాయిన్
సంపుటి 20 పుట 57,58)

మరల వారిట్లనిరి.

"రాజకుమారుడైన అబ్దుల్లతీఫ్ కొరకు భాగ్యమైన అమరత్వము సంభవించెను.. ఇప్పుడు క్రూరుని శిక్ష మిగిలియున్నది. (తాహా:75)

﴿اِنَّهٗ مَنْ يَّاْتِ رَبَّهٗ مُجْرِمًا فَاِنَّ لَهٗ جَهَنَّمَ لَايَمُوْتُ فِيْهَا وَلَايَحْيٰي﴾

విచారము ఈ అధ్యక్షుడు ﴿مَنْ يَّقْتُلْ مُؤْمِنًا مُّتَعَمِّدًا﴾ (అన్నిసా:94) సూక్తిలో చేరి పోయెను. కొంతైనా అల్లాహ్‌కు భయపడలేదు. కాబుల్ మొత్తము భూమిపై వెతికినా అతని మాదిరి లభించని విశ్వాసునిగా నుండెను. ఇట్టి వారు ఎట్టని ఆమోదయోగ్యమైన ఔషధము వలె నుందురు. వారు సహృదయముతో విశ్వాసము, సత్యము కొరకు ప్రాణాలర్పించుటకు కూడ వెనుకాడరు. వారు భార్యాపిల్లలను కూడ లెక్కచేయరు. ఓ అబ్దుల్లతీఫ్! నీకు వేలాది దయానుగ్రహములు కలుగుగాక! నా జీవితములోనే నీవు తమ సత్యపు మాదిరిని చూపితివి. నా మరణా నంతరము నా సంస్థ వారే కార్యములొనరింతురో నేనెరుగను."

(తజ్కిరతుష్షహాదతైన్ – రూహాని ఖజాయిన్ సంపుటి 20 పుట 60)

"కీ.శే. సాహిబ్జాదహ్ మౌల్వీ అబ్దుల్లతీఫ్ ద్వారా బహిర్గతమైన స్థిరత్వమును, ప్రాణత్యాగమును నేను చూచినప్పుడు నాకు నా సంస్థ గురించి ఆశ ఎంతో పెరిగిపోవును. ఎందుకనగా తమ ధనమే కాక ప్రాణమును కూడ ఈ మార్గములో త్యాగము చేయు అనుగ్రహము ఈ సంస్థలోని కొందరికి అల్లాహ్ కల్పించెను. కావున సాహిబ్జాదహ్ మౌల్వీ అబ్దుల్లతీఫ్ ఆత్మ కలిగి, వారి ఆధ్యాత్మికత క్రొత్త మొక్కలగు కొందరిని పుట్టించుటకు అల్లాహ్ గట్టిగా కోరెనని తెలియుచున్నది."

(తజ్కిరతుష్షహాదతైన్ – రూహాని ఖజాయిన్
సంపుటి 20 పుట 75)

నేటికి సరిగ్గా వంద సంవత్సరముల క్రితం హజ్రత్ సాహిబ్జాదహ్ అబ్దుల్లతీఫ్ షహీద్ గారిని దైవమార్గములో హతమార్చబడెను.

ఓ అంతిమ కాలపు మసీహ్! నీకు శుభాకాంక్షలు. మీకు మీ సంస్థతో గల ఆశలను మీ ప్రియమైన సంస్థ పూర్తి చేసినది. వారికి వారి సంస్థతో గల ఆశలను పూర్తి చేసెను. ధనము, సమయము, ప్రాణ త్యాగములో ఎన్నడు వెనుకడుగు వేయలేదు. దీని దృశ్యములు మనకు నేడు కూడ కనిపించుచున్నవి. వారి తర్వాత కూడ ఇట్టి వారు సంస్థలో జన్మించిరి. నా తర్వాత ఏమగునోనని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంకు చింత యుండెను. వారి తర్వాత కూడ ప్రాపంచిక ఆశలను లెక్క చేయని, తమ ప్రాణాలను సైతం త్యాగము చేయుటకు వెనుకాడని వారు జన్మించినారని మేము సాక్ష్యమిత్తుము. తనయుడు తన కళ్ళ ముందు మరణవాత పడుచుండగా తండ్రి చూచెను. తండ్రి తన ముందు షహీద్ అగుచుండగా తనయుడు చూచెను. కాని

స్థిరత్వములో భేదము రానివ్వలేదు. అనంతరం తను కూడ స్వయముగా ప్రాణ త్యాగము చేసెను.

ఓ పవిత్ర మసీహ్! మీకు శుభాకాంక్షలు, మీ సంతానములో నుండి కూడ, మీ రక్తములో నుండి కూడ తన ప్రాణమును త్యాగము చేయుచు సంఘమును ఘోర ప్రమాదము నుండి రక్షించిన వాడు కూడ గలడు. అల్లాహ్ ఈ అమరులందరి దశలను పెంచుచు పోవుగాక! ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నిచ్చే అనుగ్రహము అల్లాహ్ మనకు కూడ కలిగించుగాక! ప్రతి త్యాగమునకు ఎల్లప్పుడు సిద్ధముగా నుందుము గాక! తమ సంతానములో కూడ ఈ ఉత్తేజమును సజీవముగా నుంచుదుము గాక! అల్లాహ్ సదా మనకీ అనుగ్రహము కల్పించు గాక! (ఆమీన్)

(ఖుత్బా జుమా ప్రసంగము 10 అక్టోబర్ 2003 మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్, లండన్)

# మానవ సేవ, స్వచ్ఛత, విశ్వసనీయతలో జమాఅత్ సభ్యులు నిరుపమాణ ఆదర్శములను నెలకొల్పిరి

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము ఇట్లనిరి.

సృష్టి, మానవ జాతి సేవ కొరకు జమాఅత్‌లో ఎంతో శ్రద్ధ చూపబడును. ప్రతి ధనికుడు, నిరుపేద తన సామర్థ్యము మేరకు అతనికి ఎప్పుడు అవకాశము లభించునను, అల్లాహ్ ప్రీతి కొరకు సృష్టి సేవ చేయాలని ప్రయత్నము లో వుండును. సృష్టి సేవ కొరకు ప్రతి అహ్మదీయుని హృదయము ఎందుకు ఇంత విశాలముగా నున్నదనగా ఇస్లాం ఏ అందమైన బోధనను మనము మరచిపోయి యుంటిమో అనగా అల్లాహ్ ప్రేమనే కోరుచున్నచో అతని సృష్టితో మంచిగా వ్యవహరించుము, దాని అవసరాలను దృష్టియందుంచుకొనుము. అల్లాహ్ సామీప్యమునకు చేర్చుటకు ఇది కూడ ఒక మార్గమే. అటువంటి అందమైన బోధనను

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన బైఅత్ నిబంధనలలో ఒక ప్రాథమిక నిబంధనగా నిర్ణయించిరి. నాతో సంబంధము ఏర్పరచుకున్న తర్వాత తన పూర్తి శక్తులతో, శుభములతో అల్లాహ్ సృష్టికి సేవ చేయుము, దానికి లబ్ది కలిగించుము. అందుకే భూకంప బాధితులకు సహాయము అవసరమున్నచో అహ్మదీయులే ముందుంటారు. కొన్ని సందర్భాలలో అతి వేగంగా ప్రవహించుచున్న నీటిలో అహ్మదీ యువకులు దూకి తమ ప్రాణాలను త్యాగము చేసిరి. కాని కొట్టుకుపోవుచున్న వారిని రక్షించిరి. ఆఫ్రీకా పేద పిల్లల విద్యా, వ్యాధుల వలన పీడిత సృష్టి కొరకు చికిత్స వసతులు లేవు, పాఠశాలలు, ఆసుపత్రులు తెరుచుటకు ఇంత నగదు అవసరమున్నది, నగదు ఇవ్వవలెనని వర్తమాన ఖలీఫా పిలుపునిచ్చినప్పుడు ఒక అహ్మదీయుని హృదయములో బాధిత మానవ జాతి పట్ల గల ఉత్సాహము వలన కోరబడిన దాని కంటే ఎన్నో రెట్లు అధికముగా జమాఅత్ సభ్యులు వర్తమాన ఖలీఫాకు సమర్పించిరి. అనంతరం ఈ పాఠశాలలు, ఆసుపత్రులను నడుపుటకు వైద్యులు, ఉపాధ్యాయులు కావలెనని పిలుపునివ్వగా వైద్యులు, ఉపాధ్యాయులు ఎంతో మినమ్రతతో తమను తాము సమర్పించిరి. ఇప్పుడు ఆఫ్రీకా పరిస్థితులు చాలా మెరుగ్గా నున్నవి. 70వ దశకంలో నుస్రత్ జహాం స్కీమ్ ప్రారంభించ బడినప్పుడు అతి క్లిష్టమైన పరిస్థితులుండెను. ఆ క్లిష్టమైన పరిస్థితులలో వారు సర్దుకు పోయిరి. కొందరు వైద్యులు, ఉపాధ్యాయులు మంచి ఉద్యోగములో యుండిరి. కాని సమర్పణ తర్వాత గ్రామాలలో కూడ వెళ్ళి యుండిరి. అధిక ఆసుపత్రులు, పాఠశాలలు గ్రామాలలోనే యుండెను. విద్యుత్తు, నీటి వసతి లేకుండెను. కాని బాధిత మానవ సేవ బైఅత్ నిబంధనను పాటించవలసి యుండుట

వలన ఏ అవరోధము, వసతిని అడ్డు రానివ్వలేదు. ఆరంభములో ఆసుపత్రులలో కట్టె బల్లలపై రోగులను పరుండ బెట్టేవారు. వెలుతురు కొరతను కొన్ని దీపములు, గ్యాస్ దీపములతో పూరించేవారు. అందుబాటులో నున్న కత్తులు, కటార్లతో శస్త్ర చికిత్స సామాగ్రిని సమకూర్చొకొని రోగికి శస్త్ర చికిత్స చేసిరి. ఆ తర్వాత ఓ అల్లాహ్! నా వద్ద నున్న సామాగ్రితో నేను చికిత్స చేసితిని. దుఆతో చికిత్స చేయుము, అల్లాహ్ స్వస్థత కలిగించునని నా ఖలీఫా నాతో అనిరి. నీవే ఆరోగ్యము ప్రసాదించుమని ప్రార్థన చేయుచుండిరి. ఆ త్యాగములు చేసిన వైద్యులను అల్లాహ్ కూడ ఆదరించెను. బ్రతికే నమ్మకము లేని ఎటువంటి రోగులు కూడ ఆరోగ్యవంతులైరి. ఇది చూచి ప్రపంచము ఆశ్చర్యానికి లోనయ్యెను. ఆర్థిక అవసరాలను అల్లాహ్ ఇట్లు పూర్తి చేసెను. పెద్ద పెద్ద ధనికులు కూడ పట్టణాల ఆసుపత్రులను వీడి మన కుగ్రామ ఆసుపత్రులకు వచ్చి చికిత్స చేయించు కొనుటకు ప్రాధాన్యత నిచ్చేవారు. ఇదే విధముగా ఉపాధ్యాయులు కూడ మానవ జాతి సేవ ఉత్సాహముతో సంపూర్ణులై పిల్లలను విద్యాభరణాలతో అలంకరించిరి. వైద్యులు, ఉపాధ్యాయుల సేవలు నేడు కూడ కొనసాగుచున్నవి. అల్లాహ్ ఈ పరంపరలను కొనసాగించుగాక! ఈ సేవలందించు వారందరికి గొప్ప ప్రతిఫలము నొసంగుగాక!

## అహ్మదీ వైద్యులు తమ జీవితములను సమర్పించవలెను

మన ఆఫ్రీకా ఆసుపత్రుల కొరకు శాశ్వతముగా లేదా తాత్కాలికముగా వైద్యులు తమ జీవితములను సమర్పించవలెనని సభ

సందర్భమున నేను ఇట్లు వైద్యులకు సూచించి యుంటిని. ఇప్పుడు అల్లాహ్ అనుగ్రహముతో పరిస్థితులు చాలా మెరుగ్గా నున్నవి. ఆరంభ సమర్పితులకు ఎదురైన ఆ ఇబ్బందులు, కష్టములు ఇప్పుడు లేవు. చాలా చోట్ల ఎంతో మంచి పరిస్థితులు, వసతులన్ని వున్నాయి. కొద్ది మేరకు కష్టములున్నను అల్లాహ్ కొరకు మాత్రమే దైవ ప్రసాదిత శక్తులతో మానవజాతికి ప్రయోజనము కలిగింతునను ఈ బైఅత్ ప్రతిజ్ఞనను గుర్తుంచుకొని, ముందుకు రమ్ము! వర్తమాన మసీహ్‌తో చేసిన ప్రతిజ్ఞను పూర్తి చేయుము. వారి ప్రార్థనలకు వారసులగుము. ఇటులనే రబ్వాలో ఫజ్లె ఉమర్ ఆసుపత్రి కొరకు కూడ వైద్యుల అవసరము గలదు. అక్కడి కొరకు కూడ వైద్యులు తమను తాము సమర్పించవలెను.

పాకిస్తాన్‌లో కూడ ఇతర దేశములలో కూడ పిల్లల విద్య, రోగుల చికిత్స కొరకు శాశ్వతముగా సభ్యులు సంస్థ విధానము ప్రకారము ఆర్థిక సహాయము చేయుదురు. బీదరికము ఎక్కువగా నున్న పాకిస్తాన్, భారత దేశము లాంటి దేశములలో ఈ ఉద్దేశము కొరకు ఆర్థిక సహాయము చేయువారు, ఈ సేవల వలన రోగుల ఆశీర్వాదాలు పొందుచున్నారు. కనుక ఈ సత్కార్యమును కూడ సంస్థ సభ్యులు కొనసాగించవలెను. ముందు కంటే ఎక్కువ కొనసాగించవలెను. గతము కంటే ఎక్కువ చేయవలెను. బాధలు కూడ అతి వేగముగా పెరుగుచున్నవి.

సృష్టి సేవ సంపూర్ణ ఉత్సాహము గల పలువురు పూర్వ సజ్జనుల వృత్తాంతములను ఇప్పుడు నేను ప్రవేశపెట్టెదను.

హజ్రత్ మిర్జా అయ్యూబ్ బేగ్ గారు రజియల్లాహు అన్హు గురించి చెప్పేవారు ఇట్లు వ్రాసిరి. కీ॥శే॥ ఒక సజీవ ఆదర్శముగా యుండిరి.

హదీసు ప్రకారము తన కొరకు కోరునదే తన సోదరుని కొరకు కోరేవారు. తన కొరకు ఇష్టము లేని ప్రవర్తనను తన సోదురునితో చేసేవారు కాదు. తన ఏదేని సోదరునికి, మిత్రునికి సహాయము చేసే అవకాశమును వారు సదా అన్వేషించేవారు. వారి గురించి ఇట్లు గలదు. వారు కళాశాలలో చదివే కాలములో జమాఅత్ లెక్చర్ అగునప్పుడు వారు వచ్చేవారు. అక్కడ ప్రతి అహ్మదీయునితో కలిసేవారు. ఏ సోదరుడైనా అనారోగ్యమునకు గురైనచో వారి గృహమునకు వెళ్ళి వారిని పరామర్శించేవారు. కొన్ని సందర్భాలలో ప్రతి రోజు ఆ రోగులను చూచుటకు వెళ్ళేవారు. ఒక సారి ముఫ్తి ముహమ్మద్ సాదిఖ్ గారు (రజి) తీవ్ర అనారోగ్యమునకు గురైనప్పుడు కీ॥శే॥లు ఎన్నో రోజులు ముఫ్తి గారి నివాసములో వుండి దివారాత్రులు వారికి సేవలందించిరి. పలు సార్లు వ్యాధి వలన మలినము శుభ్రము చేయవలసి వచ్చినను చేసేవారు.

(అస్హాబె అహ్మద్ సంపుటి 1 పుట 199, 200)

హజ్రత్ ఛౌద్రి జఫ్రుల్లాహ్ ఖాన్ గారు (రజి) తమ తల్లి గురించి ఇట్లు వ్రాసిరి. వారిట్లనేవారు. అల్లాహ్ శత్రువు కానిచో ఏ శత్రువు నష్టమేమి కలిగించలేడు. అందుకే నేనెవరిని శత్రువుగా భావించను. శత్రువులందరితో మంచిగా ప్రవర్తించేవారు. వారిట్లనే వారు. ఎవరితో మనసు సంతోషించునో వారితో మంచిగానే వ్యవహరించుటకు మనసు స్వయముగా ఉత్తేజించును. ఇందులో పుణ్య కారణమేమున్నది. అల్లాహ్‌ను సంతోషపెట్టుటకు ఎవరిని మనసు ఇష్టపడదో అటువంటి వ్యక్తులతో కూడ ఉపకారము, పుణ్యముగా వ్యవహరించ వలెను.

వారిట్లు వ్రాసిరి. డస్క (ప్రాంతము)లో వుండేవారు. అక్కడి వారితో

ఎంతో దానధర్మముగా వ్యవహరించేవారు. ప్రజలు కూడ వారిని ఎంతో గౌరవ, మర్యాదలతో చూచేవారు. ఇహ్రార్ జగడము మొదలైనప్పుడు దాని ప్రభావము వీరి ప్రాంతములో కూడ పడెను. సహాయము తీసుకునే ప్రజలే శత్రుత్వము చేయసాగిరి. కాని ఈ శత్రుత్వ ప్రభావము కూడ వారిపై పడలేదు. ఫలానా వ్యక్తి మనకు వ్యతిరేకంగా పని చేయుచున్నాడు. అతడు ఇహ్రార్‌లో చేరినాడు అటువంటి వ్యక్తికి మీరు సహాయము చేయుచున్నారని వారి బంధువులలో ఎవరైనా అన్నచో మీరు నన్ను ఈ సేవ నుండి ఎందుకు నివారించుచున్నారని కోపగించుకునే వారు.

తెలుపు వారిట్లు తెలిపిరి. ఒక సారి వారు కొన్ని పాత్రలు, వస్త్రములు మొ॥ వాటిని సిద్ధము చేయుచుండిరి. వారు వెళ్ళి వారితో ఇట్లనిరి. మీరెవరి కొరకు సిద్ధము చేయుచున్నారు ? అప్పుడు ఛౌధ్రి గారి తల్లి ఇట్లనిరి. ఇది ఫలానా వ్యక్తి పిల్లల కొరకు చేయుచున్నాను. ఆ వ్యక్తి ఇట్లనెను. మీరు చాలా విచిత్రమైనవారు. అతడు ఇహ్రార్ వ్యక్తి. జమాఅత్‌ను చాలా వ్యతిరేకించుచున్నాడు. అతని కొరకు మీరు వస్త్రములు సిద్ధము చేయుచున్నారా ? వారిట్లనిరి. వారు దౌష్ట్యముగా వ్యవహరించినచో అల్లాహ్ మనకు రక్షణ కల్పించును. అట్టి వాడు మనతో వున్నంత వరకు వీరి శత్రుత్వములు మనకు ఎలాంటి నష్టము కలిగించలేవు. కాని ఈ వ్యక్తి నిరుపేద. తన పిల్లల, మనుమల శరీరమును కప్పుకొనుటకు వస్త్రములు లేవు. కనుక అతనికి అవసరమున్నదని నేనీ వస్త్రములను సిద్ధము చేయుచున్నాను. విమర్శకు దిగుచున్న నీకు శిక్ష ఏమనగా నేను ఈ వస్త్రములు సిద్ధము చేసిన తర్వాత నీవే అతని ఇంటికి వీటిని చేర్చెదవు. వెంటనే ఇట్లు కూడ అనిరి. ఇతడు ఇహ్రారీ అయినందున అతన్ని ఇతర

ఇఫ్రారీయులు కూడ గమనించుచుండవచ్చును. కావున అహ్మదీయుల నుండి వస్త్రములు తీసుకున్నాడని అతన్ని ఎవరు ఇబ్బంది పెట్టకుండా రాత్రి పూట వెళ్ళి ఇవ్వవలెను.

(అస్హాబె అహ్మద్ సంపుటి 11 పుట 175,176)

విధవరాళ్ళ, అనాథల సంరక్షణ కూడ వారికి ఇష్టమైన కార్యముగా నుండెను. వ్రాయు వారిట్లందురు. పిల్లల కట్న కానుకలను అతి శ్రద్ధగా స్వయాన తమ చేతులతో సిద్ధము చేసేవారు. వస్త్రములు సిద్ధము చేసేవారు.

(అస్హాబె అహ్మద్ సంపుటి 11 పుట 186)

హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్హాఖ్ (రజి) కూడ అనాథల సంరక్షణ పట్ల ఎంతో శ్రద్ధ చూపేవారు. "అనాథాశ్రమము" లో ఎంత మంది అనాథలుండిరి. దానిని "దారుష్షుయూఖ్" అనగా పెద్దల గృహము అని అనే వారు. వారి గురించి గల ఒక సంఘటన ఇట్లు గలదు. ఒక సారి వారు జ్వరము వలన విశ్రాంతి తీసుకుంటుండిరి. జ్వరము చాలా తీవ్రంగా నుండెను. చాలా బలహీనత, శక్తిహీనత యుండెను. ఉద్యోగి వచ్చి ఇట్లనెను. భోజనము కొరకు ధాన్యము తక్కువగా నున్నది. ఎక్కడి నుండి ఏర్పాటు కావడం లేదు. బాలలు ఉదయం కూడ అల్పహారము తీసుకోలేదు. వారిట్లనిరి. వెంటనే గుఱ్ఱపు బండి తీసుకరండి. గుఱ్ఱపు బండిలో కూర్చొని స్వయాన ధనికుల గృహాలకు వెళ్ళి ధాన్యము సమకూర్చి ఆ బాలల ఆహారమునకు ఏర్పాట్లు చేసిరి.

మన పూర్వీకుల ఉత్సాహము ఇట్లుండెను. జ్వరమున్న పరిస్థితిలో కూడ తమ విశ్రాంతిని త్యాగము చేసిరి. అనాథ బాలల కొరకు ఇంటి నుండి బయలు దేరిరి. ఇటుల ఎందుకు జరగదు ? వారికి తమ యజమాని

సల్లల్లాహు అలైహి వసల్లం ఈ శుభవార్త తమ కనుల ముందుండెను. "నేను, అనాథ సంరక్షకుడు స్వర్గములో నా రెండు వ్రేళ్ళు కలిసి వున్నట్లే వుందుమని తెలిపిరి. చూపుడు వ్రేళు, మధ్య వ్రేళు వారు కలిపి యుండిరి" మన పూర్వీకుల ఆదర్శములు ఇట్లుండెను.

హజ్రత్ హాఫిజ్ ముయీనుద్దీన్ గారిని (రజి) గురించి ఇట్లు కథనము గలదు. వారికి కనిపించేది కాదు. నేత్రాంధకారము యుండెను. వారిట్లనిరి. చలి తీవ్రంగా వున్న ఒక రాత్రి ఖాదియాన్ మట్టి వీధులలో ఎంతో బురద యుండెను. అతి కష్టముతో ఇబ్బంది పడుచు ఎక్కడికో పోవుచుండిరి. ఎక్కడికి పోవుచున్నారని ఒక మిత్రుడు అడిగెను. వారిట్లనిరి. సోదరుడా! ఒక కుక్క ఇక్కడ ప్రసవించెను. వర్షా కాలము అయినందున వర్షము పడుచున్నది. నా దగ్గర వున్న ఒక్క రొట్టె దానికి ఇవ్వదలచితిని. హాఫిజ్ గారు చేసిన ఈ పని కూడ జంతువులను కనికరించుమను సున్నత్ అనుసరణయే. ఆ సంఘటనను కూడ గుర్తు చేసుకొనుము. ఒకడు ఒక బావిలో దిగి, తన పాదరక్షలలో నీరు నింపుకొని కుక్కకు త్రాగించెను. ఈ పుణ్యమునకు బదులు అల్లాహ్ అతన్ని క్షమించెనని వారు (సల్లం) అనిరి. అందుకు అనుచరులు ఎంతో ఆశ్చర్యపడి ఇట్లడిగిరి. జంతువుల వలన కూడ ప్రతిఫలము లభించునా ! వారిట్లనిరి. ప్రతి ప్రాణి, జంతువు పుణ్యము, ఉపకారమునకు ప్రతిఫలము లభించునని అనినది కూడ గుర్తు చేసుకొనుము.

ఒక అహ్మదీ హజ్రత్ నూర్ ముహమ్మద్ గారి మరో సంఘటన ఇట్లు గలదు. తీవ్రమైన చలి కాలముండెను. వారి దగ్గర కోట్ గాని దుప్పటి గాని లేకుండెను. పైన క్రింద రెండు చొక్కాలు ధరించి, వాహనములో

కూర్చొని వుండిరి. ఒక వికాలాంగుడైన వృద్ధుడు అచ్ఛాదన లేకుండా వణుకుచు కనిపించెను. తక్షణమే తన ఒక చొక్కా తీసి అతనికి తొడిగించిరి. ఒక సిక్కు మిత్రుడు కూడ వెంట ప్రయాణము చేయుచుండెను. అతడు ఇది చూసి ఇట్లనెను. "సోదరుడా! ఇప్పుడు మీ పడవ సురక్షితముగా దాటును. మా లాంటి పాపిస్టుల అంతము ఏమగునో." ఇవి ఆదర్శములు. కొన్ని రోజుల తర్వాత ఇట్లు జరిగెను. ఇదే నూర్ ముహమ్మద్ గారు ఒక క్రొత్త దుప్పటి కప్పుకొని బైతుజ్జిక్ర్ ముఘల్‌పూరలో ఫజ్ర్ నమాజు కొరకు రాగా ఒకప్పుడు ధనవంతుడైన ఫతహ్ దీన్ నామము గల ఒక వ్యక్తి వ్యాధి, బీదత్వముతో బాధపడుచు చలితో వణుకుచు కనిపించెను. అప్పుడు నూర్ ముహమ్మద్ గారు వెంటనే తన క్రొత్త దుప్పటి తీసి అతనికి కప్పిరి.

(రూహ్‌పర్వర్ యాద్లైఁ పుట 287)

1947లో పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత లక్షలాది మంది వలసదారులు దోపిడీకి గురగుచు బృందాల రూపంలో ఖాదియాన్ వైపు వచ్చుచుండిరి. అప్పుడు పరిస్థితులు చాలా క్లిష్టమైయుండెను. ముస్లిం మహిళల శీలమునకు ఎలాంటి భద్రత లేకుండెను. ఖాదియాన్ చేరినచో మేము సురక్షితులగుదుమని ముస్లిములందరు భావించేవారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ రహ్మహుల్లాహు అన్‌హును పర్యవేక్షకులుగా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు నియమించి యుండిరి. ఎంతో దయనీయ స్థితిలో అందరు అక్కడికి వచ్చేవారు, కొందరు వస్త్రములు లేకుండా వచ్చిరి. అప్పుడక్కడ వున్నవారందరు, అందరికంటే ముందు హుజూర్ తన ఇంటి, కుటుంబ సభ్యుల దుస్తులు పెట్టెల నుండి తీయించి వారికిచ్చిరి. అనంతరం అక్కడి నుండే ఒక వ్యవస్థ అధ్వర్యములో

బృందములు బయలుదేరి, పాకిస్తాన్‌కు చేరినవి. అల్లాహ్ కృపానుసారము అతి సురక్షితముగా చేరినవి. అహ్మదీయులు తమ ప్రాణాలను త్యాగము చేసి ప్రజల రక్షణ బాధ్యతను నిర్వహించిరి.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌లో ఒక నిబంధన ఇది కూడ గలదు. బైఅత్ చేసిన తర్వాత మా స్వంతము ఏమియును వుండదు. ఇప్పుడు జమాఅత్ వ్యవస్థ, హుజూర్ అఖ్దస్ ఉనికితో ముడిపడివున్నంత వరకే సర్వ బంధుత్వములు, అన్ని సంబంధములు గలవు. ఏ బంధుత్వము మమ్ములను హుజూర్ అలైహిస్సలాం నుండి దూరము చేయ లేదు. మేము ఈ ఆస్థానపు యాచకులము. ఇదే మాకు ముఖ్యమైనది. మరి ఈ ప్రతిజ్ఞను పాటించిరి, ఎంతో గొప్పగా పాటించబడెను. దీని కొన్ని ఉదాహరణలు ప్రవేశపెట్టెదను. ఈ కాలపు ఇమామ్ స్వయాన తన అక్షరాలలో గొప్పగా పొగిడిన సంఘటనలే అధికముగా నున్నవి.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"ఇటులనే మా హృదయపూర్వక ప్రియులు మౌల్వీ ముహమ్మద్ అహ్సన్ అమ్రూహి గారు ఈ సంస్థ కొరకు మంచి మంచి రచనలు చేయుటలో తలమునకలై వున్నారు. సాహిబ్జాదహ్ పీర్‌జీ సిరాజుల్ హఖ్ గారు వేలాది అనుచరుల బంధమును తెంచుకొని ఇక్కడి సన్యాసపు జీవితమును స్వీకరించిరి. మియా అబ్దుల్లాహ్ సన్నోరి, మౌల్వీ బుర్హానుద్దీన్ జిహ్లామి గారు, మౌల్వీ ముబారక్ అలి సియాల్కోటి గారు, ఖాజి జియావుద్దీన్ ఖాజికోటి గారు, బటాలా జిల్లా గుర్దాస్‌పూర్ నివాసి మున్షి ఛౌధ్రి నబీ బఖ్ష్ గారు, మున్షి జలాలుద్దీన్ యలాని మొ॥ వారు తమ తమ సామర్థ్యము

మేరకు సేవలో నిమగ్నమైయున్నారు. నా జమాఅత్ ప్రేమ, వినమ్రతపై నేను ఆశ్చర్యపడెదను. వారిలో తక్కువ ఆదాయము గలవారు ఉదా॥ మియా జమాలుద్దీన్, ఖైరుద్దీన్, ఇమాముద్దీన్ కష్మీరి నా గ్రామమునకు సమీపములో వుందురు. ఈ ముగ్గురు పేద సోదరులు బహుశా రోజు మూడు లేదా నాలుగు అణాల కూలీ పని చేయుదురు ఎంతో ఉత్సాహముగా నెలవారి చందాలో పాల్గొంటున్నారు. వారి మిత్రుడు మియా అబ్దుల్ అజీజ్ పట్వారీ వినమ్రతపై కూడ నాకు ఆశ్చర్యము కలుగును. అతి కొద్ది ఆదాయమున్నను ఇవి దైవమార్గములో వినియోగము కావలెనని నేను ఆశించుచున్నానని ఒక రోజు వంద రూపాయలు ఇచ్చిపోయెను. ఆ వంద రూపాయలు ఆ నిరుపేద ఎన్నో సంవత్సరాలలో ప్రోగు చేసి యుండవచ్చును. కాని దైవ ఉత్తేజము అల్లాహ్ ప్రీతి ఉత్సాహము కలిగించెను."

(అన్జామె ఆథమ్ – రూహాని ఖజాయిన్
సంపుటి 11 పుట 313, 314)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి)ను గురించి మరల వారిట్లనిరి.

"అధిక ధనముండగా ఎంతో కొంత అల్లాహ్ మార్గములో ఇచ్చువారిని చాలా మందినే చూచితిని. కాని తాను ఆకలి, దాహముతో ఉంటూ తన ప్రియమైన ధనమును దైవ ప్రీతి కొరకు వినియోగించుట, ప్రపంచములో తన కొరకు ఏమియును పెట్టు కోక పోవు ఈ లక్షణమును సంపూర్ణ రీతిలో మౌల్వీ గారిలోనే చూచితిని.... వారి ధనముతో నాకు లభించిన సహాయమునకు మరో ఉదాహరణ లేదు."

(నిషానె ఆస్మాని– రూహాని ఖజాయిన్ సంపుటి 4 పుట 407)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సన్నిధిలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ మౌలానా నూరుద్దీన్ గారిట్లు వ్రాసిరి.

"మీ దారిలో నేను బలియైతిని. నాది ఏమున్నను నాది కాదు, మీది. హజ్రత్ గురువులు, మార్గదర్శకులు! నా ధనము, ఆస్తి మొత్తము ధర్మ ప్రచారములో వినియోగించబడినచో నేను గమ్యమునకు చేరితినని నేను సహృదయముతో తెలుపుచున్నాను."

(ఫతహ్ ఇస్లాం – రూహాని ఖజాయిన్ సంపుటి 3 పుట 36)

హజ్రత్ మున్షి జఫర్ అహ్మద్ (రజి) గారి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ కొరకే నా ప్రియుడైన మున్షి జఫర్ అహ్మద్ యువ సత్పురుషుడు, అల్ప సంభాషకుడు, వినమ్రతతో పరిపూర్ణమైన సూక్ష్మమైన ఆలోచన గల వ్యక్తి. అనగా అతి సూక్ష్మమైన చూపుతో గమనించువారు. స్థిరత్వ చిహ్నములు, కాంతులు వారిలో ప్రతిబింబించును. విశ్వసనీయత వంటి లక్షణాలలో అదృష్టవంతులు. ఋజువైన సత్యములను మంచిగా అర్థము చేసుకొనును. వాటితో ఆనందము పొందును. అల్లాహ్, ప్రవక్తతో నిజమైన ప్రేమ కలిగివున్నాడు. సర్వ శుభములను పొందుటకు మూలమైన మర్యాద, ఈ దారికి అత్యవసరమైన మంచి ఆలోచన అనగా ఈ రెండు గుణములు వీరిలో గలవు. అనగా శుభము పొందుట, మంచి ఆలోచన కలిగివుండుటకు వీరు నిదర్శనం. ఈ రెండు లక్షణములు వీరిలో గలవు.

جزاهم الله خير الجزاء.

హజ్రత్ మియా అబ్దుల్లాహ్ సన్నోరి (రజి) గారి గురించి హజ్రత్

అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ కొరకే, నా ప్రియుడైన మియా అబ్దుల్లాహ్ సన్నోరి యువ సత్పురుషుడు తన సహజత్వము వలన నా వైపు ఆకర్షించబడెను. ఎటువంటి ఆపద కదిలించలేని విశ్వసనీయ మిత్రులలో వారున్నారని నేను నమ్ముచున్నాను." అనగా ఏ ఆపద వారిని తమ స్థానము నుండి కదిలించలేదు. "వివిధ సమయాలలో రెండు రెండు మూడు మూడు నెలల వరకు నా సహవాసములో వున్నాడు. నేను సదా విశ్వాస కాంతితో అతని విశ్వాస స్థితిని గమనించితిని." అనగా నేను చాలా శ్రద్ధతో చూచు చుంటిని. "నా దూరదృష్టి అతని అంతరంగమునకు చేరి తెలుసుకున్నదేమనగా ఈ నవ యువకుడు వాస్తవముగా అల్లాహ్, ప్రవక్త ప్రేమలో ఒక ప్రత్యేక ఉత్సాహము కలిగివున్నాడు. ఇతడు అల్లాహ్, ప్రవక్తల ప్రేమికుడను ఒకే ఒక్క కారణము వలన నాతో ప్రేమపూర్వక బంధమును ఏర్పాటు చేసుకొనెను."

(ఇజాల ఔహామ్ – రూహాని ఖజాయిన్ సంపుటి 3 పుట 531)

హజ్రత్ మున్షి అరూడా ఖాన్ (రజి) గారి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"అల్లాహ్ కొరకే, నా ప్రియుడైన మున్షి అరూడా ఖాన్ మెజిస్ట్రేట్ కార్యాలయ పటము గీయువారు. మున్షి గారు ప్రేమ, వినమ్రత, ఆప్యాయతలో సజీవమైన వ్యక్తి. సత్య ప్రేమి, సత్యమును త్వరగా అర్థము చేసుకొందురు. ఎంతో సంతోషముతో సేవలను చేయుదురు." చాలా ఆనందముతో చేయుదురు. "నాతో ఏదేని సేవ జరగవలెననే ఆలోచనలోనే దివారాత్రులు వుందురు. చిరంజీవి విశాల హృదయము, ప్రాణత్యాగ

స్వభావముగల వ్యక్తి." అనగా విశాల హృదయముతో స్వీకరించు, ప్రాణమునకు వెనుకాడని వ్యక్తి. ఈ బలహీనునితో వారికి ఒక ప్రేమపూర్వక బంధము గలదని నేను భావింతును. తమ శక్తులు, తమ ధనము, తమ ఉనికితో అనగా ఏదో ఒక విధముగా సేవ చేయు అనుగ్రహము కలిగినచో వారికి అంతకు మించి సంతోషము కలుగదు. వారు మనసా వాచా విశ్వసనీయులు, అన్ని పరిస్థితులలో స్థిరత్వము కలగినవారు, ధైర్యశాలి." ప్రతి స్థితిలో విశ్వాసపాత్రులు, విశ్వాసములో గట్టి ధైర్యము కలిగిన వ్యకి. "అల్లాహ్ వారికి గొప్ప ప్రతిఫలము నొసంగు గాక!" (ఆమీన్)

మరల వారిట్లనిరి.

"అల్లాహ్ కొరకే, నా ప్రియుడైన మియా ముహమ్మద్ ఖాన్ గారు కపూర్థలా రాష్ట్రములో ఉద్యోగి. అతి వినమ్రత గల స్వభావికులు, పవిత్ర అంతరంగికులు, సూక్ష్మ విషయముల పరిశోధకులు, సత్య ప్రేమి" అనగా అతి సూక్ష్మముగా గ్రహించేవారు, సత్యమును గుర్తు పట్టేవారు, నిజమును ఇష్టపడువారు. "నా గురించి వారికి గల ఎంత విశ్వాసము, అనురాగము, ప్రేమ, మంచి ఆలోచన గలదో నేను అంచనా వేయలేను. వారి ఈ అనురాగములో ఎప్పుడైనా తగ్గుదల వచ్చుననే సందేహము లేదు. హద్దు దాటునేమో అను సందేహము గలదు. వారు నిజమైన విశ్వసనీయులు, అన్ని పరిస్థితులలో స్థిరత్వము కలగినవారు. అల్లాహ్ వారి వెంట వుండుగాక! వారి నవయువ సోదురుడు సర్దార్ అలి ఖాన్ కూడ నా బైఅత్ పరంపరలో చేరినాడు. ఈ బాలుడు కూడ తమ సోదరుని వలె ఎంతో సజ్జనుడు, మార్గదర్శనము పొందిన వాడు, వివేకుడు." అనగా చాలా పుణ్యుడు, సత్పధముపై నడిచేవాడు. "అల్లాహ్ వారి రక్షకుడగు

గాక!”

(ఇజాల ఔహామ్ – రూహాని ఖజాయిన్ సంపుటి 3 పుట 532)

మరల వారిట్లనిరి.

“తన వియోగముతో మమ్ములను గాయపర్చిన నా అతి ప్రియమైన సోదరులు మిర్జా ఆజమ్ బేగ్ గారు కీ॥ శే॥ సామానా నాయకుడు పట్యాలా ప్రాంత నివాసి. వారు రెండవ రబీవుస్సాని 1308 హిజ్రిలో ఈ లోకమును విడిచిపోయిరి. **اِنَّا لِلّٰهِ وَاِنَّا اِلَيْهِ رَاجِعُوْنَ** ఇట్లనిరి.

**اَلْعَيْنُ تَدْمَعُ وَالْقَلْبُ يَحْزُنُ وَاِنَّا بِفِرَاقِهٖ لَمَحْزُوْنُوْنَ**

అనగా నేత్రము కన్నీరు కార్చును, హృదయములు దుఃఖముతో నున్నవి. మేమతని వియోగముతో దుఃఖించుచున్నాము. కీ॥శే॥ మిర్జా గారు అల్లాహ్ కొరకు మాత్రమే నాతో ప్రేమానురాగము కలిగి వుండిరి. ఎంతగా నాలో లీనమైనారనగా ఆ స్థాయిని వివరించుటకు పదాలు ఎక్కడి నుండి తేగలను. వారి అసందర్భ వియోగము వలన నాకు కలిగిన బాధకు ఉదాహరణలు గతములో నేను తక్కువే పొందెదను. వారు మా సభ్యులు, గమ్యమునకు చేర్చువారు.” అనగా మా దృష్టిలో వారికి గొప్ప స్థానము గలదు. ఎంతో మంచితో ముందుకెళ్ళేవారు, నాయకత్వ సామర్థ్యము యుండెను. మేము చూస్తుండగానే మాతో విడిపోయిరి. మేము బ్రతికి వున్నంత వరకు వారి మరణ దుఃఖము మరచిపోలేము. వారి ఎడబాటు జ్ఞాపకముతో నిరాశ, యదలో బాధ అధికమై కొంత కష్టము, హృదయములో దుఃఖము కలిగి, కనులలో కన్నీరు ప్రవహించును. వారి ఉనికి మొత్తం ప్రేమతో నిండి యుండెను. కీ॥శే॥ మిర్జా గారు ప్రేమపూర్వక ఉద్రేకములను వ్యక్తపరచుటలో

ఎంతో ధైర్యశాలిగా యుండిరి.”

(ఫతహ్ ఇస్లాం – రూహాని ఖజాయిన్ సంపుటి 3 పుట 39)

హజ్రత్ ఖాజి జియావుద్దీన్ (రజి) గారిట్లు వ్రాసిరి. దుఆ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఎదుట ఈ విధముగా వివరించుచున్నారు.

“ఓ నా యజమాని! నేను నా హృదయములో విరుద్ధ ఆలోచనలు పొందుతాను. ఒక వైపు హుజూర్ అలైహిస్సలాం సత్యము, ఒక వైపు ఆధ్యాత్మిక కాంతులను బయటి ప్రపంచము తొందరగా తెలుసుకోవాలని సహృదయముతో నేను కొరుకుంటున్నాను. సర్వ జాతులు, సంప్రదాయాల వారు వచ్చి అల్లాహ్ జారీ చేసిన ఈ చెలిమ నుండి పుష్టిగా సేవింతురు గాక! కాని ఈ కోరికతో పాటు రెండవ వైపు ఇతరులకు కూడ హుజూర్ తెలిసిన తర్వాత వారు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చినప్పుడు నాకు మీ సహవాసము, సామీప్యము లభించిన దానితో కలిగే ఆనందమును కోల్పోవుదునను ఆలోచనతో నా హృదయము దుఃఖించును. ఇటువంటి స్థితిలో హుజూర్ ఇతరుల గృహములకు వెళ్ళెదరు.

హుజూర్ గారు! నాకు నా ప్రియమైన యజమాని సహవాసములో కూర్చొనే, వారితో మాట్లాడే అవకాశము గల ఆనందము నుండి నేను దూరమగుదును. ఈ విధమైన విరుద్ధ కోరికలు ఒకటి తర్వాత మరొకటి నా హృదయములో కలుగుచుండును.”

నా ఈ మాటలను విని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిరునవ్వు నవ్విరని ఖాజీ గారు తెలపిరి.

(అస్హాబె అహ్మద్ – రూహాని ఖజాయిన్ సంపుటి 6 పుట 10)

మరల ఖాజి జియావుద్దీన్ (రజి) గారి మరో ఉదాహరణ గలదు. ఖాజి అబ్దుర్రహీం గారు ఇట్లు వినిపించేవారు. ఒక సారి తండ్రి (రజి) గారు సంతోషముతో వినిపించిరి. నేను ప్రక్షాళనము (వజూ) చేయుచుంటిని. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో వారి సేవకుడు హజ్రత్ హామిద్ అలి (రజి) గారు వీరెవరని నా గురించి అడిగిరి. హుజూర్ (అ) నా పేరు, చిరునామా చెప్పుచు ఇట్లు కూడ అనిరి. ఈ వ్యక్తికి మాతో ప్రేమ గలదు. అందుకే ఖాజి (రజి) గారు ఈ విషయమై గర్వపడేవారు. (ఆశ్చర్యముతో) ఇట్లనేవారు. హుజూర్‌కు నా హృదయ స్థితి ఎట్లు తెలిసెను. ఈ ప్రేమ వల్లనే హజ్రత్ ఖాజి (రజి) గారు తన మరణము సందర్భమున తన సంతానమునకు ఇట్లు మరణాదేశము చేసి యుండిరి. నేను ఎంతో కష్టముతో మిమ్ములను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు చేర్చితిని. నా తర్వాత ఎన్నడు ఈ ద్వారమును వీడకుము. వారి సంతానము కూడ దీనిపై పూర్తిగా అమలు చేసెను.

(అస్‌హాబె అహ్మద్ – రూహాని ఖజాయిన్ సంపుటి 6 పుట 8,9)

హజ్రత్ మౌల్వీ నీమతుల్లాహ్ గారిని కాబుల్‌లో 1924లో దైవమార్గములో హతమార్చబడెను. హత్యకంటే ముందు కారాగారము నుండి ఒక మిత్రునికి వారొక ఉత్తరము ఇట్లు వ్రాసిరి. “నేను కారాగారములో అనుక్షణం ఇట్లు ప్రార్థింతును. ఓ నా దైవమా! ఈ అసమర్థున్ని ధార్మిక సేవలో సఫలము చేయుము. కారాగారము నుండి విడుదల అగుటకు నేను ఇష్టపడను. వాస్తవానికి నేను కోరునదేమనగా ఈ అసమర్థుని అస్తిత్వపు అణువణువు ఇస్లాం కొరకు త్యాగము చేయుము.”

(తారీఖె అహ్మదియ్యత్ సంపుటి 5 పుట 450 ముద్రణ 1964)

# మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో నిరుపమాణ అనుబంధము

ఇదే పదవ నిబంధన అనుసారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో నిరుపమాణ అనుబంధము కలిగివుండునను విషయము గలదు. ఇది సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ (రజి) గారి సంఘటన. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిన్న కుమారుడు సాహిబ్జాదహ్ మిర్జా ముబారక్ అహ్మద్‌పై 1907లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరము దాడి చేసెను. వారి అనారోగ్య రోజులలో ఒకరు ముబారక్ అహ్మద్ వివాహము జరుగునట్లు స్వప్నము చూసిరి. వివాహము గుర్తు తెలియని స్త్రీతో అయినచో దాని పారాంశము మరణమని స్వప్న విశ్లేషకులు వ్రాసిరి. కాని కొందరు స్వప్న విశ్లేషకుల అభిప్రాయమేమనగా ఇటువంటి స్వప్నమును బాహ్య రూపంలో పూర్తి చేసినచో పారాంశము తప్పిపోవును. కనుక స్వప్నము చూసిన వాడు తన స్వప్నమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు వినిపించగా వారిట్లనిరి. దీని పారాంశము మరణమే, కాని దీనిని బాహ్య రూపంలో పూర్తి చేసినచో పారాంశము తప్పిపోవును. అందుకే రమ్ము ముబారక్ అహ్మద్ వివాహము చేయుదుము. వివాహము గురించి ఏమి తెలియని బాలుని వివాహము పట్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు కలత కలిగెను. ఈ విషయములు మాట్లాడుచున్న సమయమున దైవికముగా ఇక్కడికి అథితిగా వచ్చిన హజ్రత్ డా॥ సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ గారి సతీమణి సయ్యదహ్ సయీదతున్నిసా బేగం గారు అంగణములో కనిపించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

వారిని పిలిచి ఇట్లనిరి. మేము ముబారక్ అహ్మద్ వివాహము చేయదలచితిమి. మీకిష్టమున్నచో మీ కుమార్తె అయిన మర్యమ్‌తో ముబారక్ అహ్మద్ వివాహము చేయబడును. వారిట్లనిరి. నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కాని హుజూర్ కొంత గడువు ఇచ్చినచో డా॥ గారిని కూడ అడిగెదను. ఆ రోజులలో డా॥ గారు, వారి కుటుంబ సభ్యులు "గుండ్రని గది" లో వుండేవారు. వారు (డా॥ గారి సతీమణి) క్రిందికి వెళ్ళిరి. బహుశా డా॥ గారు అక్కడ లేకుండిరి. ఎక్కడికో బయటికి పోయి వుండిరి. వారు కొద్ది సమయము నిరీక్షించగా వారొచ్చిరి. వారొచ్చినప్పుడు వారితో ఇట్లు సంభాషించడం మొదలు పెట్టిరి. అల్లాహ్ ధర్మములో ఎవరైనా ప్రవేశించినప్పుడు అతని విశ్వాసమును కొన్ని సార్లు పరీక్షించబడును. అల్లాహ్ మీ విశ్వాసమును పరీక్షించినచో మీరు స్థిరముగా నుందురా ? వీరు ఈ వివాహము చేయుటలో వెనుకడుగు వేయుదురని వారికప్పుడు రెండు ఆలోచనలు కలిగెను. ఒకటి వారి వంశములో ఏ అమ్మాయి సయ్యదేతరునితో వివాహము చేయబడలేదు. రెండవది ముబారక్ అహ్మద్ ఒక ప్రాణాంతకమైన వ్యాధితో బాధ పడుచుండెను. కీ॥ శే॥ డా॥ గారు స్వయాన అతనికి చికిత్స చేయుచుండిరి. అందుకే ఇతను 99 శాతం ప్రమాదములో కూరుకుపోయాడని వారు భావింతురు. కనుక ఈ అమ్మాయి నుదుట త్వరలోనే విధవరాలు అనే బిరుదు పడునని భయము గలదు. కనుక ఈ విషయముల వలన డా॥ గారు బలహీనత చూపినచో వారి విశ్వాసము వృధా కావచ్చునని వారి ఇంటి వారికి భయము కలిగినది. అందుకే వారిట్లు అడిగిరి. ఒక వేళ అల్లాహ్ మిమ్ములను పరీక్షించినచో మీరు స్థిరముగా నుందురా ? డా॥ గారిట్లనిరి. అల్లాహ్ స్థిరత్వము

ప్రసాదించునని నాకు నమ్మకము గలదు. అప్పుడు మర్యమ్ బేగం గారి కీ॥ శే॥ తల్లి తన మాట వినిపించిరి. నేను పైకి పోయి వుంటిని. మర్యమ్ వివాహము ముబారక్ అహ్మద్‌తో చేయమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. ఈ విషయము విని హజ్రత్ డా॥ గారిట్లనిరి. మంచి విషయమే. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఇష్టమున్నచో మనకు ఇందులో అభ్యంతరమెందుకుండును. వారి ఈ సమాధానము విని మర్యమ్ బేగం గారి కీ॥ శే॥ తల్లి అల్లాహ్ వారి స్థాయిని సదా పెంచుగాక! అని ఏడ్చిరి. అనుకోకుండా వారి కనుల నుండి కన్నీరు ప్రవహించెను. ఏమైనది ? మీకు ఈ బంధము ఇష్టము లేదా ? అని కీ॥శే॥డా॥ గారడిగిరి. వారిట్లనిరి. నాకు ఇష్టమే. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివాహ విషయము చెప్పినప్పటి నుండి నా హృదయము కలవర పడుచుండెను. మీ విశ్వాసము వృధా అగునేమోనని నేను భయపడుచుంటిని. కనుక మీ సమాధానము విని నేను సంతోషముతో కన్నీరు ఆపుకోలేకపోతిని. ఈ విధముగా ఈ వివాహము కొన్ని రోజుల తర్వాత జరిగెను. (వ్యాధి తీవ్రముగా నున్నందున) ఆ అమ్మాయి కూడ విధవరాలయ్యెను.

ఇప్పుడు చూడండి! అల్లాహ్ కూడ డా॥ గారి విశ్వాసమును వృధా కానివ్వలేదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి)తో వారి వివాహమైనది. వారి పేరే హజ్రత్ ఉమ్మె తాహిర్, మర్యమ్ సిద్దీఖ రజియల్లాహు అన్హా.

(మాసపత్రిక అల్‌ఫజల్ ఖాదియాన్ 1.8.1944 పుట 1-2,
సీరత్ సయ్యద్ అబ్దుస్సత్తార్ షాహ్ గారు 122-124)

హజ్రత్ సాహిబ్జాదహ్ అబ్దుల్లతీఫ్ గారు షహీద్ (రజి) గురించి

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు వ్రాసిరి. "అదే రోజులలో వరుసగా ఈ దైవవాణి నాకందెను. చాలా గొప్ప శక్తివంతమైన సంకేతములు ప్రత్యక్షమయ్యెను. మసీహ్ మౌవూద్ అగు నా ప్రకటన నిదర్శనములతో ప్రచురించబడెను. కాబుల్ సరిహద్దులో గల ఖోస్త్ ప్రాంతములోని ఒక సజ్జనుడు మౌల్వీ అబ్దుల్లతీఫ్ వరకు దైవికముగా నా పుస్తకములు చేరినవి. వాటిని వివేకవంతమైన నిదర్శనములు, ఆకాశ సహాయములతో నేను వ్రాసియుంటిని. (అనగా అల్లాహ్ సహాయముతో నేను నా పుస్తకములలో వ్రాసియుంటిని.) ఆ నిదర్శనములన్నియు వారు చూచిరి. ఆ సజ్జనుడు అతి పవిత్ర అంతరంగికుడు, విద్యావంతుడు, దూరదృష్టి, దైవభీతి గల, నిష్పాపరుడైనందున అతని హృదయముపై అవి ప్రగాఢ ప్రభావము చూపెను. ఈ ప్రకటన సత్యములో వారికెలాంటి ఇబ్బంది కలుగలేదు. ఈ వ్యక్తి అల్లాహ్ వైపు వాడని, ఈ ప్రకటన సరైనదేనని అతని పవిత్ర అంతరాత్మ నిస్సంకోచముగా అర్థము చేసుకొనెను. అప్పుడు వారు నా పుస్తకములను అతి ప్రేమగా చూడడం మొదులు పెట్టిరి. అతని పవిత్రమైన, చురుకైన ఆత్మ నా వైపు ఆకర్షించబడెను. భేటీ కాకుండా దూరము కూర్చొనుట వారికి కష్టమైపోయెను. ఈ గొప్ప ఆకర్షణ, ప్రేమ, వినమ్రత కారణ ఫలితముగా తుదకు కాబుల్ రాష్ట్రము నుండి అనుమతి లభించుటకు హజ్ కొరకు దృఢంగా సంకల్పించిరి. ఈ ప్రయాణము కొరకు కాబుల్ రాజ్యాధికారితో మనవి చేసిరి. కాబుల్ రాజ్యాధికారి దృష్టిలో వారు అతి గొప్ప, విద్యావంతుల నాయకులుగా నున్నందున అనుమతి తో పాటు కొంత ఆర్థిక సహాయము కూడ ఇవ్వబడెను. వారు అనుమతి తీసుకొని ఖాదియాన్ చేరిరి. నాతో వారు సమావేశమైనప్పుడు నా ప్రాణము ఎవరి

చేతిలో వున్నదో ఆ అల్లాహ్ ప్రమాణముగా నా అనుసరణలో, నా ప్రకటన సత్యమును బలపర్చుటలో ఇంతకు మించి మానవునికి సాధ్యము కాని రీతిలో వారిని చూచితిని. అత్తరుతో ఒక సీసా నిండి వున్నట్లు నా ప్రేమతో వారిని నిండి వున్నట్లు నేను పొందితిని. వారి ముఖము కాంతివంతమైనట్లే వారి అంతరంగము కూడ కాంతివంతమైనట్లు నాకు తెలిసినది.”

(తజ్కిరతుష్షహాదతైన్ – రూహాని ఖజాయిన్
సంపుటి 20 పుట 9,10)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ గారిని (రజి) గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

“ఇక్కడ నేను ఈ విషయమును వ్యక్త పరచక, అందుకు కృతజ్ఞత తెలుపక వుండలేను. అల్లాహ్ దయానుగ్రహము నన్ను ఒంటరిగా వదల లేదు. నాతో సోదర భావమును ఏర్పరచుకొను వారు, అల్లాహ్ స్వయాన తన హస్తముతో స్థాపించిన ఈ సంస్థలో ప్రవేశించువారు ప్రేమ, వినమ్రతలో ఒక విచిత్రమైన విధానములో నున్నారు. నా కష్టముతో కాక, అల్లాహ్ తన ప్రత్యేక ఉపకారముతో సత్యముతో నిండివున్న ఆత్మలను నాకు ప్రసాదించెను. అందరి కంటే ముందు ఒక నా ఆధ్యాత్మిక సోదరునిని ప్రస్తావించుటకు నేను నా హృదయములో ఉత్తేజము పొందచున్నాను. వారి పేరు వారి స్వచ్ఛత వలె నూరుద్దీన్ (ధర్మకాంతి) గలదు. ఇస్లాం గొప్పతనము కొరకు వారు తమ ధర్మబద్ధ ధనముతో ఖర్చు చేయుచున్న వారి పలు సేవలను సదా మర్యాదతో చూచెదను. ఆ సేవలు నాతో కూడ సంభవించినచో ఎంత బాగుండును. ధర్మ సహాయమునకు వారి హృదయములో నిండివున్న ఉత్తేజమును ఊహించినచో దైవ ప్రకృతి

దృశ్యము అనగా అల్లాహ్ ఎటుల తన దాసులను తన వైపు ఆకర్షించునో నా కనుల ముందుకు వచ్చును. వారు తమ మొత్తము ధనము, మొత్తము బలము, వారికి అందుబాటులో నున్న వస్తువులు (అనగా వారి అధీనములో నున్న ధనము)తో అనుక్షణం అల్లాహ్, ప్రవక్త విధేయత కొరకు సన్నద్ధమైయుందురు. వారు నా మార్గములో ధనమే కాదు ప్రాణము, గౌరవమును కూడ లెక్కచేయరని కేవలము మంచి ఊహతోనే కాక అనుభవముతో నేను సరైన వషయము తెలుసుకొన్నాను. నేను వారికి అనుమతి నిచ్చినచో సర్వమును త్యాగము చేసి ఆధ్యాత్మిక మిత్రుత్వము వలె శారీరక మిత్రుత్వముతో ప్రతి క్షణం సహవాసము లో వుండు హక్కును చెల్లించు వారు. నా ప్రియ సోదరుడు మౌల్వీ హకీం నూరుద్దీన్ భైర్వీ జమ్మూ రాష్ట్ర వైద్యులు ప్రేమానురాగము, వినమ్రతలో ఎన్ని అంతస్థుల వరకు ప్రగతి సాధించిరో తెలియుటకు వారి కొన్ని ఉత్తరముల పలు పంక్తులను ఉదాహరణగా పాఠకులకు చూపెదను. ఆ పంక్తులు ఇట్లు గలవు. వారిట్లు వ్రాయుదురు.

నా గురువులు! నా మార్గదర్శకులు! నా నాయకులు! అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి వబరకాతుహు. గౌరవనీయులు. నేను అనుక్షణం హుజూర్ సన్నిధిలో నుండుటకు ప్రార్థించుచున్నాను. ఏ ప్రయోజనముల కొరకు నియమించబడిరో ఆయా ప్రయోజనములను వర్తమాన ఇమామ్‌తో పొందుదును గాక! అనుమతి లభించినచో నేను ఉద్యోగమునకు రాజీనామా చేసి దివారాత్రులు మీ సేవలో వుందును. లేదా ఆజ్ఞ లభించినచో ఈ అనుబంధమును వీడి ప్రపంచములో ప్రయాణించి ప్రజలను సత్యమైన ధర్మము వైపు పిలుచుచు ఈ మార్గములోనే ప్రాణమిత్తును. నేను మీ

మార్గములో త్యాగమైతిని. నాకున్నదంతయు నాది కాదు, మీదే. హజ్రత్ గురువులు! నా మార్గదర్శకులు! నా ధనము, ఆస్తి మొత్తము ధర్మ ప్రచారములో ఖర్చు అయినచో నేను నా గమ్యమునకు చేరినట్లు భావింతునని నేను పూర్తి సత్యముగా వేడుకుంటున్నాను. ..... మీతో నాకు ఫారూఖి వంటి అనుబంధము గలదు. సర్వమును ఈ మార్గములో త్యాగము చేయుటకు సిద్ధముగా నున్నాను. సత్యవంతుల వలె నా మరణమగుటకు ప్రార్థన చేయగలరు.

మౌల్వీ గారి సత్యము, సాహసము, వినమ్రత, నీతి నిజాయితి వారి వచనముల నుండి స్పష్టమైనది. అంతకు మించి వారి విధేయతా సేవలతో స్పష్టమగును. వారు సంపూర్ణ ప్రేమ, వినమ్రత ఉత్తేజముతో సర్వమును తుదకు కటుంబ జీవితపు అత్యవసర వస్తువులను కూడ ఈ మార్గములో సమర్పించదలతురు. ఉత్తేజము, ప్రాణత్యాగముతో వారి ఆత్మ వారి శక్తిని మించి ముందడుగు వేయుటకు వారిని బోధించుచున్నది. ప్రతి శ్వాస, ప్రతి క్షణం సేవలో నిమగ్నమై యున్నారు.

(ఫతహ్ ఇస్లాం - రూహాని ఖజాయిన్
సంపుటి 3 పుట 35-37)

ఒక విమర్శకునికి సమాధానమిచ్చుచు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు వ్రాసి యుండిరి.

"ఈ సంస్థలో ఒక్క హకీం నూరుద్దీన్ గారే ఆచరణాత్మక ఆదర్శము కలిగి వున్నారు, ఇతరులు ఇట్లున్నారు, అట్లున్నారని మీరందురు. ఈ ఆరోపణకు మీరే సమాధానమిత్తురో నాకు తెలియదు. కనీసం ఒక లక్ష మంది సహృదయముతో నన్ను విశ్వసించినారని నేను ప్రమాణముగా

చెప్పగలను. వారు సత్కార్యములు చేయుదురు, విషయములు వినుచుండగా వారి యద తడిచిపోవు విధముగా విలపింతురు. నేను నా బైఅత్ చేసిన వేలాది మందిని మూసా సందేశహరుని జీవితములో వారిని విశ్వసించిన అనుచరుల కంటే వేల రెట్లు ఉత్తమముగా నున్నట్లు నేను భావింతును. వారి ముఖములపై అనుచరుల విశ్వాసము, సామర్థ్యపు కాంతిని పొందెదను. కాని ఒక్కరిద్దరు తమ సహజ లోపము, సామర్థ్యము వలన తక్కువగా యుండినా యుండవచ్చును.

ఇట్లనిరి. నా సంస్థ సత్కార్యము, సామర్థ్యములో సాధించిన ప్రగతి ఒక మహిమే. వేలాది మంది హృదయపూర్వకముగా ఆహుతటకు సిద్ధముగా నున్నారు. తమ సర్వ ధనమును వీడవలెనని నేడు అనబడినచో వారు తమ ధనము మొత్తమును వీడుటకు సంసిద్ధులుగా నున్నారు. అయినను నేను సదా ప్రగతి పొందుటకు వారిని ప్రోత్సహింతును. వారి సత్కార్యములను వారికి వినిపించను. కాని మనసులో ఆనందముగా నున్నాను."

(సీరతుల్ మహ్దీ సంపుటి 1 పుట 165)

## సత్పురుషుల సంతానపు బాధ్యతలు

కొన్ని ఉదాహరణలను నేనిక్కడ ప్రవేశపెట్టితిని. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ ప్రియమైన జమాఅత్‌లో ఇటువంటి లక్షలాది ఉదాహరణలు వ్యాపించియున్నవి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ కాలములో లక్షలాదిని ప్రస్తావించిరి. తమ వినమ్రత, తమ త్యాగముల పెద్ద ప్రమాణములను ఏర్పరచిన వారు ఇప్పుడింకా చాలా పెరిగిరి. చాలా మంది విశ్వాస, వినమ్రత, అనుబంధము, ప్రేమ,

విధేయత సంఘటనలు బహిర్గతము కాని వారున్నారు. వీరు మౌనముగా వచ్చి, ప్రేమ, అనుబంధము, విశ్వసనీయత, విధేయత ఉదాహరణలను నెలకొల్పి మౌనముగానే వెళ్ళిపోయిరి. ఇటువంటి వినమ్రుల సంతానము తమ పూర్వీకుల సంఘటనలను వ్రాసి జమాఅత్ వద్ద భద్రపరచవలెను. తమ కుటుంబములో కూడ ఈ కథనములను కొనసాగించవలెను. మన పూర్వీకులు ఈ ఉదాహరణలను నెలకొల్పిరని, వీటిని మనము కొనసాగించవలెనని తమ సంతానమునకు తెలుప వలెను. వారు త్యాగములు చేసి వర్తమాన ఇమామ్ ప్రార్థనల వారసులైన మన పూర్వీకులపై గర్వపడుచు ఆ ప్రార్థనలను పొందే అవకాశములు నేడు కూడ గలవని గుర్తుంచు కోవలెను. రమ్ము! ఆ విశ్వాసము, వినమ్రత, విధేయత, అనుబంధము, ప్రేమపూర్వక ఉదాహరణములను నెలకొల్పుతూ పోదాము. అల్లాహ్ అనుగ్రహములకు వారసులగుచు పోదాము. ఈ ఆదర్శములు నెలకొల్పబడు నంత వరకు ప్రాపంచిక వ్యతిరేకతలు మనకు నష్టము కలిగించలేవని జ్ఞప్తియందుంచుకొనుము.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ వచనమును సదా గుర్తుంచుకొనుము.

“ఆకాశముతో మీకు దృఢమైన సంబంధమున్నచో భూమి మీకెట్టి నష్టము కలిగించలేదు”.

## ఇతరుల అంగీకారము

ఈ మార్పులను ఇతరులు కూడ చూచి, వాటిని అంగీకరించిరి. ఇవి స్పష్టమైన, బహిరంగ మార్పులుగా నున్నందున వారు అంగీకరించక తప్పలేదు. వర్తమాన ఇమామ్‌ను విశ్వసించిన పిదప అహ్మదీయులలో

అనేక మార్పులు సంభవించినవని ఒప్పుకొనిరి. కాని వారి స్పందన మాత్రము నేను నమ్మనే నమ్మను అను విధముగా నుండును. ఏది ఏమైనా ఈ అంగీకారపు పలు ఉదాహరణలను నేను ప్రవేశపెట్టెదను.

అల్లామా ఇఖ్బాల్ ఇట్లు వ్రాసిరి.

"ఇస్లాం ఆచరణాత్మక అసలు సిసలైన ఉదాహరణ పంజాబ్ (భారత్) లోని ఖాదియానీ వర్గమనబడు జమాఅత్ రూపములో ప్రత్యక్షమైనది."

(ఖౌమి జిందగీ ఔర్ మిల్లతె బైజా పర్ ఏక్ ఇమ్రాని నజర్ పుట 84)

అల్లామా నియాజ్ ఫతహ్‌పూరి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను గురించి ఇట్లు వ్రాసిరి.

"వారు నిశ్చయముగా ఇస్లాం ప్రవర్తనలను పునరుద్ధరించిరనుటలో సందేహము లేదు. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శ ఛాయ అనబడు జీవితముతో కూడిన ఒక పవిత్రమైన జమాఅత్‌ను సృష్టించిరి."

(ములాహిజాత్ నియాజ్ ఫతహ్‌పూరి పుట 29)

స్టేట్స్‌మేన్ పత్రిక ఢిల్లీ సంపాదకులు ఇట్లు వ్రాసిరి.

"ఖాదియాన్ అను ఒక పవిత్ర నగరములో ఒక భారతీయ సందేశహరుడు జన్మించెను. అతడు తన పరిసరాలను సత్కార్య, గొప్ప ప్రవర్తనలతో పూరించెను. ఈ సద్గుణములు అతన్ని విశ్వసించే లక్షలాది మందిలో కూడ ప్రకాశించుచున్నవి."

(స్టేట్స్‌మేన్ ఢిల్లీ 12 ఫిబ్రవరి క్రీ.శ. 1949)

అబ్దుర్రహీమ్ అష్రఫ్ అహ్మదియ్య జమాఅత్‌లో పుట్టిన విప్లవము

గురించి ఇట్లు వ్రాయుదురు.

"ఈ నూతన ధర్మము కొరకు తన బంధుత్వములను వీడిన వారు వేలాది మంది గలరు. వారు ప్రాపంచిక నష్టములు భరించిరి, ప్రాణ, ధన త్యాగములు చేసి. ................ ఖాదియానీయుల ఒక పెద్ద సంఖ్య దానిని సహృదయముతో యదార్థముగా భావించుచు ధన, ప్రాణ, ప్రాపంచిక వసతులు, సౌకర్యాలను త్యాగము చేయుదురని మేము విశాల హృదయముతో అంగీకరింతుము. వీరిలోనే కొందరు కాబుల్‌లో మరణ శిక్షను స్వీకరించిరి. విదేశాలలో సుదూర ప్రాంతములలో నిరుపేద, లేమితనముతో జీవితమును గడిపిరి."

(వార పత్రిక అల్ మెంబర్ లాఇల్పూర్ 2 మార్చి 1952 పుట 10)

ఇంత జరిగినను నమ్మే అవకాశము లభించకపోవడం వీరి దురదృష్టమే. వీరి ఈ అంగీకారము మా విశ్వాసమును దృఢపరచెను. అల్‌హందులిల్లాహ్. అల్లాహ్ మన విశ్వాసము, నమ్మకమును మరింత పెంచుచు పోవునుగాక! బైఅత్ ప్రతిజ్ఞలోని ప్రతి నిబంధనను సంతోషముతో తమపై కర్తవ్యముగా భావించుచు పూర్తి చేయువారమగుగా! అల్లాహ్ ప్రీతికి వారసులగుదుముగాక! (ఆమీన్)

(ఖుత్బా జుమా ప్రసంగము 17 అక్టోబర్ 2003
మస్జిద్ ఫజల్ లండన్)